అనుదినం... జనస్వరం
నవతెలంగాణ
ఆదివారం 25-6-2023
సమగ్ర తెలుగు దినపత్రిక



సంపుటి : 9 | సంచిక : 175 | Published from Hyderabad, Rangareddy, Khammam, Karimnagar | www.navatelangana.com | 14 పేజీలు + సోపతి (వెబ్‌లో) | వెల : 8.00

అఖిలపక్షాన్ని పంపాలి

మణిపూర్ ముఖ్యమంత్రిని బర్తరఫ్ చేయాలి | బాధితులకు పునరావాసం కల్పించాలి

- పునరావాస ప్యాకేజీ విడుదల చేయాలి
- అఖిలపక్ష నేతల డిమాండ్
- ప్రధాని మోడీ గైర్హాజరుపై నిలదీత

మణిపూర్‌లో కేంద్రం రగిల్చిన రిజర్వేషన్ల చిచ్చు రావణకాష్టంలా రగులుతూనే ఉంది. శాంతిభద్రతల అదుపులో బీజేపీ సారధ్యంలోని కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు చేతులెత్తేశాయి. పరిస్థితులు చేయి దాటడంతో తప్పనిసరై కేంద్ర హౌం మంత్రి అమిత్‌షా నేతృత్వంలో అఖిలపక్ష సమావేశం ఏర్పాటు చేశారు. దీనికి ప్రధాని నరేంద్రమోడీ గైర్హాజరు కావడాన్ని ప్రతిపక్షాలు తీవ్రంగా తప్పుపట్టాయి. ఇంత జరుగుతున్నా... ఆయన మౌనం దేనికి సంకేతమంటూ ఈ సమావేశంలో ఘాటుగా స్పందించాయి. కేంద్ర వైఫల్యంపై ఇప్పటికే దేశవ్యాప్తంగా ప్రధాని మోడీకి వ్యతిరేకంగా నిరసనలు, ఆందోళనలు కొనసాగుతున్నాయి. అమెరికా పర్యటనలో ఉన్న మోడీని 'గోబ్యాక్' అంటూ అక్కడి భారతీయులు తీవ్రంగా నిరసిస్తున్నారు. భారత్‌లో ప్రజాస్వామ్యం ప్రమాదంలో ఉందంటూ ప్లకార్డులు ప్రదర్శిస్తూ, మోడీని ఆ దేశానికి ఆహ్వానించిన బైడన్ నిర్ణయాన్నీ తప్పుపడుతున్నారు. మరోవైపు ఢిల్లీలోని జంతర్‌మంతర్ వద్ద మణిపూర్ హింస, కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాల వైఫల్యాలను నిరసిస్తూ ఐద్వా సహా 40 సంఘాల నేతృత్వంలో నిరసన కార్యక్రమం నిర్వహించారు. మోడీ మౌనాన్ని ప్రశ్నించారు.



మణిపూర్‌లో పరిస్థితి అదుపులో లేదు : అమిత్ షా

న్యూఢిల్లీ : మణిపూర్ పరిస్థితులను చక్కదిద్దేందుకు అఖిలపక్షాన్ని పంపాలని వివిధ రాజకీయ పార్టీలు డిమాండ్ చేశాయి. మణిపూర్ వివాదం ముదిరి పాకాన పడుతున్నా ప్రధాని నరేంద్ర మోడీ మౌనం దాల్చడాన్ని ప్రతిపక్షాలు తీవ్రంగా విమర్శించాయి. అలాగే మణిపూర్ హింసను నిలువరించడంలో విఫలమైన ముఖ్యమంత్రి బీరెన్ సింగ్‌ను తక్షణమే బర్తరఫ్ చేయాలని డిమాండ్ చేశాయి. అక్కడ రాష్ట్రపతి పాలన విధించాలని కోరాయి. శనివారం నాడిక్కడ పార్లమెంట్ లైబ్రరీ బిల్డింగ్‌లో కేంద్ర హౌం మంత్రి అమిత్ షా అధ్యక్షతన మణిపూర్ పరిస్థితులపై అఖిలపక్ష సమావేశం జరిగింది. దాదాపు మూడు గంటల పాటు సమావేశం జరుగగా, అన్ని పార్టీలు తమ అభిప్రాయాలను వెల్లడించాయి. ఈ సమావేశానికి ప్రధానమంత్రి నరేంద్ర మోడీ హాజరుకాకపోవడంపై ప్రతిపక్ష పార్టీలు నిలదీశాయి. మణిపూర్‌లో పరిస్థితి అదుపులో లేదని అమిత్ షా తొలిసారి ...2లో

మణిపూర్‌లో శాంతి నెలకొల్పాలి

- జంతర్ మంతర్ వద్ద 40 సంఘాల ఆందోళన



న్యూఢిల్లీ : మణిపూర్ వివాదాన్ని నియంత్రించి శాంతిని పునరుద్ధరించేందుకు కేంద్ర ప్రభుత్వం చర్యలు చేపట్టాలని డిమాండ్ చేస్తూ ఢిల్లీలో భారీ నిరసన ప్రదర్శన జరిగింది. మహిళా సంఘాలతో సహా నలభై సంస్థలు పిలుపునిచ్చిన ఆందోళనలో అల్లర్ల బాధితులతో సహా వందలాది మంది పాల్గొన్నారు. బీజేపీ ముఖ్యమంత్రి బీరెన్ సింగ్‌కు వ్యతిరేకంగా ప్లకార్డులు పట్టుకుని నినాదాల హోరెత్తించారు. ముఖ్యమంత్రిని ...5లో



బడాబాబుల సేవలో మోడీ

భూముల అమ్మకంలో కేసీఆర్ బిజీ

- పేదలకు జానెడు జాగా దొరకదు
- 27లోగా ఇండ్ల స్థలాల పంపిణీపై ప్రకటన చేయాలి
- రాష్ట్ర ప్రభుత్వానికి బస్సుజాత కన్వీనర్ ఎస్. వీరయ్య డిమాండ్
- సమరశీల పోరాటాలకు సిద్ధంకావాలని పిలుపు

నవతెలంగాణ-నిజామాబాద్ ప్రాంతీయ ప్రతినిధి

ఇండ్లు, ఇండ్ల స్థలాల కోసం సమరశీల ఉద్యమాలకు పేదలు సిద్ధం కావాలని ప్రజాసంఘాల ఐక్య పోరాట వేదిక రాష్ట్ర కన్వీనర్ వీరయ్య పిలుపునిచ్చారు. ఇండ్ల స్థలాలు ఇప్పుడు సాధించుకోకపోతే, ముందుముందు పేదలకు జానెడు జాగా కూడా దొరకబోదని స్పష్టం చేశారు. నగరీకరణ పథకం పేరిట కేంద్రం బడా కార్పొరేట్లకు భూములు ధారాదత్తం చేస్తోందని, రాష్ట్ర ప్రభుత్వం భూములు అమ్ముకుని సొమ్ము చేసుకుంటుందని విమర్శించారు. రాష్ట్ర ప్రభుత్వం ప్రకటించిన గృహలక్ష్మి పథకం కంటితుడుపు చర్య అని అసంతృప్తి వ్యక్తం చేశారు. ఇండ్లు లేని పేదలకు స్థలాలు ఇచ్చి ఇంటి నిర్మాణం కోసం కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు రూ.15 లక్షల ఆర్థికసాయం చేయాలని స్పష్టం చేశారు. రాష్ట్ర ప్రభుత్వం వాగ్దానం చేసినట్టుగా ఎన్నికలలోపు రాష్ట్రవ్యాప్తంగా 5 లక్షల డబుల్ బెడ్‌రూమ్ ఇండ్లు నిర్మించి పేదలకు పంచాలని డిమాండ్ చేశారు. ఇక ఇండ్ల స్థలాల పంపిణీపై రాష్ట్ర ప్రభుత్వం ఈ నెల 27లోగా నిర్దిష్ట కాలపరిమితితో కూడిన అధికారిక ప్రకటన చేయాలని, లేకపోతే రాష్ట్రవ్యాప్తంగా ఆందోళన కార్యక్రమాలను ఉధృతం చేస్తామని హెచ్చరించారు.

ఇండ్లు, ఇండ్ల స్థలాల కోసం తెలంగాణ ప్రజా సంఘాల ఐక్య పోరాట వేదిక ఆధ్వర్యంలో ఈ నెల 18వ తేదీన ప్రారంభమైన బస్సుజాతా శనివారం నిజామాబాద్ జిల్లా కేంద్రానికి చేరుకుంది. మొదట కంఠేశ్వర్ బైపాస్ వద్ద బస్సు యాత్రకు జిల్లా నేతలు ఘనస్వాగతం పలికారు. అక్కడి నుంచి ర్యాలీగా సభావేదిక రాజీవ్‌గాంధీ ఆడిటోరియానికి యాత్ర చేరింది. ఈ సందర్భంగా బస్సుయాత్ర కన్వీనర్ ఎస్. వీరయ్య మాట్లాడుతూ.. దేశంలో 2022 డిసెంబర్ 31 నాటికి ఇండ్లులేని పేదలందరికీ పక్కా ఇండ్లు కట్టిస్తామని ప్రధానమంత్రి మోడీ హామీనిచ్చి, ప్రధానమంత్రి ఆవాజ్ యోజన అంటూ అదరగొట్టి ఇప్పుడు ఇండ్ల ఊసేఎత్తడం లేదని ...5లో

మెట్రో రైల్ విస్తరణను ఆమోదించండి

పట్టణ ఉపాధి హామీ అమలు చేయాలి

- కేంద్రమంత్రి హర్దీప్ సింగ్ పూరీకి కేటీఆర్ వినతి



న్యూఢిల్లీ : హైదరాబాద్ మెట్రో రైల్ ప్రాజెక్ట్ రెండో దశ విస్తరణకు కేంద్ర ప్రభుత్వం ఆమోదం తెలపాలని రాష్ట్ర మునిసిపల్ పట్టణాభివృద్ధి శాఖ మంత్రి కెటి రామారావు కోరారు. ఈ మేరకు శనివారం నాడిక్కడ అక్బర్ రోడ్‌లో కేంద్ర పట్టణాభివృద్ధి శాఖ మంత్రి హర్దీప్ సింగ్ పూరీని ఆయన నివాసంలో కలిసి వివిధ అంశాలపై వినతి పత్రం అందజేశారు. లక్డీకపూల్ నుంచి బీహెచ్‌ఈఎల్ వరకు 26 కిలోమీటర్లు, నాగోల్ నుంచి ఎల్బీనగర్ వరకు ఐదు కిలోమీటర్ల మెట్రోకు ఆమోదంతో పాటు, ఆర్థిక సహాయం చేయాలని విజ్ఞప్తి చేశారు. జాతీయ గ్రామీణ ఉపాధి హామీ పథకం మాదిరి పట్టణ పేదల కోసం ప్రత్యేకంగా ఉపాధి హామీ కార్యక్రమాన్ని దేశవ్యాప్తంగా అమలులోకి తీసుకురావాలన్న ప్రతిపాదనను సమర్పించారు. తెలంగాణ ప్రభుత్వం హైదరాబాద్ నగర పరిధిలో చేపట్టిన మిస్సింగ్, లింకు రోడ్ల కార్యక్రమాలు విజయవంతంగా నడుస్తున్నాయనీ, ఇప్పటికే 22 మిస్సింగ్ లింక్ రోడ్లను పూర్తి చేశామని, మరో 17 రోడ్ల నిర్మాణ పనులు దాదాపుగా పూర్తి కావచ్చాయని కేటీఆర్ తెలిపారు. అదేవిధంగా అవుటర్ రింగ్ రోడ్డు నుంచి పరిసర పురపాలికలకు మొత్తం 104 అదనపు కారిడార్లను నిర్మించేందుకు దాదాపు రూ.2,400 కోట్లు ఖర్చు అవుతుందని, ఇందుకు సంబంధించి కేంద్ర ప్రభుత్వం సుమారు రూ.800 కోట్లను ఈ ప్రాజెక్టు కోసం కేటాయించాలని విజ్ఞప్తి చేశారు.

హైదరాబాద్ నగరంలో పారిశుధ్య కార్యక్రమాలు ముఖ్యంగా ఇప్పటికే పేరుకుపోయిన చెత్తను శుద్ధి చేయడంతో పాటు చెత్తను తరలించేందుకు అవసరమైన వాహనాల ప్రొక్యూర్మెంట్ కోసం, ట్రాన్స్‌ఫర్ స్టేషన్‌ల ...5లో

30 నుంచి పోడు పట్టాలు

అసిఫాబాద్ జిల్లా కేంద్రం నుంచి ప్రారంభించనున్న సీఎం



నవతెలంగాణ బ్యూరో-హైదరాబాద్

రాష్ట్రంలో ఈ నెల 30 నుంచి గిరిజనులకు పోడు భూముల పట్టాలను పంపిణీ చేయాలని ముఖ్యమంత్రి కె.చంద్ర శేఖర్‌రావు నిర్ణయించారు. ఈ కార్యక్రమాన్ని అసిఫాబాద్ జిల్లాకేంద్రం నుంచి అదేరోజు ఆయన లాంఛనంగా ప్రారంభించనున్నారు. మంత్రులు, ఎమ్మెల్యేలు వారి వారి జిల్లాలు, నియోజకవర్గాల్లో అదే రోజు పోడు పట్టాల పంపిణీ చేయనున్నారు. ఈనెల 24 నుంచే పోడు పట్టాల పంపిణీ కార్యక్రమాన్ని ప్రారంభించాలని ప్రకటించినప్పటకీ కొన్ని అనివార్య కారణాల వల్ల ఈనెల 30వ తేదీకి మార్చాల్సి వచ్చిందని సీఎం తెలిపారు. జాతీయ ఎన్నికల కమిటీ రాష్ట్రంలో పర్యటిస్తుండటం, అందుకు సంబంధించి శుక్ర, శనివారాల్లో జిల్లా కలెక్టర్లకు శిక్షణాతరగుతులు నిర్వహిస్తుండటంతో పాటు ఈ నెల 29 న బక్రీద్ పండుగ కూడా ఉండడం ...వీటన్నింటి నేపథ్యంలో ప్రకటించిన కార్యక్రమాన్ని ఈ నెల 30 కి మార్చినట్టు సీఎం తెలిపారు. అసిఫాబాద్ జిల్లా కలెక్టరేట్, ఎస్పీ కార్యాలయాన్ని కూడా అదే రోజు సీఎం కేసీఆర్ ప్రారంభించనున్నారు. ఈ మేరకు ముఖ్యమంత్రి కార్యాలయం శనివారం ఒక ప్రకటన విడుదల చేసింది.

అత్యుత్తమ చికిత్స కోసం

సెంటర్ ఫర్ ఎక్సలెన్సీ

- రాష్ట్రంలోని 18 ఎస్ఎన్‌సీయూలకు అనుసంధానం : మంత్రి హరీశ్‌రావు



వివరాలు 2లో..

దివ్యాంగుల సమాచారం

అవసరం లేదు

కుటుంబ ఆరోగ్య సర్వేపై కేంద్రం

వివరాలు 5లో..



వైద్య సేవల కార్పొరేటీకరణ

దురదృష్టకరం

ఇది సమాజానికి ప్రమాదం, హానికరం

- సుప్రీంకోర్టు మాజీ ప్రధాన న్యాయమూర్తి ఎన్.వి.రమణ వివరాలు 5లో..
- ఆరోగ్య సమాజానికి నివారణ చర్యలే పునాది
- రోగాలపై యుద్ధంలో ఫ్యామిలీ ఫిజిషియన్లే ఫ్రంట్‌లైన్ వారియర్లంటూ వ్యాఖ్య

హిందీని రుద్దడం చట్ట ఉలంఘనే!

- అంగీకరించిన కేంద్రం



న్యూఢిల్లీ : దేశంలో ఉన్నత విద్యా సంస్థల్లో హిందీని బలవంతంగా రుద్దేందుకు కేంద్ర హోం మంత్రి అమిత్ షా నేతృత్వంలోని పార్లమెంటరీ కమిటీ చేసిన సిఫార్సు చట్టాన్ని ...5లో

నవతెలంగాణపై స్పందన
ఫోన్ చేయాల్సిన నంబరు : 9490099016

పత్రికకు ప్రజలే మార్గదర్శకులు. నవతెలంగాణలో మీకు నచ్చిన, నచ్చని అంశాలను ఎప్పటికప్పుడు మా దృష్టికి తెస్తే.. పత్రికకు మరింత పదును పెట్టే వీలుంటుంది. ఆదివారం మినహా ప్రతి రోజూ మధ్యాహ్నం 12 నుంచి సాయంత్రం 6 గంటలవరకూ పత్రికపై మీ అభిప్రాయాలను 9490099016కు తెలియచేయవచ్చు. మీరు చెప్పేది స్పష్టంగా, సూటిగా, క్లుప్తంగా ఉండాలి. ఇప్పటికే చాలా మంది పంపుతున్న విమర్శలు, సూచనలు మాకు బాగా ఉపయోగపడుతున్నాయి. వారందరికీ కృతజ్ఞతలు.

అభిప్రాయాలు పంపదలిస్తే మా అడ్రస్ : స్పందన, నవతెలంగాణ తెలుగు డైలీ, ఎం.హెచ్ భవన్, ప్లాట్ నెం.21/1, అజామాబాద్, ఆర్టీసీ కళ్యాణ మండపం దగ్గర, బాగ్‌లింగంపల్లి, హైదరాబాద్ - 20.

అఖిలపక్షాన్ని పంపాలి

(మొదటిపేజీ తరువాయి)

బహిరంగంగా అంగీకరించారు. తనను విశ్వసించాలని, ఈ విషయంపై ప్రధాని సూచనలు ఇస్తున్నారని అమిత్ షా తెలిపారు. ఈ ఘర్షణల్లో ఇప్పటి వరకు 131 మంది మరణించారనీ, హింస, దోపిడీలు సహా 5,036 ఘటనలు నమోదయ్యాయని వెల్లడించారు. 5,889 ఎఫ్ఐఆర్‌లు నమోదు కాగా 144 మందిని మాత్రమే అరెస్టు చేశారు. వివాదాలకు కారణమైన కేసును హైకోర్టు నుంచి సుప్రీం కోర్టుకు బదిలీ చేసేలా చర్యలు తీసుకోవచ్చని అమిత్ షా అన్నారు.

ప్రధాని ఒక్కసారి కూడా మణిపూర్ వైపు చూడలేదు: ఓక్రమ్ ఇబోబీ సింగ్

మణిపూర్ భారత్‌లో భాగమని, ప్రధాని ఒక్కసారి కూడా ఆ రాష్ట్రం వైపు చూడలేదని కాంగ్రెస్ నేత, మణిపూర్ మాజీ ముఖ్యమంత్రి ఓక్రమ్ ఇబోబీ సింగ్ విమర్శించారు. తనకు ఏడు నిమిషాలు సమయం ఇచ్చారని, మణిపూర్ నా సొంత రాష్ట్రం కనుక తన అభిప్రాయాలు తెలిపేందుకు అదనంగా మరో ఐదు నిమిషాలు మాట్లాడేందుకు అవకాశం ఇవ్వాలని కోరాననీ, అందుకు కేంద్ర ప్రభుత్వం నిరాకరించిందనీ, ఇది దురదృష్టకరమని అన్నారు. గత 50 రోజులుగా ఒక్క మాట కూడా మాట్లాడని ప్రధాని మోడీ నేతృత్వంలో మణిపూర్ రాజధాని ఇంఫాల్‌లో అఖిలపక్ష సమావేశం ఏర్పాటు చేస్తే బాగుండేదని కాంగ్రెస్ పేర్కొంది. అప్పుడు మణిపూర్ ప్రజలకు వారి బాధ, జాతీయ వేదనపై స్పష్టమైన సందేశం ఇవ్వగలమని తెలిపింది. సాయుధ బలగాలను ఎటువంటి రాజీ లేకుండా వెంటనే వెనక్కి పంపాలని, రాష్ట్ర ప్రభుత్వం అత్యంత అవసరమైనప్పుడు సమర్థవంతమైన పాలన అందించడంలో ఘోరంగా విఫలమైందని పేర్కొంది. పరిస్థితిని ఎదుర్కోవడంలో, సంక్షోభాన్ని నిలువరించడంలో విఫలమైనట్లు ముఖ్యమంత్రి స్వయంగా రెండుసార్లు బహిరంగంగా అంగీకరించారని, ప్రజలను క్షమించాలని కూడా కోరారని తెలిపింది. మార్చి 11 ఆయన కుకీ ప్రయోజనాలను సమర్థిస్తున్నామని చెప్పుకునే కొన్ని మిలిటెంట్ గ్రూపులతో కార్యకలాపాల సస్పెన్షన్‌పై త్రైపాక్షిక ఒప్పందాన్ని ఏకపక్షంగా ఉపసంహరించుకున్నారని తెలిపారు. ఈ చర్యను తరువాత కేంద్ర హోం మంత్రిత్వ శాఖ తిరస్కరించిందని గుర్తు చేసింది. కానీ అప్పటికే జరగాల్సిన నష్టం జరిగిందని పేర్కొంది. మణిపూర్ ఐక్యత, ప్రాదేశిక సమగ్రతపై ఏ విధంగానూ రాజీపడకూడదని స్పష్టం చేసింది. ప్రతి సంఘం ఫిర్యాదులను తప్పనిసరిగా వినాలని, సున్నితంగా పరిష్కరించాలని సూచించింది. బాధిత ప్రజల ఉపశమనం, పునరావాసం, జీవనోపాధికి సంబంధించిన ప్యాకేజీని ఆలస్యం చేయకుండా సిద్ధం చేయాలని, ప్రకటించిన ఉపశమన ప్యాకేజీ పూర్తిగా సరిపోదని తెలిపింది.

బీరెన్ సింగ్‌కు అధికారంలో కొనసాగే హక్కు లేదు: సీపీఐ(ఎం)

పక్షపాతం, నిష్క్రియాత్మకమైన బీజేపీ ముఖ్యమంత్రి బీరెన్ సింగ్‌కు అధికారంలో కొనసాగే హక్కు లేదని సీపీఐ(ఎం) రాజ్యసభ సభ్యుడు జాన్ బ్రిట్టాస్ అన్నారు. సమస్యలకు బీరెన్ సింగ్ మూలకారణమని, బీరెన్ సింగ్ ముఖ్యమంత్రిగా కొనసాగితే పరిష్కారం అసాధ్యమని అన్నారు. బీజేపీ మిత్రపక్షమైన ఎంఎన్ఎఫ్‌తో పాటు సమాజ్‌వాదీ పార్టీ, జేడీయూ ఆప్, ఆర్జేడి కూడా దీనికి మద్దతు పలికాయి. పోలీసుల ఆయుధాలను స్వాధీనం చేసుకోవడంపై కేంద్రం మౌనం వహించడాన్ని బ్రిట్టాస్ ప్రశ్నించారు. ముగ్గురితో కూడిన ప్రతినిధి బృందం ఢిల్లీకి చేరుకుని ప్రధానిని కలిసేందుకు సమయం అడిగినా ఇవ్వలేదని తెలిపారు. ఈ ప్రతినిధులలో ఇద్దరు బీజేపీ ఎమ్మెల్యేలు కూడా ఉన్నారని, ముఖ్యమంత్రిని మార్చాలని బీజేపీ ఎమ్మెల్యేలు స్వయంగా డిమాండ్ చేస్తున్నారని తెలిపారు. మేఘాలయ, సిక్కిం ముఖ్యమంత్రులను ఆహ్వానించడం, మణిపూర్ ముఖ్యమంత్రిని సమావేశానికి ఆహ్వానించకపోవడంపై బ్రిట్టాస్ ప్రశ్నించారు.

మరో వారం రోజుల్లో అఖిలపక్ష ప్రతినిధి బృందాన్ని మణిపూర్‌కు పంపాలని టీఎంసీ, ఆర్జేడి డిమాండ్ చేశాయి. శాంతి, సామరస్యాన్ని పునరుద్ధరించాలని కోరాయి. మణిపూర్‌లో ప్రభుత్వాన్ని నడిపే వ్యక్తిపై విశ్వాసం లేదని, శాంతిని పునరుద్ధరించవలసి వస్తే, అలాంటి వ్యక్తితో చేయలేరని చెప్పినట్టు ఆర్జేడి నేత మనోజ్ కుమార్ ఝా అన్నారు. శివసేన ఎంపీ ప్రియాంక చతుర్వేది మాట్లాడుతూ మణిపూర్ పరిస్థితిపై అన్ని పార్టీలు ఆందోళన వ్యక్తం చేశాయని, సాధారణ స్థితికి తీసుకురావడానికి తక్షణమే ప్రభుత్వం చర్యలు తీసుకోవాలని కోరినట్టు చెప్పారు.డీఎంకే నేత తిరుచ్చి శివ మాట్లాడుతూ "హోంమంత్రి మా ప్రతి ఒక్కరి మాట విన్నారు. ఆయన దానిని చూస్తున్నానని చెప్పారు. శాంతిని పునరుద్ధరిస్తాను నన్ను నమ్మండి అన్నారు. ప్రధాని తన ఆందోళనను వ్యక్తం చేయలేదని నిలదీశాం. అఖిలపక్ష ప్రతినిధి బృందాన్ని మణిపూర్‌కు పంపాల్సిందిగా కోరాం. అక్కడ రాష్ట్రంలో పాలనా వైఫల్యం, కేంద్ర ప్రభుత్వ వైఫల్యం" అని అన్నారు.

బీఆర్ఎస్ నేత బోయినపల్లి వినోద్ కుమార్ మాట్లాడుతూ మణిపూర్ ప్రజలకు భరోసా, ధైర్యం కల్పించే బాధ్యత అన్ని రాజకీయ పార్టీలపై ఉందని అఖిలపక్ష సమావేశంలో చెప్పామన్నారు. ఘర్షణల కారణంగా అనేక ఇండ్లు ధ్వంసం అయ్యాయని, వేలాదిమంది నిర్వాసితులయ్యారని అన్నారు. కేంద్రం వెంటనే వారికి పునరావాసం కల్పించాలని డిమాండ్ చేశారు. 50 రోజులుగా ఇంటర్నెట్ నిషేధించడం మంచిది కాదని, ఇంటర్నెట్ సేవలను పునరుద్ధరించాలని కోరామన్నారు. ఇంత జరిగినా ఇప్పటివరకు ప్రధాని స్పందించలేదని, ఇది మంచి పద్ధతి కాదని అన్నారు. క్షేత్ర స్థాయిలో పర్యటించేందుకు అన్ని పార్టీలను తీసుకెళ్లాలని కోరారు.

ఈ సమవేశంలో జెపి నడ్డా (బీజేపీ), మేఘాలయ సీఎం కాన్రాడ్ సంగ్మా (ఎన్‌పీపీ), సిక్కిం ముఖ్యమంత్రి ప్రేమ్ సింగ్ తమాంగ్ (సిక్కిం క్రాంతికారి మోర్చా), మణిపూర్ మాజీ ముఖ్యమంత్రి ఓక్రమ్ ఇబోబీ సింగ్ (కాంగ్రెస్), బీరేంద్ర ప్రసాద్ బైశ్యా (అసోం గణ పరిషత్), జాన్ బ్రిట్టాస్ (సీపీఐ(ఎం), డెరెక్ ఒబ్రెయిన్ (టీఎంసీ), తిరుచ్చి శివ (డీఎంకే), రామ్ గోపాల్ యాదవ్ (ఎస్పీ), బుగ్గన రాజేంద్రనాథ్ రెడ్డి (వైసీపీ), వినోద్ కుమార్ (బీఆర్ఎస్), సంజయ్ సింగ్ (ఆప్), పినాకి మిశ్రా (బీజేడీ), ప్రియాంక చతుర్వేది (శివసేన-ఉద్ధవ్ ఠాక్రే), మనోజ్ కుమార్ ఝా (ఆర్జేడి), తంబిదురై (అన్నాడీఎంకే), నరేంద్ర వర్మ (ఎన్సీపీ), అనిల్ ప్రసాద్ (జేడీయూ), పార్లమెంటరీ వ్యవహారాల మంత్రి ప్రహ్లాద్ జోషి, కేంద్ర హోం శాఖ సహాయ మంత్రులు నిత్యానంద్ రాయ్, అజయ్ కుమార్ మిశ్రా, కేంద్ర హోంశాఖ కార్యదర్శి అజయ్ భల్లా, ఇంటెలిజెన్స్ బ్యూరో డైరెక్టర్ తపన్ దేకా హాజరయ్యారు.అఖిల పక్ష సమావేశానికి సిపిఐని ఆహ్వానించలేదు. దీనిపై సీపీఐ ఎంపీ బినయ్ విశ్వం స్పందిస్తూ తమ పార్టీని ఆహ్వానించక పోవడంపై కేంద్ర హోం మంత్రి వివరణ ఇవ్వాలని డిమాండ్ చేశారు.



పోలవరం బాధితులకు పునరావాసం కల్పించాలి

ఏఐఏడబ్ల్యుయూ ప్రధాన కార్యదర్శి బి.వెంకట్



న్యూఢిల్లీ: పోలవరం ముంపు బాధితులకు పరిహారం, పునరావాసం కల్పించాలని ఏఐఏడబ్ల్యుయూ ప్రధాన కార్యదర్శి బి. వెంకట్ డిమాండ్ చేశారు. శనివారం నాడిక్కడ ఏపీ, తెలంగాణ భవన్‌లో ఆయన మీడియాతో మాట్లాడారు. 'పోలవరం ప్రాజెక్టుకు జాతీయ హోదా కల్పిస్తూ విభజన చట్టంలో పేర్కొన్నారు. కానీ కేంద్ర ప్రభుత్వం ఇప్పుడు జాతీయ ప్రాజెక్టు అర్థాన్నే మార్చేస్తుంది. నిర్మాణ వ్యయం ఇస్తాం. కాని పునరా వాసం కల్పించలేమని అంటున్న కేంద్రం కేసుల కోసం జగన్ కేంద్రానికి సరెండర్ అయ్యి పోలవరాన్నీ కేంద్రానికి తాకట్టు పెట్టారు. గత కొన్నేండ్లుగా పోలవరానికి నిధులు ఇవ్వడం లేదు. లక్ష మంది ప్రజలకు రూ.34 వేల కోట్ల పునరావాస ప్యాకేజి ఇవ్వాల్సి ఉంది. ముంపునకు గురయ్యే షెడ్యూల్ ప్రాంతంలో 18 ఏండ్లుగా ఉన్న ప్రతి ఒక్కరికి రూ.10 లక్షల నష్ట పరిహారం ఇవ్వాలి. కానీ నిర్వాసిత కుటుంబానికే ఇస్తామంటున్నారు. కేంద్ర, రాష్ట్ర ప్రభు త్వాలు ముంపు బాధితులకు పునరావాస నిధులు ఇవ్వకపోవడాన్ని ఖండి స్తున్నాం' అన్నారు.

'అభివృద్ధి పేరుతో తెలంగాణాలోని హైదరాబాద్‌లో పేదల నుంచి అన్యాయంగా భూములు లాగేసుకుంటున్నారు. భూ రక్షణ ఉద్య మాలు దేశవ్యాప్తంగా నిర్వహించడానికి సిద్ధంగా ఉన్నాం. అసైన్డ్ భూములు తీసుకోవడం వల్ల దళితులు, పేదలకు నష్టం జరుగుతుంది' అని అన్నారు.



చేయాల్సింది ఎంతో ఉంది

పారిస్ ఒప్పందంలో భారత్ హామీలపై సీఏటీ నివేదిక

న్యూఢిల్లీ : పారిస్‌లో 2015లో జరిగిన జీ-20 దేశాల సమావేశంలో వాతావరణ మార్పులపై ఇచ్చిన హామీలను అన్నింటినీ నెరవేర్చిన ఏకైక దేశం భారతదేశమేనని ప్రధాని నరేంద్ర మోడీ చెప్పుకొచ్చారు. అమెరికా అధ్యక్షుడు జో బైడెన్‌తో కలిసి శ్వేతసౌధంలో నిర్వహించిన సంయుక్త విలేకరుల సమావేశంలో ఆయన ప్రసంగిస్తూ పారిస్ ఒప్పందంలో నిర్దేశించుకున్న లక్ష్యాలను ప్రస్తావించారు. వాస్తవానికి ఈ లక్ష్యాలను చేరుకోవడానికి మన దేశం కొన్ని చర్యలను అమలు చేసింది కూడా. అయితే అన్ని లక్ష్యాలనూ చేరుకోవడంలో మాత్రం చాలా వెనుకబడింది. వాతావరణంపై 40 దేశాలు తీసుకున్న చర్యలు, వాటి ప్రభావంపై 'ది క్లైమేట్ యాక్షన్ ట్రాకర్' (సీఏటీ) అనే సంస్థ రూపొందించిన నివేదిక ప్రకారం వాతావరణ మార్పులపై మన దేశం తీసుకున్న చర్యలు లక్ష్యాలను చేరుకోవడానికి ఏ మాత్రం సరిపోవు.

కర్బన ఉద్గమనాల తీవ్రతను 2030 నాటికి 33-35% మేర తగ్గిస్తానని భారత్ హామీ ఇచ్చింది. ఆ తర్వాత లక్ష్యాన్ని 40%నికి పెంచింది. అదే సమయంలో స్వచ్ఛమైన ఇంధన వనరుల నుండి సంచిత విద్యుదుత్పత్తిని 40 శాతానికి పెంచుతానని తెలిపింది. అడవులు, చెట్లను పెంచి వాతావరణంలో కార్బన్‌డైయాక్సైడ్‌ను తగ్గిస్తానని చెప్పింది. స్వచ్ఛమైన ఇంధన వనరుల ప్రాజెక్టులను అభివృద్ధి చేయడంలో మన దేశం కొంత పురోగతి సాధించినప్పటికీ 2022 నాటికి 175 గిగా-వాట్ల పునరుద్పాదక ఇంధనాన్ని ఉత్పత్తి చేస్తానన్న లక్ష్యాన్ని మాత్రం చేరుకోలేక పోయింది.

పారిస్ ఒప్పందంలో పొందుపరిచిన లక్ష్యాలను చేరుకోవడమే కాకుండా ఈ విషయంలో అమెరికా వంటి ఇతర దేశాలకు కూడా సాయపడ్డామని మోడీ చెప్పారు. 2021 ఆగస్టులో కూడా ఆయన ఇవే వ్యాఖ్యలు చేశారు. అయితే భారత్ చేయాల్సింది ఎంతో ఉందని సీఏటీ తెలిపింది. ఉదాహరణకు ఉష్ణోగ్రత పరిమితికి సంబంధించి భారత్ అమలు చేస్తున్న వాతావరణ విధానాలు, నెరవేరుస్తున్న హామీలు నిలకడగా లేవని తేల్చింది. 'దీర్ఘకాలిక వ్యూహంలో భాగంగా అతి తక్కువ కర్బనాన్ని ఉత్పత్తి చేస్తానని ఇచ్చిన హామీ విషయంలో భారత్ పనితీరు పేలవంగా ఉంది. బొగ్గు ఉత్పత్తిని కొనసాగించడమే దీనికి కారణం. 2070 నాటికి కర్బన ఉద్గమనాలను జీరో స్థాయికి తీసుకురావాలన్న లక్ష్యాన్ని చేరుకునేందుకు ఎలాంటి చర్యలు తీసుకోవడం లేదు. అనుకున్నది సాధించాలంటే స్వల్పకాలిక లక్ష్యాలను నిర్దేశించుకొని అడుగులు వేయాలి' అని వివరించింది.

పారిస్ ఒప్పందంలో నిర్దేశించుకున్న లక్ష్యాలను చేరుకోవడానికి జీ-20లోని ఏ ఒక్క దేశం ముందుకు సాగడం లేదని 2020లో విడుదలైన ఒక నివేదిక స్పష్టం చేసింది.

ఉద్గమనాలను జీరో స్థాయికి తీసుకురావాలన్న లక్ష్యం నెరవేరాలంటే భారత్, అమెరికా దేశాలు తీసుకోవాల్సిన చట్టపరమైన చర్యలు ఎన్నో ఉన్నాయని ఆ నివేదిక తెలిపింది.

వరిలో స్వల్పకాలిక వంగడాలు సాగుచేయాలి

రైతులకు మంత్రి నిరంజన్‌రెడ్డి విజ్ఞప్తి

నవతెలంగాణబ్యూరో-హైదరాబాద్

వానాకాలంలో స్వల్పకాలిక వరి వంగడాలను సాగు చేయాలని రాష్ట్ర వ్యవసాయ శాఖ మంత్రి సింగిరెడ్డి నిరంజన్‌రెడ్డి రైతులకు విజ్ఞప్తి చేశారు. సాగు చేయాల్సిన పంటల వివరాలను వెంటనే అందజేయాలని వ్యవసాయ శాఖను ఆదేశించారు. 'కూనారం సన్నాలు , కూనారం 1638, బతుకమ్మ, వరంగల్ 962, ఆర్ఎన్ఆర్ 21278, ఆర్ఎన్ఆర్ 29325, జగిత్యాల 1798, తెలంగాణ సోనా, ఎంటీయూ 1010, జగిత్యాల 24423, ఐఆర్64, హెచ్ఎంటీ సోనా' సాగు చేయాలని సూచించారు.

శనివారం హైదరాబాద్‌లోని డాక్టర్ బీఆర్ అంబేద్కర్ రాష్ట్ర సచివాలయంలో వాతావరణ పరిస్థితులు, వానాకాలం పంటల సాగు, విత్తనాల లభ్యత, ఎరువుల సరఫరా, ఆయిల్ పామ్ సాగుపై ఉన్నతాధికారులతో మంత్రి సమీక్షించారు.ఈ సందర్భంగా మంత్రి మాట్లాడుతూ వర్షాలు ఆలస్యం అయినందున క్షేత్రస్థాయిలో వ్యవసాయ శాఖ అధికారులు పర్యటించి రైతులకు సలహాలు, సూచనలు ఇవ్వాలని ఆదేశించారు. తగినంత తేమ ఉన్నప్పుడే విత్తనాలు నాటుకునేలా రైతులకు విస్తృతంగా అవగాహన కల్పించాలన్నారు. రైతులకు అవసరమైన ఎరువులు, విత్తనాలు అందుబాటులో ఉన్నాయని తెలిపారు. యాసంగిలో అకాలవర్షాల నుంచి వరి పంట నష్టపోకుండా రైతులు పంటకాలాన్ని ముందుకు జరుపుకునేలా అవగాహన కల్పించాలని కోరారు. వరి పంటకాలం ముందుకు జరుపుకునేలా రైతులను చైతన్యం చేస్తూ వ్యవసాయ శాఖ రూపొందించిన వీడియోను విడుదల చేశారు. సమీక్షా సమావేశంలో వ్యవసాయ శాఖ కార్యదర్శి రఘునందన్‌రావు, ప్రత్యేక కమిషనర్ హన్మంతు కొండిబ, హైదరాబాద్ వాతావరణ శాఖ డైరెక్టర్ డాక్టర్ నాగరత్న, సాగునీటి శాఖ ఎస్ఈ శ్రీనివాస్, విత్తన సంస్థ ఎండీ కేశవులు, అడిషనల్ డైరెక్టర్ విజయ్ కుమార్, ఉద్యాన శాఖ జేడీ సరోజిని తదితరులు ఉన్నారు.

అత్యుత్తమ చికిత్స కోసం సెంటర్ ఫర్ ఎక్సలెన్సీ

నవతెలంగాణ-మెహిదీపట్నం

అనుభవజ్ఞులైన వైద్యులు వీడియో కాన్ఫరెన్స్ ద్వారా అత్యుత్తమ చికిత్స అందించడమే సెంటర్ ఫర్ ఎక్సలెన్సీ ఉద్దేశం అని వైద్యారోగ్యశాఖ మంత్రి హరీశ్‌రావు తెలిపారు. హైదరాబాద్ రెడ్ హిల్స్‌లోని నిలోఫర్ ఆస్పత్రిలో శనివారం సెంటర్ ఫర్ ఎక్సలెన్సీని మంత్రి ప్రారంభించారు. సెంటర్ ఫర్ ఎక్సలెన్సీలో భాగంగా రాష్ట్ర వ్యాప్తంగా ఉన్నటువంటి 44 ఎస్ఎన్‌సీయూలలో 18 ఎస్ఎన్‌సీయూలను అనుసంధించారు.

ఈ సందర్భంగా మంత్రి మాట్లాడుతూ.. రాష్ట్రంలోని వివిధ ఆస్పత్రుల్లో విపత్కర పరిస్థితిలో ఉన్న పిల్లలకు నిలోఫర్ ఆస్పత్రిలోని అనుభవజ్ఞులైన వైద్యులు వీడియో కాన్ఫరెన్స్ ద్వారా అత్యుత్తమ చికిత్స అందించడమే సెంటర్ ఫర్ ఎక్సలెన్సీ ఉద్దేశం అన్నారు. నెలలు నిండకుండగానే పుట్టిన పిల్లలు, ఏదైనా ఇన్‌ఫెక్షన్, అవయవాలు పూర్తిగా వృద్ధి చెందకుండానే పుట్టిన పిల్లలను అత్యవసర చికిత్స నిమిత్తం నిలోఫర్ ఆస్పత్రికి తీసుకొస్తుండగానే చాలామంది శిశువులు దారిలోనే మరణిస్తున్నారని చెప్పారు. ఇకపై సెంటర్ ఫర్ ఎక్సలెన్సీ కార్యక్రమం ద్వారా నీలోఫర్ ఆస్పత్రిలోని వైద్యులు వీడియోలో చూస్తూ ఆ పిల్లలు జన్మించిన ఆస్పత్రిలోని డాక్టర్ల ద్వారా వారికి ఉత్తమ చికిత్స అందిస్తారని తెలిపారు. దేశంలో ఇప్పటివరకు ఇలాంటి సౌకర్యం ప్రయివేటు ఆస్పత్రుల్లో మాత్రమే ఉందని తెలిపారు. ఒకప్పుడు ప్రయివేటు ఆస్పత్రుల్లో 90 శాతం డెలివరీలు అయితే ప్రభుత్వ ఆస్పత్రుల్లో 30 శాతం డెలివరీలు అయ్యావని.. ఇప్పుడు ప్రయివేటు ఆస్పత్రుల్లో 30 శాతం డెలివరీలు అయితే, 70 శాతం డెలివరీలు ప్రభుత్వ ఆస్పత్రుల్లో అవుతున్నాయని తెలిపారు. ముఖ్యమంత్రి కేసీఆర్ వైద్య ఆరోగ్య సేవలకు రూ.500 కోట్లు కేటాయించడం, కేసీఆర్ కేట్, ఆరోగ్య లక్ష్మి, వైద్య ఆరోగ్య సిబ్బంది నిరంతర శ్రమ వల్ల ఈ లక్ష్యాలను సాధించగలిగామని వివరించారు. వైద్య ఆరోగ్యశాఖ కమిష నర్ శ్వేత, డీఎమ్ఈ రమేష్‌రెడ్డిని అభినందించారు.

నిటి అయోగ్ ర్యాంకింగ్స్‌లో రాజస్థాన్ 16, ఛత్తీస్‌గఢ్ 10, హిమాచల్ ప్రదేశ్ 7, ఉత్తరప్రదేశ్ చిట్ట చివరి స్థానంలో ఉందని చెప్పారు. ప్రపంచ వ్యాప్తంగా నమోదవుతున్న మాతాశిశు మరణాల్లో 60శాతం పది దేశాల నుంచే అవుతుండగా, అందులో భారత్ అగ్రస్థానంలో ఉందని డబ్లూహెచ్‌ఓకు చెందిన యునిసెఫ్ ఇటీవల ప్రకటించిందని ఆందోళన వ్యక్తం చేశారు. ఈ విషయంలో నైజీరియా, పాకిస్థాన్, కాంగో, ఇథియోపియా, బంగ్లాదేశ్ వంటి దేశాలతో భారత్ పోటీ పడుతున్నదని ప్రపంచ ఆరోగ్య సంస్థ పరువు తీసిందన్నారు.

ఇన్నేండ్ల స్వతంత్రంలో తల్లీబిడ్డల ఆరోగ్యాలకు కూడా మన దేశంలో భరోసా ఇవ్వలేకపోతున్నాం.. ఇలాంటి అంశాల గురించి దేశ నాయకులు ఆలోచించాల్సింది పోయి రాజకీయాల గురించి మాట్లాడుతుండటం సిగ్గుచేటు అన్నారు. నడ్డాలు, పాండేలు, సుక్విందర్ సింగ్ సహా తెలంగాణకు వచ్చి నీతులు చెప్పే బీజేపీ, కాంగ్రెస్ నాయకులు ఆలోచించుకోవాలని.. తమ నుంచి నేర్చుకోవాలని సూచించారు. ఈ కార్యక్రమంలో హోం మంత్రి మహమ్మద్ అలీ పాల్గొన్నారు.

ఆధునిక పరిశ్రమగా వ్యవసాయం

- 'లైట్ హౌస్ కంక్లేవ్ ఎఫ్‌పీవో 2023'లో మంత్రి నిరంజన్‌రెడ్డి

నవతెలంగాణబ్యూరో-హైదరాబాద్

వ్యవసాయం ఆధునిక పరిశ్రమగా తయారు కావాలని రాష్ట్ర వ్యవసాయ శాఖ మంత్రి సింగిరెడ్డి నిరంజన్‌రెడ్డి ఆశాభావం వ్యక్తం చేశారు. సాంప్రదాయ వ్యవసాయం నుంచి రైతాంగం బయటకు రావాలని కోరారు. ఆ దిశగా అందరూ ఆలోచించాలని విజ్ఞప్తి చేశారు. శనివారం హైదరాబాద్ కన్హాశాంతివనంలో సమున్నతి సంస్థ నిర్వహించిన 'లైట్ హౌస్ కంక్లేవ్ ఎఫ్ పీ ఓ 2023' కార్యక్రమంలో మంత్రి మాట్లాడారు. తెలంగాణలో రైతు ఉత్పత్తి సంఘాలను ప్రోత్సహిస్తామన్నారు. దేశంలోని వివిధ రాష్ట్రాల నుంచి 180కి రైతు ఉత్పత్తిదారుల సంఘాల ప్రతినిధులతో సమావేశం నిర్వహించడం అభినందనీయ మన్నారు. ఈ కార్యక్రమంలో సమున్నతి సంస్థ సీఈవో అనిల్ కుమార్, డైరెక్టర్ ప్రవేశ్ శర్మ, డాక్టర్ వెంకటేష్ తగత్, ఏపీఎంఏఎస్ సీఈవో సీఎస్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

మందిరాల వద్ద మందు..మాంసం వద్దు

అమ్మకంపై నిషేధం కోసం మహారాష్ట్రలో హిందూత్వ సంస్థ ప్రయత్నం

- తప్పుబడుతున్న పరిశోధకులు, సామాజికవేత్తలు

ముంబయి: మహారాష్ట్రలో ఆలయాల వద్ద మందు, మాంసం దుకాణాల నిషేధానికి అక్కడి హిందూత్వ సంస్థ ఒకటి ప్రయత్నిస్తున్నది. ఇందుకోసం ఒక డ్రైవ్‌ను నిర్వహించడానికి సదరు సంస్థ సభ్యులు సిద్ధమవుతున్నారు. మహారాష్ట్ర లోని పలు ఆలయ యాజమాన్యాలకు ఉన్నత సంస్థగా ఉన్న మహారాష్ట్ర మందిర్ మహాసంఘ్ ఈ ప్రయత్నాలను చేస్తు న్నది. నెల కిందటే రాష్ట్రవ్యాప్తంగా 300 వరకు గుడులలో ఒక కఠినమైన డ్రెస్ కోడ్‌ను విధించారు. ఇప్పుడు సదరు హిందూత్వ సంస్థ పలు ప్రముఖ ఆలయాలకు 500 మీటర్ల దూరంలో మందు, మాంసం అమ్మకాలపై నిషేధం విధించడానికి యత్నిస్తున్నది.

ఇటీవల గోవాలో నిర్వహించిన ఏడు రోజుల అఖిల భారతీయ హిందూ రాష్ట్ర సమావేశంలో మహారాష్ట్ర మందిర్ మహాసంఘ్ ఈ నిర్ణయాన్ని తీసుకున్నది. రాష్ట్రంలోని మునిసిపల్ కార్పొరేషన్‌లో గల ఎక్సైజ్ విభాగం ప్రస్తుత నిబంధనల ప్రకారం విద్యా సంస్థలు, మత ప్రదేశాలు, రాష్ట్ర రవాణ బస్సు డిపార్ట్‌మెంట్‌ల నుంచి 50 మీటర్ల దూరంలో లిక్కర్ దుకాణాలపై నిషేధం ఉన్నది. అయితే, ఈ దూరాన్ని పెంచాలని సదరు హిందూత్వ సంస్థ కోరుతున్నది.

అయితే, సదరు హిందూత్వ సంస్థ ప్రతిపాదిత నిషేధాన్ని పలువురు తప్పు బడుతున్నారు. హిందూ మతంలో అలాం టి ఆచారానికి ఎలాంటి సంపూర్ణ నిబం ధన లేదని పరిశోధకులు జయరాజ్ సల గావోంకర్ అన్నారు.

నిషేధం విధించాల న్న ఒక్క నిబంధన హిందూ మతానికి సరి పోదని అన్నారు. హిందూ మతంలో పలు వర్గాలు ఉంటాయని చెప్పారు. కొందరు మందు, మాంసాన్ని సమర్పిస్తారనీ, మరి కొందరికి ఇది ఆమోదయోగ్యం కాదని జయరాజ్ అన్నారు. ఇలాంటి హిందూత్వ సంస్థలు తమకు నచ్చిన విధంగా వ్యవ హరిస్తూ హిందూమతంలోని ఇతర వర్గాల ఆచారాలను తొక్కిపెడు తున్నాయని సామాజిక, పౌర సంఘాల నాయకులు, కార్యకర్తలు ఆందోళన వ్యక్తం చేశారు.

నాణ్యమైన విద్యకు గుణాత్మక కార్యక్రమాలు

నవతెలంగాణ-సిటీబ్యూరో

బడి ఈడు పిల్లలు బడికి రావడం ఎంత ముఖ్యమో! వారందరూ వారి వయసుకు తగ్గ తరగతికి చెందిన సామర్థ్యాలను సాధించడమూ అంతే ముఖ్యం! దీనిని దృష్టిలో ఉంచుకొని మన రాష్ట్ర ప్రభుత్వం ఒకవైపు బడిని బలోపేతం చేస్తూనే... మరోవైపు విద్యార్థులందరూ నాణ్యమైన విద్యను పొందేలా చేయడానికి శ్రీకారం చుట్టింది.

ఆంగ్ల మాధ్యమం: పేద, బడుగు వర్గాల పిల్లలు కూడా ప్రభుత్వ బడుల్లో ఆత్మవిశ్వాసంతో నేర్చుకునేలా 2022-23 విద్యాసంవత్సరం నుంచి 8వ తరగతి వరకు ఆంగ్ల మాధ్యమాన్ని ప్రవేశపెట్టారు. ఈ సంవత్సరం 9వ తరగతికి విస్తరించారు. ఇందుకనుగుణంగా ద్విభాషా వాచకాలను ఎస్సీఈఆర్టీ రూపొందించింది. ఆంగ్లభాష మాధ్యమంలో బోధించే ఉపాధ్యాయుల ఆంగ్ల భాష బోధన సామర్థ్యాలను పెంపొందించడానికి 5వారాల శిక్షణ కార్యక్రమాలను నిర్వహించారు.

తొలిమెట్టు కార్యక్రమం(ఎఫ్ఎల్ఎన్): 2022-23 సంవత్సరం నుంచి ప్రాథమిక పాఠశాలల్లో 1 నుంచి 5 తరగతుల విద్యార్థులందరూ ఆయా తరగతులకు చెందిన సామర్థ్యాలను సాధింపజేయడం కోసం



'తొలిమెట్టు'(ఎఫ్ఎల్ఎన్) కార్యక్రమాన్ని నిర్వహిస్తున్నారు. ప్రతీ విద్యార్థి స్థాయిని



గుర్తించడానికి ప్రారంభ పరీక్ష నిర్వహించారు. ఆ తరగతికి అవసరమైన 'కనీస సామర్థ్యాల'ను సాధింపజేసి ఆ తదుపరి ఆయా తరగతుల సామర్థ్యాలను సాధింపజేయడానికి ప్రణాళిక చేశారు. ఇందుకోసం హైదరాబాద్ జిల్లాలో 2,333 ఉపాధ్యాయులకు శిక్షణా కార్యక్రమాలను నిర్వహించారు. ఈ కార్యక్రమం ద్వారా 62,944 మంది విద్యార్థులు నాణ్యమైన విద్యను పొందుతున్నారు. ఈ కార్యక్రమాన్ని నిశితంగా పరిశీలించి.. ఉపాధ్యాయులకు తగిన సలహాలు, సూచనలు ఇవ్వడానికి 24 మంది మండల నోడల్ అధికారులను నియమించారు. అలాగే ప్రతీ 10-15 పాఠశాలలను పర్యవేక్షించడానికి 56 క్లస్టర్ నోడల్ అధికారుల వ్యవస్థను ఏర్పరచారు. క్లస్టర్ స్థాయితో మొదలుకొని రాష్ట్ర స్థాయి వరకు సబ్జెక్టు వారీ విషయనిపుణుల బృందాలు విద్యాపరమైన సహాయ సహకారాలను ఉపాధ్యాయులకు అందిస్తున్నాయి. ఉన్నత పాఠశాలల్లో అభ్యసనాభివృద్ధి కార్యక్రమం: ప్రాథమిక పాఠశాలల్లో 'తొలిమెట్టు' కార్యక్రమాన్ని నిర్వహిస్తున్న విధంగానే ఉన్నత పాఠశాలల్లో 6 నుంచి నిర్వహించడానికి ప్రణాళికలు రూపొందించారు.

10వ తరగతికి ప్రత్యేక కార్యాచరణ ప్రణాళిక: 10వ తరగతిలో చేరిన విద్యార్థులందరూ ఉత్తీర్ణత పొందేలా, ఉన్నత గ్రేడులు సాధించేలా మాస వారీగా సూక్ష్మ స్థాయి ప్రణాళికతో కూడిన కార్యాచరణ ప్రణాళికలను విద్యాశాఖ రూపొందిస్తున్నది. పాఠ్యాంశాల ఆధారంగా విద్యార్థుల స్థాయికి అనుగుణమైన అభ్యాసాన్ని కల్పిస్తారు. ఇందుకోసం 'అభ్యాస దీపిక'లను అందించి అభ్యాసం కల్పిస్తారు.

ప్రభుత్వ స్కూళ్లలో గ్రంథాలయాలు: ప్రభుత్వ పాఠశాలల్లో పిల్లలకు చదవడం అలవాటుగా చేయడానికి వీలుగా గ్రంథాలయాలను బలోపేతం చేయడం ద్వారా పుస్తక ప్రపంచం (రీడింగ్ కార్నర్లు)ను ఏర్పరుస్తున్నారు. వీటి వల్ల విద్యార్థుల్లో పఠన సామర్థ్యం పెంపొందడంతో పాటు అవగాహన పరిధి విస్తృతమవుతుంది. ఇందుకోసం మొదటి దశలో 152 ప్రాథమికోన్నత పాఠశాలల్లో గ్రంథాలయ పుస్తకాలను పంపిణీ చేశారు. దశల వారీగా అన్ని పాఠశాలలకు పంపిణీ చేయడానికి ప్రణాళిక చేశారు.

రీడింగ్ క్యాంపెయిన్ (పఠనోత్సవం): విద్యార్థుల్లో పఠన సామర్థ్యాన్ని పెంపొందించడానికి 'పఠనం ఒక అలవాటు'గా మారడానికి రీడింగ్ క్యాంపెయిన్‌ను 'పఠనోత్సవం' పేరుతో అన్ని పాఠశాలల్లో నిర్వహిస్తున్నారు. 2023-24 విద్యా సంవత్సరంలో జూన్ 23వ తేదీ నుంచి అన్ని పాఠశాలల్లో 'రీడింగ్ క్యాంపెయిన్'ను పఠనోత్సవం పేరుతో ప్రారంభించి జులై మాసాంతం వరకు నిర్వహిస్తారు. రాష్ట్ర వ్యాప్తంగా గ్రామ గ్రామాల్లో పండుగ వాతావరణంలో పఠనోత్సవాన్ని నిర్వహిస్తారు. ఇందుకనుగుణంగా 152 ఉన్నత పాఠశాలల్లోని గ్రంథాలయాలు/ రీడింగ్ కార్నర్లను ఇప్పటికే ప్రారంభించారు. అన్ని తరగతులకు ప్రతీ రోజు పుస్తక పఠనం కోసం ఒక పీరియడును కేటాయించారు. ఈ పీరియడులో పఠన వ్యూహాలను అమలుపరుస్తారు.

ప్రభుత్వ పాఠశాలల విద్యార్థులు - ప్రోత్సాహకాలు

పాఠశాల విద్యలో అందించే ప్రోత్సాహకాలు అనగా 2 జతల యూనిఫామ్స్, ఉచిత పాఠ్యపుస్తకాలు, రవాణా భత్యం, స్కాలర్ షిప్స్, నాణ్యమైన మధ్యాహ్న భోజనం మొదలగు వాటి వల్ల రాష్ట్ర ఆవిర్భావం తర్వాత బడి ఈడు పిల్లలందరూ బడిలో చేరి విద్యనభ్యసిస్తుండడం అభినందనీయమైన పరిణామమని చెప్పవచ్చు.

పాఠ్య, నోట్ పుస్తకాలు: 1,43,676 మందికి ఈ విద్యా సంవత్సరం నుంచి ఉచిత నోటు బుక్స్, వర్క్ బుక్స్ కూడా అందించాలనే ప్రభుత్వం నిర్ణయం వల్ల పేద పిల్లల చదువుల్లో వెలుగులు నిండుతున్నాయి. ప్రాథమిక స్థాయి విద్యార్థులకు 1 నుంచి 5వ వరకు వారి సామర్థ్యాలను వృద్ధిం రచడానికి వీలుగా తెలుగు, ఆంగ్లం, గణితం సబ్జెక్టులలో వర్క్‌బుక్స్‌ను ఇవ్వడానికి ప్రభుత్వం ఏర్పాట్లు చేసింది. 6 నుంచి 10వ తరగతి విద్యార్థులకు సబ్జెక్టు వారీగా నోటుబుక్స్ కూడా అందిస్తున్నారు. 6, 7, 8 తరగతుల్లో సబ్జెక్టుకు ఒకటి చొప్పున, ఆపై తరగతుల్లో సబ్జెక్టు రెండు చొప్పున నోటు బుక్స్‌ను అందిస్తున్నారు. దీని వల్ల పిల్లలకు తగిన లేఖన అభ్యాసం లభిస్తుంది.



రాష్ట్ర సీనియర్ బ్యాడ్మింటన్ ఛాంపియన్ షిప్ విజేతలకు మెమెంటోలు అందజేత

నవతెలంగాణ-నాగోల్



రంగారెడ్డి జిల్లాల్లోని నందిగామ మండలంలోని కన్హ శాంతి వనంలో రంగారెడ్డి జిల్లా బ్యాడ్మింటన్ అసోసియేషన్ ఆధ్వర్యంలో జరిగిన తెలంగాణ స్టేట్ సీనియర్ బ్యాట్మింటన్ ఛాంపియన్ షిప్స్- 2023 మెన్ డబుల్స్ అండ్ ఉమెన్ సింగిల్స్ నేషనల్ సెలక్షన్ ఛాంపియన్ షిప్ విజేతలకు మెమెంటోలు సర్టిఫికెట్లు ప్రదానోత్సవం కార్యక్రమం శనివారం జరిగింది. ఈ కార్యక్రమంలో రాష్ట్ర పర్యాటక అభివృద్ధి సంస్థ మాజీ చైర్మెన్ ఐపీఎఫ్ జాతీయ కార్యదర్శి ఉప్పల శ్రీనివాస గుప్త ముఖ్య అతిథిగా పాల్గొన్నారు. ఈ బ్యాట్మింటన్ ఛాంపియన్ షిప్స్ -2023 పోటీలు జూన్ 22 నుండి జూన్ 24 వరకు నిర్వహించారు. ఫైనల్ మ్యాచ్ శనివారం జరిగింది. ఈ సందర్భంగా బ్యాట్మింటన్ ఛాంపియన్ షిప్స్ విన్నర్స్ అండ్ రన్నర్స్‌కు రూ.50,000/- ప్రైజ్ మని అందజేశారు. విజేతలు ఎం ఎస్ ఫస్ట్ ప్లేస్ పి. సహాస్ కుమార్, 2 వ ప్లేస్ కె. లోకేష్ రెడ్డి,3 వ ప్లేస్ తరుణ్ రెడ్డి, ఎండీ ఫస్ట్ ప్లేస్ కీర్తి శశాంక్, డబ్ల్యూ ఎస్ ఫస్ట్ ప్లేస్ ఎస్.రక్షిత శ్రీ, ఎక్స్ డి ఫస్ట్ ప్లేస్ సాత్విక్ రెడ్డి నిలిచారు. ప్రస్తుతం రంగారెడ్డి జిల్లా బ్యాడ్మింటన్ అసోసియేషన్ ప్రెసిడెంట్ గా పుల్లెంల గోపిచంద్, వైస్ చైర్మెన్ గా ఉప్పల శ్రీనివాస్ గుప్త వ్యవహరిస్తున్నారు..ఈ సందర్భంగా ఉప్పల శ్రీనివాస్ గుప్తను శాలువతో సన్మానించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ.. విన్నర్స్, రన్నర్స్‌కు అభినందనలు తెలియజేస్తూ గెలుపు ఓటములు ముఖ్యం కాదని, ప్రతి ఆటను స్పోర్టివ్ గా తీసుకోవాలని అన్నారు. సీఎం కేసీఆర్ నాయకత్వంలో రాష్ట్రం వచ్చిన తర్వాత స్పోర్ట్స్ కి, క్రీడాకారులకు అత్యధిక ప్రాధాన్యత ఇచ్చారని అన్నారు. రాష్ట్రంలోని అన్ని జిల్లాలలో స్పోర్ట్స్ స్టేడియంలు కూడా నిర్మిస్తూ ఉత్సాహం, ప్రతిభ ఉన్న క్రీడాకారులను ప్రోత్సహిస్తున్నారని పేర్కొన్నారు. క్రీడాకారులు మంచిగా రాణించి జాతీయ స్థాయిలో,రాష్ట్ర స్థాయిలో విజయం సాధించి , దేశానికి , మన తెలంగాణ రాష్ట్రానికి,వారి తల్లిదండ్రులకు మంచి పేరు తేవాలని సూచించారు. ఆత్మీయ అతిథులుగా ఇంటర్నేషనల్ బ్యాట్మింటన్ ప్లేయర్స్ దీప్తి, బి.సాయి ప్రణీత్, రంగారెడ్డి జిల్లా బ్యాడ్మింటన్ అసోసియేషన్ జనరల్ సెక్రటరీ శ్రీనివాసరావు, ట్రెసరర్ బాబు, వైస్ ప్రెసిడెంట్ పి. ఆనంద్ బాబు, జాయింట్ సెక్రటరీ సాయి రెడ్డి,జాయింట్ సెక్రటరీసతీష్,ప్రభాకర్ రెడ్డి, నరేందర్ రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

టీడీపీకి పూర్వవైభవం తీసుకొస్తాం

నవతెలంగాణ-సిటీబ్యూరో



రాష్ట్రంలో టీడీపీకి పూర్వవైభవం తీసుకొస్తామని సికింద్రాబాద్ పార్లమెంట్ టీడీపీ అధ్యక్షులు పీ.సాయిబాబా తెలిపారు. శనివారం టీడీపీ నగర కార్యాలయంలో ఆయన మాట్లాడారు. రాబోయే ఎన్నికలల్లో మరింత బలమైన శక్తిగా ఎదిగేందుకు పార్టీ రాష్ట్ర అధ్యక్షులు కాసానీ జ్ఞానేశ్వర్ ముదిరాజ్ వచ్చే నెలలో బస్సుయాత్రను ప్రారంభించనున్నారని తెలిపారు. ఈ బస్సు యాత్ర తెలంగాణాలోని అన్ని జిల్లాలల్లో కొనసాగుతుందన్నారు. టీడీపీ జాతీయ అధ్య క్షులు నారా చంద్రబాబు నాయుడు అధికారంలో ఉన్న సమయంలో చేసిన అభివృద్ధితోపాటు, సంక్షేమ కార్యక్రమాలను ప్రజలకు వివరిస్తామని తెలిపారు. పార్టీ అభిమానులు, ప్రతిఒక్క కార్యకర్త, నాయకులు క్షేత్రస్థాయిలో గ్రామగ్రామానా పనిచేస్తారని తెలిపారు. ముషీరాబాద్ నియోజకవర్గం నుంచి నూతనంగా ఎన్నికైన ప్రధాన కార్యదర్శులు నల్లెల్ల కిషోర్, పి.బాలరాజ్‌గౌడ్‌లను ఘనంగా సత్కరించారు. ప్రత్యేకంగా శుభాకాంక్షలు తెలిపారు.

ప్రెస్ క్లబ్ అధ్యక్షుడిగా కల్యాకరి ఎల్లయ్య

నవతెలంగాణ-బోడుప్పల్



జర్నలిస్టుల సంక్షేమం కోసం నిరంతరం కృషి చేస్తానని మేడిపల్లి మండల ప్రింట్ మీడియా ప్రెస్ క్లబ్ అధ్యక్షుడు కల్యాకరి ఎల్లయ్య అన్నారు. శనివారం మేడిపల్లిలోని ఎం కన్వెన్షన్ హాల్ జరిగిన కార్యవర్గ సమావేశంలో నూతన కమిటీని ఎన్నుకున్నారు. కమిటీ అధ్యక్షుడిగా కల్యాకరి ఎల్లయ్య (నవతెలంగాణ) ప్రధాన కార్యదర్శిగా చిర్ర శ్రీధర్ రెడ్డి, కోశాధికారిగా ఎస్.రాము యాదవ్‌లతో పాటు పూర్తి స్థాయి కార్యవర్గాన్ని ఎన్నుకున్నారు.నూతన కార్యవర్గ సభ్యులు మాట్లాడుతూ జర్నలిస్టుల సంక్షేమం కోసం తమవంతు కృషి చేస్తామని తెలిపారు.



సొంత జాగా ఉన్నవాళ్లకు ఇంటి నిర్మాణం కోసం మూడులక్షల రూపాయలు ఇస్తామనే గృహలక్ష్మి పథకాన్ని ప్రకటించారు. మరిజాగాలేని వాళ్లేమికావాలి. జాగా చూసుకుని ఉంటున్నవాళ్లను ఎందుకు గుర్తించి, ఇల్లు కట్టించి ఇవ్వరు! పథకాలు చాలా వచ్చాయి. నాడు ఇందిరమ్మ ఇండ్లు, రాజీవ్‌పేరుతో, కానీ ప్రజల గూడుబాధ తొలగనేలేదు. ప్రజా సంఘాలు అన్నికలిసి ఇండ్లులేని పేదల కోసం యాత్ర చేస్తున్నది. సమస్యలు ప్రభుత్వం దృష్టికి తీసుకొస్తున్నది. వేలాదిగా పేదలు గూడు కోసం డిమాండ్ చేస్తున్నారు. ఆలకించడం, పరిష్కరించడం పాలకుల బాధ్యత. గూడు పొందటం జనుల హక్కు.

గూడు

సంపాదకీయం

ప్రకృతిలో పక్షులకు, జంతువులకు, సమస్త జీవులకు వాటివాటి నివాస స్థలాలుంటాయి. గూళ్లుంటాయి. మనుషులూ మొదట చెట్టు తొర్రల్లో నివసించారు. ఆ తర్వాత తనకంటూ ప్రత్యేకమైన గూడునూ నిర్మించుకున్నాడు. ఇప్పుడనేక పేర్లతో పిలుచుకుంటాము. ఇల్లు, ఆవాసం, నివాసం, నిలయం, వసతి, గృహం, గీము, సదనం, సాల, కొంప, భవంతి, ధామం, ఆశ్రమం... ఇలా ఏ విధంగా పిలిచినా నివాసముండే చోటు అని అర్థం. నివాసాన్ని ఏర్పరుచుకోవటమనేది ప్రాకృతిక అవసరంగానే వచ్చిందని చెప్పవచ్చు. ఇక నాగరికత పెరిగాక, కుటుంబాలు ఏర్పడ్డాక ఇల్లు అనే దాని అర్థం మరింత విస్తృతమై స్థిరపడింది. కూడు, గూడు, గుడ్డ ఇవి కనీసావసరాలు. గూడు కలిగుండటమనేది మనిషికి ప్రాథమిక అవసరం. అంతేకాదు ఆధునిక సమాజంలో అదొక మానవహక్కు కూడా. ఒక వ్యక్తి గౌరవ జీవనానికి కావలసిన ఏర్పాటు, సౌకర్యం. అదొక సాంస్కృతిక జీవనానికి సంబంధించిన సామర్థ్యపు సమస్య. ఇల్లులేకపోవటమనేది నేడు దేశంలో ప్రజలు ఎదుర్కొంటున్న పెద్ద సమస్య. ఇది పేదరికంతో ముడిపడి ఉన్న సమస్య. ఇల్లు లేని తనమనేది మనుషుల్ని మానసికంగా క్రుంగదీసే సమస్య. ఇంత పెద్ద భూమండలంలో, ఇంత నాగరికత పెరిగాక కూడా మనుషులు ఇండ్లులేక తండ్లాడటం అనేది వ్యవస్థలు మిగిల్చిన విషాదం!

ఇల్లులేక పోవటమంటే సభ్య సమాజంలో నివసించేందుకు కావలసిన జాగా లేకపోవటం. భద్రతలేకపోవటం, సాంస్కృతిక జీవనాన్ని కొనసాగించలేకపోవటం. మనుషుల గౌరవం భంగపడటం. దేశంలోని లక్షలాది మంది పేవ్‌మెంట్లపైన, రోడ్డుప్రక్క, రైల్వేప్లాట్‌ఫామ్స్‌పైన, గుళ్లలో, వీధుల్లో, పెద్ద సిమెంటుపైపుల్లో, బస్టాండుల్లో ఇంకా అనేకానేక స్థలాల్లో బతుకుల్ని గడిపేస్తున్నారు. 18 మిలియన్ల మంది వీధి బాలలే ఉన్నారని ప్రభుత్వం చెపుతోంది. 19 మిలియన్ల ఇండ్ల కొరత ఉందన్నది ప్రభుత్వ లెక్క. ఇంతకు పదిరెట్లు ఎక్కువే ఉంటారు. మరీ ముఖ్యమైన విషయమేమంటే, దేశంలోని యువతలో చాలా మంది గూడులేని వాళుగానే ఉన్నారు. బాలలకు నివాసం లేకపోవటం వారి హక్కుల ఉల్లంఘన క్రిందకే వస్తుంది. భారత రాజ్యాంగం ప్రకారం వ్యక్తులు సరియైన గూడును కలిగివుండటమనేది ప్రాథమిక హక్కుగా గుర్తించింది. రాష్ట్రాలు బాధ్యత వహించి వ్యక్తుల గౌరవానికి భంగం కలగకుండా వారికి ఇండ్లు ఏర్పాటు చేయాలని సుప్రీంకోర్టు పేర్కొంది. ఇండ్లంటే గదులే కాదు, తాగునీటి సౌకర్యం, పరిశుభ్రమైన పరిసరాలు, సౌకర్యవంతమైన నివాస ఏర్పాటు, వెలుగు, దారులు మొదలైన వాటితో కూడిన ఇల్లు అందరికీ ఉండాలి. పట్టణాల్లో, నగరాల్లోనైతే పూరిపాకల్లో, డేరా గూళ్లలో, మురికివాడల్లో ఏ సౌకర్యాలూ లేకుండా నివసిస్తున్న ప్రజలు లక్షలాదిగా ఉన్నారు. ఇక ఆ వుంటున్న గాలికి, వానకు ఊగిపోయే పాకలు సైతం, జాతి విపత్తుల కారణంగా, అలజడులు, మతకల్లోలాలు, కోవిడ్ లాంటి విపత్తుల సందర్భంలో ఎగిరిపోతుంటాయి. గూళ్లు మాయమవుతాయి. వాళ్లందరూ ఈ దేశ పౌరులే. ఎవరు దీనికి కారకులు? పనిచేసే వాడికి పని కల్పించడం, ఉపాధి పెంచడం ప్రభుత్వ బాధ్యత. ఉద్యోగ భద్రత కల్పించలేనప్పుడు, ఈ కనీసావసరాల భద్రతను ఏర్పాటు చేయలేరు!

పేదలకు ఇండ్లు కట్టిస్తాం! అనేది ఒక రాజకీయ ప్రయోజన పూర్వకమైన వాగ్దానం. ఇది స్వాతంత్ర్యం వచ్చినప్పటి నుండీ వినిపిస్తున్న నినాదం కూడా. ఇప్పటికీ ఇదే ఎజెండాగా రాజకీయాలు నడుస్తూనే ఉన్నాయి. కానీ సమస్య పరిష్కారం కావడం లేదు. మన తెలంగాణ రాష్ట్రం ఏర్పడ్డాక కూడా గౌరవప్రదంగా కుటుంబాలు బ్రతకటానికి రెండు పడకల ఇల్లు నిర్మించి ఇస్తామని వాగ్దానం చేశారు. పదేండ్లు గడుస్తున్నది. వందలు, వేలు మాత్రమే కడుతున్నారు. అవీ ఇంకా పూర్తికాలేదు. కావలసిన వాళ్లు లక్షల్లో ఉన్నారు. ఊరికి దూరంగానే అనేక ప్రభుత్వ భూములున్నాయి. పేదలు, ఇండ్లు లేనివారు గుడిసెలేసుకుని ఉంటే, ప్రభుత్వం పెద్దయెత్తున దాడులు చేసి ప్రజలను నిర్బంధానికి గురిచేస్తున్నది. రియలెస్టేట్ వ్యాపారుల భూ ఆక్రమణ దాహమూ పేదల ఇండ్లకు ఆటంకంగా మారుతున్నది. సొంత జాగా ఉన్నవాళ్లకు ఇంటి నిర్మాణం కోసం మూడులక్షల రూపాయలు ఇస్తామనే గృహలక్ష్మి పథకాన్ని ప్రకటించారు. మరిజాగాలేని వాళ్లేమికావాలి. జాగా చూసుకుని ఉంటున్నవాళ్లను ఎందుకు గుర్తించి, ఇల్లు కట్టించి ఇవ్వరు! పథకాలు చాలా వచ్చాయి. నాడు ఇందిరమ్మ ఇండ్లు, రాజీవ్‌పేరుతో, కానీ ప్రజల గూడుబాధ తొలగనేలేదు. ప్రజా సంఘాలు అన్నికలిసి ఇండ్లులేని పేదల కోసం యాత్ర చేస్తున్నది. సమస్యలు ప్రభుత్వం దృష్టికి తీసుకొస్తున్నది. వేలాదిగా పేదలు గూడు కోసం డిమాండ్ చేస్తున్నారు. ఆలకించడం, పరిష్కరించడం పాలకుల బాధ్యత. గూడు పొందటం జనుల హక్కు.

'అప్రకటిత' ఎమర్జెన్సీపై ఐక్యపోరాటం



తెలకపల్లి రవి

పాట్నాలో జయప్రదంగా ముగిసిన 17 ప్రతిపక్షాల శిఖరాగ్ర సమావేశం దేశ రాజకీయాల్లో అందులోనూ లోక్‌సభ ఎన్నికల ముంగిట్లో కీలక ఘటన అని చెప్పొచ్చు. దీని కొనసాగింపుగా సిమ్లాలో తదుపరి సమావేశం జరపాలని కూడా హాజరైన నేతలు నిర్ణయించారు. అంటే ఈ ప్రక్రియను కొనసాగించాలని కూడా వారు ఏకాభిప్రాయానికి వచ్చారు. 450 నియోజకవర్గాలలో బీజేపీకి వ్యతిరేకంగా ఒకే అభ్యర్థిని ప్రతిపక్షాల తరపున నిలబెట్టాలని భావిస్తున్నట్టు సమావేశానికి ముందు వార్తలు వచ్చాయి. వివిధ రాష్ట్రాలలో పోటీలు ఎలా ఉంటాయనే అంశాన్ని వచ్చే సమావేశంలో చర్చించాలని కూడా అంగీకారానికి వచ్చాయి. బీజేపీ తర్వాత పెద్దపార్టీగా ఉన్న కాంగ్రెస్ నుంచి రాష్ట్రాలను పాలించే ప్రాంతీయ పార్టీల వరకూ ఈ సమావేశానికి హాజరైనాయి. ముగ్గురు ముఖ్యమంత్రులు స్వయంగా పాల్గొనగా కాంగ్రెస్ సీపీఐ(ఎం) అగ్రనేతలు హాజరవడంతో దేశంలో దాదాపు గణనీయమైన భూభాగానికి రాజకీయ బలానికి ప్రాతినిధ్యం లభించినట్లయింది. అలా అని హడావుడిగా ఏదో ఒక ప్రకటన చేసి ప్రచారంలో పెట్టడం గాక హాజరైన పార్టీలు తమ తమ అభిప్రాయాలు సూటిగా చెప్పడం ఆచరణయోగ్యం కాని అభిప్రాయాలను ముందే తోసిపుచ్చడం మంచి విషయమే. ఉదాహరణకు కాంగ్రెస్ పెద్దన్న పాత్ర వహించాలనే కొందరిమాట లేదంటే ఎక్కడ ఎవరు బలంగా ఉంటే వారి మాట అందరూ వినాలనే

> రెండు కారణాల వల్ల ఈ సమావేశాలు లౌకిక పక్షాల అవగాహన త్వరితంగా పూర్తి కావలసి ఉంది. లోక్‌సభకు ఎన్నికలు ముందుగా రావచ్చని బీజేపీ కావాలనే సంకేతాలిస్తున్నది. నిజంగా వచ్చేట్టయితే సిద్ధం కావలసి ఉంటుంది. ఎన్నికలు ఎప్పుడు జరిగినా ముందే అవగాహన ఉందన్న సంకేతాలు స్పష్టం చేస్తేనే ఫలితాల తర్వాత కలసి వ్యవహరించే చట్టబద్ద అనుకూలత ఉంటుంది. ఎందుకంటే పూర్తి మెజార్టీ గల పార్టీ లేదా ఎన్నికలు ముందు ఏర్పడిన కూటమికి మొదటి అవకాశం, ఎన్నికల తర్వాత ఏర్పడినా పూర్తి మెజార్టీ గల కూటమి ఈ క్రమంలో అవకాశం ఇవ్వాలని గతంలో కొన్ని స్థూలమైన సూచనలు వచ్చాయి.

వాదన ఇక్కడ రాలేదు. బీజేపీ కాంగ్రెస్‌లను ఒకేగాట కట్టే ధోరణి కూడా కనిపించలేదు. అదే సమయంలో కాంగ్రెస్ పట్ల తమకున్న అభ్యంతరాలనూ మిగిలిన పార్టీలు దాచిపెట్టుకోలేదు. ఏది ఏమైనా మతతత్వ రాజకీయాలు రాష్ట్రాలపై దాడి జాతీయ రాజ్యాంగ సంస్థల దుర్వినియోగంతో విపక్షాలపై దాడి, భావ ప్రకటనా స్వేచ్ఛ పరిరక్షణ వంటి అంశాలు కీలకమనే అవగాహన అక్కడ ద్యోతకమవడం హర్షణీయం.

బీహార్ ఉద్యమం-ఎమర్జెన్సీ

ఇప్పటి సమావేశాన్ని కాస్సేపు పక్కనపెట్టి గత చరిత్రలోకి తొంగిచూస్తే బీహార్ రాజధాని పాట్నా లేదా పాతకాలపు పాటలీపుత్ర ఎమర్జెన్సీ వ్యతిరేక పోరాటాన్ని గుర్తు చేస్తుంది. యాభైఏళ్ల కిందట జయప్రకాశ్ నారాయణ్ నాయకత్వంలో ఇక్కడే ప్రతిపక్షాల ఐక్యపోరాటం మొదలవడం, అది విస్తరించినకొద్దీ ప్రతిస్పందనగా ఇందిరాగాంధీ ఎమర్జెన్సీ విధించడం ప్రజాస్వామ్య చరిత్రలో ఒక పీడకల. పౌరహక్కులు కాలరాసి, ప్రభుత్వాలను కూలదోసి పత్రికలపై సెన్సార్‌షిప్ విధించి ప్రతిపక్ష నాయకులను ఖైదుచేసిన ఆ రోజులు ఎన్నటికీ మర్చిపోకూడనివి. అందుకు వ్యతిరేకంగా జయప్రకాశ్ నాయకత్వంలోనే ప్రతిపక్షాలు ఏకమై జనతాపార్టీగా ఏర్పడ్డాయి. అయితే అందులో చోటు సంపాదించిన నాటి జనసంఘ్ మతతత్వ పోకడలు జనతా ప్రభుత్వ విచ్ఛిన్నానికి దారితీశాయి. ఆ జనసంఘమే బీజేపీగా అవతరించి సర్వ ప్రతిపక్షాల ఐక్యత మంత్రంతో పెరుగుతూ 1990లో వచ్చిన విపి సింగ్ నేషనల్ ఫ్రంట్ ప్రభుత్వాన్ని కూలదోసింది. అప్పుడు కూడా అద్వానీ రథయాత్రను బీహార్‌లోనే అడ్డుకోవడం యాధృచ్ఛికం కాదు. ఈ క్రమం 1992 అయోధ్య, బాబ్రీ విధ్వంసం వరకూ నడిచి దేశ రాజకీయాలలో మతతత్వం పరాకాష్టకు చేర్చింది. 1996లో ఏర్పడిన యునైటెడ్ ఫ్రంట్ కూటమిని కూడా బీజేపీ కాంగ్రెస్ కూలదోశాయి. 1996 నుంచి 2004 వరకూ వాజ్‌పేయి ప్రభుత్వం పాలన సాగడానికి టీడీపీ, జేడీయూ వంటి పార్టీల ఫిరాయింపు కారణమైంది. 2004లో వామపక్షాల మద్దతుతో యూపీఏ-1 ఏర్పడినా అమెరికా అణుఒప్పందానికి వ్యతిరేకంగా అవి వ్యతిరేకించాక ఫిరాయింపుల సహాయంతో 2013 దాకా పాలన సాగించింది. కాని 1991లో మొదలైన సరళీకరణ విధానాలు ఒకవైపు, బీజేపీ రగిలించిన మత రాజకీయాలు మరోవైపు దేశ రాజకీయ దృశ్యాన్ని కకావికలు చేశాయి. 2014 నుంచి పాలనలోకి వచ్చిన మోడీ ప్రభుత్వం దీన్ని పరాకాష్టకు చేర్చింది. ఆయన పాలనలో మతతత్వం, నిరంకుశత్వం కలయికలో ఈ ప్రభుత్వ పాలన అప్రకటిత ఎమర్జెన్సీగా పేరు తెచ్చుకుంది. అప్పటికంటే దారుణంగా పత్రికల పీకనొక్కడం, స్వేచ్ఛను హరించడం మతశక్తుల విజృంభణ అమెరికాకు దాసోహమనడం, యుద్ధోన్మాదాన్ని రెచ్చగొట్టడం ఒకటేమిటి ఫాసిస్టు తరహా పోకడలతో సంఘ్ పరివార్ అనబడే ఆరెస్సెస్ కూటమి రెచ్చిపోతున్నది. సుప్రీం కోర్టుతో సహా దేశంలోని అన్ని రాజ్యాంగ వ్యవస్థలూ ఒత్తిడికి లోనవుతున్నాయి. రాష్ట్ర ప్రభుత్వాలను నామకార్థంగా మార్చి మోడీ ప్రధాని కార్యాలయమే ఏకైక శాసన కేంద్రంగా మారింది. ఈ పరిస్థితుల కారణంగానే లౌకిక ప్రతిపక్షాలు మళ్లీ ఒకతాటిమీదకు రావలసిన అగత్యమేర్పడింది. మొత్తానికి పాట్నా మరోసారి ప్రతిపక్ష ఐక్యతకు కేంద్రమైంది. విశేషమేమంటే ఈ యాభై ఏళ్లలోనూ భాగస్వాములుగా తప్ప నేరుగా కాంగ్రెస్, బీజేపీలు ఇక్కడ దాదాపు అధికారంలోకి రాలేకపోయాయి.

వివిధ పార్టీల సంకేతాలు

బీజేపీని ఓడించడమే ఏకైక లక్ష్యంగా ఉండాలని సమావేశానికి హాజరైన సీతారాం ఏచూరి పిలుపునిచ్చారు. వివిధ రాష్ట్రాలలో పరిస్థితులను బట్టి చర్చలు జరగాలని కాంగ్రెస్ అధ్యక్షుడు మల్లికార్జున ఖర్గే, రాహుల్‌గాంధీ అన్నారు. ఢిల్లీ ఆర్డినెన్సును కాంగ్రెస్ వ్యతిరేకిస్తేనే దాంతో తాము ప్రతిపక్ష వేదికలో ఉంటామని ఢిల్లీ సీఎం కేజ్రీవాల్ స్పష్టంచేశారు. ఈ విధంగా షరతులు పెట్టడం సరికాదనే అభిప్రాయం కాంగ్రెస్ వ్యక్తం చేసింది. బెంగాల్‌లో కాంగ్రెస్ సీపీఐ(ఎం)తో పొత్తుపెట్టుకోకుండా ఉంటేనే తాము పాలుపంచుకుంటామని ముఖ్యమంత్రి మమతా బెనర్జీ షరతుపెట్టారు. అయితే మళ్లీ బీజేపీ గెలిస్తే ఎన్నికలు జరిగే అవకాశం కూడా ఉండదని ఆమె అన్నారు. తాము బీజేపీకి వ్యతిరేకం తప్ప కాంగ్రెస్ వ్యతిరేకులుగా పరిగణించరాదని సమాజ్‌వాది పార్టీ నేత అఖిలేష్‌యాదవ్ వెల్లడించారు. బీజేపీతో ఒకసారి కూడా కలవని ఆర్జేడీ వ్యవస్థాపక నేత లాలూయాదవ్ ఈ సమావేశంలో ఒక ఆకర్షణ అయితే వారితో కలసి చేతులు కాల్చుకున్న నితిష్ కుమార్ ఆతిథేయ పాత్ర పోషించారు. సీపీఐ డి రాజా కూడా అదే సందేశమిచ్చారు. శివసేన నాయకులూ దేశం ముందున్న ప్రమాదాన్ని గుర్తుచేశారు. ఈ విధంగా భిన్నాభిప్రాయాలు వ్యక్తమైనా బీజేపీ నిరంకుశత్వాన్ని ఓడించాల్సిన అవసరాన్ని అందరూ గుర్తించడం పెద్ద మలుపు. సిమ్లా సమావేశంలో ఇది మరింత ముందుకు సాగి మరింత స్పష్టమైన కార్యాచరణకు దారితీస్తుందని ఆశించవచ్చు.

గతంలో బీజేపీతో చేతులు కలిపి ఈ పరిస్థితికి దోహదం చేసిన కొన్ని పార్టీలూ ఇప్పుడు ఇందులో పాల్గొనగా టీడీపీ, బీజేడీ వంటిపార్టీలు ఇప్పటికీ కళ్లు తెరవని స్థితి. ఇక ఏపీని పాలించే వైసీపీ, బీజేపీ కేంద్ర ప్రభుత్వానికి విధేయపక్షంగా వత్తాసునిస్తుంటే తెలంగాణ ముఖ్యమంత్రి కేసీఆర్ బీఆర్ఎస్ పార్టీ కాంగ్రెస్, బీజేపీలకు ప్రత్యామ్నాయ విధానాలు కీలకమంటున్నారు గనక



బీఎస్‌పీతో సహా వీరందరికీ ఆహ్వానాలు పంపలేదు. గతంలో బెంగాల్, బీహార్ యూపీలతో పాటు ప్రతిపక్ష కూటమికి ఒక ముఖ్య కూడలిగా ఉమ్మడి ఏపీ ఉండిన పరిస్థితి ఇప్పుడు లేదు. బీజేపీపై తీవ్రంగా విమర్శలు కార్యక్రమాలు చేసిన బీఆర్ఎస్ భవిష్యత్ వ్యూహమేమిటో అస్పష్టం. ఈ ఐక్యవేదికలు, కూటములు ప్రయోజనం లేదని కేటీఆర్ ప్రకటించారు.

బీజేపీ అక్కసు

ఇక ఈ సమావేశాన్ని బీజేపీ జీర్ణం చేసుకోలేకపోవడమే గాక వేయిరకాల దాడిచేసింది. పాట్నా గోడలను వ్యతిరేక పోస్టర్లతో కార్టూన్లతో నింపేసింది. మిమ్మల్ని అరెస్టు చేసిన కాంగ్రెస్‌తో కలుస్తారా? అని పక్కదోవ పట్టించే ప్రయత్నం చేసింది. ప్రతిపక్షాలతో సమావేశానికి హాజరవడం ద్వారా కాంగ్రెస్ తను గెలవలేనని ఒప్పుకుందని అతితెలివితో వాదించింది. ఒక విధంగా ఇది మీరు సింగిల్‌గా రావాలని సవాలు చేసే జగన్ ఎత్తుగడను తలపిస్తుంది. ప్రజాస్వామ్యంలో పొత్తులు సర్దుబాట్లు అపరాధమో, అవమానమో కాదు. కాకుంటే భావసారూప్యత ప్రజాస్వామ్య ప్రయోజనాలు ఉమ్మడి ప్రమాదంపై అవగాహన ఉండాలి. ఆ మాటకొస్తే మోడీ ప్రభుత్వం కూడా పొత్తులు లేకుండా పోటీ చేసి ఏర్పడిందా? ఒంటరిగా మెజార్టీ ఉండొచ్చు గాని ఎన్నికలు కలిసే

> ప్రజాస్వామ్యంలో పొత్తులు సర్దుబాట్లు అపరాధమో, అవమానమో కాదు. కాకుంటే భావసారూప్యత ప్రజాస్వామ్య ప్రయోజనాలు ఉమ్మడి ప్రమాదంపై అవగాహన ఉండాలి. ఆ మాటకొస్తే మోడీ ప్రభుత్వం కూడా పొత్తులు లేకుండా పోటీ చేసి ఏర్పడిందా? ఒంటరిగా మెజార్టీ ఉండొచ్చు గాని ఎన్నికలు కలిసే పోరాడింది కదా! గుజరాత్ యూపీ వంటివాటిని మినహాయిస్తే మరెక్కడా బీజేపీ కేవలం తన బలంతోనే గెలిచింది లేదు. ఫిరాయింపులు మిశ్రమ కూటములతోనే పాలిస్తున్నది. పరోక్షంగానూ ఒత్తిళ్లతో, ప్రలోభాలతో, బెదిరింపులతో కొన్నిపార్టీలను లోబర్చుకున్నది. ఈ అక్రమ పొత్తులకన్నా సూటిగా, రాజకీయంగా అవగాహనకు రావడం రాజ్యాంగ బద్ధం.

పోరాడింది కదా! గుజరాత్ యూపీ వంటివాటిని మినహాయిస్తే మరెక్కడా బీజేపీ కేవలం తన బలంతోనే గెలిచింది లేదు. ఫిరాయింపులు మిశ్రమ కూటములతోనే పాలిస్తున్నది. పరోక్షంగానూ ఒత్తిళ్లతో, ప్రలోభాలతో, బెదిరింపులతో కొన్నిపార్టీలను లోబర్చుకున్నది. ఈ అక్రమ పొత్తులకన్నా సూటిగా, రాజకీయంగా అవగాహనకు రావడం రాజ్యాంగ బద్ధం.

రేపటి పోరాటానికి సిద్ధంగా...

రెండు కారణాల వల్ల ఈ సమావేశాలు లౌకిక పక్షాల అవగాహన త్వరితంగా పూర్తి కావలసి ఉంది. లోక్‌సభకు ఎన్నికలు ముందుగా రావచ్చని బీజేపీ కావాలనే సంకేతాలిస్తున్నది. నిజంగా వచ్చేట్టయితే సిద్ధం కావలసి ఉంటుంది. ఎన్నికలు ఎప్పుడు జరిగినా ముందే అవగాహన ఉందన్న సంకేతాలు స్పష్టం చేస్తేనే ఫలితాల తర్వాత కలసి వ్యవహరించే చట్టబద్ధ అనుకూలత ఉంటుంది. ఎందుకంటే పూర్తి మెజార్టీ గల పార్టీ లేదా ఎన్నికలు ముందు ఏర్పడిన కూటమికి మొదటి అవకాశం, ఎన్నికల తర్వాత ఏర్పడినా పూర్తి మెజార్టీ గల కూటమి ఈ క్రమంలో అవకాశం ఇవ్వాలని గతంలో కొన్ని స్థూలమైన సూచనలు వచ్చాయి. సీపీఐ(ఎం) ఎప్పుడూ చెబుతున్నట్టు భిన్నమైన పరిస్థితులు రాజకీయ శక్తులు ఉన్న ఈ దేశంలో ఎన్నికల ముందే సంపూర్ణమైన ఏకీకృత అవగాహన రావడం, కాబోయే ప్రధాని ఎవరో నిర్ణయించుకోవడం జరగని పని. గతంలో జరగలేదు కూడా. అది ఎన్నికల అనంతర (పోస్ట్‌పోల్) ప్రక్రియగానే వుంటుంది. అయితే ఇలాంటి ముందస్తు చర్చలు ఉమ్మడి అవగాహన ఆ క్రమాన్ని సులభతరం చేస్తాయి. రేపు రాష్ట్రపతి నిర్ణయం తీసుకోవడానికి రాజ్యాంగపరంగానూ ఒక సానుకూల వాతావరణం కల్పిస్తాయి. అంతకుమించి లౌకిక ప్రజాస్వామ్య రక్షణ కోసం ఐక్యంగా పోరాడాలనే చైతన్యాన్ని పెంచుతాయి. అవకాశవాద శక్తులను బీజేపీకి అనుబంధశక్తులుగా వ్యవహరిస్తున్న వారిని ప్రజల ముందు నిలబెడతాయి. ఒకే దేశం, ఒకే మతం, ఒకే పార్టీ, ఒకే మోడీ అనే ఏకపక్ష నిరంకుశత్వాన్ని ఓడించే కర్తవ్యానికి ప్రజలను సిద్ధం చేస్తాయి. ఈ ఐక్యతా కృషిని అపహాస్యం చేసే వారి కుటిల ప్రచారాలను బేఖాతరు చేస్తూ ఈ కర్తవ్యాన్ని జయప్రదం చేసేట్టయితే అది దేశ చరిత్రలో మరో చారిత్రిక మలుపుగా నిలిచిపోతుంది. ■

అన్నా..గా ముచ్చటేందో 'చెప్పు...'

చరిత్ర అనేది అన్ని సంఘటనలను, వ్యక్తులందర్నీ తనలో కలిపేసుకుంటూ పోతుంది. అందులో కొంతమంది పేర్లు సువర్ణాక్షరాలతో లిఖించబడితే.. మరికొందరు తమకు తెలియకుండానే చరిత్రలో అలా అలా మిగిలిపోతుంటారు. ఇందుకు సంబంధించి మాజీ సీఎం కిరణ్‌కుమర్‌రెడ్డికి కూడా ఒక ప్రత్యేకత ఉంది. అంతకుముందు ఏ మంత్రి పదవినీ చేపట్టకుండానే 2009లో ఏకంగా ముఖ్యమంత్రి పీఠాన్ని అధిరోహించారాయన. వైఎస్ రాజశేఖరరెడ్డి హఠాన్మరణానంతరం అప్పటి పరిస్థితుల రీత్యా కాంగ్రెస్ అధిష్టానం పెద్దాయన రోశయ్యను సీఎం సీట్లో కూర్చోబెట్టింది. ఆ తర్వాత రాజకీయాల్లో పెనుమార్పులు సంభవించటంతో స్పీకర్‌గా ఉన్న కిరణ్ కుమార్‌రెడ్డి అనుకోకుండా సీఎం అయ్యారు. అయితే అదే ఆయనకు చరిత్రలో ఎవరికీ లేని ఒక ప్రత్యేకతను ఆపాదించిపెట్టింది. 2014లో రాష్ట్ర విభజన నేపథ్యంలో ఆయన తన సీఎం పదవికి రాజీనామా చేయాల్సి వచ్చింది. 'రాష్ట్రం విడిపోయింది. సీఎం పదవి పోయింది... అయినా బాధలేదు. కానీ ఉమ్మడి రాష్ట్రానికి చివరి ముఖ్యమంత్రి కిరణ్‌కుమార్‌రెడ్డి అనే పదం వినటానికే కష్టంగా ఉంది.. నేను చరిత్రలో ఇలా మిగలాల్సి రావటం నా దురదృష్టం...' అంటూ ఆయన సన్నిహితుల వద్ద వాపోయేవారట. ఈ విషయాన్ని కాసింత సేపు పక్కనబెడితే... అప్పట్లో కిరణ్ కుమార్‌రెడ్డికి అత్యంత సన్నిహితుడిగా ఉండి... ఆ తర్వాత 2018లో కాంగ్రెస్ నుంచి ఎమ్మెల్యేగా గెలిచి... అటు తర్వాత బీఆర్ఎస్ తీర్థం పుచ్చుకున్న ఓ లీడర్ ఇటీవల ఆనాటి సంగతులను గుర్తు చేసుకున్నారు. 2014లో రాష్ట్రం విడిపోయింది.. కిరణ్ సీఎం పదవికి రాజీనామా చేశారు. ఆ తర్వాత కూడా ఆయన్ను చాలాసార్లు కలిశానంటూ ఆ ఎమ్మెల్యే చెప్పారు. 'తెలంగాణ వచ్చిన తర్వాత కిరణ్ జై సమైక్యాంధ్ర పార్టీ పెట్టారు. ఆ పార్టీకి పాదరక్షల (చెప్పులు) గుర్తును ఎంచుకున్నారు. ఇదే నాకు గమ్మత్తుగా అనిపించింది. అన్నా... పార్టీ పెడితే పెట్టినవ్ గానీ, పోయి పోయిగా చెప్పు గుర్తును ఎందుకు ఎంచుకున్నవే...' అని పలుమార్లు ఆయన్ను ఆటపట్టించానంటూ ఆ ప్రజా ప్రతినిధి చెప్పుకొచ్చారు. అలా అడిగిన ప్రతీసారీ... 'అరెయ్... ఆ పార్టీ గురించి, ఆ చెప్పుల గురించి గురించి వదిలేయ్.. నన్ను కూడా వదిలేయ్...' అని కిరణ్ పక్కకుపోయే వారంటూ ఎమ్మెల్యే చెప్పేసరికి పాత్రికేయులు పొట్టచెక్కలయ్యేలా నవ్వారు.

-బి.వి.యన్.పద్మరాజు

ఇదేం తద్దినం!

వాడెవడో ఫేస్‌బుక్‌లో తల్లి తద్దినం ఫొటోలు పెడితే, అది చూసిన వ్యూవర్స్ 'తద్దినం శుభాకాంక్షలు...మీ ఇల్లు ఎప్పుడూ ఇలా తద్దినాలతో కళకళలాడుతూ ఉండాలి...ఈ కార్యక్రమం వెరైటీగా ఉంది..మా ఇంట్లో మేమూ, మా పిల్లలం కలిసి ఇలాగే తద్దినం ఫంక్షన్ చేసుకుంటాం. ఏమేం కావాలో...ఎలా పెట్టాలో కాస్త చెప్పండి" అంటూ కామెంట్స్ పెట్టారట! వాళ్లేం మంత్రుల పీఆర్వోలో... శుభానికి, అశుభానికి తేడా లేకుండా రెంటినీ సమంగానే చూస్తున్నారు. తెలంగాణ అమరవీరుల జ్యోతిని ముఖ్యమంత్రి కేసీఆర్ ఆవిష్కరించిన విషయం తెలిసిందే. ఇక ఆరోజు ఆ కార్యక్రమంలో పాల్గొన్న మంత్రుల పీఆర్వోలు తమ సారు దగ్గర మార్కులు కొట్టేయాలనే అత్యుత్సాహంతో అమరవీరుల జ్యోతి ప్రారంభోత్సవ కార్యక్రమంలో మా మంత్రి పాల్గొని ఇట్లన్నాడు...అట్లన్నాడు... అంటూ పెద్దాయన దృష్టిలో పడేంతగా తమ కలాలకు పనిచెప్పారు. తప్పులేదు...వాళ్ల పని వాళ్లు చేశారు. చిక్కంతా 'ప్రారంభోత్సవం' తోనే వచ్చింది. అమరులంటే మరణించిన వాళ్లు...వాళ్ల జ్ఞాపకార్థం జ్యోతిని వెలిగిస్తే అది 'ఉత్సవం' ఎలా అవుతుందిరా సామీ? వాట్సాప్పుల్లో ఆ మెసేజ్‌లు చూసిన జర్నలిస్టులకు మతిపోయింది. తెలిసీ తెలీక కొన్ని పత్రికల్లో దాన్ని ఉత్సవం అనే రాసేశారు. బహుశా 'చావు కూడా పెండ్లిలాంటిదే బ్రదరూ...'అని గట్టిగానే నమ్మించేసినట్టున్నారు మహానుభావులు!!

-ఎస్ఎస్ఆర్ శాస్త్రి

బత్తాయిగాళ్ల బడాయి!

లేనిది ఉన్నట్టు, ఉన్నది కాస్తా ఎక్కువగా చెప్పేటోళ్లు అక్కడక్కడ మనకు తారసపడుతుంటారు. వీడు వీడి బడాయి మాటలు అని అంటుంటారు. అటువంటి మాటలు విని నవ్వుకోవడం తప్ప చేసేదేమీ ఉండదు. తాజాగా ఇలాంటి బడాయిగాళ్లు వాట్సాప్, పేస్‌బుక్, ఇన్‌స్టాలో కొకొల్లాలుగా కనిపిస్తున్నారు. ఏమీ లేకపోయినా, ఎంతో జరిగిపోయినట్టు పోస్టులు పైచికానందం పొందుతున్నారు. ప్రజల మెదళ్లను కరాబ్ చేస్తున్నారు బతాయిగాళ్లు.అందుకే వారిని బడాయి బత్తాయిగాళ్లు అనక ఇంకేమంటారు. అమెరికా పార్లమెంటులో ఆదేశపు ఎంపీలు మోడీతో సెల్ఫీలు దిగారు. ఆటోగ్రాఫ్‌లు తీసుకున్నారు. అది చూసి బైడెన్ కూడా విస్మయానికి గురయ్యారంటూ ఓ ఫోటో చూపించి బతాయిగాళ్లు ఆకాశానికెత్తుతున్నారు. అంతేకాదు, ఆయన ప్రపంచ నాయకుడు అయిపోయాడంటూ వాట్సాఫ్‌ల్లో ఒక్కటే పార్వర్డ్ చేస్తున్నారు. ప్రపంచానికి ఓ దిక్సూచి మోడీ అంటూ చెబుతుంటే, అబ్బా వినలేక పోతున్నరా బాబూ... అంటూ కామెంట్లు కూడా వస్తున్నాయి. వాటిపై కూడా బత్తాయిలు శాపనార్థాలు పెడుతున్నారు. ఈ క్రమంలో మోడీ రాకను వ్యతిరేకిస్తూ...అమెరికాలో జనం రోడ్లపైకి వచ్చారు. భారతదేశంలో ప్రజాస్వామ్యం ప్రమాదంలో ఉందంటూ ఆందోళన చెందారు. అక్కడ ఓ జర్నలిస్టు మాట్లాడుతూ '23 ఏండ్లలో మోడీ ఒక ప్రెస్‌కాన్ఫరెన్స్ మాట్లాడలే. జవాబుదారీతనం అనేది లేదు. గతంలో గుజరాత్‌లో ఘర్షణలు జరిగితే ఆయన స్పందించలేదు. మణిపూర్‌లో మరణహోమం జరుగుతున్నా పట్టించుకోవడం లేదు. అదే ఓ సినిమా తీసిన వ్యక్తికి చిన్న ఇబ్బందైతే ఏకంగా ట్వీట్ చేసిండు. మా పూర్వీకులు స్వాతంత్ర్యం కోసం త్యాగాలు చేశారు. అప్పుడు కూడా ప్రజాస్వామ్యం ఈ విధంగా లేదు' అని ఆవేదన చెందారు. ఇది మాత్రం ఎక్కడా వైరల్ కాదు. ఇది మన దేశ దుస్థితి.

-గుడిగ రఘు

ప్రొటోకాల్!

నజర్

"ఎంతైనా మన పెద్దాయన ఛరిష్మానే వేరు! చూడు అమెరికాలో ఎంత గౌరవం! ఎన్ని మర్యాదలు! 70ఏండ్లలో ఇంత గౌరవం ఎవరికి దక్కలేదు తెలుసా?" పొంగిపోతూ చెప్పాడు భర్త.

"నిజమా!" ఆశ్చర్యంగా అడిగింది భార్య.

"ముమ్మాటికీ నిజం! కావాలంటే టీవీలు చూడు! నమ్మకపోతే పేపర్స్ చూడు! పెద్దాయనకు స్వాగతం పలకటానికి మహామహులే క్యూ కడుతున్నారు! భారత సర్వం సహా చక్రవర్తికి బైడెన్ పెద్ద దావత్ కూడా ఇచ్చాడు తెలుసా" అన్నాడు మరింత గొప్పగా భర్త.

"ఇంటికి వచ్చిన చుట్టాలకు ఎంత పేదవాడైనా తన తాహతుకు తగ్గ దావత్ ఇస్తాడు! బైడెన్ అమెరికా అధ్యక్షుడు గనక తన తాహతుకు తగ్గట్టు దావత్ ఇచ్చాడు! ఇందులో గొప్పేముంది?" ఆశ్చర్యంగా అడిగింది భార్య.

"ఒసేయ్ మొద్దు మొహమా! నీకు ప్రొటోకాల్ అంటే ఏమిటో తెలియదు. అందుకే ఇట్లా మాట్లాడుతున్నావు! తనతో సమానస్థాయి ఉన్నవారికి ఇచ్చే దావత్ వేరు. తక్కువ స్థాయి వారికి ఇచ్చే దావత్ వేరు! మన పెద్దాయనకు తనతో సమాన స్థాయి దావత్ ఇచ్చాడు బైడెన్ అది తెలుసుకో!" అన్నాడు భర్త.

"ప్రొటోకాల్ అంటే అదన్నమాట! దావత్‌ల వద్దే ఉంటుందన్న మాట!" అన్నది భార్య.

"పల్లెటూరి పిల్లను చేసుకోవటం నాదే బుద్ధి తక్కువ! ప్రొటోకాల్ అంటే స్థాయిని బట్టి గౌరవించటం! ఇది దావత్‌ల వద్దే కాదు! అన్ని చోట్లా ఉంటుంది! అంటే సభలు, అధికారిక కార్యక్రమాలు, ప్రారంభోత్సవాలు మొదలైనవి అన్న మాట" అన్నాడు భర్త.

"ఓహెూ! అట్లానా! అయితే ద్రౌపతి ముర్ముకు ఏ స్థాయి లేదా!" అనుమానంగా అడిగింది భార్య.

"ద్రౌపతి ముర్ము మన రాష్ట్రపతి! అంటే ప్రథమ పౌరురాలు" అంటే అన్నింటా ప్రథమ గౌరవం ఆమెకే దక్కుతుంది. ఒక ఎస్టీ మహిళకు అంత గొప్ప గౌరవం కల్పించాడు! మన పెద్దాయన! అది ఆయన గొప్పతనం!" అన్నాడు భర్త గర్వంగా.

"మరి కొత్తపార్లమెంటును ఆమే ప్రారంభించాలి కదా! ఇక్కడ ప్రొటోకాల్ అమలుకాదా! లేక సర్వం సహాచక్రవర్తి ముందు ఏ ప్రొటోకాల్ పనిచేయదా!" అడిగింది భార్య.

"సరే! సరే! అమెరికాలో చక్కగా విలేకర్ల సమావేశంలో పెద్దాయన నవ్వుతూ మాట్లాతాడు! మన దేశంలోని విలేకర్లతో ఎప్పుడూ మీటింగ్ పెట్టలేదు ఎందుకూ?" అడిగింది.

"పిచ్చిదానా! పెద్దాయనను అడిగే స్థాయి ఈ దేశంలోని విలేకర్లకు ఉందా?" పెద్దాయన మేధా సంపన్నత విలేకర్ల స్థాయి ఎన్నడో దాటిపోయింది!" అన్నాడు భర్త చిద్విలాసంగా.

"భారతదేశంలోని విలేకర్లకు స్థాయిలేదు గాని అమెరికా విలేకర్లకు మాత్రం స్థాయి ఉందన్న మాట! దేశం మీద ప్రేమ ఉందా అన్న డౌటు కొడుతోంది ఎక్కడో!" అన్నది భార్య.

"పెద్దాయన దేశ ప్రేమపై డౌటా? నీవు రాజద్రోహానికి పాల్పడుతున్నావు!" అన్నాడు భర్త ఆగ్రహంగా.

"ఆ సంగతి తర్వాత మాట్లాడుదాం! మన దేశంలోని విలేకర్ల స్థాయి చాలకపోతే పత్రికా సంపాదకులతో సమావేశాలు జరపొచ్చు కదా! ఓహెూ వారికీ స్థాయి లేక యాక్షన్ అండ్ కామెడీ హీరో అక్షయ్‌కుమార్‌కి ఇంటర్వ్యూ ఇచ్చాడు కావచ్చు!" అన్నది భార్య.

"అదీ సంగతి! రాజద్రోహం అనగానే దారిలోకి వచ్చావు! తన స్థాయికి తగ్గవారితోనే పెద్దాయన మాట్లాడతారు! అడ్డమైన వాళ్ళతో మాట్లాడరు ఇది గుర్తుంచుకో!" అయినా ఇంటర్వ్యూలో చెప్పాల్సినవి అన్నీ "మన్ కీ బాత్"లో ప్రపంచానికి చెబుతూనే ఉన్నాడు కదా!" అన్నాడు భర్త.

"మరి మణిపూర్‌లో నెల రోజులకి పైగా మారణకాండ నడుస్తోంది కదా! ఎందుకు?" అడిగింది భార్య.

"పక్కనే ఉన్న చైనా, ఇంకా పాకిస్థాన్ దేశ విభజనకు చేస్తున్న కుట్రల వల్ల మణిపూర్‌లో మారణకాండ ఆగటం లేదు!" అన్నాడు భర్త.

"సర్వం సహ చక్రవర్తి అమెరికా వెళ్ళి అన్ని సమస్యలకు యోగానే పరిష్కారం అని చెప్పారు. మణిపూర్ మనదేశంలోనే ఉంది కదా! ముందు మణిపూర్ వెళ్ళి అక్కడి ప్రజలతో యోగా చేయించి ప్రశాంతత నెలకొల్పి ఆ తర్వాత ఐక్యరాజ్యసమితిలో చెబితే చాలా బాగుండేది కదా! పోని అమెరికా నుండి డైరెక్టుగా మణిపూర్‌లో దిగి యోగా చేయించి అక్కడ



ప్రశాంతత తెస్తారు కావచ్చు" అన్నది భార్య.

"నీవు యోగాను అవమానిస్తున్నావు. భారతీయ సంస్కృతిని కించపరుస్తున్నావు!" కోపంగా అన్నాడు భర్త.

"నా భాష అర్థం చేసుకోండి! యోగా మానసిక ప్రశాంతత కల్పిస్తుందని, శారీరక ఆరోగ్యం తెస్తుందని, మన రాందేవ్ బాబా, జగ్గీ వాసుదేవ్ లాంటివారు చెప్పిందే నేను చెబుతున్నాను. ఒక పక్క మణిపూర్ తగలబడిపోతుంది. అక్కడి ప్రజలు వందల సంఖ్యలో హత్య చేయబడుతున్నారు. ప్రపంచానికి యోగా గొప్పతనం గురించి చెప్పే మనం మనదేశానికి యోగాను ఉపయోగించుకోవటంలో విఫలమవుతున్నాం! అందుకే పెద్దాయన వచ్చేలోగా రాందేవ్ జగ్గీవాసుదేవ్‌లను మణిపూర్ పంపించి అక్కడి ప్రజలకు యోగా నేర్పించి ప్రశాంత వాతావరణం కల్పించాలి!" దృఢంగా అన్నది భార్య.

"ఏం మాట్లాడాలో భర్తకు తోచటం లేదు! అయోమయంగా భార్యవైపు చూస్తున్నాడు.

"యోగా చేయటం ద్వారా ఆలోచనలను నియంత్రించవచ్చునని, సద్భావనలు కలుగుతాయని చెబుతున్నారు కదా!" అడిగింది భార్య."ముమ్మాటికీ నిజం!" నమ్మకంగా చెప్పాడు భర్త.

"మరి బీజేపీలో ఉన్నవారు యోగా చేయరా? చేసినవారు అట్లా నటిస్తారా?" అడిగింది భార్య.

"అన్ని పార్టీల్లాంటిది కాదు బీజేపీ. తాను ఆచరించిన తర్వాతే మిగిలిన వారికి చెబుతుంది! అంతేకాదు యోగాలో నటనకు అవకాశమేలేదు! ఒకసారి యోగా చేయటం ప్రారంభిస్తే దాని ప్రభావం మనపై తప్పకుండా పడుతుంది!" అన్నాడు భర్త.

"మరి బ్రిజ్ భూషణ్ యోగా చేయడా? లేక చేసినట్లు నటిస్తాడా? తన కూతుళ్ళలాంటి రెజర్లపై వేధింపులకు ఎందుకు పాల్పడ్డాడు? దేశానికి పతకాలు సాధించి, దేశ గౌరవాన్ని పెంచిన మహిళలను వేధించాలన్న దుర్మార్గపు ఆలోచనను యోగా ద్వారా ఎందుకు అధిగమించలేదు?

> "సర్వం సహ చక్రవర్తి అమెరికా వెళ్ళి అన్ని సమస్యలకు యోగానే పరిష్కారం అని చెప్పారు. మణిపూర్ మనదేశంలోనే ఉంది కదా! ముందు మణిపూర్ వెళ్ళి అక్కడి ప్రజలతో యోగా చేయించి ప్రశాంతత నెలకొల్పి ఆ తర్వాత ఐక్యరాజ్యసమితిలో చెబితే చాలా బాగుండేది కదా! పోని అమెరికా నుండి డైరెక్టుగా మణిపూర్‌లో దిగి యోగా చేయించి అక్కడ ప్రశాంతత తెస్తారు కావచ్చు" అన్నది భార్య.

నాలుగు వేదాలు, సకల శాస్త్రాల్లో పండితుడైన రావణుడు సీతమ్మను అపహరించాడు! కాని వేధించలేదు. సీతమ్మ ఇష్టానికి వ్యతిరేకంగా ఆమె ఎదుటకి కూడా రాలేదు! తనను గడ్డిపరకతో సమానంగా చూసినా సీతమ్మను గౌరవించాడే తప్ప అవమానించలేదు! అయినా సరే! రావణుడు తరతరాలకు విలన్‌గా మిగిలిపోయాడు! మరీ మహిళా రైజర్లను వేధింపులకు గురి చేసిన బ్రిజ్ భూషణ్ మాత్రం గౌరవాలు అందుకుంటాడు. కొత్త పార్లమెంటులోకి గౌరవ ఆహ్వానం అందుకుంటాడు. పతకాలు సాధించిన రెజ్లర్లను మాత్రం అవమానకరంగా రోడ్లమీద ఈడ్చి వేస్తారు! రోజూ యోగా చేసే పెద్దాయనకు తన దేశానికి అత్యున్నత స్థాయి గౌరవం సంపాదించి పెట్టిన ఈ దేశపు ఆడబిడ్డలు లైంగిక వేధింపులకు గురి అయితే పరామర్శించాలన్న మంచి ఆలోచన ఇంకా రావటం లేదు! బ్రిజ్ భూషణ్‌పై చర్య తీసుకుని, పార్టీ నుండి బహిష్కరించాలన్న సదుద్దేశ్యం కలగటం లేదు! మరింకెందుకు యోగా చేయటం? యోగా గొప్పతనం గురించి ప్రపంచానికి చాటి చెప్పటం?" నిలదీసింది భార్య.

భర్త శవాసనం వేసేశాడు.

- ఉషాకిరణ్



'నాన్నకు అందని వైద్యం అందరికీ అందించాలని'



తండ్రి అనారోగ్యంతో మరణించాడు. అప్పుడు ఆమె వయసు 14 ఏండ్లు. తొమ్మిదో తరగతి చదువుతోంది. తండ్రి ఎలా మరణించాడో స్పష్టంగా తెలియకపోయినా, సరైన వైద్యం అందక చనిపోయాడని మాత్రం మనసులో ఉండిపోయింది. అదే ఆమె డాక్టర్ కావాలనే బలమైన లక్ష్యానికి కారణంగా నిలిచింది. ప్రస్తుతం ఆ లక్ష్యం దిశగా ముందుకు సాగుతూ నీట్‌లో 427 మార్కులు సాధించింది. ఎస్టీ కోటాలో 2,782 ర్యాంక్ తెచ్చుకుంది. అంతే కాదు వైద్య విద్యను పూర్తి చేస్తే ఆదివార్ కొలవార్ తెగలో డాక్టరేట్ పట్టా పొందిన తొలి తెలుగు అమ్మాయిగా చరిత్ర సృష్టించే అవకాశం ఉంది. ఆమె ఎస్.స్రవంతి.

కుమరంభీం ఆసిఫాబాద్ జిల్లా చంద్రపల్లి గ్రామంలో పుట్టింది స్రవంతి. అసలే మారుమూల జిల్లా. అందులోనూ దహెగాం మండలమంటే మరింత మారుమూల ప్రాంతం. ఈ మండల కేంద్రానికి 12 కిలోమీటర్ల దూరంలో ఉంటుంది చంద్రపల్లి. అక్కడ సుమారు 2,500 వరకు జనాభా ఉంటుంది. వారందరికీ వ్యవసాయమే ప్రధాన జీవనాధారం. భూమి లేని వారు కూలీ పని చేసుకొని జీవనం సాగిస్తుంటారు. అలా కూలీ పని చేసుకుంటూ జీవనం సాగించే వారిలో స్రవంతి కుటుంబం కూడా ఒకటి.

స్రవంతి తల్లి బుచ్చమ్మ, తండ్రి శంకర్. శంకర్ కూలీ పని చేస్తుండగా, బుచ్చమ్మ సమీప అడవికి వెళ్లి చీపురు పుల్లలు ఏరుకొని వచ్చి గ్రామంలో అమ్ముతూ కొంత డబ్బు సంపాదించేది. వీరికి ఐదుగురు అమ్మాయిలు. స్రవంతి అందరికంటే చిన్నది. నలుగురు అమ్మాయిల పెండిండ్లు అయిపోయాయి. స్రవంతిని స్వగ్రామంలోనే ఐదో తరగతి వరకు చదివించారు. ఆరు నుండి పదో తరగతి వరకు దహెగాం మండల కేంద్రంలోని కస్తూర్బా గాంధీ విద్యాలయంలో చదివించారు. అక్కడ చదువుతున్న సమయంలోనే ఆమె తండ్రి శంకర్ క్యాన్సర్‌తో మరణించాడు.

శంకర్ సరైన వైద్యం అందక మృతి చెందాడని చుట్టుపక్కల వారు అనుకుంటూ ఉండేవారు. అది విని స్రవంతి చాలా బాధపడేది. అప్పటి నుండి డాక్టర్ కావాలని ఆమె కోరిక. డాక్టర్ అయ్యి పేదలకు, ముఖ్యంగా తమలాంటి మారుమూల ప్రాంతాల పేదలకు వైద్యం అందించాలని లక్ష్యంగా పెట్టుకుంది. పదో తరగతిలో 8.2 జీపీఏ సాధించింది. తనకు డాక్టర్ కావాలనే కోరిక ఉందని బంధువులకు చెప్పింది. వీరంతా ఆమెకు అండగా నిలిచారు. స్థానికంగా ప్రభుత్వ కాలేజీ అందుబాటులో లేదు, ఉన్న ప్రైవేట్ కాలేజీలో చదివే ఆర్థిక స్థోమత లేదు. దాంతో బంధువుల సహకారంతో డీఆర్‌డీఏను సంప్రదించింది. హైద్రాబాద్‌లో డీఆర్‌డీఏ ఆధ్వర్యంలోని ఎస్.ఆర్ జూనియర్ కళాశాలలో సీటు సాధించి ఇంటర్ పూర్తి చేసింది.

ఇంటర్‌లో 934 మార్కులతో ఉత్తీర్ణత సాధించింది. నీట్ శిక్షణ తీసుకుంటే మంచి ర్యాంక్ వస్తుందని గిరిజన సంక్షేమ శాఖకు చెందిన ఆపరేషన్ ఎస్‌రాల్డ్‌లో నీట్ శిక్షణ తీసుకొంది. అయితే మొదటి సారి ఆమెకు మంచి ర్యాంక్ రాలేదు. అయినా ఏ మాత్రం అధైర్య పడకుండా రెండో సారి పట్టుదలతో చదివి 427 మార్కులతో, 2,782 ర్యాంక్ సాధించి వైద్య విద్యకు ఎంపికైంది. ఆదివాసీలలో ఒక తెగ అయిన కొలవార్‌కు చెందిన స్రవంతి వైద్య విద్య పూర్తి చేస్తే రెండు తెలుగు రాష్ట్రాలలోనూ ఆ తెగలో డాక్టర్ పట్టా అందుకున్న మొదటి మహిళగా గుర్తింపు పొందుతుంది.

- సురేందర్‌రావు
కాగజ్‌నగర్ ప్రతినిధి, నవతెలంగాణ



సంతోషంగా వుంది

నా భర్త, నేను ఏం చదువుకోలేదు. నాకున్న ఐదుగురు బిడ్డల్లో స్రవంతి చిన్న బిడ్డ. నలుగురు పెద్ద బిడ్డలను మాకున్నంతలో చదివించి పెండిండ్లు చేశాం. నా భర్త చనిపోయినంక ఈమె చదువు కూడా ఆపించి కూలీ పనికి పంపిస్తాను అనుకున్నా. కానీ నా వాళ్లంతా చదివించాలని గట్టిగా చెప్పడంతో సరేనన్నా. అంతా వాళ్లే చూసుకున్నరు. అక్షరం ముక్క రాని నేను ఇవ్వాళ సంతోషంగా ఉన్నాను. లనా ఇంటికి ఇపుడు ఎవరెవరో వచ్చి పోతున్నరు. ఇపుడే నా బిడ్డ డాక్టర్ అయినంత సంతోషంగా ఉంది నాకు.

- బుచ్చమ్మ, స్రవంతి తల్లి



లక్ష్యం చేరుకుంటా

నాకు తెలిసీ తెలియని వయసులోనే మా నాన్న చనిపోయాడు. సరైన వైద్యం అందితే నాన్న బతికేవాడని చుట్టుపక్కల వారు మాట్లాడుకోవడం విన్నాను. అప్పటి నుండే డాక్టర్ చదవాలనే కోరిక నాలో బలంగా నాటుకుపోయింది. అందుకు తగ్గట్టుగానే కష్టపడి చదివాను. ఇందుకు మా బంధువుల సహకారం కూడా తోడైంది. మొదటి సారి ప్రయత్నిస్తే ర్యాంక్ రాలేదు. అయినా ఏడాది పాటు కోచింగ్ తీసుకొని రెండో సారి ప్రయత్నించా. ఎస్టీ కోటాలో 2,782 ర్యాంక్ వచ్చింది. ఇపుడు అందరూ అభినందిస్తే సంతోషంగా అనిపిస్తోంది. మా తల్లిదండ్రులు ఎంత కష్టపడేవారో నాకు తెలుసు. మా నాన్న ఇప్పుడు లేకపోయినా, మా అమ్మ ముఖంలో సంతోషాన్ని చూస్తున్నా. తప్పకుండా వైద్య విద్య పూర్తి చేసి మారుమూల ప్రాంతాల ప్రజలకు నా వంతుగా వైద్యం అందిస్తా.

- ఎస్. స్రవంతి

పరిమితికి మించితే...

పుట్టబోయే బిడ్డ ఆరోగ్యంగా అందంగా పుట్టాలని కాబోయే అమ్మలు ఎంతో ఆశగా ఎదురుచూస్తారు. నెలతప్పిన నాటి నుంచి ప్రసవమై పాపాయి చేతుల్లోకి వచ్చేవరకు ప్రతి క్షణం కడుపులోని బిడ్డ కోసమే పరితపిస్తారు. బిడ్డ ఆరోగ్యానికి కావాల్సిన ఆహారం తీసుకుంటూ.. డాక్టర్లు చెప్పిన మందులన్నీ క్రమం తప్పకుండా వేసుకుంటారు. అయితే కొందరు పరిమితికి మించి తీసుకునే మందుల వల్ల మంచి కన్నా చెడే ఎక్కువగా జరుగుతుందని వైద్యనిపుణులు హెచ్చరిస్తున్నారు.

విటమిన్ ఎ

గర్భిణులు విటమిన్ ఎ సప్లిమెంట్లు ఎక్కువగా తీసుకుంటే పుట్టే పిల్లలకు ప్రమాదం ఉందని వైద్యపరిశోధకులు హెచ్చరిస్తున్నారు. అంతేకాదు ఇలాంటి శిశువుల్లో క్యాన్సర్ కారకాలు చేరే ప్రమాదం కూడా ఉంది. విటమిన్ ఎ సప్లిమెంట్స్ ఎక్కువగా తీసుకునే గర్భిణిలకు పుట్టే శిశువులకు పుట్టుకతోనే శారీరకలోపాలు, అనారోగ్య సమస్యలు ఉంటాయి. అలాగే బీటా కెరోటిన్ ను పరిమితికి మించి తీసుకుంటే చిన్నారుల్లో ఊపిరితిత్తుల సమస్యలు వచ్చే అవకాశాలు పెరుగుతాయి.

విటమిన్ ఇ

కొంతమంది మహిళలు చర్మ సౌందర్యం కోసం 'విటమిన్ ఇ' సప్లిమెంట్లు తీసుకుంటారు. అయితే ప్రతి రోజూ క్రమం తప్పకుండా విటమిన ఇ తీసుకునే వాళ్లకి 'ఆల్కాజ్ మొటాలిటీ'... అంటే ఏ ఆరోగ్య సమస్యతోనైనా ప్రాణాలు కోల్పోయే అవకాశాలు పెరుగుతాయి. ఇందుకు కారణం విటమిన్ ఇ సప్లిమెంట్లను వాడటం వల్ల శరీరంలో టాక్సిసిటీ పెరుగుతుంది. రోజుకి 30 మైక్రో యూనిట్ల విటమిన్ ఇ మాత్రమే అవసరం. ఇంతకు మించితే శరీరంలో టాక్సిసిటీ పెరుగుతుంది. అయితే గర్భిణులు వీటిని వేసుకోకపోవడమే అన్ని విధాల మంచిది. అయితే తప్పనిసరై విటమిన్ ఇ తీసుకోవల్సి వస్తే టాబ్లెట్‌గా కాకుండా నేరుగా చర్మంపై అప్లై చేసే వాటిని వాడటం మంచిది. దీని వల్ల శరీరంలో టాక్సిసిటీకి అవకాశం ఉండదు పైగా మంచి ఫలితం కూడా ఉంటుంది.

కాల్షియం, విటమిన్ డి

మనకు రోజు మొత్తానికి సరిపడా 'విటమిన్ డి'తో కలిసిన క్యాల్షియం పరిమాణం 600 నుంచి 800 మైక్రో యూనిట్లు. గర్భిణులు కూడా క్యాల్షియంను ఇదే పరిమాణంలో తీసుకోవాలి. శరీరానికి కావల్సిన క్యాల్షియం ఆహారం ద్వారా తీసుకోగలిగితే అదనంగా సప్లిమెంట్ల అవసరం ఉండదు. కాల్షియం, విటమిన్ డి ఎక్కువగా తీసుకుంటే 'హైపోకాల్సీమియా' సమస్య ఉత్పన్నం అవుతుంది. అంటే శరీరంలో కాల్షియం నిల్వలు పేరుకుపోయి మూత్రపిండాల్లో రాళ్లు ఏర్పడవచ్చు. ఇతర అనారోగ్య సమస్యలు రావచ్చు.



బి కాంప్లెక్స్

బి1, బి2, బి6, బి12 అనే ఎన్నో రకాలు ఉంటాయి. వీటన్నింటినీ మల్టీ విటమిన్‌గా చాలా వరకు తీసుకుంటారు. శరీరానికి అవసరమైన దాంట్లో కేవలం యాభై శాతం మాత్రమే సప్లిమెంట్స్‌గా మిగతా యాభై శాతం ఆహారం ద్వారా తీసుకుంటే మంచిది. అయితే గర్భిణులు బీ కాంప్లెక్స్ సప్లిమెంట్స్ ఎంత మేరకు వాడాలి అన్నది డాక్టర్ సూచన ప్రకారమే వేసుకోవాలి. విటమిన్లు ఆరోగ్యానికి మంచివే అయితే పరిమితి మించితే పాపాయి ఆరోగ్యానికి ముప్పు తేస్తాయి. కాబట్టి డాక్టర్ సలహా లేనిదే ఏ మాత్రలు వాడవద్దు.

వ్యాయామం తప్పనిసరి

నెల తప్పగానే చాలామంది బెడ్ రెస్ట్ అంటూ పూర్తిగా రెస్ట్ తీసుకుంటారు. ఇది సరి కాదు. కాబోయే అమ్మల శారీరక వ్యాయామం, మానసిక ఆనందం కడుపులోని బిడ్డను ఆరోగ్యంగా ఉంచుతుంది. తేలికపాటి పనులు చేయడం, మంచి పుస్తకాలు చదవడం, సంగీతం వినడం, పాజిటివ్ గా ఆలోచించడం వల్ల పాపాయి ఆరోగ్యంగా పెరుగుతుంది.

మెట్రో రైల్ విస్తరణను ఆమోదించండి

(మొదటిపేజీ తరువాయి)

నిర్మాణం వంటి వివిధ కార్యక్రమాల కోసం స్వచ్ఛ భారత్ మిషన్, ఇతర కేంద్ర ప్రభుత్వ కార్యక్రమం కింద రూ.400 కోట్ల ఆర్థిక సహాయాన్ని అందించాలని కోరారు. రూ.3,050 కోట్లతో రాష్ట్ర ప్రభుత్వం చేపడుతున్న ఎయిర్‌పోర్ట్ ఎక్స్‌ప్రెస్‌వే నిర్మాణానికి 15 శాతం నిధులను కేంద్రం అందించాలని, ఇందుకోసం రూ.450 కోట్ల ఆర్థిక సహాయం చేయాలని విజ్ఞప్తి చేశారు. హైదరాబాద్ నగర పరిధిలో చేపడుతున్న ఎస్టీపీల నిర్మాణ ఖర్చు దాదాపు రూ.3,722 కోట్లు అవుతుందనీ, ఇందులో కనీసం 20 శాతం రూ.744 కోట్లను కేంద్ర ప్రభుత్వం అందించాలని మంత్రి కేటీఆర్ విజ్ఞప్తి చేశారు. కేంద్రం నిర్దేశించిన సిటిజన్ సెంట్రిక్ రిఫార్మ్స్ కింద బయో మైనింగ్, మానవ వ్యర్థాల శుద్ధి ప్లాంట్ల ఏర్పాటువంటి అనేక కార్యక్రమాలను రాష్ట్ర ప్రభుత్వం చేపట్టిందని, వీటన్నింటి కోసం రాష్ట్ర వ్యాప్తంగా ఉన్న పురపాలికల్లో చేపడుతున్న కార్యక్రమాలకు మొత్తంగా రూ. 3,777 కోట్లు ఖర్చు అవుతుందని, ఇందులో రూ.750 కోట్లు కేంద్రం ఆర్థిక సాయం చేయాలని కోరారు. ఇలాంటి వినూత్నమైన ఆలోచనలతో కూడిన శానిటేషన్ హబ్ వల్ల పురపాలక అభివృద్ధిలో అనేక సవాళ్లకు సమాధానం దొరుకుతుందన్నారు. ఈ అంశంపైన తెలంగాణ తన నమూనాను, ఆలోచనలను పంచుకోవాలని కేటీఆర్‌ను హర్దీప్ సింగ్ పూరి కోరారు. త్వరలోనే తన మంత్రిత్వ శాఖ ఢిల్లీలో ఏర్పాటుచేసే సమావేశంలో ఇందుకు సంబంధించిన వివరాలతో కూడిన ప్రజెంటేషన్ ఇవ్వాలని కోరారు. తెలంగాణ ప్రభుత్వం చేపట్టిన డబుల్ బెడ్ రూమ్ ఇండ్లు, ఎస్‌ఆర్డీపి, లింకు రోడ్లు, పారిశుద్ధ్యరంగంలో చేపట్టిన సాలిడ్ వేస్ట్ మేనేజ్‌మెంట్, లిక్విడ్ వేస్ట్ మేనేజ్‌మెంట్ వంటి అర్బన్ డెవలప్‌మెంట్ కార్యక్రమాలను స్వయంగా పరిశీలించేందుకు హైదరాబాద్ రావాలని కేంద్ర మంత్రిని కెటి రామారావు ఆహ్వానించారు. కేంద్ర మంత్రిని కలిసిన వారిలో కేటీఆర్ వెంట బీఆర్ఎస్ ఎంపీలు జి.రంజిత్ రెడ్డి, కొత్త ప్రభాకర్ రెడ్డి, రాష్ట్ర మునిసిపల్, పట్టణాభివృద్ధి శాఖ ప్రత్యేక ప్రధాన కార్యదర్శి అరవింద్ కుమార్ ఉన్నారు.

ధాన్యంపై పియూష్ గోయల్‌కు వినతి

తెలంగాణ రాష్ట్రంలో 2022-23 యాసంగి పంటకు గాను 20 లక్షల మెట్రిక్ టన్నుల అదనపు పారా, బాయిల్డ్ రైస్ సేకరణకు కేంద్ర మంత్రి పియూష్ గోయాలకు విన్నవించడం జరిగిందని మంత్రి కెటి రామారావు తెలిపారు. ప్రధానంగా తెలంగాణ రాష్ట్రంలో వరి సాగు గురించి కేంద్ర మంత్రి కేంద్ర మంత్రి పియూష్ గోయల్ దృష్టికి తీసుకెళ్లడం జరిగిందన్నారు. ఈ యాసంగి సీజన్‌లో 57 లక్షల ఎకరాల్లో వరి సాగు చేయడం జరిగిందని, ఇది దేశంలో 50శాతం కంటే ఎక్కువ అని కేంద్ర మంత్రికి వివరించామన్నారు. ప్రధానంగా యాసంగి పంట 88.11 లక్షల మెట్రిక్ టన్నుల వరిని సేకరించిడం జరిగిందన్నారు. ఇందులో భారత ప్రభుత్వం తెలంగాణ రాష్ట్రానికి 10.20 లక్షల మెట్రిక్ టన్నుల ఉడకబెట్టిన బియ్యాన్ని తీసుకునేందుకు లక్ష్యంగా పెట్టుకున్నదని. దీనివల్ల ఒక లక్ష మెట్రిక్ టన్నులు సేకరించేందుకు 42.08 కోట్లు అదనంగా ఖర్చు అవుతుందని తెలిపారు.

బడాబాబుల సేవలో మోడీ

(మొదటిపేజీ తరువాయి)

విమర్శించారు. ఇక తెలంగాణ వచ్చిన తర్వాత డబుల్ బెడ్‌రూమ్ ఇండ్లు ఇస్తామని కేసీఆర్ చెప్పడంతో ప్రజలు కండ్లు కాయలు కాసేలా ఎదురు చూసినా అమలు చేయలేదని వాపోయారు. తెలంగాణలో మేమే అధికారంలోకి వస్తామంటున్న బీజేపీ అధ్యక్షులు బండి సంజయ్ ఇండ్లు, ఇండ్ల స్థలాలపై మాటెత్తడం లేదని విమర్శించారు. బీజేపీకి మొదటి నుంచీ పేదల సమస్యలు పట్టవని ఆరోపించారు. మోడీకి కుడి ఎడమ భుజంలా అంబానీ, అదానీ ఉన్నారని, వీరుంటే సరిపోతుందని అన్నారు. నిజామాబాద్ జిల్లాలోని పేదలందరికీ 125 గజాల స్థలం ఇవ్వడంతో పాటు ఇంటి నిర్మాణానికి రాష్ట్రం రూ.5 లక్షలు, కేంద్రం రూ.10 లక్షలు సాయం చేయాలని డిమాండ్ చేశారు. రాష్ట్ర ప్రభుత్వం ప్రకటించిన గృహలక్ష్మిలో రూ.3 లక్షల సాయంతో పునాదులు కూడా లేవవని, దాంతో పేదలకు ఉపయోగం జరగబోదని స్పష్టం చేశారు. రైతు సంఘం రాష్ట్ర ప్రధాన కార్యదర్శి సాగర్ మాట్లాడుతూ.. ధర్మపురి అరవింద్ పసుపు బోర్డు హామీ ఎంత జూటానో, మోడీ చెప్పిన అందరికీ ఇండ్లు కూడా అంతే జూటా, మోసం అని విమర్శించారు. పేద ప్రజలకు వ్యతిరేకంగా నిలబడిన ప్రభుత్వాలు ఎక్కువ కాలం నిలబడలేవని హెచ్చరించారు. బడాబాబులు, రియల్టర్లు వందల ఎకరాలు తన్నుకుపోతున్నా పట్టించుకోని సర్కారు పేదలకు తలదాచుకునేందుకు స్థలం కోరితే కేసులు పెడుతూ అరెస్టులు చేస్తున్నారని వాపోయారు. రాష్ట్ర ప్రభుత్వం స్థలాలు పంపిణీ చేయకపోవడం వల్ల పేదలు శివారు ప్రాంతాల్లో, మురికివాడల్లో, పాములతో సావాసం చేయాల్సిన పరిస్థితి తలెత్తిందని వాపోయారు. రాష్ట్ర వ్యాప్తంగా అర్హులైన పేదలందరికీ ఇండ్లు, ఇండ్ల స్థలాలు పంపిణీ చేసే వరకు పోరాటం ఆగబోదని స్పష్టం చేశారు. యాత్రలో ఐద్వా రాష్ట్ర ప్రధాన కార్యదర్శి మల్లు లక్ష్మి, కేవీపీఎస్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి స్కైలాబ్ బాబు, వ్యవసాయ కార్మిక సంఘం రాష్ట్ర ప్రధాన కార్యదర్శి ఆర్ వెంక్రటాములు, డీవైఎఫ్ఐ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి వెంకటేష్, ప్రజానాట్యమండలి రాష్ట్ర అధ్యక్షులు ఆనంద్, సోషల్ మీడియా రాష్ట్ర కన్వీనర్ జగదీష్, ప్రజానాట్య మండలి రాష్ట్ర అధ్యక్షులు ఆనంద్, రాష్ట్ర నాయకులు పర్వతాలు, జిల్లా నాయకులు రమేష్‌బాబు, నూర్జహాన్, పెద్ది వెంక్రటాములు, గంగాధరప్ప, వెంకటేష్, సుజాత, శంకర్‌గౌడ్, గోవర్ధన్, పెద్ది సూరి, అనిల్, విఘ్నేష్ తదితరులు పాల్గొన్నారు.

హిందీని రుద్దడం చట్ట ఉలంఘనే!

(మొదటిపేజీ తరువాయి)

ఉల్లంఘించడమేనని కేంద్రం ఎట్టకేలకు అంగీకరించింది. తన పరిధిలో లేని అంశంపై కమిటీ చేసిన సిఫార్సు అధికార భాషా చట్టాన్ని ఉల్లంఘించిందని కేంద్ర హోం మంత్రిత్వ శాఖ పేర్కొంది. ఐఐటీలు, ఐఐఎంలు, ఎయిమ్స్, కేంద్ర విశ్వవిద్యాలయాలు, కేంద్రీయ విద్యాలయాలు, నవోదయా వంటి సంస్థల్లో ప్రధాన భాషగా ఇంగ్లీషు స్థానంలో హిందీని ప్రవేశపెట్టాలని పార్లమెంటరీ కమిటీ సిఫార్సు చేసింది. ఈ సిఫార్సు గత ఎనిమిది మాసాలుగా రాష్ట్రపతి పరిశీలనలో వుంది. గత ఏడాది డిసెంబరులో సీపీఐ(ఎం) ఎంపీ జాన్ బ్రిట్టాస్ రాజ్యసభలో మాట్లాడుతూ, ఈ సిఫార్సు చట్టాన్ని ఉల్లంఘించడమా? కాదా? అని ప్రశ్నించారు. కానీ ఆయనకు ప్రభుత్వం నుంచి స్పష్టమైన సమాధానం రాలేదు. దీంతో బ్రిట్టాస్ సభాధ్యక్షులైన ఉప రాష్ట్రపతికి ఫిర్యాదు చేశారు. అనంతరం కేంద్ర హోం మంత్రిత్వ శాఖ దీనికి సమాధానం ఇచ్చింది. ఆ సిఫార్సు చట్టాన్ని ఉల్లంఘించడమేనని పేర్కొంది. హిందీని అధికార భాషగా ఉపయోగించడానికి సంబంధించి నెలకొన్న పురోగతిని అంచనా వేసి, రాష్ట్రపతికి నివేదిక అందజేయడమే కమిటీ బాధ్యత. అంతకుమించి మరే ఇతర జోక్యానికి అనుమతి లేదా అధికారమివ్వలేదు. అయితే, సమాధానంలో దీన్ని ప్రస్తావించకుండా చట్టాన్ని ఉటంకించారు. హిందీతోపాటు ఇంగ్లీషును కూడా అధికార కార్యాచరణకు ఉపయోగించాలని అధికార భాషా చట్టం పేర్కొంటోంది. పార్లమెంట్, రాష్ట్రాల శాసనసభలు చట్టాన్ని ఆమోదించే వరకు షరతులకు కట్టుబడి వుండేందుకు కేంద్ర హోం శాఖ అంగీకరించింది. పార్లమెంటరీ కమిటీ సిఫార్సుల నివేదిక బుట్టదాఖలు చేసే అవకాశం ఉండటంతోనే కేంద్రం ఇంకా దీన్ని బహిరంగపరచలేదని పరిశీలకులు భావిస్తున్నారు.

దేశవ్యాప్తంగా కొత్త మెడికల్ కాలేజీలు

- వైద్యవిద్యకు మోడీ పెద్దపీట
- గవర్నర్ డాక్టర్ తమిళిసై

నవతెలంగాణ బ్యూరో - హైదరాబాద్

దేశవ్యాప్తంగా కొత్త మెడికల్ కాలేజీలను నెలకొల్పటం ద్వారా ప్రధాని మోడీ వైద్యవిద్యకు పెద్దపీట వేస్తున్నారని రాష్ట్ర గవర్నర్ డాక్టర్ తమిళిసై సౌందర రాజన్ తెలిపారు. నేషనల్ బోర్డ్ ఆఫ్ ఎగ్జామినేషన్ ఇన్ మెడికల్ సైన్సెస్ (ఎన్‌బీఈఎంఎస్) ఆధ్వర్యంలో శనివారం హైదరాబాద్‌లోని ఏసియన్ గ్యాస్ట్రోఎంటరాలజీ (ఏఐజీ)లో నిర్వహించిన ఫ్యాకల్టీ డెవలప్‌మెంట్ ప్రోగ్రాంలో ఆమె పాల్గొన్నారు.

సర్జరీల్లో రోబోటిక్స్ వినియోగం, సాంకేతికంగా పురోగతిని అందిపుచ్చుకుని వైద్యవిద్యలో శిక్షణ పొందిన సిబ్బందికి ఎక్కువగా డిమాండ్ ఉందని తెలిపారు. నేటితరం వైద్యవిద్యార్థులు అదృష్టవంతులంటూ వారికి డిజిటల్ పుస్తకాలు అందుబాటులోకి వచ్చాయని గుర్తుచేశారు.. ఈ కార్యక్రమంలో డాక్టర్ నాగేశ్వర్ రెడ్డి (ఏఐజీ), డాక్టర్ సంగీతారెడ్డి (అపోలో హాస్పిటల్స్), ప్రెసిడెంట్ డాక్టర్ అభిజత్ షేత్, వైస్ ప్రెసిడెంట్ ప్రొఫెసర్ సి.మల్లికార్జున్ (ఎన్‌బీఈఎంఎస్), ఎండీ డాక్టర్ సురేందర్ రావు (యశోద హాస్పిటల్స్) పాల్గొన్నారు.

దివ్యాంగుల సమాచారం అవసరం లేదు

న్యూఢిల్లీ: జాతీయ కుటుంబ ఆరోగ్య సర్వే-6 (ఎన్‌ఎఫ్‌హెచ్‌ఎస్- 6) నుండి అంగవైకల్యానికి సంబంధించిన ప్రశ్నలను తొలగించడాన్ని కేంద్ర ప్రభుత్వం సమర్థించుకుంది. అలాంటి సమాచారంలో వేగవంతమైన మార్పులు రావని, అందువల్ల దానిని సేకరించాల్సిన అవసరం లేదని తెలిపింది. తల్లులు, పిల్లల ఆరోగ్యానికి సంబంధించిన సమాచారాన్ని సేకరించడంపై మాత్రమే దృష్టి సారించామని ఆరోగ్య, కుటుంబ సంక్షేమ శాఖ (గణాంకాల విభాగం) వివరించింది. అందువల్ల వైకల్యంపై కచ్చితమైన సమాచారాన్ని సేకరించడం సాధ్యం కాదని తేల్చేసింది. వైకల్యానికి సంబంధించి ఎన్‌ఎఫ్‌హెచ్‌ఎస్, ఎన్‌ఎస్‌ఎస్‌ఓలు సేకరించే సమాచారంలో తేడాలు ఉంటాయని, కాబట్టి జాతీయ స్థాయిలో వైకల్యానికి సంబంధించి వివరాలు తీసుకోవడం కష్టమని చెప్పింది. అదీకాక దివ్యాంగుల సంఖ్యను తక్కువగా అంచనా వేసే ప్రమాదం కూడా ఉందని మంత్రిత్వ శాఖ తెలిపింది. 2019-2021 మధ్యకాలంలో జరిపిన కుటుంబ సర్వే-5లో వైకల్యంపై కూడా ప్రశ్నలను చేర్చారు. ఈ నివేదిక ప్రకారం గ్రామీణ ప్రాంతాలలో 1%, పట్టణ ప్రాంతాలలో 0.9% దివ్యాంగులు ఉన్నారు. అయితే 2018లో ఎన్‌ఎస్‌ఎస్‌ఓ జరిపిన సర్వేలో గ్రామీణ ప్రాంతాలలో 2.3%, పట్టణ ప్రాంతాలలో 2% దివ్యాంగులు ఉన్నారని తేలింది. ఎన్‌ఎస్‌ఎస్ 76వ రౌండ్‌లోనే దేశంలోని దివ్యాంగులకు సంబంధించిన సమాచారం చాలా వరకూ అందుబాటులోకి వచ్చిందని ఆరోగ్య, కుటుంబ సంక్షేమ శాఖ తెలిపింది. కాగా సమాజంలోని దివ్యాంగులను ప్రభుత్వం పెద్దగా పట్టించుకోదని, సర్వేలో వారిపై ప్రశ్నలు చేర్చకపోవడం ప్రభుత్వ నిర్లక్ష్యానికి పరాకాష్ట అని దివ్యాంగుల హక్కుల జాతీయ వేదిక ప్రధాన కార్యదర్శి మురళీధరన్ విమర్శించారు.

మణిపూర్‌లో శాంతి నెలకొల్పాలి

(మొదటిపేజీ తరువాయి)

తొలగించాలని ఆందోళనకారులు డిమాండ్ చేశారు. అల్లర్ల బాధితులు ఎదుర్కొన్న క్రూరమైన అనుభవాలను కూడా వివరించారు. ఐద్వా అధ్యక్షురాలు పికె శ్రీమతి టీచర్ ఆందోళనను ఉద్దేశించి మాట్లాడారు. మణిపూర్ పోరాటానికి చివరి వరకు ఐద్వా అగ్రభాగాన నిలుస్తుందనీ, శాంతిభద్రతల పునరుద్ధరణకు కేంద్రం చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. మణిపురిలు భారతదేశంలో భాగమనీ, దేశం కోసం ప్రాణత్యాగం చేసిన వారు హింసకు గురవుతున్నారని శ్రీమతి టీచర్ అన్నారు. ఐద్వా నాయకురాలు సుభాషిణి అలీ, నేషనల్ ఫెడరేషన్ ఆఫ్ ఇండియన్ ఉమెన్ లీడర్ అన్నీ రాజా, మహిళా హక్కుల కార్యకర్తలు పాల్గొని సంఘీభావం తెలిపారు. మరోవైపు మణిపూర్‌లోని ప్రతిపక్ష పార్టీల ఆధ్వర్యంలో మహాత్మాగాంధీ స్మారక మందిరం రాజ్‌ఘాట్ వద్ద శాంతి పునరుద్ధరణ పిలుపుతో సత్యాగ్రహం జరిగింది. కాంగ్రెస్, సీపీఐ(ఎం), సీపీఐ, ఆప్ ఇలా పది పార్టీలు పాల్గొన్నాయి.

వైద్యసేవల కార్పొరేటీకరణ దురదృష్టకరం

నవతెలంగాణ బ్యూరో - హైదరాబాద్

వైద్యసేవల కార్పొరేటీకరణ దురదృష్టకరమని సుప్రీంకోర్టు మాజీ ప్రధాన న్యాయమూర్తి జస్టిస్ ఎన్.వి.రమణ వ్యాఖ్యానించారు. ఆ కార్పొరేటీకరణ ఆరోగ్య సమాజ ఆవిర్భావంలో కీలక పాత్ర పోషిస్తున్న ఫ్యామిలీ ఫిజిషియన్లతో పాటు ప్రయివేటు ప్రాక్టీషనర్లను కనుమరుగు చేస్తున్నదని ఆయన ఆవేదన వ్యక్తం చేశారు. ఈ పరిణామం సమాజానికే ప్రమాదం, హానికరమంటూ ఆందోళన వ్యక్తం చేశారు. అకాడమీ ఆఫ్ ఫ్యామిలీ ఫిజీషియన్స్ ఆఫ్ ఇండియా (ఏఎఫ్‌పీఐ) తెలంగాణ, ఆంధ్రప్రదేశ్ చాప్టర్ల ఆధ్వర్యంలో 'ప్రివెంటివ్ కేర్ ఇన్ క్లినికల్ ప్రాక్టీస్-రోల్ ఆఫ్ ఫ్యామిలీ ఫిజీషియన్' అనే అంశంపై రెండు రోజుల సదస్సు శనివారం హైదరాబాద్‌లో ప్రారంభమైంది. ఈ సందర్భంగా ఏఎఫ్‌పీఐ తెలంగాణ చాప్టర్ వ్యవస్థాపక అధ్యక్షులు డాక్టర్ వి.శ్రీనివాస్ అధ్యక్షతన నిర్వహించిన ప్రారంభ కార్యక్రమంలో రమణ పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ....ఇటీవల కాలంలో సాంకేతిక పురోగతి, ఔషధాలనేవి కార్పొరేటీకరణ, వ్యాపారమయం కావడమనేది ఫ్యామిలీ డాక్టర్ల ప్రాధాన్యతను తగ్గించిందని తెలిపారు. రోగులే కేంద్రంగా, ప్రాథమిక ఆరోగ్య సంరక్షులుగా సేవలందించే ఫ్యామిలీ డాక్టర్లకు ఇది సవాలుగా మారిందని చెప్పారు. సాంకేతిక పురోగతిని ఉపయోగించుకుని ప్రజలు ఫ్యామిలీ డాక్టర్ల స్థానంలో గూగుల్ డాక్టర్‌ను ఆశ్రయిస్తున్నారని గుర్తు చేశారు. అంతర్జాలంలో లభించే సగం పరిజ్ఞానంతో రోగులే స్వీయ వైద్యులుగా మారి సొంతంగా రోగ నిర్ధారణ, చికిత్స చేసుకుంటున్నారని ఆందోళన వ్యక్తం చేశారు. అది కాస్తా బెడిసి కొట్టి పరిస్థితి విషమించాకే వైద్యులను సంప్రదిస్తున్నారని తెలిపారు.వైద్యవృత్తి ఉన్నతమైందనీ, దాంతో పోల్చదగిన వృత్తి మరేది లేదని జస్టిస్ రమణ ఈ సందర్భంగా తెలిపారు. కరోనా మహమ్మారి నుంచి ప్రజల ప్రాణాలను కాపాడేందుకు డాక్టర్లు అందించిన సేవలకు ఆ వృత్తి సాక్ష్యంగా మిగిలిందని చెప్పారు. అయినప్పటికీ, ఎక్కువ సంవత్సరాల చదువు, దానికయ్యే అధిక ఖర్చు, డాక్టరయ్యాక వచ్చే పారితోషికం తక్కువగా ఉండటం, ఇబ్బందికరమైన జీవనశైలి, త్యాగాలు చేయాల్సి రావడం, సొంతంగా ప్రాక్టీస్ పెట్టుకోవాలంటే ఎక్కువగా పెట్టుబడి పెట్టాల్సిన పరిస్థితి, మంచి డాక్టర్ అనిపించుకోవడానికి ఎక్కువ కాలం పట్టడం, ఎక్కువ పోటీ ఉన్న రంగం కావడం తదితర కారణాలతో నేటి తరం యువతీ, యువకులు వైద్యులు కావడానికి ఎక్కువగా ఇష్టపడటం లేదని తెలిపారు. అందుకే చాలా మంది డాక్టర్లు తమ పిల్లలను డాక్టర్లు చేయాలనుకోవడం లేదని గుర్తుచేశారు.మనదేశంలో డాక్టర్లపై హింస, దాడులు పెరగడం పట్ల రమణ ఈ సందర్భంగా ఆందోళన వ్యక్తం చేశారు. ఒత్తిడితో ఉన్న రోగులు, వారి కుటుంబాలకు సేవలందిస్తున్న వైద్యులు వారితో బూతులు, బెదిరింపులు, భౌతిక దాడులకు గురవుతున్నారని గుర్తుచేశారు. ఈ భయంతో కూడిన పరిస్థితుల్లో సేవలందిస్తున్న డాక్టర్లను కాపాడేంత బలంగా డాక్టర్ల సంఘాలు కూడా లేవని ఆయన తేల్చిచెప్పారు. ఈ చర్యలు వ్యక్తిగతంగా ఒక డాక్టరుపైనే కాకుండా మొత్తం ఆరోగ్యవ్యవస్థపైనే ప్రభావం చూపిస్తున్నాయనే విషయాన్ని గుర్తించాలని సూచించారు. ఈ సందర్భంగా తక్కువ సంఖ్యలో డాక్టర్లు మాత్రమే సేవలందించేందుకు మిగులుతున్నారని వివరించారు. మొత్తంగా మెరుగైన వైద్యం అందించడం సవాలుగా మారుతుందని తెలిపారు. పరిస్థితిలో మార్పు తీసుకురావాల్సిన బాధ్యత సమాజంపై ఉందంటూ, డాక్టర్లు - రోగుల మధ్య విశ్వాసాన్ని పునరుద్ధరించాలని సూచించారు. హింసకు వ్యతిరేకంగా బలమైన చట్టాల ద్వారా డాక్టర్లకు భద్రత కల్పించాలని కోరారు.రోగాలు రాకుండా నివారించడంలో ఫ్యామిలీ ఫిజీషియన్ల పాత్ర పునాది లాంటిదని అభివర్ణించారు. వ్యక్తులు, కుటుంబాలు మొట్టమొదట సంప్రదించే డాక్టర్లుగా వారు, ఆయా వ్యక్తులు, కుటుంబాల ఆరోగ్య చరిత్రనెరిగి భౌతిక, మానసిక, సామాజిక ఆరోగ్యం పట్ల అప్రమత్తం చేస్తారని తెలిపారు. భవిష్యత్తులో రాబోయే రోగాల సంకేతాలను ముందుగానే పసిగట్టి ప్రజలు వాటి బారిన పడకుండా కాపాడటంతో పాటు వారిపై ఆర్థికభారం పడకుండా చూస్తారని కొనియాడారు. తద్వారా ఆరోగ్యరంగంపై ఆర్థికభారం కూడా తగ్గుతుందని వివరించారు. నివారణ అనేది ఆరోగ్య సమాజ ఆవిర్భావంలో పునాది వంటిదైతే, రోగాలపై జరిగే యుద్ధంలో ఫ్యామిలీ ఫిజీషియన్లు ఫ్రంట్‌లైన్ వారియర్లంటూ కొనియాడారు. మోతాదుకు మించి ఔషధాల వాడకం, అవసరం లేని మందుల వాడకం, యాంటీ బయాటిక్స్, స్టెరాయిడ్స్ దుర్వినియోగం, అవాంఛనీయ శస్త్రచికిత్సలు, అవసరం లేకుండా రేడియేషన్ బారిన పడటం, ఆస్పత్రుల్లో దీర్ఘకాలం ఉండాల్సి రావడం వంటి ఇబ్బందులను ఫ్యామిలీ ఫిజీషియన్లు నివారిస్తారని తెలిపారు. దీంతో ప్రజల భౌతిక ఆరోగ్యంతో పాటు ఆర్థిక పరిస్థితి మెరుగుపడి చికిత్సలో, ఔషధాల వాడకంలో చెప్పుకోదగ్గ మార్పు వస్తుందని ఆశాభావం వ్యక్తం చేశారు. ఆరోగ్యమే మహాభాగ్యమనేది విశ్వవ్యాప్త సత్యమని తెలిపారు. ప్రజలు ఆరోగ్యంగా లేకుండా ఒక దేశం పురోగతిని సాధించలేదని వ్యాఖ్యానించారు. 'ఈసురోమని మనుషులుంటే దేశమేగతి బాగుపడునోయ్?' అన్న మహాకవి గురజాడ మాటలను ఈ సందర్భంగా గుర్తుచేశారు.

అడ్డంకులను తొలగించాలి

ఏఎఫ్‌పీఐ జాతీయ అధ్యక్షులు డాక్టర్ రమణ కుమార్ మాట్లాడుతూ , ఫ్యామిలీ మెడిసిన్ అభివృద్ధికి చట్టపరంగా (రెగ్యులేటరీ బారియర్స్) అడ్డంకులున్నాయని తెలిపారు. వీటిని పరిష్కరించుకుంటే ఆరోగ్య సమాజ నిర్మాణానికి మార్గం సుగమమవుతుందని చెప్పారు. ఈ సమావేశంలో సదస్సు ఆర్గనైజింగ్ చైర్ పర్సన్ డాక్టర్ కిరణ్మయి లింగుట్ల, ఆర్గనైజింగ్ సెక్రెటరీ డాక్టర్ కె.షావాలెస్, ఏఎఫ్‌పీఐ తెలంగాణ వ్యవస్థాపక కార్యదర్శి డాక్టర్ విక్రమ్ చేర్యాల, ఏఎఫ్ పీఐ ఆంధ్రప్రదేశ్ బాధ్యురాలు డాక్టర్ జి.మల్లేశ్వరమ్మ తదితరులు పాల్గొన్నారు. మొదటి రోజు వివిధ అంశాలపై ఐదు సైంటిఫిక్ సెషన్లను, ఒక ప్యానెల్ డిస్కషన్ నిర్వహించారు.



రాష్ట్రమంతటా నైరుతి

- జలమయమైన హైదరాబాద్

నవతెలంగాణ బ్యూరో - హైదరాబాద్

ఖమ్మం జిల్లాలో ఈ నెల 22న ప్రవేశించిన నైరుతి రుతుపవనాలు శుక్రవారం నాటికి మరికొన్ని ప్రాంతాలకు విస్తరించాయి. శనివారం నాటికి అన్ని జిల్లాలకు అవి విస్తరించినట్టు హైదరాబాద్ వాతావరణ కేంద్రం ఒక ప్రకటనలో తెలిపింది. ఈ ప్రభావంతో రాబోయే మూడు రోజులపాటు రాష్ట్రంలో భారీ వర్షాలు కురియనున్నట్టు ఆ శాఖ తెలిపింది. ఈ క్రమంలో ఉరుములు, మెరుపులతో కూడిన వర్షాలు అక్కడక్కడా పడే అవకాశముంది. కొన్ని చోట్ల తేలికపాటి నుంచి మోస్తారు వర్షాలు కురిసే అవకాశముంది.

అంగన్‌వాడీలను విస్మరిస్తున్న ప్రభుత్వాలు

- పెంచిన జీతాలివ్వకుండా బడ్జెట్‌లో నిధుల కోత
- ఐసీడీఎస్ పరిరక్షణ కోసం సమరశీల పోరాటాలు
- 10న కలెక్టరేట్ ముట్టడిని జయప్రదం చేయండి
- అంగన్‌వాడీ టీచర్స్ అండ్ హెల్పర్స్ యూనియన్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి జయలక్ష్మి



నవతెలంగాణ-నల్లగొండ కలెక్టరేట్

కేంద్రంలోని బీజేపీ, రాష్ట్రంలోని బీఆర్ఎస్ ప్రభుత్వాలు అంగన్‌వాడీలను పూర్తిగా విస్మరిస్తున్నాయని తెలంగాణ అంగన్‌వాడీ టీచర్స్ అండ్ హెల్పర్స్ యూనియన్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి పి.జయలక్ష్మి ఆవేదన వ్యక్తం చేశారు. ఐసీడీఎస్ పరిరక్షణకై అంగన్‌వాడీ ఉద్యోగులు సమరశీల పోరాటాలకు సిద్ధం కావాలని పిలుపునిచ్చారు. రాష్ట్రవ్యాప్తంగా అంగన్‌వాడీ టీచర్స్ హెల్పర్ల సమస్యల పరిష్కారం కోరుతూ ఈనెల 16న ఆదిలాబాద్ జిల్లాలో ప్రారంభమైన జీపుజాతా శనివారం నల్లగొండ జిల్లా కేంద్రానికి చేరుకుంది. జిల్లా కేంద్రంలోని యూటీఎఫ్ కార్యాలయంలో జరిగిన సభలో జయలక్ష్మి మాట్లాడారు. కేంద్రంలో బీజేపీ ప్రభుత్వం అధికారంలోకొచ్చి 9 ఏండ్లవుతున్నా అంగన్‌వాడీ ఉద్యోగుల సమస్యలు పరిష్కారానికి నోచుకోలేదన్నారు. పెరిగిన ధరలకు అనుగుణంగా ఉద్యోగుల జీతాలు పెంచలేదని ఆవేదన వ్యక్తం చేశారు. 2018లో టీచర్లకు రూ.1500, హెల్పర్లకు రూ. 750, మినీ వర్కర్లకు రూ.1250పెంచినట్టు చెప్పినా బడ్జెట్ నుంచి ఐసీడీఎస్‌కు 40 శాతం నిధులు తగ్గించడం వల్ల రాష్ట్ర ప్రభుత్వాలు వీటిని చెల్లించడం సాధ్యం కాదని చెబుతున్నాయని తెలిపారు. బడ్జెట్ తగ్గించడం వల్ల ఐసీడీఎస్ సేవలకు అంతరాయం కలుగుతుందని, పక్కా భవనాలు, పోషకాహారం, సెంటర్ అద్దెలు, మెస్‌చార్జీలు, ఖాళీ పోస్టులు తదితర సమస్యలు పెండింగ్‌లో ఉన్నాయని చెప్పారు. అలాగే 2013లో 45వ ఇండియన్ లేబర్ కాన్ఫరెన్స్ స్కీంవర్కర్లను కార్మికులుగా గుర్తించాలని, కనీస వేతనం, ఈఎస్ఐ, పెన్షన్, ఉద్యోగ భద్రత కల్పించాలని తీర్మానం చేసింది కానీ ఇప్పటికీ అమలు చేయడం లేదన్నారు. నూతన విద్యావిధానం పాలసీ ద్వారా కేంద్రం ఐసీడీఎస్ వ్యవస్థను నిర్వీర్యం చేస్తుందని ఆవేదన వ్యక్తం చేశారు.

సీఐటీయూ రాష్ట్ర ఉపాధ్యక్షులు తుమ్మల వీరారెడ్డి మాట్లాడుతూ.. కార్మికులు పోరాడి సాధించుకున్న కార్మికుల చట్టాలను కేంద్ర ప్రభుత్వం నాలుగు కోడ్‌లుగా మార్చిందని, వాటిని వెంటనే రద్దు చేయాలని డిమాండ్ చేశారు. రాష్ట్రవ్యాప్తంగా జీపుజాతా సందర్భంగా వచ్చిన సమస్యలపై సెక్టారు ప్రాజెక్టుల వారీగా సమావేశాలు జరుపుకొని సీడీపీఓలకు, టీడబ్ల్యూఓ అధికారులకు వినతిపత్రాలు ఇవ్వాలన్నారు. జులై 10 కోరికల దినోత్సవం సందర్భంగా అంగన్వాడీ ఉద్యోగులందరూ జిల్లా కలెక్టరేట్ ముట్టడి చేయాలని పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో సీఐటీయూ జిల్లా కోశాధికారి బాణాల పరిపూర్ణచారి, జిల్లా సహాయ కార్యదర్శి దండంపల్లి సత్తయ్య, ఉపాధ్యక్షులు నారబోయిన శ్రీనివాస్, జిల్లా కమిటీ సభ్యులు అద్దంకి నర్సింహ, అంగన్వాడీ యూనియన్ నాయకులు కె.విజయలక్ష్మీ, బి.పార్వతి, నాగమణి, ప్రమీల, రత్నకుమారి, ప్రకతాంబ, మణిరూప, ప్రమీల, వాణి పాల్గొన్నారు.

దళిత బంధు రెండో దశ ఉత్తర్వులు జారీ

- హర్షం వ్యక్తం చేసిన మంత్రి కొప్పుల
- లబ్దిదారుల ఎంపిక ప్రక్రియ వేగవంతం చేయాలి
- కలెక్టర్లకు ఆదేశాలు

నవతెలంగాణ బ్యూరో-హైదరాబాద్

రాష్ట్ర ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా అమలు చేస్తున్న దళిత బంధు పథకం రెండో విడతకు సంబంధించిన ఉత్తర్వులు జారీ అయ్యాయి. సీఎం కేసీఆర్ ప్రకటించిన విధంగా ప్రతీ నియోజకవర్గంలో 1100 మందికి ఆ పథకాన్ని అమలు చేయనున్నారు. దళిత బంధు రెండో విడత ఉత్తర్వుల జారీ పట్ల రాష్ట్ర ఎస్సీ అభివృద్ధి శాఖ మంత్రి కొప్పుల ఈశ్వర్ హర్షం వ్యక్తం చేశారు. జిల్లా కలెక్టర్లు లబ్ది దారుల ఎంపిక ప్రక్రియ వేగవంతం చేయాలని సూచించారు. దళితుల అభ్యున్నతే ప్రభుత్వ లక్ష్యమని తెలిపారు. ఇప్పటికే తొలి విడతలో ఈ పథకం ద్వారా లబ్ది పొందిన పలువురు ఉన్నత మైన జీవనం సాగిస్తున్నారని గుర్తుచేశారు. రానున్న ఎనిమిదేండ్లలో ప్రతి దళిత కుటుంబానికి దళిత బంధు పథకం ద్వారా లబ్ది చేకూరుతుందన్నారు. విపక్షాలు ఎన్ని విమర్శలు చేసినా తెలంగాణ ప్రజలు తిప్పి కొడుతున్నారని చెప్పారు. రాజకీయ లబ్ది కోసం ప్రభుత్వంపై బురద జల్లే ప్రయత్నాలు చేస్తున్నారనీ,ఇది ఎంత మాత్రం మంచిది కాదని హితవు పలికారు.

భద్రాద్రి కొత్తగూడెంలోనే అత్యధిక పోడు పట్టాలు

- రెండో స్థానంలో మహబూబాబాద్ : మంత్రి సత్యవతి రాథోడ్ వెల్లడి

నవతెలంగాణ బ్యూరో-హైదరాబాద్

పోడు పట్టాలకు సంబంధించి రాష్ట్ర ప్రభుత్వం ఒక నిర్ణీత గడువును ప్రకటించటం హర్షణీయమని గిరిజన సంక్షేమ శాఖ మంత్రి సత్యవతి రాథోడ్ తెలిపారు. రాష్ట్రంలోని జిల్లాల వారీగా చూస్తే భద్రాద్రి కొత్తగూడెం జిల్లాలో అత్యధిక పోడు పట్టాలు ఇవ్వాల్సి ఉందని ఆమె ఒక ప్రకటనలో పేర్కొన్నారు. ఆ జిల్లాలో 1,51,197 ఎకరాలకు గానూ 50,595 మందికి పట్టాలు అందించనున్నామని వివరించారు. మంత్రులు హరీశ్‌రావు, పువ్వాడ అజయ్‌కుమార్ చేతుల మీదుగా అక్కడ పట్టాల పంపిణీ కొనసాగుందని తెలిపారు. అత్యధిక పోడు ఉన్న జాబితాలో మహబూబాబాద్ రెండో స్థానంలో నిలిచిందని పేర్కొన్నారు. ఆ జిల్లాలో మొత్తం 67,730 ఎకరాలకు గానూ 24,181 మందికి పట్టాలు అందించనున్నట్టు తెలిపారు. తనతో పాటు రాష్ట్ర మంత్రి కేటీఆర్ హజరై రైతులకు పట్టాలు అంజేస్తామని వివరించారు.

త్యాగాలతోనే తెలంగాణ

- తెలంగాణ బీసీ సంక్షేమ సంఘం

నవతెలంగాణ బ్యూరో-హైదరాబాద్

త్యాగాలతోనే తెలంగాణ సాధ్యమైందని తెలంగాణ బీసీ సంక్షేమ సంఘం -ఉద్యమ కారుల వేదిక తెలిపింది. ఈ మేరకు శనివారం హైదరాబాద్‌లోని సోమాజిగూడ ప్రెస్‌క్లబ్‌లో 'ప్రజాత్యాగాలతోనే తెలంగాణ' అనే అంశంపై ఎల్ల సత్యనారాయణ ఆధ్వర్యంలో సెమినార్ నిర్వహించారు. ఈ కార్యక్రమంలో తొలి మలి దశ ఉద్యమకారులు పాల్గొన్నారు.తెలంగాణ తెచ్చింది తామే అంటూ కేసీఆర్, కేటీఆర్ చేసిన వ్యాఖ్యలను ప్రస్తావిస్తూ.. ప్రజల త్యాగాలను వారు అవమానిస్తున్నారని విమర్శిం చారు.ఈ కార్యక్రమంలో న్యాయవాది శ్రీనివాస్‌యాదవ్,కేంద్ర మాజీ మంత్రి సర్వే సత్యనారాయణ, మాజీ మంత్రి విజయరామారావు, సుధాకర్ పాల్గొన్నారు.

అసోంలో వరదలు..పలువురు మృతి

గువహతి : అసోంలో కురిసిన కుండపోత వర్షాలకు రోడ్లు ఏరుల్ని తలపిస్తున్నాయి. నదులు ప్రమాదస్థాయికి మించి ప్రవహించడంతో వేలాది గ్రామాలు వరద నీటిలో మునిగిపోయాయి. ఇక లక్షలాది మంది ప్రజలు నిరాశ్రయులై కొండలు, గుట్టల మీద తలదాచుకుంటున్నారు. గత కొన్నిరోజులుగా అసోం వరదలు ముంచెత్తుతున్నా, రోజులు గడుస్తున్నా.. ఆ వరద ప్రవాహం మాత్రం తగ్గడం లేదు. ప్రస్తుతం 19 జిల్లాలు వరద ప్రభావిత జిల్లాలుగా ఉన్నాయని అస్సాం స్టేట్ డిజాస్టర్ మేనేజ్‌మెంట్ అథారిటీ (ఎస్‌డీఎంఎ) శనివారం వెల్లడించింది. ప్రస్తుతం అసోం ఇంకా దయనీయ పరిస్థితుల్లోనే ఉందని ఎస్‌డీఎంఎ పేర్కొంది. ఈ వరదలకు రెండు పట్టణ ప్రాంతాల్లో దాదాపు 4,88,525 మంది, 1,538 గ్రామాలు నీటమునిగాయని ఎస్‌డీఎంఎ నివేదిక తెలిపింది.

కాగా, ఈ వరదల కారణంగా గురువారం తాముల్పూర్ జిల్లాలో వరద ప్రభావానికి ఒకరు మతి చెందారు. శుక్రవారం నల్బరీ జిల్లాలోని నిఖిలేష్ మల్లా బుజోర్‌బరువా అనే వ్యక్తి తన ఇంటి దగ్గర ఉన్న వరద నీటిలో ప్రమాదవశాత్తూ పడిపోయి మృతి చెందాడు. అయితే వరదల కారణంగా మృతి చెందిన వారి కుటుంబాలకు ఎక్స్‌గ్రేషియా కింద పరిహారం అందించనున్నట్టు రాష్ట్ర ప్రభుత్వ అధికారులు తెలిపారు. ఇక ఈ వరద ప్రభావితమైన జిల్లాలుగా బజలి, చిరాంగ్, దర్రాంగ్, బక్సా, బర్పేట, బిస్వనాథ్, బొంగైగావ్, ధేమాజీ, ధుబ్రి, డిబ్రూగర్, గోల్‌పరా, గోలాఘాట్, కమ్రూప్, కోక్రాఝర్, లఖింపూర్, నాగోన్, నల్బరీ, తమూల్‌పూర్, ఉదల్‌గురిలు ఉన్నాయని ఎస్‌డీఎంఏ పేర్కొంది. బజలి జిల్లా పరిస్థితి మరీ దయనీయంగా ఉంది. ఈ జిల్లాలో 267,253 మంది వరద నీటిలో ఇళ్ల మునిగిపోయి నిరాశ్రయులయ్యారు. 73,233 మంది నిరాశ్రయులై ఆ తర్వాత రెండో స్థానంలో బార్పేట జిల్లా నిలిచింది. 14 జిల్లాలో రాష్ట్ర యంత్రాంగం నిర్వహిస్తున్న 225 సహాయక శిబిరాల్లో కనీసం 35,142 మంది తలదాచు కున్నారు. బజలి జిల్లాల్లోనే అత్యధికంగా 73 సహా యక శిబిరాలను అధికారులు ఏర్పాటు చేశారు. ఈ శిబిరాల్లో సుమారు 15,841 మంది ఆశ్రయం పొందినట్టు అధికారులు తెలిపారు. ఈ శిబిరాల్లోని ప్రజలకు ఆహారం, మందులు, ఇతర నిత్యావసరా లను నిర్వాహకులు అందిస్తున్నారని రాష్ట్ర ప్రభుత్వ సీనియర్ అధికారి ఒకరు తెలిపారు. ఇదిలా ఉండగా, 10,782 హెక్టార్ల పంట భూములు వరద నీటిలో మునిగిపోయాయి. దీంతో పెద్ద మొత్తంలో వ్యవసాయ ఉత్పత్తులు దెబ్బతింటాయని, రైతులు తీవ్రంగా నష్టపోయే అవకాశముందని అధికారులు అంచనా వేశారు. ఈ వరదల నీటి ప్రవాహానికి మూడు జిల్లాలో కనీసం 14 కరకట్టలు దెబ్బతిన్నాయి. ఇక 14 జిల్లాల్లోని 213 ప్రాంతాల్లో మౌలిక సదుపాయాలకు నష్టం వాటిల్లినట్లు అధికారులు పేర్కొన్నారు. ఈ నేపథ్యంలో భారత వాతావరణ శాఖ ఆదివారం వరకు అస్సాంలోని వరద ప్రభావిత ప్రాంతాలకు ఎల్లో అలర్ట్ జారీ చేసింది. ప్రస్తుతం ఆ రాష్ట్రంలో బ్రహ్మపుత్ర, మానస్, పుతిమరి, పగ్లాదియ నదులన్నీ ప్రమాదస్థాయిని మించి ప్రవహిస్తున్నాయి.

పీఈసెట్‌లో 1,707 మంది ఉత్తీర్ణత

బీపీఈడీలో 1,660 సీట్లు, 1,153 మంది అర్హత

- డీపీఈడీలో 350 సీట్లు, 554 మంది ఉత్తీర్ణత
- ఫలితాలను విడుదల చేసిన ఉన్నత విద్యామండలి చైర్మెన్ లింబాద్రి

నవతెలంగాణ బ్యూరో - హైదరాబాద్

ప్రస్తుత విద్యాసంవత్సరం (2023-24)లో రాష్ట్రంలో బీపీఈడీ, డీపీఈడీ కోర్సుల్లో ప్రవేశాల కోసం నిర్వహించిన ఫిజికల్ ఎడ్యుకేషన్ కామన్ ఎంట్రెన్స్ టెస్ట్ (పీఈసెట్) ఫలితాలను శనివారం హైదరాబాద్‌లో ఉన్నత విద్యామండలి చైర్మెన్ ఆర్ లింబాద్రి విడుదల చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ పీఈసెట్‌కు 2,865 మంది దరఖాస్తు చేశారని, 1,769 మంది అభ్యర్థులు పరీక్ష రాశారని చెప్పారు. వారిలో 1,707 (96.50 శాతం) మంది ఉత్తీర్ణత సాధించారని వివరించారు. ఇందులో 1,664 మంది అబ్బాయిలు దరఖాస్తు చేయగా, 1,030 మంది పరీక్షకు హాజరయ్యారని అన్నారు. వారిలో 997 (96.80 శాతం) మంది ఉత్తీర్ణత పొందారని చెప్పారు. 1,201 మంది అమ్మాయిలు దరఖాస్తు చేస్తే, 739 మంది పరీక్ష రాశారని అన్నారు. వారిలో 710 (96.08 శాతం) మంది ఉత్తీర్ణులయ్యారని వివరించారు. అయితే బ్యాచులర్ ఆఫ్ ఫిజికల్ ఎడ్యుకేషన్ (బీపీఈడీ) కోర్సుకు చెందిన 16 కాలేజీల్లో 1,660 సీట్లున్నాయని చెప్పారు. బీపీఈడీలో 1,153 మంది అర్హత సాధించారని అన్నారు. అందరూ ప్రవేశాలు పొందినా 507 సీట్లు మిగులుతాయని అన్నారు. డిప్లొమా ఆఫ్ ఫిజికల్ ఎడ్యుకేషన్ (డీపీఈడీ) కోర్సుకు సంబంధించి నాలుగు కాలేజీల్లో 350 సీట్లున్నాయని వివరించారు. డీపీఈడీలో 554 మంది ఉత్తీర్ణత పొందారని చెప్పారు. బీపీఈడీలో జనగామకు చెందిన గుర్రం దేవ మొదటి ర్యాంకు, రంగారెడ్డికి చెందిన కేలావత్ భారతి రెండో ర్యాంకు, జయశంకర్ భూపాలపల్లికి చెందిన బానాల జగదీశ్ మూడో ర్యాంకు, వరంగల్ రూరల్‌కు చెందిన బల్లె హరీశ్ నాలుగో ర్యాంకు, నల్లగొండకు చెందిన గొర్ల లోకేశ్వరి ఐదో ర్యాంకు సాధించారని వివరించారు. డీపీఈడీలో నల్లగొండకు చెందిన నారిమళ్ల ప్రవళిక ప్రథమ ర్యాంకు, భద్రాద్రి కొత్తగూడెంకు చెందిన ఊకే సంధ్య రెండో ర్యాంకు, జనగామకు చెందిన చెరిపెల్లి కీర్తన మూడో ర్యాంకు, మహబూబాబాద్‌కు చెందిన అర్వపల్లి సుస్మిత నాలుగో ర్యాంకు, జయశంకర్ భూపాలపల్లికి చెందిన జటోత్ ఐశ్వర్య ఐదో ర్యాంకు పొందారని చెప్పారు. ఉన్నత విద్యామండలి వైస్ చైర్మెన్ వి వెంకటరమణ మాట్లాడుతూ పాఠశాలల్లో పీఈటీలు తప్పనిసరిగా ఉండాలని అన్నారు. వారి అవసరాన్ని రాష్ట్ర ప్రభుత్వానికి వివరించాలని సూచించారు. ఈ కార్యక్రమంలో శాతవాహన వర్సిటీ వీసీ ఎస్ మల్లేష్, ఉన్నత విద్యామండలి కార్యదర్శి ఎన్ శ్రీనివాసరావు, ఎడ్‌సెట్ కన్వీనర్ రామకృష్ణ, పీఈసెట్ కన్వీనర్ రాజేష్‌కుమార్, మాజీ కన్వీనర్ వి సత్యనారాయణ తదితరులు పాల్గొన్నారు.

పీఈసెట్ ఉత్తీర్ణత వివరాలు

కోర్సు	అభ్యర్థుల హాజరు			ఉత్తీర్ణత		
	అబ్బాయిలు	అమ్మాయిలు	మొత్తం	అబ్బాయిలు	అమ్మాయిలు	మొత్తం
బీపీఈడీ	664	529	1,193	642	511	1,153
డీపీఈడీ	366	210	576	355	199	554
మొత్తం	1,030	739	1,769	997	710	1,707

టీఎస్ఎంసీ చైర్మెన్‌తో వైద్యసంఘాల ప్రతినిధుల చర్చ

త్వరలో ఎన్నికల నోటిఫికేషన్

నవతెలంగాణ బ్యూరో - హైదరాబాద్

త్వరలో తెలంగాణ స్టేట్ మెడికల్ కౌన్సిల్ (టీఎస్ఎంసీ) ఎన్నికల ప్రక్రియ ప్రారంభం కానుంది. తెలంగాణ ఆవిర్భావం తర్వాత తొలిసారిగా నిర్వహించనున్నఈ ఎన్నికల కోసం కసరత్తు ఇప్పటికే ఆరంభమైంది. శనివారం హైదరాబాద్‌లోని సరోజినీ దేవి కంటి ఆస్పత్రి ప్రాంగణంలో టీఎస్ఎంసీ చైర్మెన్ రాజలింగం వివిధ వైద్యుల సంఘాల ప్రతినిధులతో సమావేశమై దీనికి సంబంధించిన విషయాలపై చర్చించారు. 16 అసోసియేషన్ల నుంచి 42 మంది హాజరై పలు సూచనలు చేసినట్టు ఆయన తెలిపారు. ఉమ్మడి ఆంధ్రప్రదేశ్‌లో చివరిసారిగా జరిగిన ఎన్నికలను బ్యాలెట్ పద్ధతిలో నిర్వహించారు. గతంలో సర్టిఫికేట్ ఆఫ్ పోస్టింగ్‌కు అవకాశముండేది. ప్రస్తుతం దాన్ని తొలగించినట్టు రాజలింగం వివరించారు. దాదాపు 50 వేల మందికి ఆ విధానంలో పోస్టల్ పంపడమనేది ఖర్చుతో కూడుకున్నదని చెప్పారు. దానికి చాలా సమయం పడుతుందని చెప్పారు. మెజారిటీ ప్రతినిధులు ఆన్‌లైన్ ఓటింగ్ ను కోరారనీ, ఈ విషయంపై ప్రభుత్వానికి అనుమతి కోసం రాయనున్నట్టు చెప్పారు. నామినేషన్ డేట్, ఓటు వేసేందుకు రిజిస్టర్ అయిన కట్ ఆఫ్ డేట్ తదితర విషయాలపై ఈ సమావేశంలో చర్చించారు. టీఎస్ఎంసీ వద్ద ఇప్పటికే 55 వేల మంది ఓటర్లుగా నమోదై ఉన్నారు. ఉమ్మడి ఆంధ్రప్రదేశ్‌లో తెలంగాణ నుంచి 30 వేల మంది ఉండగా, తెలంగాణ ఆవిర్భావం తర్వాత మరో 25 వేల మంది నమోదు చేసుకున్నారు. ఎన్నికలను నిర్వహించనున్న నేపథ్యంలో రెన్యూవల్ చేసుకునేందుకు అవకాశం కల్పించాలని ఎక్కువ మంది సభ్యులు కోరినట్టు తెలుస్తున్నది. కౌన్సిల్‌లో ఇప్పటికే చైర్మెన్‌తో పాటు ఆరుగురు ప్రభుత్వ నామినేటెడ్ సభ్యులు, ఇద్దరు యూనివర్సిటీ నామినేట్ చేసిన సభ్యులు, మరో నలుగురు ఎక్స్‌అఫిషియో సభ్యులు మొత్తం 12 మంది ఉన్నారు. వీరు కాకుండా ఎన్నికల ద్వారా మరో 13 మందిని ఎన్నుకోవాల్సి ఉంటుంది. శనివారం నాటి సమావేశంలో టీఎస్ఎంసీ రిజిస్ట్రార్ హనుమంత రావు, సభ్యులు డాక్టర్ శేషు, డాక్టర్ క్రిష్టారెడ్డి, డాక్టర్ ఎస్.కె.అగర్వాల్ తదితరులు పాల్గొన్నారు.

బంధం మరింత బలోపేతం !

- ఈజిప్ట్ పర్యటనకు కైరో చేరుకున్న మోడీ

కైరో : అమెరికాలో నాలుగు రోజులు పర్యటన ముగించుకున్న ప్రధాని నరేంద్ర మోడీ ఈజిప్ట్‌లో రెండు రోజుల పర్యటన నిమిత్తం శనివారం కైరో చేరుకున్నారు. ఈజిప్ట్ ప్రధాని ముస్తఫా మద్బులీ విమానాశ్రయంలో మోడీకి స్వాగతం పలికారు. అనంతరం సైనిక గౌరవ వందనాన్ని స్వీకరించారు. ఆదివారం ఈజిప్ట్ అధ్యక్షుడు అబ్దుల్ ఫతా ఎల్ సిసితో మోడీ భేటీ అవుతారు. ఇతర నేతలు, ప్రముఖులతో కూడా మోడీ చర్చలు జరుపుతారు.

అలాగే ఈజిప్ట్‌లోని భారతీయులను కూడా కలుసుకుంటారని విదేశాంగ కార్యాలయం ఒక ప్రకటనలో తెలిపింది. ప్రాచీన వాణిజ్యం, ఆర్థిక సంబంధాలు, సాంస్కృతిక, ప్రజా సంబంధాల ప్రాతిపదికన ఇరుదేశాల సంబంధాలు అభివృద్ధి చెందుతున్నాయని ఆ ప్రకటన పేర్కొంది. ఈ పర్యటనతో ఇరు దేశాల మధ్య ద్వైపాక్షిక సంబంధాలు మరింత బలోపేతమవుతాయని భావిస్తున్నారు. ఈజిప్ట్‌తో భారత్‌కు గల బహుముఖ సంబంధాలు ఈ ఏడాది వ్యూహాత్మక భాగస్వామ్యం స్థాయికి చేరాయని ఈజిప్ట్‌లో భారత రాయబారి వ్యాఖ్యానించారు. తాజాగా మోడీ జరుపుతున్న పర్యటనతో ద్వైపాక్షిక సంబంధాలకు మరింత ప్రేరణ కలుగుతుందని అన్నారు. ఈజిప్ట్‌లో మోడీ మొదటి అధికారి పర్యటన ఇది. 26ఏళ్ళ తర్వాత భారత ప్రధాని ఈజిప్ట్‌లో పర్యటించడం ఇదే మొదటిసారి.

ఆఫ్రికా ఖండంలో భారత్‌కు గల కీలకమైన వాణిజ్య భాగస్వాముల్లో ఒకటైన ఈజిప్ట్‌లో తాజాగా మోడీ జరిపే పర్యటన ప్రాధాన్యత సంతరించుకుంది. ఈ ఏడాది భారత రిపబ్లిక్ దినోత్సవాలకు ముఖ్య అతిథిగా విచ్చేసిన ఈజిప్ట్ అధ్యక్షుడు అబ్దుల్ ఫత్తా ఎల్ సిసి ఆహ్వానం మేరకు మోడీ పర్యటిస్తున్నారు. ఈ పర్యటనా సమయంలో మోడీ హెలిపోలిస్ వార్ గ్రేవ్ సిమెట్రీని సందర్శిస్తారు. మొదటి ప్రపంచ యుద్ధంలో ఈజిప్ట్ కోసం పోరాడి అశువులు బాసిన భారత సైనికులకు నివాళులు అర్పిస్తారు. దావూదీ బోరా కమ్యూనిటీ సాయంతో పునరుద్ధరణ పనులు చేపట్టిన 11వ శతాబ్దం నాటి అల్‌హకీమ్ మసీదును ఆదివారం మోడీ సందర్శిస్తారు.

15న బ్రిస్‌బేన్‌లో బోనాలు

ఎమ్మెల్సీ కవిత పోస్టర్ ఆవిష్కరణ

నవతెలంగాణ-హైదరాబాద్‌బ్యూరో

ఆస్ట్రేలియాలోని బ్రిస్‌బేన్‌లో జులై 15న భారత జాగృతి ఆధ్వర్యంలో బోనాల ఉత్సవాలు నిర్వహిస్తున్నట్టు ఎమ్మెల్సీ కే కవిత తెలిపారు. శనివారం నాడామె దీనికి సంబంధించిన వాల్ పోస్టర్‌ను ఆవిష్కరించారు. ఈ సందర్భంగా అక్కడి తెలంగాణ వారికి శుభాకాంక్షలు తెలిపారు. ఈ కార్యక్రమానికి బ్రిస్ బేన్ తెలంగాణ అసోసియేషన్, క్వీన్స్ ల్యాండ్ తెలుగు , తెలుగు అసోసియేషన్ ఆఫ్ గోల్డ్ కోస్ట్, ఇండియన్ కౌన్సిల్ ఆఫ్ ఆస్ట్రేలియా మద్దతు తెలిపాయి.

గురునానక్, శ్రీనిధి యాజమాన్యాలపై
క్రిమినల్ కేసులు నమోదు చేయాలి

- విద్యార్థులు నష్టపోకుండా ప్రత్యామ్నాయ చర్యలు చేపట్టాలి
- ఉన్నత విద్యామండలి చైర్మెన్ లింబాద్రికి ఎస్ఎఫ్ఐ వినతి

నవతెలంగాణ బ్యూరో - హైదరాబాద్

ప్రయివేట్ విశ్వవిద్యాలయాలుగా ఉండి రాష్ట్ర ప్రభుత్వం గెజిట్ విడుదల చేయకుండా, అనుమతులు రాకుండానే విద్యార్థులను చేర్పించుకుని వారి జీవితాలతో చెలగాటమాడుతున్న గురునానక్, శ్రీనిధి వర్సిటీల యాజమాన్యాలపై క్రిమినల్ కేసులు నమోదు చేయాలని భారత విద్యార్థి ఫెడరేషన్ (ఎస్ఎఫ్ఐ) రాష్ట్ర కమిటీ డిమాండ్ చేసింది. ఈ మేరకు ఉన్నత విద్యామండలి చైర్మెన్ ఆర్ లింబాద్రిని శనివారం హైదరాబాద్‌లో ఆ సంఘం రాష్ట్ర అధ్యక్షులు ఆర్ఎల్ మూర్తి, కార్యదర్శి టి నాగరాజు నేతృత్వంలో కలిసి వినతిపత్రం అందజేశారు. గురునానక్, శ్రీనిధి కళాశాలలకు ప్రయివేటు విశ్వవిద్యాలయం అనుమతి రాకముందే అడ్మిషన్లు చేసి, విస్తృతంగా ప్రచారం చేసి వేలాది మంది విద్యార్థులను చేర్చుకున్నాయని తెలిపారు. ఈ



సందర్భంగా ప్రవేశాలు చేపట్టకూడదంటూ రాష్ట్ర ప్రభుత్వం ప్రకటించలేదని గుర్తు చేశారు. ఇప్పుడు అనుమతి రాకపోవడంతో విద్యార్థులు, తల్లిదండ్రులు మోసపోయామంటూ ఆందోళన చేస్తున్నారని తెలిపారు. అయినా ప్రభుత్వం జోక్యం చేసుకోవడం లేదని విమర్శించారు. తక్షణమే ఈ అంశంపై ప్రభుత్వం జోక్యం చేసుకోవాలని డిమాండ్ చేశారు. విద్యార్థులు విద్యాసంవత్సరాన్ని కోల్పోకుండా చదువులు నష్టపోకుండా ప్రత్యామ్నాయ చర్యలు చేపట్టాలని సూచించారు. జేఎన్టీయూ హైదరాబాద్‌కు అనుబంధంగా ఉన్న కాలేజీల్లోనైనా విద్యార్థులను చేర్పించాలని కోరారు. వారు కట్టిన ఫీజులను వెనక్కి ఇవ్వాలని తెలిపారు. లేదంటే ఎస్ఎఫ్ఐ ఆధ్వర్యంలో ఆందోళన చేస్తామని హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో ఉన్నత విద్యామండలి వైస్ చైర్మెన్ వి వెంకటరమణ, ఎస్ఎఫ్ఐ రాష్ట్ర ఉపాధ్యక్షులు బి శంకర్, ఆర్ సంతోష్, సహాయ కార్యదర్శి కె అశోక్ రెడ్డి, రాష్ట్ర కమిటీ సభ్యులు బి వెంకట్, నాయకులు లిఖిత్ తదితరులు పాల్గొన్నారు.

కఠిన చర్యలు తీసుకోవాలి : పీడీఎస్‌యూ

అనుమతి లేకుండా అడ్మిషన్లు చేపట్టిన గురునానక్, శ్రీనిధి యాజమాన్యాలపై కఠిన చర్యలు తీసుకోవాలని పీడీఎస్‌యూ రాష్ట్ర అధ్యక్షులు మామిడికాయల పరశురాం, ప్రధాన కార్యదర్శి ఇడంపాక విజయ్‌కన్నా డిమాండ్ చేశారు. విద్యార్థుల జీవితాలను కాపాడాలని రాష్ట్ర ప్రభుత్వాన్ని కోరారు. ఇంకా ఎందుకు అనుమతి లేదంటూ విద్యార్థులు, తల్లిదండ్రులు ప్రశ్నిస్తే పోలీసులతో బెదిరించడం, అక్రమంగా అరెస్టు చేయించడం దారుణమని తెలిపారు. వాటిపై చర్యలు తీసుకోకుండా నోటీసులిచ్చి చేతులు దులుపేసుకోవడం ప్రభుత్వ చేతగానితనానికి నిదర్శనమని విమర్శించారు. విద్యార్థులకు న్యాయం చేయకుంటే ఆందోళనా కార్యక్రమాలను చేపడతామని హెచ్చరించారు.

బీహార్‌లో కూలిన మరో వంతెన

పాట్నా:బీహార్‌లో శనివారం మరో వంతెన కూలిపోయింది. బీహార్‌లోని కతిహార్, కిషన్‌గంజ్ జిల్లాలను కలిపే ఈ వంతెన శనివారం కూలిపోయినట్టు అధికారులు వెల్లడించారు. ఈ వంతెన మేచి నదిపై నేషనల్ హైవే గోరి గ్రామం సమీపంలో నిర్మించబడింది. ఈ బ్రిడ్జిని జీఆర్ ఇన్‌ఫ్రా లిమిటెడ్ అనే కంపెనీ నిర్మించింది. స్తంభాలు పాడైపోవడంతో బ్రిడ్జి కూలిపోయింది. ఈ ఘటనలో ఆరు పిల్లర్స్ నదిలో మునిగిపోయాయి. దీంతో బ్రిడ్జిపై వాహనాల రాకపోకల్ని జిల్లా యంత్రాంగం నిలిపివేసింది. వంతెనపై వెళ్లే వాహనదారుల్ని అడ్డుకునేందుకు బ్రిడ్జికిరువైపులా పోలీసు అధికారులు మోహరించారు.

కాగా, బీహార్‌లో బాగల్‌పూర్‌లో రూ. 1700 కోట్లకు పైగా నిధులతో నిర్మించిన నాలుగులైన్ల వంతెనను జూన్ 4వ తేదీన నిర్మాణ లోపాల కారణంతో అధికారులు కూల్చివేశారు. ఈ ఘటనపై నితీష్‌కుమార్ ప్రభుత్వంపై బిజెపి విమర్శలు గుప్పించిన సంగతి తెలిసిందే.

వారిది రహస్య ఎజెండా

- మోడీ, షా అందుకే జోక్యం చేసుకోలేదు
- మణిపూర్ హింసపై ఆ రాష్ట్ర మాజీ సీఎం ఇబోబి సింగ్ ఆసక్తికర వ్యాఖ్యలు

న్యూఢిల్లీ : ఈశాన్య రాష్ట్రం మణిపూర్ హింస విషయంలో ప్రధాని మోడీ, కేంద్ర హెూం మంత్రి అమిత్ షాలపై ఆ రాష్ట్ర మాజీ సీఎం, కాంగ్రెస్ సీనియర్ నాయకులు ఇబోబి సింగ్ ఆసక్తికర వ్యాఖ్యలు చేశారు. మోడీ, షాలకు రహస్య ఎజెండా ఉన్నదనీ, ఈ కారణంగానే వారు మణిపూర్ హింసపై జోక్యం చేసుకోలేదని చెప్పారు. దీంతో ఇబోబి సింగ్ వ్యాఖ్యలు రాజకీయంగా చర్చనీయాంశమయ్యాయి. ఒక ఇంటర్వ్యూలో ఆయన ఈ వ్యాఖ్యలు చేశారు. 'ఒకవేళ మణిపూర్ భారత్‌లో భాగం అనుకుంటే, అక్కడ సమస్య ఉంటే.. కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు రెండూ బాధ్యత వహించాలి. జాతి హింసను వారు వెంటనే ఎందుకు ఆపలేదు. రహస్య అజెండా ఏమైనా ఉన్నదా?' అని ఆయన ప్రశ్నించారు. ప్రముఖ రాజకీయ నాయకుడైన ఇబోబి సింగ్.. మణిపూర్ ముఖ్యమంత్రిగా 2002 నుంచి 2017 మధ్య పని చేశారు.

మణిపూర్‌లో హింసపై ప్రధాని మోడీ మౌనాన్ని ఇబోబి సింగ్ ప్రశ్నిస్తున్నారు. హింసపై రాష్ట్రంలో కాంగ్రెస్‌తో పాటు పది ప్రతిపక్ష పార్టీల నాయకుల బృందంతో మోడీని కలవడానికి ఆయన యత్నించారు. కానీ మోడీ మాత్రం ప్రతినిధి బృందం అభ్యర్థనను పరిగణలోకి తీసుకోకుండానే అమెరికా పర్యటనకు వెళ్లిన విషయం విదితమే. 'ఆయన (మోడీ) ఎందుకు మౌనంగా ఉన్నారని ప్రతి ఒక్కరూ ప్రశ్నిస్తున్నారు. 50 రోజులలో ఆయన ఏమీ మాట్లాడలేదు. సమస్యపై కలిసి మాట్లాడేందుకు ఎమ్మెల్యేలు, రాజకీయ పార్టీ సభ్యుల అభ్యర్థనను వినేందుకు ఆయన పది, పదిహేను నిమిషాలు కూడా కేటాయించలేదు. నేనే వారం పాటు ఎదురు చూశాను' అని ఇబోబి సింగ్ అన్నారు.

ఎస్టీ హెూదాను కల్పించే అంశంపై మెయిటీ సామాజిక వర్గం డిమాండ్ చేస్తుండగా, కుకీ తెగ దీనిని వ్యతిరేకిస్తున్నది. ఈ విషయంపై గతనెల 3 నుంచి రాష్ట్రంలో అల్లర్లు కొనసాగుతున్న విషయం తెలిసిందే. ఈ అల్లర్లలో రాష్ట్రంలో దాదాపు వంది మంది మరణించారు. 300 మందికి పైగా గాయాలపాలయ్యారు. 50 వేల మందికి పైగా ప్రజలు తమ ఇండ్లను విడిచి పెట్టాల్సిన పరిస్థితులు ఏర్పడ్డాయి.

మంత్రి గోడౌన్‌కు నిప్పు

- తూర్పు ఇంఫాల్‌లో ఘటన
- మణిపూర్‌లో ఇంకా అదుపులోకి రాని పరిస్థితులు

ఇంఫాల్ : మణిపూర్‌లో అధికార బీజేపీ నాయకులే లక్ష్యంగా నిరసనకారులు చేస్తున్న దాడులు ఆగటం లేదు. ప్రస్తుతం ఇదే పరిస్థితి ఆ రాష్ట్ర ప్రజారోగ్య ఇంజినీరింగ్ మరియు వినియోగదారుల వ్యవహారాల మంత్రి ఎల్. సుసింద్రో మెయిటీకి ఎదురైంది. మంత్రికి చెందిన రెండు ప్రయివేటు గోడౌన్‌లకు మూక నిప్పు పెట్టింది. తూర్పు ఇంఫాల్‌లో శుక్రవారం రాత్రి ఈ ఘటన చోటు చేసుకున్నది. ఇటు జిల్లాలోని ఖురాయ్ ప్రాంతంలో బీజేపీ నాయకుడి ఇంటికి కూడా నిప్పు పెట్టే ప్రయత్నమూ జరిగింది. అయితే, భద్రతా బలగాలు దానిని నిరోధించాయి. మూకను చెదరగొట్టడానికి అనేక రౌండ్ల టియర్ గ్యాస్ షెల్స్‌ను ప్రయోగించాయి. మణిపూర్‌లో పరిస్థితిపై చర్చించటానికి అఖిలపక్ష సమావేశానికి కేంద్ర హెూం మంత్రి అమిత్ షా పిలుపునిచ్చిన ముందు రోజే.. మంత్రి ఆస్తులపై దాడి ఘటన చోటు చేసుకోవటం గమనార్హం. మణిపూర్‌లో ఇప్పటికే పలువురు ప్రజాప్రతినిధులు, రాజకీయ నాయకుల ఇండ్లపై ఆగ్రహంతో ఉన్న మూకలు దాడులు జరిపాయి. ఇందులో కేంద్ర మంత్రి ఆర్కే రంజన్ సింగ్, రాష్ట్ర మంత్రులు నెమ్చా కిప్‌గెన్, గోవిందాస్ కొంతౌజమ్, ఎమ్మెల్యేలు రఘుమణి సింగ్, రంజిత్ సింగ్, ఎస్ కెబి దేవి ల ఇండ్లు, ఆస్తులు ఉన్నాయి. రాష్ట్రంలోని హింసాత్మక పరిస్థితులకు బీజేపీ వైఖరే కారణమని అక్కడి ప్రజల్లో, నిరసనకారుల్లో ఉన్నది. మణిపూర్‌లో హింసాత్మక పరిస్థితులను నియంత్రించడానికి సరైన చర్యలు తీసుకోవటం లేదని ప్రధాని మోడీ, కేంద్రం, రాష్ట్రంలో అధికారంలో ఉన్న బీజేపీ తీరును పలు ప్రతిపక్ష పార్టీలు, ప్రజా సంఘాలు సైతం విమర్శిస్తున్నాయి.

27న హెలెన్ కెల్లర్ జయంతి : ఎన్‌పీఆర్‌డీ



నవతెలంగాణ బ్యూరో-హైదరాబాద్

తమ సంఘం ఆధ్వర్యంలో ఈ నెల 27న హెలన్ కెల్లర్ జయంతిని నిర్వహించనున్నట్టు వికలాంగుల హక్కుల జాతీయ వేదిక(ఎన్‌పీఆర్‌డీ) రాష్ట్ర అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు కె వెంకట్, ఎం అడివయ్య శనివారం ఒక ప్రకటనలో తెలిపారు. ఆయన 143వ జయంతి సందర్భంగా 'వినికిడి లోపం, ఆటిజం మానసిక వైకల్యం- తీసుకోవాల్సిన జాగ్రత్తలు' అంశంపై హైదరాబాద్‌లోని సుందరయ్య విజ్ఞాన కేంద్రంలో స్మారక సెమినార్‌ను నిర్వహిస్తున్నామని పేర్కొన్నారు. హెలెన్ కెల్లర్ విద్యా సంస్థల చైర్మెన్ పి ఉమ్మర్ ఖాన్, ఎన్‌పీఆర్‌డీ సంయుక్తంగా ఈ కార్యక్రమాన్ని నిర్వహిస్తున్నట్టు పేర్కొన్నారు. సంబంధిత పోస్టర్‌ను వారు ఆవిష్కరించారు. సెమినార్‌ను ఉమ్మార్‌ఖాన్ ప్రారంభిస్తారని తెలిపారు. ఆటిజంపై అసోసియేటెడ్ ప్రొఫెసర్ సుసన్, మానసిక వైకల్యంపై డాక్టర్ శ్రీపూజ సిద్ధం సెట్టి, వినికిడి లోపంపై ఇమద్‌ఖాన్ రుమాని ప్రసంగిస్తారని పేర్కొన్నారు. అతిథులుగా టీఎస్ఎల్‌పీఏ రాష్ట్ర అధ్యక్షులు నాగేందర్ కంకిపాటి, సిమన్ డైరెక్టర్ సరిత హాజరవుతారని తెలిపారు.

26న మీటింగ్‌కు రండి

- ఆర్టీసీ కార్మిక సంఘాలకు అశ్వత్థామరెడ్డి విజ్ఞప్తి

నవతెలంగాణ-హైదరాబాద్‌బ్యూరో

టీఎస్ఆర్టీసీలో కార్మికుల సమస్యల పరిష్కారం కోసం ఐక్య పోరాటాలు చేపట్టేందుకు సంస్థలోని అన్ని కార్మిక సంఘాలు కలిసిరావాలని టీఎంయూ గౌరవాధ్యక్షులు, ఇంచార్జి ప్రధాన కార్యదర్శి ఈ అశ్వత్థామరెడ్డి విజ్ఞప్తి చేశారు. ఐక్య కార్యాచరణ కోసం గతంలో జరిగిన సమావేశాల్లో కొన్ని సంఘాల ప్రధాన కార్యదర్శులు పాల్గొన లేదనీ, ఈనెల 26వ తేదీ సాయంత్రం 5 గంట లకు సుందరయ్య విజ్ఞాన కేంద్రంలో జరిగే సమావేశానికి వారంతా రావాలని కోరారు. విశాల దృక్పథం తో సంస్థలోని కార్మిక సంఘాలన్నీ సానుకూలంగా స్పందించాలని చెప్పారు.

ఆప్టా సభలకు రండి

నవతెలంగాణ-హైదరాబాద్‌బ్యూరో

అమెరికన్ ప్రోగ్రెసివ్ తెలుగు అసోసియేషన్ (ఆప్టా) ఆధ్వర్యంలో సెప్టెంబర్ 1 నుంచి 3వ తేదీ వరకు అట్లాంటాలో జరిగే సదస్సుకు హాజరవ్వాలని బీఆర్ఎస్ పార్లమెంటరీ పార్టీ నేత కే కేశవరావు, మంత్రి గంగుల కమలాకర్, పార్లమెంటు సభ్యులు వద్దిరాజు రవిచంద్రలను ఆహ్వానించారు. ఈ మేరకు శనివారం ఆప్టా అధ్యక్షులు కొట్టే ఉదయభాస్కర్ తరపున మాజీ అధ్యక్షులు గుడపాటి గోపాల్ వారి నివాసాలకు వెళ్లి ఆహ్వానపత్రికలు అందచేశారు. ఆయన వెంట ప్రముఖ వ్యాపారవేత్త మరికల్ పోత సుధీర్‌కుమార్, డాక్టర్ సెట్లం రంగయ్య ఉన్నారు. ఈ సదస్సుకు అమెరికాలో స్థిరపడిన తెలుగు కుటుంబాలు, ఆంధ్రప్రదేశ్, తెలంగాణ రాష్ట్రాలకు చెందిన పలువురు ప్రజాప్రతినిధులు,వివిధ రంగాల ప్రముఖులు హాజరవుతారని ఈ సందర్భంగా ఆయన తెలిపారు.

నీళ్ల పులుసు, పప్పుచారు

అక్షయ పాత్ర ఆధీనంలో మధ్యాహ్న భోజనం

- రంగారెడ్డి జిల్లాలో 190 బడులు అప్పగింత
- విద్యుత్ మిషన్లతో భోజనం తయారీ చేస్తున్న సంస్థ
- అన్నం తినలేకపోతున్నామని విద్యార్థుల ఆవేదన
- విద్యార్థులకు పోషకాలు దూరం. గుడ్డు కూడా పెట్టని పరిస్థితి
- మధ్యాహ్న భోజన కార్మికులకే అప్పగించాలని డిమాండ్

'సద్ది బువ్వ.. మెత్తబడ్డ బువ్వలో నీళ్ల చారు.. ఇది తినేదెట్లా.. పొద్దున్నే బడికొచ్చే మాకు మధ్యాహ్నం గీ బువ్వ పెడితే మా కడుపెట్లా నిండేది.. ఇంతకు ముందు మధ్నాహ్న భోజన కార్మికులు మా స్కూల్లోనే వండేది.. ఉడుకుడుకు బువ్వ పెట్టేది. ఆ బువ్వ మంచిగుండే.. గిప్పుడేమో గా అక్షయపాత్రకు అప్పగించిండ్రు.. గాళ్లుపొద్దుగాళ్ల ఎక్కడో వండిన దాన్ని మా స్కూళ్లకు తెచ్చి మధ్యాహ్నం పెడుతుండ్రు.. వారంలో రెండు, మూడు సార్లు పెట్టే గుడ్డు కూడా పెడుతలేరు.. గీ బువ్వ మాకొద్దు.. ఇంతకుముందు పెట్టిన బువ్వే మాకు కావాలి' అని ప్రభుత్వ పాఠశాలల విద్యార్థులు అంటున్నారు. ప్రభుత్వ పాఠశాలలో మధ్యాహ్న భోజన పథకాన్ని అక్షయ పాత్రకు అప్పగించడంతో విద్యార్థులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. మధ్యాహ్న భోజన పథకాన్ని అక్షయ పాత్రకు అప్పగించడం పట్ల వ్యతిరేకత, విద్యార్థుల అవస్థలపై కథనం.



నవతెలంగాణ- రంగారెడ్డి ప్రాంతీయ ప్రతినిధి

ఉమ్మడి రంగారెడ్డి జిల్లాలో 2,370 ప్రభుత్వ పాఠశాలలు ఉన్నాయి. ఇందులో 2.50 లక్షల మంది విద్యార్థులు చదువుతున్నారు. రంగారెడ్డిలో 1,338 ప్రభుత్వ పాఠశాల్లో 1.60 లక్షల మంది, వికారాబాద్ జిల్లాలో 1032 ప్రభుత్వ పాఠశాలల్లో 90 వేల మంది విద్యార్థులు చదువుతున్నారు. వీరందరికీ మధ్యాహ్న భోజన పథకం ద్వారా భోజనం అందుతోంది. ప్రభుత్వ పాఠశాలలో చదువుతున్న పేద, మధ్యతరగతి పిల్లలకు పౌష్టి కాహారం అందించేందుకు నాటి కేంద్ర ప్రభుత్వం 2003లో న్యూట్రీషన్ సపోర్ట్ పథకం కింద మధ్యాహ్న భోజన పథకాన్ని అమలు చేస్తోంది. దీన్ని 2008లో ప్రైమరీ నుంచి హైస్కూల్ వరకు విస్తరించారు. ప్రస్తుతం దీని అమలుపై నీలినీడలు అలుముకుంటున్నాయి. బాధ్య తల నుంచి తప్పుకునేందుకు ప్రభు త్వాలు ప్రయత్నిస్తున్నాయి. బీజేపీ పాలిత రాష్ట్రాల్లో ఈ పథకాన్ని పూర్తి స్థాయిలో స్వచ్ఛంద సంస్థలకు అప్పగిం చింది. ఇదే పద్ధతిలో తెలంగాణలో కూడా మధ్యాహ్న భోజన పథకాన్ని అక్షయ పాత్ర అనే స్వచ్ఛం ద సంస్థకు అప్పగించే క్రమం లో అధికారులు రంగారెడ్డి జిల్లాలో ప్రతి స్కూళ్లలో ప్రయోగిస్తారు.

పౌష్టికాహారం కరువు

అక్షయ పాత్ర సంస్థ విద్యార్థులకు అందించే భోజనంలో ఉల్లిపాయలు, అల్లం వెల్లుల్లి, గుడ్డు లాంటివి ఏమీ ఉండక పోవడంతో పిల్లలకు పౌష్టి కాహారం అందడం లేదు. వారంలో మూడు రోజులు గుడ్డు పెట్టాలని మెనూలో ఉంది. కానీ అక్షయ పాత్ర మాత్రం కేవలం వెజ్ భోజనం మాత్రమే సప్లయ్ చేస్తోంది. దాంతో విద్యార్థులకు పౌష్టికాహారం అందడం లేదు. ఇప్పటికైనా ప్రభుత్వం తన నిర్ణయాన్ని వెనక్కి తీసుకుని, మధ్యాహ్న భోజనాన్ని గతంలో లాగే మధ్యాహ్న భోజన కార్మికులకు అప్పగిం చాలని విద్యార్థులు, వారి తల్లిదండ్రులు కోరుతున్నారు.

190 స్కూల్స్ అక్షయ పాత్రకు అప్పగింత

రంగారెడ్డి జిల్లాలో మొయినాబాద్, శంకర్‌పల్లి, రాజేందర్‌నగర్, శేరిలింగంపల్లి మొత్తం నాలుగు మండలాల్లో 190 ప్రభుత్వ పాఠశాలను అక్షయ పాత్రకు అప్పగిస్తూ ప్రభుత్వం ఆర్డర్ పాస్ చేసింది. 42,454 మంది విద్యార్థులకు మధ్యాహ్న భోజనం అందించే బాధ్యత అప్పగించింది. ఈ యేడు పాఠశాల ప్రారంభం నుంచి అక్షయ పాత్ర విద్యార్థులకు మధ్యాహ్న భోజనం సప్లయ్ చేస్తోంది. అయితే అక్షయ పాత్ర సంస్థకు ఒకే ప్రాంతంలో భోజన తయారీ కేంద్రం ఉంది. ఇక్కడి నుంచే జిల్లా నలుమూలలకు సప్లయ్ చేస్తోంది. భోజనం ఉదయం 4 గంటల నుంచి చేస్తున్నారు. ఇది కూడా మిషన్లతో తయారీ చేయడంతో సుమారు నాలుగు, ఐదు గంటలకు కంటే ఎక్కువగా ఉండదు. కానీ 4 గంటలకు వండిన భోజనాన్ని విద్యార్థులకు మధ్యాహ్నం ఒంటి గంటకు పెట్టే సరికి అన్నం మెత్త బడుతోంది. దాంతో విద్యార్థులు అన్నం తినలేకపోతున్నారు.

పౌష్టికాహారం అందించాలి



విద్యార్థులకు పౌష్టికాహారం అందించాలి. అప్పుడే వండిన వేడి వేడి అన్నం అందించి పిల్లల ఆరోగ్యాన్ని కాపాడాలి. నాణ్యమైన భోజనం అందించాలి. అక్షయ పాత్ర స్వచ్ఛంద సంస్థకు కాకుండా మధ్యాహ్న భోజన కార్మికులకే నిర్వహణ అప్పగించాలి.

- గోపీ నాయక్, యూటీఎఫ్ రంగారెడ్డి జిల్లా అధ్యక్షులు

అన్నం మెత్తబడుతుంది



మధ్యాహ్న జోనం మా స్కూల్‌కు 10 గంటలకు వస్తోంది. మాకు మధ్యాహ్నం ఒంటి గంటకు పెడతారు. అన్నం మెత్తబడుతుంది. తినబుద్ది కావడం లేదు. సద్దన్నం తిన్నట్టే ఉంటుంది. మేం ఇంటి నుంచి బాక్స్ తెచ్చుకుంటున్నాం.

- సైముద్దిన్, 8వ తరగతి విద్యార్థి శివరాంపల్లి హైస్కూల్

గుడ్డు పెట్టడం లేదు



అక్షయ పాత్ర భోజనం పెడుతున్నప్పటి నుంచి గుడ్డు పెట్టడం లేదు. గతంలో మధ్యాహ్న భోజన కార్మికులు భోజనం పెట్టినప్పుడు వారంలో రెండు, మూడుసార్లు గుడ్డు పెట్టేవారు. కూరగాయలు కూడా వారంలో ఒకటి, రెండు రోజులు పెడుతున్నారు. రోజూ పప్పు, సాంబార్‌తో మధ్యాహ్న భోజనం పెడుతున్నారు. గతంలో లాగే భోజనం పెట్టాలి.

- శ్రీకాంత్, 7వ తరగతి విద్యార్థి శివరాంపల్లి హైస్కూల్

మానుకోటపై సైకిల్ జెండా ఎగరాలి

కార్యకర్తలతో కాసాని జ్ఞానేశ్వర్



నవతెలంగాణ-హైదరాబాద్

టీడీపీ నాయకులు, కార్యకర్తలు ఐక్యంగా పనిచేసి ఈసారి మానుకోటలో సైకిల్ జెండాను ఎగురవేయాలని తెలుగుదేశం తెలంగాణ శాఖ అధ్యక్షుడు కాసాని జ్ఞానేశ్వర్ సూచించారు. శనివారం ఎన్టీఆర్‌భవన్‌లో మహబూబాబాద్ అసెంబ్లీ నియోజకవర్గానికి చెందిన ఆయా అనుబంధ సంఘాల నాయకులు జ్ఞానేశ్వర్‌ను కలిశారు. ఈ సందర్భంగా మహబూబాబాద్ పార్లమెంట్ పూర్తిస్థాయి పార్టీ కమిటీని వేసినందుకు ఆయనకు కృతజ్ఞతలు చెప్పారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ మహబూబాబాద్ జిల్లాలో తెలుగుదేశం పార్టీకి మంచి పట్టు ఉందన్నారు. నాయకులు పార్టీ క్యాడర్‌ను ప్రజలకు అనుసంధానం చేసుకొని వారి మద్దతును పొందదానికి కృషి చేయాలన్నారు. టీడీపీ హయాంలోనే గిరిజన ప్రాంత ప్రజలకు అన్ని విధాలా న్యాయం జరిగిందన్నారు. అందుకే ఆ ప్రాంత ప్రజలంతా తెలుగుదేశం వైపు చూస్తున్నారని గుర్తు చేశారు.

అక్కడ అనేక అభివృద్ధి, సంక్షేమ కార్యక్రమాలకు శ్రీకారం చుట్టిన ఘనత చంద్రబాబుకే దక్కుతుందన్నారు. టీటీడీపీ అధ్యక్షుడిని కలిసిన వారిలో ప్రేమ్‌చంద్ వ్యాస్, కె. ఐలయ్య, బొమ్మ వెంకటేశ్వర్లు, ఏషబోయిన ఎల్లయ్య యాదవ్, జి భీమానాయక్, రాంరెడ్డి, రవి గౌడ్ తదితరులు పాల్గొన్నారు.

మోత్కూరు బాలుర గురుకులంలో ఫుడ్ పాయిజన్

- 34 మంది విద్యార్థులకు అస్వస్థత
- పీహెచ్‌సీలో చికిత్స
- విచారణకు ఆదేశించిన కలెక్టర్
- పాఠశాలను సందర్శించిన ఆర్సీవో, డిప్యూటీ డీఎంహెచ్‌వో
- ఫుడ్ శ్యాంపిల్ సేకరించిన ఫుడ్ ఇన్‌స్పెక్టర్





నవతెలంగాణ-మోత్కూరు

యాదాద్రిభువనగిరి జిల్లా మోత్కూరు మున్సిపల్ కేంద్రంలోని తెలంగాణ సోషల్ వెల్ఫేర్ రెసిడెన్షి యల్ బాలుర పాఠశాలలో ఫుడ్ పాయిజన్‌తో 34మంది విద్యార్థులు తీవ్ర అస్వస్థతకు గురయ్యారు. ఈ విషయాన్ని అధికారులు, పాఠశాల సిబ్బంది గోప్యంగా ఉంచడంతో శనివారం మధ్యాహ్నం ఆలస్యంగా బయటకు పొక్కింది. వివరాల్లోకి వెళితే..

మున్సిపల్ కేంద్రంలో రెండు భవనాలను అద్దెకు తీసుకుని పాఠశాల నిర్వహిస్తున్నారు. వడ్డెర కాలనీ వద్ద భవనంలో 8వ తరగతి నుంచి ఇంటర్ ద్వితీయ సంవత్సరం వరకు 263 మంది విద్యార్థులు ఉన్నారు. కొత్త బస్టాండ్ వద్ద మూతపడిన ఎస్ఆర్ జూనియర్ కళాశాల భవనంలో 5వ తరగతి నుంచి 7వ తరగతి వరకు 261 మంది విద్యార్థులు చదువుతున్నారు. శుక్రవారం రాత్రి భోజనం చేసిన 8వ తరగతి నుంచి ఇంటర్ విద్యార్థుల్లో 34 మంది వాంతులు, విరేచనాలు, కడుపు నొప్పితో తీవ్ర అస్వస్థతకు గురయ్యారు. హెల్త్ సూపర్‌వైజర్ మంగమ్మ, ఉపాధ్యాయులు విద్యార్థులను వెంటనే 108లో మోత్కూరులోని ప్రాథమిక ఆరోగ్య కేంద్రానికి తరలించారు. పీహెచ్‌సీ వైద్యాధికారి హేమంత్ కుమార్, డాక్టర్ నిరోశ విద్యార్థులకు సెలైన్లు ఎక్కించి చికిత్స చేశారు. విద్యార్థులంతా కొంతమేర కోలుకోవడంతో ఉదయం వరకు ఆస్పత్రిలోనే ఉంచితే విషయం బయటకు తెలుస్తుందన్న ఉద్దేశంతో శనివారం తెల్లవారుజామున మూడు, నాలుగు గంటల సమయంలోనే అందరినీ తిరిగి పాఠశాలకు తీసుకెళ్లారు. వైద్య సిబ్బంది పర్యవేక్షణలో ఉంచారు. విద్యార్థులు అస్వస్థతకు గురైన విషయాన్ని పాఠశాల ప్రిన్సిపాల్ వెంకటస్వామి కలెక్టర్ పమేలా సత్పతికి తెలియజేయడంతో విచారణకు ఆదేశించారు. గురుకులాల రీజినల్ కోఆర్డినేటర్ రజిని, డీసీవో శ్రీరాం శ్రీనివాస్, డిప్యూటీ డీఎంహెచ్‌వో యశోద, పీవోఎన్సీడీ డాక్టర్ సుమన్ కల్యాణ్ శనివారం పాఠశాలను సందర్శించి విద్యార్థుల ఆరోగ్య పరిస్థితిని అడిగి తెలుసుకున్నారు. శనివారం మధ్యాహ్నం వరకు విద్యార్థులను వైద్య సిబ్బంది పర్యవేక్షణలో ఉంచి చికిత్స చేయడంతో పూర్తిగా కోలుకున్నారు. ఫుడ్ సెక్యూరిటీ ఆఫీసర్ స్వాతి పాఠశాలను సందర్శించి విద్యార్థులకు పెట్టిన భోజనం శాంపిల్స్ సేకరించి నాచారంలోని ల్యాబ్‌కు పంపారు. ఫుడ్ పాయిజన్ కావడంతోనే విద్యార్థులు వాంతులు, విరేచనాలతో తీవ్ర అస్వస్థతకు గురయ్యారని, విద్యార్థులంతా పూర్తిగా కోలుకున్నారని గురుకులాల రీజినల్ కోఆర్డినేటర్ రజిని, పీహెచ్‌సీ వైద్యాధికారి హేమంత్ కుమార్ తెలిపారు.

రోడ్డు ప్రమాదంలో ముగ్గురు మృతి

- లారీని ఢీకొట్టిన బోలెరో వాహనం
- గొర్రెలు అమ్ముకుని తిరిగి స్వగ్రామానికి వస్తుండగా ఘటన





నవతెలంగాణ-షాద్‌నగర్

రంగారెడ్డి జిల్లా షాద్‌నగర్ మున్సిపల్ పరిధిలోని సోలిపూర్ వద్ద శనివారం ఘోర రోడ్డు ప్రమాదం జరిగింది. బోలేరో వాహనం అదుపు తప్పి లారీని ఢీకొట్టింది. ఈ ఘటనలో ముగ్గురు మృతిచెందారు. షాద్‌నగర్ సీఐ నవీన్ కుమార్ తెలిపిన వివరాల ప్రకారం.. వనపర్తి, నాగర్‌కర్నూల్ జిల్లాలకు చెందిన అశోక్(28), శంకర్(32), రవి(30) గొర్రెలు అమ్మడానికి హైదరాబాద్‌కు వచ్చారు. శనివారం ఉదయం గొర్రెలు అమ్ముకుని తిరిగి సొంత ఊర్లకు వెళ్లే క్రమంలో హైదరాబాద్-బెంగళూర్ జాతీయ రహదారిపై వీరు ప్రమాణిస్తున్న బొలెరో వాహనం అదుపుతప్పి డివైడర్‌ను ఢీకొట్టి.. అనంతరం ఎదురుగా వస్తున్న లారీని సైతం ఢీకొట్టింది. ఈ ఘటనలో బొలెరో డ్రైవర్ అశోక్ అక్కడికక్కడే మృతిచెందాడు. తీవ్రంగా గాయపడిన శంకర్‌ను.. షాద్‌నగర్ ప్రభుత్వ ఆస్పత్రికి తరలిస్తుండగా.. రవిని ఉస్మానియా జనరల్ ఆస్పత్రికి తరలిస్తుండగా మృతిచెందారు. కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నట్టు పోలీసులు తెలిపారు. కాగా, మృతులు గొర్రెలు అమ్మగా వచ్చిన రూ.1.92లక్షల నగదు వాహనంలోనే ఉంది. అయితే ముగ్గురూ చనిపోవడంతో డబ్బును అంబులెన్స్ పైలెట్ రమేష్‌యాదవ్, పజిల్ అహ్మద్ పోలీసులకు అప్పగించారు. నిజాయితీగా డబ్బును పోలీసులకు అందజేసిన అంబులెన్స్ సిబ్బందిని పలువురు అభినందించారు.



ఇద్దరు ఎమ్మెల్యేలకు తప్పిన ప్రమాదం

- మంగళూరు హైవేలో చెట్టును కొట్టిన రోహిత్‌రెడ్డి వాహనం
- ఆవును ఢీకొట్టిన రాథోడ్ బాపురావు వాహనం

నవతెలంగాణ-తాండూరు/ నేరడిగొండ

తాండూరు ఎమ్మెల్యే పైలెట్ రోహిత్‌రెడ్డి, బోథ్ నియోజకవర్గ ఎమ్మెల్యే రాథోడ్ బాపురావుకు ప్రమాదం తప్పింది. పైలెట్ వాహనం కర్నాటకలోని ఉడిపి సమీపంలో మంగళూరు హైవే రోడ్డుపై శనివారం ప్రమాదానికి గురైంది. అయితే ఎమ్మెల్యేకు ఎలాంటి ప్రమాదమూ జరగలేదు. వచ్చే నెల మూడో తేదీ నుంచి తాండూరులో ఎమ్మెల్యే యాగం నిర్వహించనున్నారు. ఇందులో భాగంగానే వారం రోజులుగా ఆయన వివిధ పీఠాధిపతులను కలుస్తున్నారు. శనివారం ఎమ్మెల్యే తన సెక్యూరిటీతో కలిసి శృంగేరి పీఠం వెళ్లారు. ఉడిపి సమీపంలో మంగళూరు హైవే రోడ్డుపై ఎమ్మెల్యే వాహనానికి ముందు ఉన్న సెక్యూరిటీ పైలెట్ వాహనం డ్రైవర్ ఆవును తప్పించబోయి సడన్ బ్రేక్ వేశాడు. వెనుకనే ఉన్న ఎమ్మెల్యే వాహనం డ్రైవర్ అది గమనించి పక్కకు తిప్పడంతో చెట్టును ఢీకొట్టాడు. ఎవరికీ ఎలాంటి ప్రమాదమూ జరగలేదు. తనకు ఏమీ కాలేదని, ఎవరూ ఆందోళన చెందాల్సిన అవసరం లేదని మీడియా ద్వారా సమాచారం తెలిపారు.

బోథ్ ఎమ్మెల్యే బాపురావుకు తప్పిన ప్రమాదం

ఆదిలాబాద్ జిల్లా బోథ్ నియోజకవర్గ ఎమ్మెల్యే రాథోడ్ బాపురావు వాహనం ఆవును ఢీకొట్టడంతో ఆయన చేతికి గాయమైంది. శనివారం ఉదయం హైదరాబాద్ నుంచి ఆదిలాబాద్‌కు బయలుదేరారు. మార్గమధ్యలో నేరడిగొండ మండలం కొరటికల్ వద్ద జాతీయ రహదారిపై ఎమ్మెల్యే వాహనానికి ఆవు అడ్డురావడంతో ఢీకొట్టింది. దీంతో ఎమ్మెల్యే చేతివేళ్లకు తీవ్ర గాయాలయ్యాయి. వాహనం ముందు భాగం దెబ్బతింది. ఎమ్మెల్యేను బోథ్‌లోని ఓ ప్రయివేటు ఆస్పత్రికి తరలించి చికిత్స అందించారు. ప్రజాప్రతినిధులు, నియోజకవర్గ నాయకులు, కార్యకర్తలు ఆస్పత్రికి వెళ్లి పరామర్శించారు.

ఉద్యోగాలిప్పిస్తానని కుచ్చు టోపీ

- కోట్ల రూపాయలతో ఉడాయించిన మహిళ
- ఖమ్మం జిల్లా వైరాలో ఘటన



నవతెలంగాణ-వైరా

వైరా, కొణిజర్ల, బోనకల్ మండలాల్లో నిరుద్యోగులకు వలవేసి గురుకుల పాఠశాలలో అటెండర్ పోస్టులు ఇప్పిస్తానని, ముందుగా మా బాస్‌కు లక్షన్నర రూపాయలు, ఉద్యోగం రాగానే మరో లక్షన్నర ఇవ్వాలని మొత్తం రూ.3 లక్షలకు డీల్ కుదుర్చుకుని 70 మంది నుంచి లక్షన్నర చొప్పున కోటి రూపాయలు వసూలు చేసుకుని ఉడాయించిన ఉదంతం ఇది. ఖమ్మం జిల్లా వైరా మండలం రెబ్బవరంలోని మహాత్మా జ్యోతి బా పూలే బీసీ వెల్ఫేర్ గురుకుల పాఠశాలలో అవుట్ సోర్సింగ్ అటెండర్ ఉద్యోగం చేస్తున్న బాజీ జ్యోతి పేద, మధ్యతరగతి కుటుంబాల నిరుద్యోగులకు ఉద్యోగాల ఆశ చూపి నిలువునా ముంచింది. అడ్వాన్స్ చెల్లించిన 15 రోజుల్లో పోస్టింగ్ ఆర్డర్ వస్తుందని, మొదటి మూడేండ్లు రూ.25 వేలు జీతం వస్తుందని, తర్వాత రెగ్యులర్ అయి నెలకు రూ.40 వేలు వస్తాయని నమ్మ బలికింది. ముందుగా ఇచ్చే లక్షన్నరకు నమ్మకం ఏమిటని అడిగితే అవసరమైతే ప్రాంసరీ నోటు తానే రాసిస్తానని ఆ మేరకు ప్రాంసరీ నోట్లు రాసిందని బాధితులు తెలిపారు. తాను పని చేస్తున్న గురుకుల పాఠశాల ప్రిన్సిపాల్‌కు కూడా ఏ సమాచారం ఇవ్వకుండా మే 9వ తేదీ నుంచి కనిపించకుండా పోయింది. ఇప్పటి వరకు అందిన సమాచారం మేరకు వైరా మండలం వైరా, సిరిపురం(కెజి), ముసలి మడుగు, గౌండ్ల పాలెం, రెబ్బవరం, కొణిజర్ల మండలం చిన్న మునగాల, పెద్ద మునగాల, బోనకల్ మండలం బ్రాహ్మణ పల్లి, కలకోట తదితర గ్రామాల నిరుద్యోగులు ఈ మహిళ వలలో చిక్కి నష్టపోయారు. ఆమె ఈ డబ్బుతోనే ఖరీదైన కారు కొన్నట్టు సమాచారం. బాధితులకు అడ్రెస్ తెలియకుండా కిరాయి ఇల్లు మార్చింది. చివరిలో తల్లాడ రోడ్డులో సాకేత్ కృష్ణ ఆస్పత్రి వెనక పోలీస్ కానిస్టేబుల్ ఇల్లు అద్దెకు తీసుకుని వెంటనే తాళం వేసి జంప్ అయింది. బాధితులు ఆమె అద్దెకు ఉన్న ఇంటికి వెళ్లి సమాచారం కోసం ప్రయత్నించినా ఫలితం లేదు. బీసీ వెల్ఫేర్ గురుకుల పాఠశాల ప్రిన్సిపాల్‌ను అడిగినా తనకే చెప్పకుండా పోయిందన్న సమాధానం లభించినట్టు బాధితులు వాపోతున్నారు. 45 రోజులుగా ఆమె ఫోన్ కూడా పని చేయటం లేదని తెలిపారు. బాధితులు పోలీసులను ఆశ్రయించనున్నట్టు తెలుస్తుంది.

ఓయూ ఆర్ట్స్ కళాశాలకు లైట్ షో

యూనివర్సిటీ చరిత్రను, ప్రాశస్త్యాన్ని తెలిపేలా సౌండ్ షో

- కేంద్ర పర్యాటక, సాంస్కృతిక శాఖ నిధులతో పనులు
- ఇక విద్యుత్ దీపాలతో నూతన శోభ





నవతెలంగాణ-ఓయూ

రాష్ట్రంలోని చారిత్రక, పర్యాటక ప్రాంతాలు సరికొత్త రూపు సంతరించుకోనున్నాయి. ఆయా కట్టడాల ప్రాశస్త్యాన్ని వివరించేలా సౌండ్ షో, ఏడాది పొడవునా లైట్ షో ఏర్పాటు చేయాలని కేంద్ర పర్యాటక, సాంస్కృతిక శాఖ నిర్ణయం తీసుకుంది. ఈ జాబితాలో గోల్కొండ కోట, చార్మినార్, వరంగల్ కోట, రామప్ప, భద్రాచలం ఆలయంతోపాటు ఉస్మానియా విశ్వవిద్యాలయం ఆర్ట్స్ కళాశాల కూడా ఉన్నది. భద్రాచలం ఆలయం సమీపంలోని పర్ణశాలలో మౌలిక సదుపాయాల్ని కల్పించేందుకు కేంద్ర పర్యాటక శాఖ రూ.42 కోట్లు మంజూరు చేసింది. ఆ పనులకు ఇటీవల భూమిపూజ జరిగింది. ఇక్కడ రామాయణ ఇతివృత్తాన్ని కండ్లకు కట్టేలా త్రీడీ పద్ధతిలో ప్రదర్శించనున్నారు.

పర్యాటకుల్ని ఆకర్షించడమే..

ఓయూలోని ఆర్ట్స్ కళాశాల మళ్లీ పర్యాటకుల్ని ఆకర్షించడమే లక్ష్యంగా రూ.12 కోట్లతో అదనపు హంగులు కల్పించనున్నారు. రెండు నెలల నుంచి పనులు ముమ్మరంగా సాగుతున్నాయి. జులై తొలి వారంలో లైటింగ్ ప్రారంభించనున్నారని తెలిసింది. రానున్న రెండు, నెలల్లో సౌండ్ షో ఏర్పాటు చేయనున్నారు. ఇప్పటికే ఆర్ట్స్ కళాశాలలో లైట్ షో కోసం పలుమార్లు ట్రయల్స్ నిర్వహించారు. విశ్వవిద్యాలయ చరిత్ర, స్వాతంత్ర్య పోరాటం, సమరయోధులు వంటి అంశాలతో సౌండ్ షో ఉంటుందని సమాచారం. ఉస్మానియా విశ్వవిద్యాలయం, ఆర్ట్స్ కళాశాల 104 ఏండ్ల చరిత్రను ఇక్కడకు వచ్చే పర్యాటకులకు, విద్యార్థులకు, డెలిగేట్స్‌కు, ఉద్యోగులకు కండ్లకు కట్టినట్టు త్రీడి పద్ధతిలో ప్రదర్శన నిర్వహించనున్నారు. ప్రదర్శనలో ఉండాల్సిన అంశాలపై ప్రొఫెసర్లతో కమిటీ ఏర్పాటు చేశారు. లైట్ షోతో పాటు బ్యాక్ గ్రౌండ్ మ్యూజిక్ ద్వారా ఓయూ చరిత్రను వివరించేలా ఈ ప్రదర్శన ఉండనున్నది.

కళాశాలల ఎదుట 'ఫౌన్‌టైన్'ను కూడా సుందరంగా అలంకరించి విద్యుత్ లైట్స్ ఏర్పాటు చేస్తున్నారు. ఇక ప్రతి వారంతంలో ఆర్ట్స్ కళాశాల మరింతగా విద్యుత్ కాంతులతో విరాజిల్లనుంది.

ఓయూ నిధులతో ఆర్ట్స్ కళాశాల రూఫ్ మరమ్మతులు

ఆర్ట్స్ కళాశాల కొన్ని సంవత్సరాలుగా వర్షాలకు కురుస్తోంది. దాంతో సుమారు రూ.3 కోట్ల ఓయూ నిధులతో ఆర్ట్స్ కళాశాల భవన రూఫ్ మరమ్మతులు త్వరలోనే చేపట్టనున్నారు. రూఫ్ తరువాత కింద కూడా మరమ్మతులు చేయనున్నారు.

పరిసరాలను సుందరంగా చేయాలి

ఆర్ట్స్ కళాశాలకు కుడి, ఎడమ వైపు భాగాల్లో ఉన్న పరిసరాలను పరిశుభ్రంగా ఉంచుతూ ఇక్కడ గార్డెనింగ్ కళాత్మకంగా.. పచ్చదనం మరింత పెంపొందించేలా యూనివర్సిటీ అధికారులు చొరవ చూపాలని విద్యార్థులు కోరుతున్నారు. కళాశాల వెనుక భాగంలో రాత్రి పూట అసాంఘిక కార్యకలాపాల నివారణకు లైట్స్ ఏర్పాటు చేయాలని కోరుతున్నారు.



జీపీ కార్మికులను పర్మినెంట్ చేయాలి

- కలెక్టరేట్ల ఎదుట గ్రామ పంచాయతీ కార్మికుల ధర్నా
- సమస్యలను పరిష్కరించకుంటే సమ్మెలోకెళ్తామని ప్రకటన

నవతెలంగాణ- విలేకరులు

గ్రామ పంచాయతీ సిబ్బందిని పర్మినెంట్ చేయాలని, 11వ పీఆర్సీలో నిర్ణయించిన బేసిక్ ప్రకారం వేతనం చెల్లించాలని శనివారం కలెక్టరేట్ల ఎదుట ధర్నా చేశారు. విధుల్లో మల్టీపర్పస్ విధానాన్ని రద్దు చేయాలని, వేతనం పెంచాలని డిమాండ్ చేశారు. నల్లగొండ జిల్లా కేంద్రంలో జేఏసీ ఆధ్వర్యంలో మహాప్రదర్శన నిర్వహించారు.

సూర్యాపేట జిల్లా కేంద్రంలోని కలెక్టరేట్ ఎదుట గ్రామపంచాయతీ కార్మికులు ధర్నా నిర్వహించారు. అనంతరం జేఏసీ నాయకులు అదనపు కలెక్టర్ హేమంత్‌కేశవ్ పాటిల్‌కు సమ్మె నోటీస్ అందజేశారు. జీపీ కార్మికులు నల్లగొండ జిల్లా కేంద్రంలో తెలంగాణ గ్రామ పంచాయతీ ఉద్యోగ కార్మిక సంఘాల జేఏసీ ఆధ్వర్యంలో మేకల అభినవ్ స్టేడియం నుంచి ఎన్జీ కాలేజీ వరకు నిరసన మహా ప్రదర్శన నిర్వహించారు. ఈ మహా ప్రదర్శనకు జిల్లా వ్యాప్తంగా ఉన్న గ్రామపంచాయతీ కార్మికులు వేలాదిగా తరలివచ్చారు. ప్రదర్శన ప్రారంభం సందర్భంగా జేఏసీ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి యజ్ఞ నారాయణ, జిల్లా చైర్మెన్ సిహెచ్.లక్ష్మీనారాయణ కార్మికులనుద్దేశించి మాట్లాడారు.

కరీంనగర్ జిల్లా కేంద్రంలోని కలెక్టరేట్ ఎదుట తెలంగాణ గ్రామ పంచాయతీ ఎంప్లాయిస్ అండ్ వర్కర్స్ యూనియన్(సీఐటీయూ) ఆధ్వర్యంలో ధర్నా చేశారు. అనంతరం కలెక్టరేట్ అడ్మినిస్ట్రేటివ్ ఆఫీసర్ జగత్‌సింగ్‌కు వినతిపత్రం ఇచ్చారు. సీఐటీయూ జిల్లా కార్యదర్శి ఎడ్ల రమేష్, యూనియన్ జిల్లా ప్రధాన కార్యదర్శి కొప్పుల శంకర్, నాయకులు, కార్మికులు పాల్గొన్నారు.

సీఐటీయూ ఆదిలాబాద్ జిల్లా కార్యాలయంలో సమ్మె సన్నాహక సదస్సు నిర్వహించారు. సదస్సులో సీఐటీయూ జిల్లా కార్యదర్శి అన్నమొల్ల కిరణ్ మాట్లాడారు. గ్రామపంచాయతీ కార్మికుల సమస్యలు పరిష్కరించడంలో రాష్ట్ర ప్రభుత్వం విఫలమైందన్నారు. 11వ పీఆర్సీని వర్తింపజేయాలని డిమాండ్ చేశారు. ప్రభుత్వం వెంటనే స్పందించి సమస్యలు పరిష్కరించాలని, లేకపోతే జులై 6 నుంచి సమ్మెలోకి వెళ్తారని తెలిపారు.

అత్తింటి వేధింపులకు మహిళ ఆత్మహత్య

- కుమారుడికి ఉరేసి తానూ వేసుకున్న తల్లి



నవతెలంగాణ-బంజారాహిల్స్

అత్తింటి వేధింపులు తాళలేక ఓ మహిళ ఆత్మహత్య చేసుకుంది. తన కుమారుడికి ఉరివేసి తానూ వేసుకుంది. ఈ విషాద ఘటన హైదరాబాద్ ఫిల్మ్‌నగర్ పోలిస్ స్టేషన్ పరిధిలో జరిగింది. పోలీసులు, స్థానికులు తెలిపిన వివరాల ప్రకారం.. ఫిలింనగర్‌లోని వినాయకనగర్‌లో విశ్వనాథ్, శిరీష(22) దంపతులు కుమారుడు మనీష్(4), విశ్వనాథ్ తండ్రి, తల్లితో కలిసి అద్దె ఇంట్లో నివసిస్తున్నారు. దంపతులిద్దరూ ప్రయివేటు ఉద్యోగాలు చేస్తున్నారు. అయితే వారి మధ్య తరచూ గొడవలు జరుగుతూ ఉండేవి. ఈ క్రమంలో అత్త బసవమ్మ వేధింపులు ఎక్కువ కావడంతో మనస్తాపానికి గురైన శిరీష శుక్రవారం రాత్రి కుమారుడికి ఉరివేసి, ఆ తర్వాత తానూ ఉరేసుకుని ఆత్మహత్య చేసుకుంది. సమాచారం అందు కున్న పోలీసులు ఘటన స్థలానికి చేరుకుని క్లూస్ టీంతో ఆధారాలు సేకరించారు. మృతదేహాలను ఉస్మానియా ఆస్పత్రికి తరలించారు. కేసు నమోదు చేసుకున్న పోలీసులు.. మృతురాలి భర్త, అత్త, మామను అదుపులోకి తీసుకొని దర్యాప్తు చేస్తున్నారు. ప్రస్తుతం శిరీష గర్భంతో ఉన్నట్టు సమాచారం.

బస్సు సౌకర్యం కల్పించాలని వినతి



నవతెలంగాణ -ఉప్పల్

రామంతపూర్‌లోని కాలనీల్లో బస్సు సౌకర్యం కల్పించాలని కార్పొరేటర్ బండారు శ్రీవాణి కోరారు. ఈ మేరకు శనివారం ఉప్పల్ డిపో మేనేజర్ మురళీధర్ రెడ్డిని కలిసి వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా కార్పొరేటర్ మాట్లాడుతూ రామంతపూర్‌లోని ఆర్టీసీ కాలనీ, ఓల్డ్ రామంతపూర్, బాలకృష్ణ నగర్, కాలనీలలో కార్మికులు, విద్యార్థులు బస్సు సౌకర్యం లేక తీవ్ర ఇబ్బం దులు ఎదుర్కొంటున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. అనంతరం స్పందించిన డిపో మేనేజర్ మాట్లాడుతూ వెంటనే సిబ్బందితో సర్వే నిర్వహించి బస్సులను నడుపుతామని హామీ ఇచ్చారు. ఈ కార్యక్రమంలో రామంతపూర్ డివిజన్ అధ్యక్షులు బండారు వెంకటరావు, ఉప్పల్ అసెంబ్లీ అధికార ప్రతినిధి ఇల్లిటం నరసింహారెడ్డి, పర్రి శ్రీనివాస్, ఓబీసీ మోర్చా జనరల్ సెక్రెటరీ పాల్గొన్నారు.

నేడు ఉచిత మెగా క్యాన్సర్ స్క్రీనింగ్ శిబిరం

నవతెలంగాణ-అబ్దుల్లాపూర్ మెట్

పెద్ద అంబర్ పేట మున్సిపాలిటీ యూనికార్పస్ వర్ద్ అండ్ డీడ్ హాస్పిటల్‌లో గ్రేస్ క్యాన్సర్ ఫౌండేషన్ ఆధ్వర్యంలో నేడు ఉచితంగా క్యాన్సర్ క్లీనింగ్ శిబిరం నిర్వహిస్తున్నట్లు హాస్పిటల్ మెడికల్ సూపరింటెండెంట్ డాక్టర్ జ్యోత్స్న తెలిపారు. ఈ సందర్భంగా డాక్టర్ జ్యోత్స్న మాట్లాడుతూ వర్ద్ అండ్ డీడ్ హాస్పిటల్‌లో నిర్వహిస్తున్న వైద్య శిబిరంలో ఉచిత షుగర్, బీపీ, నోటి పరీక్షలతో పాటు, పాప్ స్మెర్, మామోగ్రామ్, ఛాతీ ఎక్స్ రే, క్లినికల్ ఎగ్జామినేషన్ చేయనున్నట్లు తెలిపారు. ముందస్తుగా గర్భాశయ, రొమ్ము, నోటి ఊపిరితిత్తుల క్యాన్సర్ ను గుర్తించడం వల్ల వ్యాధి చికిత్సతో పాటు, నివారణ చర్యలు తీసుకోవడం సాధ్యపడుతుందన్నారు. ఆరోగ్యం పట్ల తగిన జాగ్రత్తలు తీసుకోవాలని సూచించారు. ఈ వైద్య శిబిరాన్ని ప్రజలు సద్వినియోగం చేసుకోవాలని కోరారు.

ఎమ్మెల్సీ కవితను కలిసిన రామ్మోహన్ గౌడ్, మాజీ కార్పొరేటర్లు



నవతెలంగాణ- వనస్థలిపురం

భారత జాగృతి వ్యవస్థాపక అధ్యక్షురాలు, శాసన మండలి సభ్యురాలు కల్వకుంట్ల కవితను బంజారాహిల్స్‌లోని ఆమె నివాసంలో ఎల్బీనగర్ నియోజకవర్గం బీఆర్ఎస్ పార్టీ ఇంచార్జి ముద్దగౌని రామ్మోహన్ గౌడ్, మాజీ కార్పొరేటర్లు సామ రమణా రెడ్డి, విఠల్ రెడ్డిలు శనివారం మర్యాద పూర్వకంగా కలిశారు. ఈ సందర్భంగా కవిత రాష్ట్ర రాజకీయాలపై చర్చించి..మాట్లాడారు. వచ్చే ఎన్నికలలో ఎల్బీనగర్ నియోజకవర్గంలో పార్టీని గెలిపించేందుకు మాజీ కార్పొరేటర్లు, ఉద్యమకారులు, సీనియర్ నాయకులు, కార్యకర్తలు, జాగృతి కార్యకర్తలు సమిష్టిగా కలిసి పనిచేయాలని కోరారు. తర్వాత ఇటీవల ఎల్బీనగర్‌లో జరిగిన పలు సంఘటనల గురించి అడిగి తెలుసుకున్నారు. ఎల్బీనగర్‌లో జరుగుతున్న రాజకీయ పరిమాణాలను సీఎం కేసీఆర్ దృష్టికి తీసుకెళ్తానని చెప్పారు. ఈ కార్యక్రమంలో చంపాపేట డివిజన్ పార్టీ నాయకులు మెట్టు వెంకట రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

కాలనీ సమస్యలు పరిష్కరిస్తాం

కార్పొరేటర్ మొద్దు లచ్చి రెడ్డి



నవతెలంగాణ-వనస్థలిపురం

బీఎన్‌రెడ్డి నగర్ డివిజన్ పరిధిలోని కాలనీల సమస్యలను పరిష్కరిస్తాం అని కార్పొరేటర్ మొద్దు లచ్చి రెడ్డి అన్నారు. సచివాలయ నగర్ 8వ రోడ్, ఎన్జీవో కాలనీ లేబర్ అడ్డా వద్ద డ్రైనేజీ పైప్ లైన్ పగిలిపోయి రోడ్లపై మురుగునీరు పారుతున్న విషయాన్ని స్థానికులు కార్పొరేటర్ దృష్టికి తీసుకెళ్లారు. ఈ మేరకు శనివారం కార్పొరేటర్ సంబంధిత జలమండలి అధికారి భవ్య రెడ్డికి సమాచారం ఇచ్చారు. తర్వాత ఆ ప్రాంతంలో పర్యటించారు. ఈ సందర్భంగా కార్పొరేటర్ మాట్లాడుతూ డ్రైనేజ్ పైప్ లైన్‌ను వెంటనే బాగు చేయాలని, డ్రైనేజీ మురుగునీరు రోడ్లపై రాకుండా తగు చర్యలు తీసుకోవాలని సంబంధిత అధికారులకు సూచించారు. డివిజన్ పరిధిలోని సమస్యలను పరిష్కరించేందకు కృషి చేస్తానని హామీ ఇచ్చారు.

సిల్వర్ మెడల్ సాధించిన హార్దిక్‌కు సన్మానం



నవతెలంగాణ -వనస్థలిపురం

అంతర్జాతీయ ఒలంపిక్ దినోత్సవాన్ని పురస్కరించుకొని బీఎన్‌రెడ్డి నగర్ డివిజన్ పరిధిలోని వైదేహినగర్ నార్త్ కాలనీకి చెందిన నివాసి రాహుల్ కాలేకర్ కుమారుడు హార్దిక్ కాలేకర్ ఈ నెల 15న రాజమండ్రిలో జరిగిన కౌన్సిల్ ఫర్ ది ఇండియన్ స్కూల్ సర్టిఫికేట్ ఎగ్జామినేషన్ (సీఐఎస్, సీఈ) ఏపీ, తెలంగాణ రీజినల్ స్పోర్ట్స్ 2023 ఆర్చరీ కేటగిరి అండర్ 17లో సిల్వర్ మెడల్ కైవసం చేసుకున్నారు. ఈ విషయాన్ని తెలుసుకున్న వైదేహినగర్ నార్త్ అసోసియేషన్ అధ్యక్షులు పోగుల రాంబాబు శనివారం హార్దిక్ కాలేకర్‌ను ఆయన కుటుంబ సభ్యుల సమక్షంలో శాలువాతో సత్కరించి మిఠాయిలు తినిపించారు. ఈ కార్యక్రమంలో అసోసియేషన్ సభ్యులు రాజేందర్ రెడ్డి, నాగరాజు, శ్రీనివాస్, విద్యాసాగర్, ప్రభాకర్, మూర్తి తదితరులు పాల్గొన్నారు.

ఘనంగా వార్షికోత్సవం, యూఆర్‌వీఐ 2కే 23



నవతెలంగాణ- సంతోష్‌నగర్

హైదరాబాద్ జిల్లా సైదాబాద్ డివిజన్ పరిధిలోని మాతృశ్రీ ఇంజనీరింగ్ కళాశాల శనివారం నాగోల్‌లోని శుభం కన్వెన్షన్ హాల్లో వార్షిక దినోత్సవం, యూఆర్ వీఐ 2 కే 23 వేడుకలు ఘనంగా నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా చైర్మన్ డాక్టర్ కె.పి. శ్రీనివాసరావు, ఎంఇఎస్, ఎంఇఎస్ సెక్రటరీ ఎం. కృష్ణ కుమార్, ఎంఇఎస్ కోశాధికారి జె. సుధాకర్, ఎంఇఎస్ వైస్ చైర్మన్ టి. జితేందర్‌నాథ్, ఎంఇఎస్ సభ్యులు, ఎంఇఎస్ ప్రిన్సిపల్ డాక్టర్ డి. హనుమంతరావు, ఎంఇసిఎస్, కన్వీనర్ డాక్టర్ టి. శేఖరం, అసోసియేట్ ప్రొఫెసర్ ఎస్. వెంకటాచారిలు హాజరయ్యారు. విద్యార్థినులు శాస్త్రీయ స్వాగత నృత్యంతో కార్యక్రమం ప్రారంభించారు. అనంతరం చైర్మన్ ప్రిన్సిపాల్ మాట్లాడుతూ విద్యార్థులకు విద్యతోనే ఉజ్వల భవిష్యత్ ఉంటుందన్నారు.సమాజ అభివృద్ధిలో విద్యార్థులు, యువత భాగస్వాములు కావాలని కోరారు. సాంకేతిక విజ్ఞానిక, పరిమాణాన్ని దృష్టిలో పెట్టుకొని అన్ని రంగాల్లో రాణించినప్పుడే ప్రపంచ దేశానికి ఆదర్శంగా నిలుస్తారని విద్యార్థులకు సూచించారు. తర్వాత యూనివర్సిటీ ర్యాంకర్లకు, కాలేజీ టాపర్లకు చైర్మన్, సెక్రటరీ, ట్రెజరర్, ప్రిన్సిపాల్ చేతుల మీదుగా అవార్డులను అందజేశారు. వివిధ కళాశాలల క్లబ్‌లు తమ డ్యాన్స్, గానం, స్కిట్‌లు చేసి తమ మనోహరమైన ప్రదర్శనలతో ప్రేక్షకులను ఆకట్టుకున్నాయి. వివిధ కార్యక్రమాల్లో విజేతలకు ప్రిన్సిపాల్, కన్వీనర్ చేతుల మీదుగా బహుమతులు అందజేశారు. హై-ఎనర్జీ సాంస్కృతిక కార్యక్రమాలు ముగిసిన వెంటనే జరిగిన ఆర్కెస్ట్రాలోని ప్రతి పదానికి ప్రేక్షకులు వేలాడదీయడం కనిపించింది. గంభీరమైన ఆనందాన్ని పంచుకున్నారు. ఈ కార్యక్రమంలో విద్యార్థులు, అధ్యాపకులు ,సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

వార్డుల అభివృద్ధికి కృషి చేస్తా : చైర్ పర్సన్



నవతెలంగాణ-ఘట్కేసర్

ఘట్కేసర్ మున్సిపల్‌లోని అన్ని వార్డుల అభివృద్ధికి కృషి చేస్తానని చైర్ పర్సన్ ముల్లి పావని జంగయ్య యాదవ్ అన్నారు. ఈ మేరకు శనివారం ఆమె మాట్లాడుతూ రాష్ట్ర కార్మిక శాఖ మంత్రి చామకురా మల్లారెడ్డి ఘట్కేసర్ మున్సిపాలిటీలోని అన్ని వార్డులకు ప్రత్యేక నిధుల కింద 1 కోటి 70 లక్షల రూపాయలు ప్రవేశపెట్టారని..మొదటి విడతగా 6వ వార్డులోని సీసీ రోడ్ పనులకు ఏర్పాటు చేయాలని ఆర్ అండ్ బి అధికారులను కోరారు. కార్మిక శాఖ మంత్రి సహకారంతో ఘట్కేసర్ మున్సిపాలిటీలోని 17 వార్డులకు రూ.1 కోటి 70 లక్షల ప్రత్యేక నిధులు మంజూరు చేయడం చాలా సంతోషంగా ఉందన్నారు. అనంతరం ఘట్కేసర్ మున్సిపాలిటీ 6వ వార్డులో ఆర్ అండ్ బి అధికారులతో కలిసి పర్యటించారు. ఈ కార్యక్రమంలో ఆర్ అండ్ బి ఏఈ శ్రీనివాస్ రెడ్డి, మాజీ వార్డు సభ్యుడు రహీం, వార్డు ప్రజలు, సారా రమంజి సైనోజి నరేష్ చారి, కరుణాకర్ యాదవ్, సారా నరేష్ నాగరాజు, సహదేవ్ ముదిరాజ్, దీపక్, తదితరులు పాల్గొన్నారు.

'ముంపు' సమస్యను పరిష్కరించకపోతే..

రాష్ట్ర సర్కార్ సంగతి తేలుస్తాం

టీపీసీసీ ఉపాధ్యక్షుడు వజ్రేష్ యాదవ్



నవతెలంగాణ - బోడుప్పల్

ముంపు ప్రాంతాల సమస్యను పరిష్కరించకపోతే..సర్కార్ సంగతి తేలుస్తాం అని టీపీసీసీ ఉపాధ్యక్షుడు తోటకూర వజ్రేష్ యాదవ్ హెచ్చరించారు. ఈ మేరకు రాష్ట్ర ప్రభుత్వ నిర్లక్ష్యాన్ని నిరసిస్తూ శనివారం ఉప్పల్ డిపో వద్ద కాంగ్రెస్ పార్టీ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన దీక్షకు ఆయన ముఖ్య అతిథిగా హాజరై మాట్లాడారు. 2020 అక్టోబర్‌లో మేడ్చల్ జిల్లా పరిధిలోని బోడుప్పల్, పీర్జాదిగూడ మునిసిపల్ కార్పొరేషన్ల పరిధిలో ముంపు ప్రాంతాల్లో వచ్చిన వరదల వలన జరిగిన ఇబ్బందులు మరోసారి తలెత్తకుండా రూ.110 కోట్లతో నిర్మించతలపెట్టిన ఎస్ఎన్డీపీ పనులను 2022 ఫిబ్రవరిలో రాష్ట్ర మున్సిపల్ మంత్రి కేటీఆర్ అట్టహాసంగా ప్రారంభించారని గుర్తుచేశారు. ఆ పనులు రేండేళ్లు కావాస్తున్న ఇప్పటికీ పూర్తి కాలేదని విమర్శించారు. ప్రజా సమస్యలపై బీఆర్ఎస్ మంత్రులకు, ప్రజాప్రతినిధులకు చిత్తశుద్ధి లేదని మండిపడ్డారు. మళ్ళీ వరదలు వస్తే.. జరిగే నష్టాలకు ఎవరూ బాధ్యత వహిస్తారో సమాధానం చెప్పాలని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో బోడుప్పల్ మున్సిపల్ కార్పొరేషన్ అధ్యక్షుడు, కార్పొరేటర్ పోగుల నరసింహ రెడ్డి, పీర్జాదిగూడ మున్సిపల్ కార్పొరేషన్ అధ్యక్షుడు తుంగతుర్తి రవి, యూత్ కాంగ్రెస్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి పొన్నం తరుణ్ గౌడ్, మేడ్చల్ నియోజకవర్గం యూత్ కాంగ్రెస్ అధ్యక్షులు కొత్త సుశాంత్ గౌడ్, మేడ్చల్ నియోజకవర్గం బీ బ్లాక్ ప్రధాన కార్యదర్శి కొత్త కిషోర్ గౌడ్, కార్పొరేటర్ కొత్త దుర్గమ్మ, మేడ్చల్ నియోజకవర్గ ఏ బి బ్లాక్ సెల్ అధ్యక్షులు పానుగంటి మహేష్, కుర్రి మహేష్ పాల్గొన్నారు.

జల్‌పల్లి అభివృద్ధికి ప్రత్యేక నిధులు

మంత్రి సబితా ఇంద్రారెడ్డి



నవతెలంగాణ - బడంగ్‌పేట్

జల్ పల్లి మున్సిపల్ అభివృద్ధికి కోట్లాది రూపాయల ప్రత్యేక నిధులు మంజూరు చేసి.. ప్రజలకు మౌలిక సదుపాయాల కల్పనకు కృషి చేస్తున్నామని రాష్ట్ర విద్యా శాఖ మంత్రి పి.సబితా ఇంద్రారెడ్డి అన్నారు. మహేశ్వరం నియోజకవర్గం జల్ పల్లి మున్సిపాలిటీ 16వ వార్డులో రూ.50లక్షలతో సీసీ రోడ్డు, 17వ వార్డులో రూ. 39లక్షలతో, 16వ వార్డులో రూ. 30లక్షలతో సీసీ, బీటీ రోడ్ల నిర్మాణ పనులకు శంకుస్థాపన...రూ.15 లక్షలతో జల్ పల్లి అర్బన్ ఫారెస్ట్‌లో చిల్డ్రన్ పార్క్‌ను శనివారం మంత్రి సబితా ఇంద్రారెడ్డి ప్రారంభించారు. తర్వాత 16 వార్డు జల్ పల్లిలో మన ఊరు- మన బడి కింద రూ. 46 లక్షల నిధులతో తీర్చిదిద్దిన మండల పరిషత్ ప్రాథమికోన్నత పాఠశాలను ప్రారంభించారు. ఈ సందర్భంగా మంత్రి మాట్లాడుతూ..సీఎం కేసీఆర్, మున్సిపల్, పట్టణాభివృద్ధి శాఖ మంత్రి కేటీఆర్ సహకారంతో ప్రత్యేక నిధులు మంజూరు చేయటం జరిగిందని, ఆ నిధులతో మహేశ్వరం నియోజకవర్గంలోని కార్పొరేషన్లు, మున్సిపాలిటీలలో అనేక అభివృద్ధి పనులు చేపడుతున్నట్లు వివరించారు. ఇటీవలి మహేశ్వరం పర్యటనలో ముఖ్యమంత్రి కేసీఆర్ రెండు కార్పొరేషన్లకు రూ. 50కోట్ల చొప్పున 100 కోట్లు, రెండు మున్సిపాలిటీలకు రూ.25 కోట్ల చొప్పున 50 కోట్ల నిధులు కేటాయిస్తూ వరాల జల్లులు కురిపించారని గుర్తుచేశారు. వీటితో ప్రజలకు కనీస సౌకర్యాల కల్పనకు ప్రాధాన్యత ఇవ్వనున్నట్లు తెలిపారు. రూ.168 కోట్లతో పాటు, మెడికల్ కళాశాల మంజూరు చేసిన సీఎం కేసీఆర్ కు నియోజకవర్గ ప్రజల తరఫున మంత్రి సబితా ఇంద్రారెడ్డి ప్రత్యేకంగా ధన్యవాదాలు తెలిపారు.

డ్రైనేజీలు, నాళాలు, తాగునీటి సమస్యలకు శాశ్వత పరిష్కారం కోసం రూ.320 కోట్ల నిధులతో అనేక అభివృద్ధి సంక్షేమ కార్యక్రమాలను అమలు చేస్తున్నామన్నారు. అదేవిధంగా నాలుగు చోట్ల సమీకృత మార్కెట్ లు, వైకుంఠ దామాలు నిర్మిస్తున్నట్లు తెలిపారు.కోట్లాది రూపాయలతో రోడ్లు, కనీస సౌకర్యాల కల్పనకు కృషి చేస్తున్నట్లు, అదే విధంగా సుమారు రూ.40 కోట్ల నిధులతో 10 చెరువులను సుందరీకరణ, అభివృద్ధి పనులు చేపడుతున్నట్లు మంత్రి తెలిపారు. ఈ కార్యక్రమంలో మున్సిపల్ చైర్మన్ అబ్దుల్లా సాది, వైస్ చైర్మన్ సయ్యద్ యూసుఫ్ పటేల్, కమిషనర్ వసంత, డీఈఈ ఎంకన్న, ఏఈ, కౌన్సిలర్లు బుడుమాల యాదగిరి, లక్ష్మీనారాయణ, పమీద అఫ్జల్, మజర్ అలీ, యాహియా, దస్తగిర్, కో ఆప్షన్ సభ్యులు సూరెడ్డి కృష్ణారెడ్డి, రంగారెడ్డి జిల్లా మైనార్టీ సెల్ అధ్యక్షులు ఖైసర్ బాం, మాజీ ఎంపీటీసీ యంజాల జనార్ధన్, దూడల శ్రీనివాస్ గౌడ్, మాజీ ఉప సర్పంచ్ జహంగీర్, యువ నాయకులు అర్జున్, పార్టీ సీనయర్ నాయకులు భూషణ్, బీఆర్ఎస్, ఎంఐఎం నాయకులు, కార్యకర్తలు, అభిమానులు మహిళలు పాల్గొన్నారు.

'సరైన పిన్ కోడ్ రాస్తే ఉత్తరాల జారీలో జాప్యం ఉండదు'



నవతెలంగాణ -వనస్థలిపురం

సరైన పిన్ కోడ్ రాస్తే ఉత్తరాల జారీలో జాప్యం ఉండదని వనస్థలిపురం డిప్యూటీ పోస్ట్ మాస్టర్ కరుణాకర్ రెడ్డి పేర్కొన్నారు. ఈ మేరకు శనివారం ఆయన మాట్లాడుతూ పిన్ కోడ్ సార్టింగ్ నిర్వహిస్తారని అన్నారు. ప్రధానంగా బీఎన్‌రెడ్డి, హస్తినాపురంలోని టీచర్స్ కాలనీ, చైతన్య నగర్, అగ్రికల్చర్ కాలనీ, విశ్వేశ్వరయ్య కాలనీ, జడ్జి రోడ్డులోని కాలనీలతో పాటు అనుపమ నగర్, హస్తినాపురం నార్త్, సౌత్ కు సంబంధించిన ఉత్తరాలపై పిన్ కోడ్ 500070 రాయడంతో ఉత్తరాలు అందుకోవడంలో ఆలస్యం జరుగుతుందన్నారు. ఆయా కాలనీలు వైదేహి నగర్ పోస్ట్ ఆఫీస్ పరిధిలోకి వస్తాయని, ఉత్తరాలపై 500079 పిన్ కోడ్ రాయాలని సూచించారు.

స్వయం ఉపాధితో యువత రాణించాలి

నవతెలంగాణ-సంతోష్ నగర్

ఉద్యోగుల కోసం నిరీక్షించకుండా స్వయం ఉపాధి రంగాలను ఎంచుకుని రాణించాలని ఎమ్మెల్యే అహ్మద్ బిన్ అబ్దుల్లా బలాల యువతకు సూచించారు.



మలక్‌పేట్ నియోజకవర్గం డివిజన్ పరిధిలోని ప్రధాన రహదారిపై నూతనంగా ఏర్పాటు సూపర్ బజార్ వద్ద బ్లాక్ పోర్ట్ అండ్ కేఫ్ ను శనివారం ఎమ్మెల్యే నిర్వాహకులతో కలిసి ప్రారంభించారు. ఈసందర్భంగా ఆయన మాట్లాడుతూ నాణ్యమైన అన్ని రకాల వెరైటీగా బ్లాక్ పోర్ట్ కేఫ్ ప్రత్యేకతగా ఉండాలని సూచించా రు. మారుతున్న కాలానికి అనుగుణంగా నూతన వెరైటీలను అందించి ప్రజల మన్ననలు పొందాలని అన్నారు. ఈ కార్యక్రమంలో స్థానిక నాయకులు, కార్యకర్తలు, అభిమానులు, కార్పొరేటర్ ఎండి సైఫుద్దీన్ షఫీ, ఎంఐఎం యాక్టివ్ లీడర్స్ తదితరులు పాల్గొన్నారు.

మాణిక్ రావు థాక్రేను కలిసిన అమరేందర్ రెడ్డి



నవతెలంగాణ- బడంగ్‌పేట్

హైదరాబాద్ నగరంలోని గాంధీ భవన్‌లో ఏఐసీసీ జనరల్ సెక్రెటరీ, తెలంగాణ కాంగ్రెస్ పార్టీ ఇంచార్జి మాణిక్ రావు థాక్రేను, ఏఐసీసీ సెక్రెటరీ ఇంచార్జి మన్సూర్ అలీను శనివారం టీపీసీసీ సెక్రెటరీ ఎల్మేటి అమరేందర్ రెడ్డి మర్యాద పూర్వకంగా కలిసి శుభాకాంక్షలు తెలిపారు. ఈ సందర్భంగా అమరేందర్ రెడ్డి మాట్లాడుతూ కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు ప్రజా వ్యతిరేక విధానాలు అవలంబిస్తూ ధనార్జనే ధ్యేయంగా పనిచేస్తున్నాయని మండిపడ్డారు. దేశంలో బీజేపీని, రాష్ట్రం లో బీఆర్ఎస్ పార్టీలకు రానున్న ఎన్నికల్లో ప్రజలు తగిన గుణపాఠం చెబుతారని హెచ్చరించారు. కాంగ్రెస్ పార్టీని కేంద్రం, రాష్ట్రంలోను అధికారంలోకి తీసుకరావడానికి ప్రజలు సిద్ధంగా ఉన్నారని ధీమా వ్యక్తం చేశారు.

విద్యార్థిని అదృశ్యం



నవతెలంగాణ-బోడుప్పల్

కాలేజి కని వెళ్లిన ఓ విద్యార్థిని అదృశ్యం అయిన సంఘటన మేడిపల్లి పీఎస్ పరిధిలో చోటు చేసుకుంది. మేడిపల్లి ఎస్ఐ అనిల్ తెలిపిన వివరాల ప్రకారం పీర్జాదిగూడ మేడిపల్లి సాయి అంజన నిలయంలో నివాసం ఉంటున్న దండేం పావని రెడ్డి (18) విజ్ఞాన్ మహిళ కళాశాలలో బీ.టెక్ చదువుతుంది. ఈ నెల 23 న ఉదయం 8 గంటలకు రోజు మాదిరిగానే కాలేజి కని వెళ్ళి సాయంత్రం వరకు ఇంటికి రాలేదు తోటి విద్యార్థులకు ఫోన్ చేసి అడగ్గా ఈ రోజు కాలేజీకి రాలేదని చెప్పడంతో కుటుంబ సభ్యులు తెలిసిన వారు, బంధువుల వద్ద ఎంత వెతికిన ఆచూకీ లభ్యం కాకపోవడంతో పావని తండ్రి పురందర్ రెడ్డి మేడిపల్లి పీఎస్ లో ఫిర్యాదు చేశారు. కేసు నమోదు చేసుకున్న పోలీసులు ఆచూకీ కోసం అన్ని కోణాల్లో దర్యాప్తు చేస్తున్నామని తెలిపారు.

దుబాయ్ సమ్మర్ సర్ ప్రైజెస్ 2023 సిద్ధంగా ఉంది

నవతలంగాణ - హైదరాబాద్

ఫన్, ఎంజాయ్ మెంట్, ఎంటర్టైన్మెంట్ అన్నీ కలిగలిపి ఒకేచోట దొరికే ప్లేస్ దుబాయ్ సమ్మర్ సర్ ప్రైజెస్. అంతర్జాతీయ స్థాయిలో దుబాయ్ సమ్మర్ సర్ ప్రైజెస్ కు ఎంతో పేరుంది. దేశవిదేశాల నుంచి ఈ ఈవెంట్ కు అతిథులు వస్తుంటారు. చాలా కాలంగా ఎదురుచూస్తున్న దుబాయ్ సమ్మర్ సర్ప్రైజెస్ ఇప్పుడు మరోసారి సిద్ధమైంది. దాదాపు 67 రోజుల పాటు ఈ ఈవెంట్ పర్యాటకులను ఎంటర్ టైన్ చేయనుంది. ఈ ఏడాది డీఎస్ఎస్ 26వ ఎడిషన్. అంటే 26 ఏళ్ల నుంచి ఈ ఈవెంట్ను నిర్వహిస్తున్నారు. ఈ సమ్మర్ సర్ ప్రైజెస్ ను దుబాయ్ ఫెస్టివల్స్, రిటైల్ ఎస్టాబ్లిష్ మెంట్ అందిస్తోంది. జూన్ 29 నుంచి సెప్టెంబర్ 3 వరకు ఈ సమ్మర్ సర్ ప్రైజ్ కొనసాగుతుంది. దీని ద్వారా అక్కడే ఉంటున్న స్థానికులకు, విదేశాల నుంచి వచ్చే పర్యాటకులకు అద్భుతమైన ఎంటర్ టైన్ మెంట్ లభించనుంది. మిమ్మల్ని ఎంతగానో ఎంటర్ టైన్ చేసే కన్సర్ట్లు, ఈవెంట్లు, అద్భుతమైన అనుభూతులను అనుభవాల కోసం సిద్ధంగా ఉండండి. అన్నింటికి మించి ఈద్ అల అదా పండుగ కూడా ఉంది. జీవితాన్ని మార్చే రాఫెల్లు, ఏమాత్రం మిస్ అవ్వలేని రిటైల్ ప్రమోషన్లు, విభిన్నమైన గ్యాస్ట్రానమీ ఆప్షన్స్, అలాగే వివిధ హోటళ్లు, కిడ్స్ గో ఉచిత ఆఫర్లు సిద్ధంగా ఉన్నాయి. వీటితోపాటు అద్భుతంగా దుబాయ్ అందించే వేడుకల కోసం ఈ సమ్మర్ లో మీరు సిద్ధం కావాల్సిందే.

బాధిత కుటుంబాన్ని పరామర్శించిన బీఆర్ఎస్ నాయకులు





నవతెలంగాణ - ఎల్బీనగర్

చైతన్యపురి డివిజన్ మున్సిపల్ కాలనీలో ఆంబోతు రంగయ్య తన కుటుంబ సభ్యులతో కలిసి గత రాత్రి నిద్రపోతున్న సమయంలో ప్రమాదవశాత్తు పురాతన ఇంటి స్లాబ్ పైకప్పు పెచ్చులు ఊడి వారిపై పడింది. దీంతో రంగయ్య, ఆయన భార్య బిందు, 3 ఏండ్ల కుమారుడు గౌతమ్ కుమార్‌లు గాయాలపాలయ్యారు. వెంటనే చుట్టుపక్కల వారు అర్థరాత్రి హుటాహుటిన ఆసుపత్రికి తీసుకెళ్లారు. ఈ విషయాన్ని తెలుసుకున్న ఎల్బీనగర్ నియోజకవర్గం బీఆర్ఎస్ పార్టీ నాయకులు ముద్దగౌని రామ్మోహన్ గౌడ్, చైతన్యపురి డివిజన్ మాజీ కార్పొరేటర్ జిన్నారం విఠల్ రెడ్డిలు శనివారం ఘటనాస్థలానికి చేరుకున్నారు. బాధితుడు రంగయ్యను ఆయన కుటుంబ సభ్యులను పరామర్శించారు. తర్వాత ప్రమాదం జరిగిన తీరును అడిగి తెలుసుకున్నారు. అనంతరం రామ్మోహన్ గౌడ్ స్పందించి ఉప్పల్ మండల తహసీల్దార్‌తో ఫోన్‌లో ప్రమాద వివరాలను వివరించి... ప్రభుత్వం నుండి రంగయ్యకు ఆర్థిక సహాయం అందేలా చూడాలని కోరారు. వెంటనే స్పందించిన తహసీల్దార్ రెవిన్యూ ఇన్‌స్పెక్టర్‌ను ఘటనాస్థలానికి పంపించారు. ఆ రెవిన్యూ ఇన్‌స్పెక్టర్ నష్టాన్ని అంచనా వేసి నష్టపరిహారం కోసం ప్రభుత్వానికి నివేదిక పంపిస్తామని అన్నారు. ఈ కార్యక్రమంలో మున్సిపల్ కాలనీ మాజీ అధ్యక్షులు పి. భాస్కర్, చిన్న యాదవ్, ఈశ్వర్ గౌడ్, మల్లేష్, రాము, పవన్ కుమార్, వీరన్న యాదవ్, గట్టు శ్రీనివాస్, తిరుమల రెడ్డి, రమణా రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

ఎల్బీనగర్ వర్కింగ్ జర్నలిస్ట్ జేఏసీ లోగో ఆవిష్కరణ



నవతెలంగాణ- సంతోష్ నగర్

ఎల్బీనగర్ వర్కింగ్ జర్నలిస్ట్ జేఏసీ ఆధ్వర్యంలో ఎల్బీ నగర్‌లోని శ్రీకాంతాచారి చౌరస్తా వద్ద శనివారం డాక్టర్ బీఆర్ అంబేద్కర్ విగ్రహానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. తర్వాత జేఏసీకి సంబంధించిన లోగోను సభ్యుల సమక్షంలో డాక్టర్ బీఆర్ అంబేద్కర్ సాక్షిగా జేఏసీ చైర్మన్ వి. ఎస్ రాజు ఆవిష్కరించారు. ఈ సందర్భంగా చైర్మన్ రాజు మాట్లాడుతూ ఎల్బీనగర్‌లో జర్నలిజాన్ని నమ్ముకొని అనేక మంది పాత్రికేయులు నిరంతరం శ్రమిస్తున్నామని గుర్తు చేశారు. రాష్ట్ర వ్యాప్తంగా వర్కింగ్ జర్నలిస్టులకు ప్రభుత్వం ఇచ్చిన హామీలో భాగంగా ఎల్బీనగర్ లో కూడా వర్కింగ్ జర్నలిస్టులకు ఇళ్ల స్థలాల మంజూరు కోసం పోరాటం కొనసాగిస్తున్నట్లు తెలిపారు. ఎల్బీనగర్ వర్కింగ్ జర్నలిస్టుల జేఏసీకి రిజిస్ట్రేషన్ నెంబర్ (567/2023) వచ్చిందని సంతోషం వ్యక్తం చేశారు. ఇక నుంచి ప్రతి విషయంలో జర్నలిస్టు కుటుంబాలకు ఏ ఆపద వచ్చినా కూడా జేఏసీ అండగా ఉంటుందని భరోసా ఇచ్చారు. జర్నలిస్టుల సమస్యల కోసం జేఏసీ నిరంతరం పోరాడుతుందని స్పష్టం చేశారు. ఎల్బీనగర్ నియోజకవర్గంలో, జర్నలిస్టులకు కూడా అనేక సమస్యలు ఉన్నాయన్నారు. ఇళ్ల స్థలాలు సాధించేవరకూ పోరాటం కొనసాగిస్తామని హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో జేఏసీ సభ్యులు తదితరులు పాల్గొన్నారు.

ప్రజా సమస్యలు పరిష్కరించాలని ధర్నా



నవతెలంగాణ-అబ్దుల్లాపూర్ మెట్

ప్రజా సమస్యలను పరిష్కరించాలని కోరుతూ సంఘాల పోరాట వేదిక ఆధ్వర్యంలో ప్రజాసంఘాల వేదిక రంగారెడ్డి జిల్లా కన్వీనర్ పగడాల యాదయ్య, సీఐటీయూ జిల్లా అధ్యక్షులు ఎం. రాజు శనివారం అబ్దుల్లాపూర్ మెట్ తహసీల్దార్ కార్యాలయం ఎదుట ధర్నా చేపట్టారు. తర్వాత తహసీల్దార్ అనితా రెడ్డికి వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ రంగారెడ్డి జిల్లాలో అనేక మంది పేదలు ఇండ్లు లేక దుర్భర జీవితాలను అనుభవిస్తూ ఇబ్బందులు ఎదుర్కొంటున్నారన్నారు. అర్హులైన వారందరికీ 60 గజాల చొప్పున ఇంటి స్థలాలు ఇచ్చేందుకు ప్రభుత్వం చర్యలు తీసుకోవాలని కోరారు. అలాగే అర్హులైన లబ్ధిదారులకు రేషన్ కార్డులు, పింఛన్లు ఇవ్వాలని, వెనుకబడిన బీసీ కులాలు అందరికీ లక్ష రూపాయల లోన్ ఇవ్వాలన్నారు. దళిత బంధు పథకం పూర్తిస్థాయిలో అమలు చేయాలని కోరారు. ఈ కార్యక్రమంలో ప్రజాసంఘాల జిల్లా నాయకులు గోరింకల నరసింహ, కేవీపీఎస్ నాయకులు కనకయ్య, మత్స్య కార్మిక సంఘం నాయకులు వెంకన్న, ప్రజా సంఘాల పోరాట వేదిక నాయకులు గుండె శివకుమార్, పి. శ్రీనివాస్, సర్వయ్య, మల్లయ్య, సుధాకర్, మహిళా నాయకురాలు లావణ్య, శోభారాణి తదితరులు పాల్గొన్నారు.

పోడు భూములకు పట్టాలు ఇవ్వాలి

గిరిజన సంఘం
రాష్ట్ర అధ్యక్షులు ధర్మనాయక్



నవతెలంగాణ- సంతోష్ నగర్

పోడు భూములకు పట్టాలను వెంటనే ఇవ్వాలని గిరిజన సంఘం రాష్ట్ర అధ్యక్షులు ఎం.ధర్మనాయక్ కోరారు. శనివారం హైదరాబాద్ గిరిజన సంఘం జిల్లా కార్యాలయంలో ఎం. బాలు నాయక్ గిరిజన సంఘం జిల్లా కార్యదర్శి అధ్యక్షతన నిర్వహించిన సమావేశంలో ప్రదేశ్ ఎరుకల సంఘం రాష్ట్ర సహాయ కార్యదర్శి బి. రఘు, ఆర్. పాండు నాయక్, ఎం. గోపిలతో కలిసి ఆయన మాట్లాడారు. దశాబ్ది ఉత్సవాలలో సీఎం కేసీఆర్ గిరిజనులకు పోడు భూములకు పట్టాలు జూన్ 24 నుంచి 30 వరకు ఇస్తామని చెప్పారని గుర్తుచేశారు. కానీ ఈరోజు చూస్తే మాట తప్పి మరోసారి గిరిజనులకు మోసం చేసేటట్టుగా ఉందని ఆవేదన వ్యక్తం చేశారు. గిరిజనులకు నేటికీ పోడు పట్టాలు రాక, వాటికి వచ్చే రైతుబంధు, రైతు బీమా అందకపోవడం ఇలా.. 17 ఏండ్ల నుండి మోసపోతూనే ఉన్నారని అన్నారు. పోడు భూములను సాగు చేస్తున్న సందర్భాలలో పోలీసులు, ఫారెస్ట్ అధికారుల మధ్య జరిగిన దాడులకు పూర్తిగా రాష్ట్ర ప్రభుత్వమే బాధ్యత వహించి, కేసులన్నీ ఎత్తివేయాలని డిమాండ్ చేశారు. ఫారెస్ట్ భూముల మీద సర్వహక్కులు ఉన్న గిరిజనులకు ఎటువంటి షరతులు లేకుండా హక్కు పత్రాలు ఇచ్చి ఆదుకోవాలని కోరారు.

నర్సింహనగర్ కాలనీలోలో కార్పొరేటర్ పర్యటన

నవతెలంగాణ-కాప్రా



మీర్‌పేట హెచ్‌బీ కాలనీ డివిజన్ పరిధిలోని నర్సింహనగర్ కాలనీలో డ్రయినేజీ, మంచినీటి సరఫరా, ఇతరత్రా సమస్యలపై కాలనీలో పర్యటించిన కార్పొరేటర్ జెరిపోతుల ప్రభుదాస్. అనంతరం ప్రభుదాస్ మాట్లాడుతూ డివిజన్ అభివృద్ధిలో భాగంగా ఎన్నో కార్యక్రమాలు చేసున్నామన్నారు. ప్రతి కాలనీలో సమస్యల పరిష్కారమే లక్ష్యంగా పని చేస్తున్నామని తెలిపారు. రాష్ట్ర ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా చేపట్టిన వార్డు పాలన వ్యవస్థ ద్వారా ఇంకా ఎన్నో సమస్యలకు సత్వర పరిష్కారం దొరుకుతుందన్నారు. కాలనీవాసులు సమస్యలేమైనా ఉంటే తన దృష్టికి తీసుకువస్తే పరిష్కారం దిశగా ముందుకు వెళ్తామని తెలిపారు. ఈ కార్యక్రమంలో జవాన్ ప్రభాకర్, వర్క్ ఇన్‌స్పెక్టర్ చారి, ప్రసాద్, కాలనీ అధ్యకులు అరుణ్, కాలనీవాసులు, స్థానిక నాయకులు రాకేష్, విజయ్, చిన్న సాయి, శ్రీనివాస్, రాజు, సాయి కుమార్, నిసార్ అహ్మద్ గోరి పాల్గొన్నారు.

నిమ్స్‌కు వాటర్ కూలర్స్, పేషెంట్ ట్రాలీలు అందజేత

నవతెలంగాణ-సిటీబ్యూరో



పంజాగుట్ట నిమ్స్ హాస్పిటల్‌లో పేషంట్స్ కోసం ఎంపీఆర్ ఫౌండేషన్ ఆధ్వర్యంలో తాగునీటి కోసం వాటర్ కూలర్స్, పేషంట్ ట్రాలీలను మేడపాటి శ్రీదేవి నిమ్స్ డైరెక్టర్ డాక్టర్ ఎన్.బీరప్పకు అందజేశారు. ఈ సందర్భంగా నిమ్స్ డైరెక్టర్ కృతజ్ఞతలు తెలియజేసి వారిని సత్కరించారు. ఈ కార్యక్రమంలో డిప్యూటీ మెడికల్ సూపరింటెండెంట్ లక్ష్మి భాస్కర్, ఎమర్జెన్సీ ఇన్‌చార్జి డాక్టర్ హస్మాశర్మ, మనోహర్ బాబు, బాపినీడు, నిమ్స్ డాక్టర్స్, సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

26న తహశీల్దార్ కార్యాలయాల ఎదుట ధర్నా

- **తెలంగాణ ప్రజా సంఘాల పోరాట వేదిక మేడ్చల్ జిల్లా కన్వీనర్ జె.చంద్రశేఖర్**
- **పోస్టర్ ఆవిష్కరణ**

నవతెలతంగాణ-కాప్రా



ఇండ్లు, ఇండ్ల స్థలాలు, ఇంటి నిర్మాణానికి రూ.5లక్షలు, నిర్మాణం పూర్తయిన డబుల్ బెడ్ రూమ్ ఇండ్లను వెంటనే ఇల్లు లేని పేదలకు పంపిణీ చేయాలని డిమాండ్ చేస్తూ ఈ నెల 26వ తేదీన జిల్లా వ్యాప్తంగా అన్ని తహిశీల్దార్ కార్యాలయాల ఎదుట నిర్వహించనున్న ధర్నాలో ఇండ్లు లేని పేదలందరూ పాల్గొని జయప్రదం చేయాలని తెలంగాణ ప్రజా సంఘాల పోరాట వేదిక మేడ్చల్ జిల్లా కన్వీనర్ జె.చంద్రశేఖర్, జిల్లా నాయకులు నాగని గళ్ళల బాలపీరు పిలుపునిచ్చారు. శనివారం ఈసీఎల్ కమలా నగర్ ప్రజాసంఘాల పోరాట వేదిక ఆధ్వర్యంలో పోస్టర్‌ను ఆవిష్కరించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ దేశానికి స్వాతంత్రం వచ్చి 75 ఏండ్లు పూర్తయినా నేటికీ పేదలు మరింత పేదలుగా, ఉన్నత వర్గాలు బడా పెట్టుబడిదారులుగా ముందుకు వెళ్తున్నారన్నారు. దేశం, రాష్ట్రంలో ఆర్థిక, సామాజిక అసమానతలు రోజురోజుకూ పెరుగిపోతున్నాయన్నారు. ఏ పార్టీ అధికారం చేపట్టినా పేదలకు మాత్రం నిలువ నీడ లేదనీ, ఉండటానికి ఇల్లు, కుటుంబ పోషణకు సాగుభూమి, చనిపోతే బొంద పెట్టుకోవడానికి ఆరడుగుల స్థలం లేని దుస్థితి నేటికీ కొనసాగడం చాలా దారుణమైన విషయం అన్నారు. పాలకులు ఎన్నికల ముందు గద్దినెక్కడానికి పేదలకు అనేక సంక్షేమ పథకాలు ప్రకటించి వాటిని అమలు చేయడంలో చిత్తశుద్ధి కనబర్చడం లేదన్నారు. బీఆర్ఎస్ ప్రభుత్వం తొమ్మిదేండ్ల పాలనలో అదిగో డబల్ బెడ్ రూమ్.. ఇదిగో డబల్ బెడ్ రూమ్ అని కాలం వెల్లదీశారన్నారు. డబల్ బెడ్ రూమ్ ఇండ్లు ఇవ్వక, స్థలం ఉంటే రూ.5 లక్షలు అనీ, రూ.3 లక్షలు అని అసెంబ్లీ సాక్షిగా ప్రకటించిన ప్రభుత్వం నేటికీ అమలు చేయలేదన్నారు. రాష్ట్రం, జిల్లాల్లో కట్టిన డబుల్ బెడ్ రూమ్ ఇండ్లను ఎందుకు పంచడం లేదని ప్రశ్నించారు. నిన్నగాక మొన్న ఇంటి స్థలం ఉన్నవారికి రూ.3 లక్షలు నిర్మాణానికి ఇస్తున్న ప్రభుత్వం నియోజకవర్గానికి కేవలం 3వేల ఇండ్లు మాత్రమే ఇస్తానని చెప్పడం సరికాదన్నారు. ఇంటి స్థలం ఉండి అర్హత గల ప్రతి ఒక్కరికీ రూ.3 లక్షలు కాకుండా రూ.5 లక్షలు నగదు రూపంలో ఇవ్వాలని డిమాండ్ చేసినారు. పేదలు రోజు కూలీ చేసుకుని కుటుంబం పోషణతో పాటు, పట్టణాల్లో ఇంటి అద్దెలకే తమ కూలీ డబ్బులు మొత్తం చెల్లిస్తున్నారనీ, ఇప్పటికైనా ప్రభుత్వం ఇండ్ల స్థలాలు లేని పేదలందరికీ 120 గజాల స్థలం ఇవ్వాలనీ, గతంలో పట్టా సర్టిఫికెట్లు ఉన్నవారికి ఇంటి స్థలం కేటాయించాలనీ, స్థలమున్న వారికి రూ.5 లక్షలు ఇంటి నిర్మాణానికి ఇవ్వాలనీ, జిల్లాలో పూర్తయిన డబల్ బెడ్ రూమ్ ఇండ్లను అర్హత గల పేదలకు పంచాలని కోరుతూ నిర్వహిస్తున్న ధర్నాలో వేలాదిగా పాల్గొని జయప్రదం చేయాలని కోరారు. ఈ కార్యక్రమంలో తెలంగాణ ప్రజాసంఘాల పోరాట వేదిక మేడ్చల్ నాయకులు సంతోష్ రాథోడ్, లింగస్వామి, సబిత, ఎన్.శ్రీనివాసులు, ఉన్నికృష్ణ, వెంకటేష్, తదితరులు పాల్గొన్నారు.

డ్రయినేజీ ఇక్కట్లు.. తొలిగేదెన్నడో..?

నవతెలంగాణ-నేరేడ్‌మెట్



పెరుగుతున్న జనాభా, నివాసలకనుగుణంగా డ్రయినేజీ వ్యవస్థను ఆధునీకరించకపోవడంతో బొల్లారం డివిజన్ పరిధిలోని లక్ష్మీ ఎన్ క్లేవ్‌లో ప్రజలు ఇబ్బందులు పడుతున్నారు. కాలనీలోని రోడ్డు నెంబర్ 2లో నాలుగు రోజుల నుంచి డ్రయినేజీ నీరు పొంగి పోర్లుతుంది. రోజు రోజుకూ రోడ్డుపై డ్రయినేజీ నీరు చేరడంతో స్థానికుల అవస్థలు అన్నీ.. ఇన్ని.. కావు. సమీపాన పాఠశాల ఉండటంతో రోడ్డు పై డ్రయినేజీ నీరు కారణంగా అటు, ఇటు రాకపోకలకు తీవ్ర అసౌకర్యంగా మారింది. భరించలేని దుర్వాసనతో స్కూల్ పిల్లలు, బాటసారులు ముక్కులు మూసుకుని వెళ్ళాల్సిన దుస్థితి ఏర్పడింది. కంపు కొడుతున్న ఈ రోడ్డు గుండా నడవాలంటే ఇబ్బందిగా ఉందని స్థానికులు, పాదచారులు వాపోతున్నారు. అసలే వర్షా కాలం.. అనునిత్యం రోడ్డుపై డ్రయినేజీ నీరు చేరకుండా సమస్యను శాశ్వతంగా పరిష్కారం చేయాలని స్థానికులు కోరుతున్నారు. ఇకనైనా అధికారులు, పాలకులు కాలనీలో పర్యటనలు చేసి ఈ సమస్య పరిష్కారానికి చర్యలు తీసుకోవాలని ప్రజలు కోరుతున్నారు.

సీఎంఆర్‌ఎఫ్‌తో పేదలకు మేలు



నవతెలంగాణ-నేరేడ్‌మెట్

సీఎంఆర్‌ఎఫ్‌తో పేదలకు వరమని బీఆర్ఎస్ మల్కాజిగిరి నియోజకవర్గం ఇన్‌చార్జి బద్దం పరుశురాంరెడ్డి అన్నారు. అనారోగ్యంతో బాధపడుతున్న పేదలకు మెరుగైన వైద్య చికిత్స కోసం సీఎం సహాయ నిధి(సీఎంఆర్ ఎఫ్) ఎంతో ఉపయోగపడుతుందన్నారు. వినాయక్ నగర్ డివిజన్ పరిధిలోని వినాయక్ నగర్ నివాసి జి.సంతోష్ కు కొంత కాలంగా ఆరోగ్యం బాగా లేదు. మెరుగైన వైద్య చికిత్స కోసం ఆర్థిక సహాయం కోరుతూ సీఎం సహయనిధికి దరఖాస్తు చేసుకున్నారు. ఎమ్మెల్యే మైనంపల్లి హన్మంత రావు రిఫర్ చేయగా.. బాధితుడికు రూ.1,50,000 మంజూరు చేశారు. ఇందుకు సంబంధించిన ఎల్ ఓసీ పత్రాన్ని శనివారం ఎమ్మెల్యే ఆదేశాల మేరకు బీఆర్ఎస్ నాయకులు బాధితుడి కుటుంబ సభ్యులకు అంద జేశారు. ఈ కార్యక్రమంలో డివిజన్ అధ్యక్షుడు తులసి సురేష్, నాయకులు ఫరీద్ భాయ్, బాల్ రాజ్ యాదవ్, బాలకృష్ణ గుప్తా, పాషా భాయ్, ఉమేశ్, పేపర్ శ్రీనివాస్, తదితరులు పాల్గొన్నారు.

సనత్‌నగర్ నియోజకవర్గాన్ని ఆదర్శంగా తీర్చిదిద్దుతా

- **మంత్రి తలసాని శ్రీనివాస్ యాదవ్**
- **సుభాష్‌నగర్, కైలాష్‌నగర్‌లో పాదయాత్ర**



నవతెలంగాణ-బేగంపేట్

ఏండ్లుగా పరిష్కారం కాని అనేక ప్రజా సమస్యలను పరిష్కరించి అభివృద్ధిలో సనత్‌నగర్ నియోజకవర్గాన్ని ఆదర్శంగా తీర్చిదిద్దామని రాష్ట్ర పశుసంవర్ధక, మత్స్య, పాడి పరిశ్రమల అభివృద్ధి, సినిమాటోగ్రఫీ శాఖల మంత్రి తలసాని శ్రీనివాస్ యాదవ్ తెలిపారు. శనివారం సనత్ నగర్ నియోజకవర్గం పరిధిలోని సుభాష్‌నగర్, కైలాష్ నగర్‌లో అధికారులతో కలిసి పాదయాత్ర నిర్వహించి ప్రజల సమస్యలను అడిగి తెలుసుకున్నారు. కొన్ని సమస్యల పరిష్కారం కోసం అధికారులకు అక్కడికక్కడే తగు ఆదేశాలు జారీ చేశారు. ప్రధానంగా డ్రయినేజీ, రోడ్డు సమస్యలను మంత్రి దృష్టికి తీసుకురాగా, నిధులు మంజూరయ్యాయి కానీ జరుగుతున్నాయని పేర్కొన్నారు. డ్రయినేజీ నిర్మాణ పనులు పూర్తయిన వెంటనే రోడ్ల నిర్మాణం చేపట్టనున్నట్టు తెలిపారు. పలు కాలనీల్లో విద్యుత్ తీగలు అస్తవ్యస్తంగా ఉన్నాయని మంత్రికి విన్నవించగా, వెంటనే విద్యుత్ తీగలను సరి చేయాలనీ, అవసరమైన చోట్ల విద్యుత్ స్తంభాలను ఏర్పాటు చేయాలని అధికారులను ఆదేశించారు. ఇనుప విద్యుత్ స్తంభాలను తొలగించి వాటిస్థానంలో సిమెంట్ స్తంభాలను ఏర్పాటు చేయాలని అధికారులను ఆదేశించారు. శిథిలావస్థలో ఉన్న కమ్యూనిటీ హాల్‌ను తొలగించి స్థానిక ప్రజల అవసరాల కోసం మల్టీ పర్పస్ ఫంక్షన్ హాల్ నిర్మాణానికి ప్రతిపాదనలను అందజేయాలని అధికారులను ఆదేశించారు. ఈ సందర్భంగా మంత్రి మాట్లాడుతూ 50, 60 ఏండ్ల నుంచి జరగని అనేక అభివృద్ధి గడిచిన తొమ్మిదేండ్లలో చేసినట్టు తెలిపారు. ఇంకా అనేక అభివృద్ధి పనులు జరుగుతున్నాయని వివరించారు. అభివృద్ధి పనులు, దీర్ఘకాలిక ప్రజా సమస్యలను పరిష్కరించినట్టు చెప్పారు. ఎంతో మంది ప్రాణాలను బలిగొన్న సుభాష్ నగర్ లోని హై టెన్షన్ విద్యుత్ లైన్ తొలగించాలని ఆప్రాంత ప్రజలు ఎంత మొరపెట్టుకున్నా గతంలో ఎవరూ పట్టించుకోలేదనీ, ఈ విషయాన్ని సీఎం దృష్టికి తీసుకెళ్ళి సమస్యను పరిష్కరించినట్టు వివరించారు. నెల రోజుల్లో ఈ ప్రాంతంలో అన్ని అభివృద్ధి పనులను చేపట్టి ప్రజల సమస్యలను పరిష్కరిస్తామని తెలిపారు. కంజర్ల లక్ష్మీనారాయణ యాదవ్ పార్క్‌ను సుమారు రూ.4 కోట్లతో అత్యంత అద్భుతంగా అభివృద్ధి చేస్తున్నట్టు పేర్కొన్నారు. స్మశాన వాటికను కూడా రూ.5 కోట్లతో మహా ప్రస్థానం కంటే గొప్పగా అభివృద్ధి చేయనున్నట్టు చెప్పారు. నియోజకవర్గ ప్రజల అవసరాలను తెలుసుకుని అందుకు అనుగుణంగా అభివృద్ధి పనులను చేపడుతున్నట్టు తెలిపారు. ప్రముఖ బల్కంపేట అమ్మవారి ఆలయాన్ని కూడా ఎంత అభివృద్ధి చేశామో ప్రజలందరికీ తెలుసు అన్నారు. ఆలయం ముందు పక్కన పెద్ద పెద్ద రేకుల షెడ్ల నిర్మాణం రోడ్ల అభివృద్ధి, భక్తులకు అవసరమైన సౌకర్యాలు కల్పించడం వంటివి చేపట్టినట్టు తెలిపారు. జరుగుతున్న అభివృద్ధి, సౌకర్యాలను కల్పిస్తున్న కారణంగా రోజురోజుకూ వచ్చే భక్తుల సంఖ్య కూడా గణనీయంగా పెరిగిందన్నారు. రాష్ట్ర ఆవిర్భావానికి ముందు ఆలయ ఆదాయం రూ.4 కోట్లు ఉండగా, నేడు రూ.22 కోట్లకు పెరిగిందన్నారు. ఈ ఏడాది అమ్మవారి కల్యాణానికి సుమారు 12 లక్షల మంది వరకు భక్తులు హాజరయ్యారనీ, భక్తులు ఎలాంటి అసౌకర్యానికి గురికాకుండా ప్రభుత్వం అన్ని ఏర్పాట్లను చేసిందని గుర్తు చేశారు. మంత్రి వెంట కార్పొరేటర్ కొలన్ లక్ష్మి బాల్ రెడ్డి, డిఈ మోహన్ రెడ్డి, ఈ ఈ ఇందిర, వాటర్ వర్క్స్ జీఎం హరి శంకర్, ఎలెక్ట్రికల్ డిఈ శేఖర్, అమర్నాద్, స్ట్రీట్ లైట్ అధికారి కిరణ్మయి, సుభాష్ నగర్ కాలనీ అధ్యక్షుడు బాలరాజు, చక్రవర్తి, సమి ఉల్లా, గణేష్, మున్నా, నాయకులు ఖలీల్, సరాఫ్ సంతోష్, రాజేష్, పురుషోత్తం, పుష్పలత, పద్మ రుక్మిణి తదితరులు ఉన్నారు.

అంగన్‌వాడీ కేంద్రం సందర్శన

మంత్రి సుభాష్ నగర్ లోని అంగన్ వాడీ కేంద్రాన్ని ఆకస్మికంగా సందర్శించి విద్యార్థుల హాజరు, సౌకర్యాల గురించి నిర్వాహకురాలిని అడిగి తెలుసుకున్నారు. విద్యార్థుల కోసం వండిన భోజనం, కూరను పరిశీలించారు.

ప్రభాకర్‌కు కన్నీటి వీడ్కోలు



నవతెలంగాణ-కంటోన్మెంట్

కంటోన్మెంట్ మాజీ సభ్యుడు, సీనియర్ ఉద్యమకారుడు బి.ప్రభాకర్ అంతిమయాత్ర శనివారం కార్యకర్తలు, అభిమానులు, నాయకులు మధ్య జరిగింది. బోయిన్‌పల్లి చింతకా యట శ్మశాన వాటికలో వందలాది కార్యకర్తలు కన్నీటి వీడ్కోలు పలికారు. ప్రభాకర్ భౌతిక కాయాన్ని చూసేందుకు నగరం నుంచి పలువురు అభిమాలు, కార్యకర్తలు తరలి వచ్చారు. మంత్రి శ్రీనివాస్ యాదవ్‌తో పాటు అభిమానులు అంతిమయాత్రలో పాల్గొని ప్రభాకర్‌కు నివాళులర్పించారు.



ప్రభాకర్ మృతి పట్ల దిగ్భ్రాంతి

కంటోన్మెంట్ బోర్డు మాజీ సభ్యులు ప్రభాకర్ మృతి పట్ల బీఆర్ఎస్ మల్కాజిగిరి పార్లమెంట్, కంటోన్మెంట్ అసెంబ్లీ నియోజకవర్గ ఇన్‌చార్జి మర్రి రాజశేఖర్ రెడ్డి దిగ్భ్రాంతి వ్యక్తం చేశారు. వారి కుటుంబ సభ్యులకు ప్రగాఢ సానుభూతి తెలిపారు. ప్రభాకర్ అంతిమ యాత్రలో పాల్గొని అంత్యక్రియలు పూర్తయ్యే వరకూ దగ్గర ఉండి ఏర్పాట్లను పర్యవేక్షించారు. ప్రభాకర్‌తో తనకున్న అనుబంధాన్ని గుర్తు చేసుకున్నారు. ప్రభాకర్ 3 వార్డు అభివృద్ధికి విశేష కృషి చేశారనీ, వారి అకాల మరణం పార్టీకి తీరని లోటు అని ఆవేదన వ్యక్తం చేశారు. వారి కుటుంబ సభ్యులకు పార్టీ అండగా ఉంటుందని పేర్కొన్నారు. అంతిమ యాత్రలో కార్మికశాఖ మంత్రి మల్లారెడ్డి, చైర్మన్లు గజ్జెల నగేష్, ఎర్రోళ్ల శ్రీనివాస్, కంటోన్మెంట్ బోర్డు మాజీ సభ్యులు, తదితరులు పాల్గొన్నారు.

మౌలిక సదుపాయాల కల్పనకు చర్యలు

- **ఎమ్మెల్యే మైనంపల్లి హనుమంతరావు**

నవతెలంగాణ-నేరేడ్‌మెట్



కాలనీల్లో మౌలిక సదుపాయాల కల్పనకు తగిన చర్యలు తీసుకుంటామని మల్కాజిగిరి ఎమ్మెల్యే మైనంపల్లి హనుమంతరావు అన్నారు. శనివారం ఆయన 133 మచ్చ బొల్లారం డివిజన్ కౌకూరులోని కావేరీ కాలనీ, వెంకుసా ఎస్టేట్ వద్ద స్థానిక కార్పొరేటర్ రాజ్ జితేంద్ర నాథ్‌తో కలిసి పర్యటించారు. ఈ సందర్భంగా ఆయన స్థానికులు ఎదుర్కొంటున్న సమస్యలను అడిగి తెలుసుకున్నారు. డ్రయినేజీ ఓవర్‌ఫ్లో, కమ్యూనిటీ హాల్, పార్క్ అభివృద్ధి, లైటింగ్, బ్యాలెన్స్ రోడ్లు తదితర సమస్యలను పరిష్కరించాలని కాలనీలు ప్రజలు ఎమ్మెల్యేను కోరారు. దీనికి వెంటనే స్పందించిన ఎమ్మెల్యే, సంబంధితశాఖ అధికారులకు ఫోన్ చేసి సమస్యలను పరిష్కరించాలని ఆదేశించారు. ఈ కార్యక్రమంలో ఏసీపీ వెంకట్‌రెడ్డి, ఎంహెచ్‌ఓ సీతారామ్, గంగాధర్, డీఈలు మహేష్, సాంబయ్య, డీజీఎం భాస్కర్, మేనేజర్ మల్లికార్జున్, ఏఈ అనిల్, మేనేజర్ రమేష్, ఎస్ఎస్ ప్రభాకర్, ఏఈ స్వాతి, వర్క్ ఇన్‌స్పెక్టర్ అఫ్రోజ్, నాయకులు సురేందర్ రెడ్డి, శ్రీశైలం, మల్లికార్జున్, కొండయ్య, శ్రవణ్, శ్రీనివాస్‌గౌడ్, వెంకటేష్, కొండయ్య, ఉపేందర్‌రెడ్డి పాల్గొన్నారు.

సీఎం కేసీఆర్‌కు కృతజ్ఞతలు

- **తెలంగాణ ఉద్యోగుల సంఘం రాష్ట్ర అధ్యక్షులు మార్త రమేశ్**



నవతెలంగాణ-సిటీబ్యూరో

సీఎం కేసీఆర్ రాష్ట్ర అవతరణ దశాబ్ది వేడుకల్లో భాగంగా దాదాపుగా అన్ని రంగాలను సంతృప్తిపరిచే విధంగా వివిధ కార్యక్రమాలను రూపకల్పన చేసి ఎంతో ఘనంగా వేడుకలు నిర్వహించారు. విశిష్టమైన సేవలు అందించిన ప్రతి ఒక్కరినీ గుర్తించి ప్రశంసించారు. సీఎం కేసీఆర్‌కు తెలంగాణ ఉద్యోగుల సంఘం తరపున కృతజ్ఞతలు తెలియజేస్తున్నాం' అని సంఘం రాష్ట్ర అధ్యక్షులు మార్త రమేశ్ తెలిపారు. శనివారం ఒక ప్రకటన విడుదల చేశారు. సీఎం కేసీఆర్ ఉద్యమ సమయంలో చెప్పినట్టుగానే రాష్ట్ర ప్రభుత్వం ఉద్యోగుల ఫ్రెండ్లీ గవర్నమెంట్‌గా ఉందన్నారు. గొప్ప పీఆర్సీని ప్రకటించి ఉద్యోగులు గౌరవంగా బతికే విధంగా చారిత్రాత్మకమైన నిర్ణయం తీసుకున్నట్టు తెలిపారు. కరోనా సమయంలో కూడా ఉద్యోగులకు కొంచెం కూడా ఇబ్బంది కలగకుండా జీతాలు అందజేశారని తెలిపారు. ప్రస్తుతం దశాబ్ది వేడుకల్లో భాగంగా ఇల్లు కట్టుకునే ఉద్యోగులకు రూ.30 లక్షలు అడ్వాన్స్ ఇవ్వడం, 30శాతం ట్రాన్స్‌పోర్టు అలవెన్స్, 30శాతం ట్రావెలింగ్ అలవెన్స్, ఉద్యోగి ఇంట్లో పెండ్లి అయితే రూ.4లక్షల అడ్వాన్స్ ఇవ్వడం తదితర ప్రయోజనాలు కల్పించడానికి నిర్ణయించి వెంటనే జీవోలు కూడా విడుదల చేయడం ఎంతో ఆనందదాయకం అన్నారు. సీఎం కేసీఆర్ గొప్ప మనసును అర్థం చేసుకుని ఉద్యోగులందరూ వారి ఆదేశాల మేరకు శక్తివంచన లేకుండా రాష్ట్ర అభివృద్ధికి కృషి చేస్తారని తెలంగాణ ఉద్యోగుల సంఘం తరపున హామీనిస్తున్నట్టు తెలిపారు.

శ్రీసహస్ర లింగేశ్వర స్వామి ధర్మకర్త మండలి కమిటీ నియామకాన్ని రద్దు చేయాలి



నవతెలంగాణ-కాప్రా

హైకోర్టు ఆదేశాలకు విరుద్ధంగా నియమించిన ఏఎస్ రావునగర్ డివిజన్ పరిధిలోని టిఎస్ఐఐసి కాలనీలోని శ్రీ సహస్ర లింగేశ్వర స్వామి దేవస్థానం ధర్మకర్తల మండలి కమిటీ నియామకాన్ని నిలిపివేయాలని కోరుతూ స్థానిక కార్పొరేటర్ సింగిరెడ్డి శిరీష సోమశేఖర్ రెడ్డి, ఆలయ కమిటీ మాజీ చైర్మన్ కొత్త అంజిరెడ్డి శనివారం తెలంగాణ దేవాదాయ ధర్మాదాయ శాఖ కమిషనర్‌కు వినతిపత్రం అందజేశారు. హైకోర్టు మధ్యంతర ఉత్తర్వుల ప్రకారం ఆలయ వార్షిక ఆదాయం రూ.25 లక్షల నుంచి రూ.కోటి మధ్య ఉన్నందున ఆలయానికి ధార్మిక పరిషత్ మాత్రమే ధర్మకర్తల మండలిని నియమించాలని రాష్ట్ర ఉన్నత న్యాయస్థానం ఆదేశాలు జారీ చేసిందని గుర్తు చేశారు. దీనికి విరుద్ధంగా ధర్మకర్తల మండలిని నియమిస్తూ జారీ చేసిన ఉత్తర్వులు రాష్ట్ర హైకోర్టు ఆదేశాలకు విరుద్ధంగా ఉన్నాయని తెలిపారు. కోవిడ్ కారణంగా 2021-2022లో రాష్ట్ర వ్యాప్తంగా అన్ని ఆలయాలకు ఆదాయం తగ్గినట్టుగానే సదరు ఆలయానికి కూడా ఆదాయం తగ్గిందన్నారు. మళ్ళీ 2022- 2023, 2023- 2024లో వార్షికాదాయం పెరిగి రూ.25 లక్షలు దాటిందన్నారు. ఈ ఆలయం దేవాదాయశాఖ చట్టం 6 ఏ ఐఐగా ఉన్నందున రాష్ట్ర ఉన్నత న్యాయస్థానం ఉత్తర్వుల ప్రకారం ధార్మిక పరిషత్ మాత్రమే ధర్మకర్తల మండలిని నియమించాల్సి ఉన్నందున, ధర్మకర్తల మండలి నియామకం ఉత్తర్వులను ఉపసంహరించాలని కోరారు. లేనిపక్షంలో హైకోర్టు ఆదేశాలను ధిక్కరించినట్టుగా పరిగణించాల్సి వస్తుందనీ, దీన్ని దృష్టిలో పెట్టుకుని కమిటీని రద్దు చేయాలని కోరారు. దేవాదాయ ధర్మాదాయ శాఖ అదనపు కమిషనర్ ఎంఎండి.కృష్ణవేణి కమిటీని రద్దు చేస్తామని హామీనిచ్చినట్టు వారు తెలిపారు.

IN THE COURT OF MOTOR ACCIDENTS CLAIMS TRIBUNAL (HON'BLE PRINCIPAL DISTRICT JUDGE) AT KHAMMAM.
MVOP NO. 660/2022

Between :
Mavuram Rajeswari @ Rajamani & another
.....Claim Petitioners
AND
Porika Jayanthi & others
.........Respondents

To,
Porika Jayanthi, W/o. Suresh Bojappa, age 46 yers, Occ : Driver of Swift LXI car bearing no. KA 03 MM 3319, R/o. Flat No. A-21 IDBI Bank Quarters Basara, Gachibowli, Hyderabad. Cell : 889771186
2) Bojjappa Suresh, S/o. BojjappaT Age : major, Occ : Owner of Driver of Swift LXI car bearing No. KA 03 MM 3319, R/o. Flat No. 203, Sherief Apartments19, Serpentine Street, Richmond Town, Benguluru - 5600025, Cell : 8879001184

The claim petitioners above named had filed the petition against you for compensation and said petition is posted to **10-07-2023.** This you are hereby directed to appear before this court in person or by a pleader duly instructed on 10th july 2023 at 10.30 AM to show cause against the said petition, failing which you will be set ex-parte and the matter will be heard and decided on merits.

.// By order of the Court//
V.S. CHANDRA SEKHAR
Advocate,Khammam.
Cell : 6305503370

IN THE COURT OF THE HON'BLE MOTOR ACCIDENTS CLAIMS TRIBUNAL-CUM-VIII ADDITIONAL DISTRICT JUDGE, RANGA REDDY DISTRICT, AT: L.B.NAGAR
O.P.NO.470 OF 2022

BETWEEN:
CHALUVADHI SRI HITHA
.. PETITIONER
A N D
MOHAMMED SHABBIR PASHA
And others
.. RESPONDENTS

To
R-1 MOHAMMED SHABBIR PASHA, S/o Mohammed Ghouse, Aged: Major, Occ: Owner of Crime Vehicle, R/o H.No.4-26-79/5/10, Suleman Nagar, Chintalmet, Rajendranagar, Ranga Reddy District

NOTICE

The Petitioner herein had filed the above petition for compensation under Section 166 of the M.V.Act, 1988 and Rule 475/1B of A.P.M.V.Rules, 1989 for injuries occurred in the motor vehicleaccident against the Respondents which includes you. The Hon'ble Court was pleasedto-order for publication of this notice for your appearance in the above Petition and the matter is postedto **10.07.2023 at 10.30 a.m.** and therefore you may appear before this Hon'ble Court either personally or through your authorized counsel or other-wise the matter will be adjudicatedindue-process of Law. Hence, this Notice.

[BY ORDER OF THE COURT]
Sd/-
G.RATHNAM REDDY,
Advocate,
11-6-227, Pochamma Bagh, Beside GHMC Office, Saroor nagar, Hyderabad
Cell No.9912658614

IN THE COURT OF THE HON'BLE SENIOR CIVIL JUDGE AT BHONGIR
O.S. NO 13 OF 2020

BETWEEN:
M/s Narne Estates Pvt Ltd
Rep by its Chairman and Managing Director, Col (Retd) Ranga Rao, s/o late N V Naidu, Aged 78 years, occ: Business, R/o 86 Gunrock Enclave, Karkhana, Secunderabad
..... PLAINTIFF
AND
Durusetty Nagamanemma & another
..... DEFENDANTS

DEFENDANT NO 1 & 2
1. Durusetty Nagamanemma, w/o Durusetty Thirupathaiah, Aged about 80 years, occ: Agriculturist
R/o Kondamadugu Village, Bibinagar Mandal, Yadadri-Bhuvanagiri District
2. N Gopal Naidu, s/o late N V Naidu, Aged about 79 years, occ: Business, R/o H No 12-114, Balaji Nagar, J J Nagar, Post Yapral, Secunderabad

The above named Plaintiff has filed a suit for Specific Performance. You are the Defendant Nos 1 & 2 in the suit and you are hereby directed to appear before the Hon'ble Senior Civil Judge at Bhongir on **26-06-2023 at 10:30 am** either in person or through an Advocate failing which the matter will be decided in accordance with Law.

BY ORDER OF THE COURT
V V L Sujatha
Advocate
Ph: 9440412044

IN THE COURT OF THE HON'BLE JUNIOR CIVIL JUDGE: R.R.DISTRICT. AT: HAYATHNAGAR.
O.S.NO. 495 OF 2019.

Between:
Chamarti Sree Padma & another
..... Plaintiffs
A N D
The Tahsildar Hayathnagar Mandal & another
..... Defendants

To,
All Concerned
... Defendant No.2

Please take notice that the Plaintiffs have filed the above suit against the Defendants in suit to declare the missing man Chamarti Venkata Raman as dead and to declare the Plaintiffs are the joint owners of the suit schedule property being the legal heirs of Chamarti Venkata Raman. The above suit is posted to 10-07-2023. You are hereby summoned to appear before the Hon'ble Court on **10-07-2023**, at about **10.30 A.M.** either in person or through an Advocate, failing which the matter will be decided as per law. Hence this notice.

SCHEDULE OF PROPERTY

All that piece and Parcel of H.No.4-9-161/7/A (old), 4-9-608 (New), constructed on Plot No.40, admeasuring 168 Sq.yards, or 140.46 Sq. Meters, in Sy. Nos.66 and 67, out of the Layout consisting of Sy.Nos.44 to 47, 65 to 68, 75 and 76, having a plinth area of 654 Sq.ft, situated at Vinayaka Nagar in Bagh Hayathnagar Village, Hayathnagar Circle, G.H.M.C. Hayathnagar Revenue Mandal, Ranga Reddy District, T.S. and bounded by: **NORTH**: House on Plot No.39, **SOUTH**: House on Plot No.41, **EAST**: House on Plot No.45, **WEST**: 20' wide Road

(BY ORDER OF THE COURT)
M/s.HEMANTH PRAVEEN KUMAR
Advocate & Associates
Plot No.71, Raghavendra Nagar, Hayathnagar, Hyderabad
Counsel for the Plaintiffs.

IN THE COURT OF 1st ADDL. CHIEF JUDGE CITY CIVIL COURT AT SECUNDERABAD
O.S.No. 38 OF 2023

Between:-
1. Sri P. Sudarshan Reddy, S/o P. Chinna Reddy,
2. Dr. P. Preetam Kumar, S/o P. Sudarshan Reddy,
Both are R/o Flat No. B-3, Gamut, Dilosso Apartments, Near Jagannatha Temple, Road No.12, Banjara Hills, Hyderabad – 500034.
3. Mrs. Dokuru Neelima Reddy, D/o P. Sudrshan Reddy, W/o Dokuru Prabhakar Reddy, R/o Flat No. O-502, 5th Floor, Tower 2, Olympus Wing, Halcyon, Road No.78, Jubilee Hills, Hyderabad - 500033.
.....Plaintiffs
A n d
1. All concerned
2. Tahsildar, Tirumalgiri Tahsil, Hyderabad District.
.....Defendants
(Defendant No.2 is a formal party and not a necessary party in this suit)

The above named plaintiffs filed suit for declaring them as legal heirs of late Late P. Bharathi Rani and issuance of Legal Heir Certificate against part and parcel of Plot No. 6 forming part of Sy. No. 129/2 admeasuring 505 Sq. Yards equivalent to 422.18 Sq. Meters situated in the layout plan of Vanita Co-Operative Housing Society, Bowenpally, Secunderabad (Part of GLR Sy. No. 609/Part) before the above said Hon'ble Court and the same is posted on 19/07/2023. If anyone is having any objection may appear on **19/07/2023** at about **10=30 A.M.** before this Hon'ble Court in person or through their counsel without fail, in default the matter will be decided in your absence as per law.

(BY ORDER OF THE COURT)
B.N.SWAMIJI,
G. NARSIMULU,
Advocates,
Flat No. 501, A-Block, Sai Brindavan, Nagarjuna Nagar, Tarnaka, Secunderabad. Ph: 9391036739
bnswamiji64@gmail.com

IN THE COURT OF HON'BLE JUNIOR CIVIL JUDGE AT HAYATIMAGAR
O. S. No. 441 OF 2023

BETWEEN:
Syed Haleema Begam, W/o. Late. Syed Moinuddin & 5 Others
.....Plaintiffs
AND
The Thashildhar Abdullapurmet Revenue Mandal
All Concerned
.....Defendants

The general public is hereby informed that, the Plaintiffs, have filed the suit for declaration and to declare them as legal heirs of his deceased Late. Syed Moinuddin, S/o. Syed Kareemuddin, who died on 27.10.2021, leaving behind his children, as her absolute legal heir for the below mentioned scheduled property. The above suit is posted on 07.07.2023. If any persons are having any objections, they may appear before the Hon'ble Court (Or) else the Hon'ble Court may pass the orders as per the Law.

SCHEDULED PROPERTY - "A"

All that Plot No. 28, admeasuring 267 Sq. Yards (or) 223.24 Sq. Mtrs, in Sy. No. 126 to 128, situated at Abdullapurmet Village / Gram Panchavat / Mandal, (Erstwhile Hayathnagar Revenue Mandal) Ranga Reddy District, Telangana State.
North : Plot No. 27
South : Plot No. 29
East : Plot No. 33
West : 25' Feet Wide Road

SCHEDULED PROPERTY - "B"

All that part and parcel of land bearing Plot No. 20W1, admeasuring 200 Sq. Yards (or) 167.23 Sq. Mtrs, in Sy. No. 18, 47, 51, 52, and 54, situated at 13hagyanagar Colony, Anajpur Village / Grampanchavat, Abdullapurmet Mandal (Erstwhile Hayathnagar Revenue Mandal), Ranga Reddy District, Telangana State.
North : Plot No. 201/1, South : Road, East : Road: West : Plot No. 203/1

//By order of the Court//
M/s. Chakravarthy Talluri
Advocate
Mobile: 99890 66858, 94910 55858
4-7-370, Hayathnagar, Ranga Reddy District- 501 505, Telangana
Counsel for the Plaintiffs

ఊపిరి ఉన్నంతవరకు బీసీల అభ్యున్నతికి పోరాడుతా

బీసీ సంక్షేమ సంఘం జాతీయ అధ్యక్షులు ఎంపీ ఆర్ కృష్ణయ్య



నవతెలంగాణ-అడిక్‌మెట్

ఓపిక ఉన్నంతవరకు కాదు ఊపిరి ఉన్నంతవరకు బీసీల అభ్యున్నతికి కృషి చేస్తానని బీసీ సంక్షేమ సంఘం జాతీయ అధ్యక్షులు ఎంపీ ఆర్ కృష్ణయ్య తెలిపారు. రాజ్యసభ సభ్యులుగా ప్రమాణ స్వీకారం చేసి ఏడాది గడిచిన సందర్భంగా బీసీ యువజన సంఘం రాష్ట్ర కన్వీనర్ ఆర్ రాజ్ కుమార్ ఆధ్వర్యంలో విద్యానగర్ బిసి భవన్ లో వేడుకలు నిర్వహించి కృష్ణయ్యను ఘనంగా సన్మానించారు. ఈ సందర్భంగా రాజ్ కుమార్ మాట్లాడుతూ. ఆర్ కృష్ణయ్య నేతృత్వంలో బీసీ బిల్లు సాధించే వరకు ఉద్యమం కొనసాగిస్తామన్నారు. బీసీల అభ్యున్నతికి నిరంతరం పాటు పడతామని తెలిపారు. ఈ కార్య క్రమంలో బీసీ సంక్షేమ సంఘం జాతీయ కన్వీనర్ గుజ్జ కృష్ణ, రాష్ట్ర ప్రధాన కార్యదర్శి నందగోపాల్, హైదరాబాద్ అధ్యక్షులు భూపేష్ సాగర్, నాయకులు నిఖిల్ తదితరులు పాల్గొన్నారు.

ఉచిత వైద్య శిబిరం



నవతెలంగాణ -సుల్తాన్ బజార్

నిక్షయ్ దివాస్ కార్యక్రమంలో భాగంగా శనివారం ముస్లిం జంగ్ పూల్ చౌరస్తా వద్ద అమన్ వేదిక ఆధ్వర్యంలో ఉచిత వైద్య శిబిరం నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ టీబీని అంతం చేయాలని, దానికి అందరి సహా య సహకారం కావాలని ఉస్మానియా ఆస్పత్రి సూపర్వైజర్ ఖలీల్ అహ్మద్ అన్నారు.ప్రముఖ వైద్యులు డాక్టర్ విజయకుమార్ పాల్గొని రోగులను పరీక్షించి మందులను అందించారు. అనంతరం టీబీ పై సూపర్వైజర్ ఖలీల్ అమ్మద్ మాట్లాడుతూ.. మందులు వాడుతున్న వారికి ప్రతినెల 500/- రూపాయలు (ప్రభుత్వం నుండి తమ తమ అకౌంట్ ని జమా చేయటం జరుగు కుందని చెప్పారు. ఈ కార్యక్రమంలో డాక్టర్ రవికుమార్. పీబీహెచ్‌వీ అమరావతి, కో-ఆర్డినేటర్ సుభద్ర, ఎస్ఎల్‌టీబీటసీ కోర్డినేటర్ స్రవంతి. వినయ్ కుమార్ రఘునాథ్ శివమణి. పాల్గొన్నారు.

జీవించే హక్కులు కోల్పోతున్న బడుగు వర్గాలు

- భారత రాజ్యాంగం ప్రజలందరికీ సమాన హక్కులు కల్పించింది
- జస్టిస్ చంద్రయ్య



నవతెలంగాణ-ముషీరాబాద్

భారత రాజ్యాంగం దేశ ప్రజలందరికీ సమాన అవకాశాలు కల్పించిందని, మానవ హక్కుల కమిషన్ రిటైర్డ్ చైర్మెన్ జస్టిస్ చంద్రయ్య పేర్కొన్నారు. శనివారం సుందరయ్య విజ్ఞాన కేంద్రంలో బంధుసొసైటీ హైదరాబాద్ ఆధ్వర్యంలో జస్టిస్ చంద్రయ్యకు బహుజనుల ఆత్మీయ సన్మానం నిర్వహించారు. అనంతరం బంధు సొసైటీ అధ్యక్షులు పల్లెల వీరస్వామి అధ్యక్షతన మానవ హక్కులు పరిరక్షణ అనే అంశంపై సదస్సు నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథులుగా జస్టిస్ చంద్రయ్య, ఐఆర్టీఎస్ రిటైర్డ్ సౌత్ సెంట్రల్ రైల్వే చీఫ్ కమర్షియల్ మేనేజర్ డాక్టర్ అప్పికట్ల భరత్ భూషణ్, ఎన్టిపిసి డిప్యూటీ జనరల్ మేనేజర్ వి ఆర్ ఎస్, ప్రొఫెసర్ నతనీయులు హాజరయ్యారు. ఈ సందర్భంగా జస్టిస్ చంద్రయ్య మాట్లాడుతూ షెడ్యూల్డ్ కులాలు తెగలు వెనుకబడిన తరగతుల ప్రజలకు వివక్షత హక్కుల వలన దేశ వ్యాప్తంగా జరుగుతుందన్నారు. పల్లెల వీరస్వామి మాట్లాడుతూ తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వం దళితులకు మూడెకరాల హామీని నెరవేర్చకపోగా, గత ప్రభుత్వాలు షెడ్యూల్ కులాలకు తెగలకు వెనుకబడిన కులాలకు ఇచ్చిన అసైన్డ్ భూములను అభివృద్ధి పేరుతో గుంజుకొని జీవించే హక్కు లేకుండా చేస్తుందని ఆవేదన వ్యక్తం చేశారు. ఈ కార్యక్రమంలో ప్రముఖ సర్జన్ డాక్టర్ రాజమౌళి కాంగ్రెస్ నాయకులు గొల్లపల్లి దయానంద్, కెవిపిఎస్ నాయకులు అజయ్ బాబు తదితరులు పాల్గొన్నారు

నాయీ బ్రాహ్మణులకు ఉద్యోగ భద్రత కల్పించాలి



- రాచకొండ జానకిరామ్ నాయి

నవతెలంగాణ-సుల్తాన్ బజార్

కళ్యాణ కట్టల్లో పనిచేస్తున్న నాయీ బ్రాహ్మణుల ఉద్యోగ భద్రత కల్పించాలని తెలంగాణ రాష్ట్ర దేవాలయాల కల్యాణకట్టల నాయీ బ్రాహ్మణ సంఘం (జేఏసీ) అధ్యక్షుడు రాచకొండ జానకిరామ్ నాయి అన్నారు. శనివారం బొగ్గుల కుంటలోని దేవాదాయ ధర్మాదాయ కార్యాలయంలో దేవాదాయ ధర్మాదాయ శాఖ కమిషనర్‌ను కలిసి వినతి పత్రం అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. కొన్ని ఏళ్లుగాగా కళ్యాణ కట్టల్లో పనిచేస్తున్న నాయీ బ్రాహ్మణులను ప్రభుత్వం వెంటనే పర్మినెంట్ చేయాలని కోరారు. సీఎం కేసీఆర్ 2017 మార్చి 13న దేవాలయ కళ్యాణకట్టలో పనిచేస్తున్న నాయి బ్రాహ్మణులను ఎండోమెంట్ నిబంధనలకు అనుగుణంగా ఉద్యోగులుగా గుర్తించి 15 రోజుల్లో జీవోను విడుదల చేస్తామని ప్రగతి భవన్‌లో ప్రకటించారని గుర్తు చేశారు. సీఎం చెప్పినట్టుగానే కళ్యాణ కట్టల్లో పనిచేస్తున్న నాయి బ్రాహ్మణులను వెంటనే పర్మినెంట్ చేసి ఉద్యోగ భద్రత కల్పించాలని కోరారు. ఈ కార్యక్రమంలో యాదాద్రి శ్రీ లక్ష్మీనరసింహస్వామి దేవస్థానం కళ్యాణకట్ట నాయీ బ్రాహ్మణ సంఘం అధ్యక్షులు , జేఏసీ ఉపాధ్యక్షులు రాచకొండ రమేష్ నాయి. నల్లగొండ నాచారం నరసింహ నాయి ఉపాధ్యక్షులు కందునూరి భగవాన్ నాయి. ప్రధాన కార్య దర్శి రాచకొండ హరికుమార్ నాయీ కోశాధికారి వెంకటేష్ నాయక్. నాయి బ్రాహ్మణులు పాల్గొన్నారు.

ఇస్లామ్‌పై ప్రజల్లో గందర గోళం వద్దు

ఐఐసీ డైరెక్టర్ వహాజ్ హాష్మి



నవతెలంగాణ-ధూల్‌పేట్

ప్రజల్లో ఇస్లామ్ పట్ల గందరగోళం వద్దని ఐఐసీ డైరెక్టర్ వహాజ్ హాష్మి తెలిపారు. ఇస్లామ్ పై ఉన్న అపోహలు తెలుసుకునేందుకు టోల్ ఫ్రీ నెంబరు ఇస్లామిక్ ఇన్ఫర్మేషన్ సెంటర్(ఐఐసీ) ఏర్పాటు చేసిన సందర్భంగా పాతబస్తీ చెత్త బజార్ లో ఏర్పాటు చేసిన సమావేశంలో ఆయన పాల్గొని మాట్లాడారు. ఇస్లామ్ అంటే శాంతి, సమర్పణ, విధేయత అనే అర్థాలున్నాయని, ఇస్లామ్ ధర్మాన్ని హింసతో ముడపెట్టే ఎన్నో కథనాలు రోజూ పత్రికల్లో, టీవీల్లో వస్తుంటాయన్నారు. ఎన్ని రకాలుగా ఇస్లామ్‌ను కించపర్చి, అపకీర్తి పాలు చేయొచ్చో అన్ని విధాలను మీడియాను వాడుకుంటున్నారన్నారు. ప్రజల్లో ఇస్లామ్ పట్ల గందరగోళానికి, అపార్థాలకు గురిచేయడంలో మీడియా తనవంతు పాత్ర పోషిస్తూనే ఉన్నాయని అన్నారు. ఆపోహలు, అపార్థాలు దూరమవనంతవరకూ వర్గాల మధ్య విశ్వసనీయత ఉండదని, అభద్రతాభావం వెంటాడుతుంటుందన్నారు. ఇస్లామ్ పై ఉన్న డౌట్స్ క్లియర్ చేసుకునేందుకు నెలకు వందల సంఖ్యలో కాల్స్ వస్తుంటాయని పేర్కొన్నారు.

మౌలిక సదుపాయాల కల్పనకు కృషి : ఎమ్మెల్యే కాలేరు వెంకటేశ్



నవతెలంగాణ-అంబర్‌పేట:

మౌలిక సదుపాయాల కల్పనకు నిరంతరం కృషి చేస్తున్నానని అంబర్‌పేట ఎమ్మెల్యే కాలేరు వెంకటేశ్ అన్నారు. శనివారం గోల్నాక డివిజన్ పరిధిలోని ఖాద్రిబాగ్, అశోకనగర్, గంగానగర్ ప్రాంతాల్లో స్థానిక అధికారులతో కలిసి పర్యటించి అక్కడి ప్రజలతో మాట్లాడి వారి సమస్యలను అడిగి తెలుసుకొని ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఖాద్రిబాగ్‌లో తాగునీరు సమస్యగా ఉందని, అలాగే నీరు వదిలే సమయాన్ని మధ్యాహ్నం నుండి ఉదయం వేళకు మార్చాలని, అలాగే మ్యాన్ హెూల్స్ పై కొత్త సిమెంట్ మూతలను వేయించాలని స్థానికులు కోరారు. అశోకనగర్ లో కొత్త డ్రయినేజీ లైన్ కావాలని, అలాగే ప్రస్తుతం ఉన్న కాల్వల్లో మురుగును తీసి పరిశుభ్రం చేయించాలని స్థానికులు ఎమ్మెల్యేకి విజ్ఞప్తి చేశారు. వెంటనే స్పందించిన ఎమ్మెల్యే అధికారులకు ఈ సమస్యలన్నీ వెంటనే పరిష్కరించాలని సంబంధిత అధికారులను ఆదేశించారు. ఈ కార్యక్రమంలో అధికారులు, నాయకులు పాల్గొన్నారు.

'ఎన్నికల గుర్తు కప్పు-సాసర్ కేటాయించాలి'

దళిత బహుజన పార్టీ జాతీయ అధ్యక్షులు వడ్లమూరి కృష్ణ స్వరూప్



నవతెలంగాణ-హిమాయత్ నగర్

తెలంగాణ రాష్ట్ర అసెంబ్లీ ఎన్నికల్లో దళిత బహుజన పార్టీకి ఎన్నికల గుర్తు 'కప్పు-సాసర్' కేటాయించాలని ఎలక్షన్ కమిషన్ ఆఫ్ ఇండియా ఈసీఐ సెక్రటరీకి శనివారం వినతి పత్రం అందజేసినట్లు ఆ పార్టీ జాతీయ అధ్యక్షులు వడ్లమూరి కృష్ణ స్వరూప్ తెలిపారు. అనంతరం న్యూఢిల్లీలోని తెలంగాణ భవన్‌లో గల భారత రాజ్యాంగ నిర్మాత డాక్టర్ బి.ఆర్.అంబేద్కర్ విగ్రహానికి ఘనంగా నివాళులు అర్పించినట్లు ఆయన ఒక ప్రకటనలో పేర్కొన్నారు. తెలంగాణలోని దొర లు, దోపిడీ కులాల నేతృత్వంలోని బీఆర్ఎస్, కాంగ్రెస్, బీజేపీలు తోడు దొంగల పార్టీలేనని విమర్శించారు. రానున్న ఎన్నికల్లో ఈ పార్టీలను ఓడించాలని, దళిత బహుజన పార్టీ అభ్యర్థులకు ఓటు వేసి అండ దండలు అందించాలని ఆయన విజ్ఞప్తి చేశారు. ఈ కార్యక్రమంలో పార్టీ జాతీయ వర్కింగ్ ప్రెసిడెంట్ వసంత్ పాటిల్, పార్టీ తెలంగాణ రాష్ట్ర శాఖ చీఫ్ అడ్వైజర్ డాక్టర్ వి.ఎల్.రాజు తదితరులు పాల్గొన్నారు.

విద్యార్థి దశ నుండే నాయకత్వ లక్షణాలను అలవర్చుకోవాలి

ఐపీఎస్ ఎం. అభినవ్



నవతెలంగాణ-ధూల్‌పేట్

ప్రతి విద్యార్థి చదువుతో పాటు వివిధ రంగాలలో ప్రతిభ కనబర్చాలని, అప్పుడే వారు అనుకున్న లక్ష్యాలను చేరుకుని తాము కన్న కలలను సాకారం చేసుకునే అవకాశం ఉంటుందని..ఎస్వీపీ నేషనల్ పోలీస్ అకాడమీ డైరెక్టర్ ఎం. అభినవ్ పేర్కొన్నారు. ఈ మేరకు శనివారం అబిడ్స్ లోని లిటిల్ ఫ్లవర్ ఉన్నత పాఠశాలలో ప్రిన్సిపాల్ బ్రదర్ షాజన్ ఆంటోనీ నేతృత్వంలో పాఠశాల క్యాబినెట్ ఇన్వెస్ట్ టీచర్స్ కార్యక్రమం నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ఆయన ముఖ్యఅతిథిగా హాజరై.. జ్యోతి ప్రజ్వలన చేసి ఘనంగా ప్రారంభించారు. ఈ సందర్భంగా పలువురు విద్యార్థిని, విద్యార్థినులను క్యాబినెట్ సభ్యులుగా ప్రమాణం చేయించారు.

ప్రజాస్వామ్యం బలోపేతానికి సీపీఐ(ఎం) కృషి

- ఓల్డ్ సిటీ పార్టీ కార్యకర్తల శిక్షణా శిబిరం లో వక్తలు..



నవతెలంగాణ-ధూల్‌పేట్

దేశంలో ప్రజాస్వామ్యం బలోపేతానికి సీపీఐ(ఎం) కృషి చేస్తుందని పలువురు వక్తలు పేర్కొన్నారు. పార్టీ ఆధ్వర్యంలో ఓల్డ్ సిటీ పార్టీ కార్యకర్తల శిక్షణా శిబిరం ఐఎస్ సదన్ చౌరస్తాలో పార్టీ కార్యాలయంలో నిర్వహించాలి. సీపీఐ(ఎం) సౌత్ జిల్లా నాయకులు అబ్దుల్ సత్తార్, ఎం.మీ లు మాట్లాడుతూ దేశంలో సకల జనుల హక్కుల్ని కేంద్ర బీజేపీ ప్రభుత్వం నిర్వీర్యం చేస్తున్నారు. పాలకులు మరో వైపు నిర్లక్ష్యంగా వ్యవహరిస్తున్నారన్నారు. ప్రజా స్వామ్య రక్షణకు సీపీఎం కృషి చేస్తుందన్నారు. జిల్లా నాయకులు ఎల్.కోటయ్య అధ్యక్షతన జరిగిన 2 రోజుల శిక్షణా శిబిరంలో వారు బోధించారు.

డాక్టర్. ఎస్. విజయ భాస్కర్‌కు సన్మానం



నవతెలంగాణ-ధూల్‌పేట్

భారత్ జాగృతి ఆధ్వ ర్యంలో తెలంగాణ సాహిత్య సభల్లో భాగంగా తెలంగాణలో సాహిత్య రంగంలో కృషి చేసిన వారికి భారత్ జాగృతి అధ్యక్షు రాలు, శాసనమండలి సభ్యురాలు కల్వకుంట్ల కవిత మెమెంటోలతో శాలువా కప్పి ఘనంగా సన్మా నించారు. డాక్టర్. ఎస్. విజయ భాస్కర్ సాహిత్య రంగంలో చేస్తున్న విశిష్ట కృషికి గుర్తింపుగా కవిత, తెలంగాణ గ్రంథాలయ సంస్థ అధ్యక్షుడు అయాచితం శ్రీధర్, తెలంగాణ సాహిత్య అకాడెమీ అధ్యక్షులు గౌరీశంకర్ తదితరులు సన్మానం చేశారు. డాక్టర్.ఎస్. విజయ భాస్కర్ ప్రభుత్వ ఉన్నత పాఠశాల అఫ్జల్ గంజ్‌లో తెలుగు పండితులుగా విధులు నిర్వహిస్తు కవిగా,రచయితగా, ఉత్తమ ఉపాధ్యాయులుగా, పాఠ్య పుస్తకాల రచయితగా, పత్రిక సంపాదకుడిగా, విమర్శ కుడిగా బహుముఖ ప్రజ్ఞాశాలి అని వక్తలు కొనియాడారు. శనివారం ప్రభుత్వ ఉన్నత పాఠశాల అఫ్జల్‌గంజ్‌లో ఉపాధ్యాయులు, విద్యార్థులు, విద్యార్థుల తల్లిదండ్రులు డాక్టర్.ఎస్. విజయ భాస్కర్‌ను అభినందించారు.

నిమ్స్‌కు ప్రపంచ స్థాయి గుర్తింపు తీసుకురావాలి

-డైరెక్టర్ డాక్టర్ నగరి బీరప్ప



నవతెలంగాణ-బంజారాహిల్స్

నిజం ఇన్ స్టిట్యూట్ ఆఫ్ మెడికల్ సైన్సెస్(నిమ్స్) కి ప్రపంచ స్థాయిలో ప్రత్యేక గుర్తింపు తీసుకు రావాలని ఆస్పత్రి డైరెక్టర్ డాక్టర్ నగరి బీరప్ప అన్నా రు. కిందిస్థాయి సిబ్బంది నుంచి ఉద్యోగులు, వైద్యులు అందరూ సమన్వయంతో కృషి చేస్తేనే అనుకున్న లక్ష్యాలను చేరుతామన్నారు. ఈనెల 14న ఆసుపత్రికి అనుసంధానంగా మరో భవనం దశాబ్ది బ్లాక్ నిర్మాణానికి గౌరవ ముఖ్యమంత్రి కేసీఆర్ శంకుస్థాపన చేశారనే విషయాన్ని గుర్తు చస్తూ ఆ కార్యక్రమాన్ని విజ యవంతం చేసేందుకు ఆసుపత్రిలోని కిందిస్థాయి సిబ్బంది నుంచి ఉద్యోగులు, వైద్యుల వరకు ప్రత్యేక కృషి చేశారని, దీంతోనే అతిపెద్ద కార్యక్రమం ఎలాంటి లోటు పాట్లు లేకుండా విజయవంతంగా పూర్తయిందన్నారు. ఇందులో వలంటరీగా పని చేసిన వారి సేవలను గుర్తిస్తు ఆసుపత్రిలో శనివారం కృతజ్ఞత సభను నిర్వహించారు.ఈ సందర్భంగా సిబ్బందిని డైరెక్టర్ ప్రత్యేకంగా అభినందించి కృతజ్ఞతలు తెలియజేశారు.

టీటీడీపీ రాష్ట్ర బీసీ సెల్ కార్యదర్శిగా జయరాజ్ యాదవ్ నియామకం



నవతెలంగాణ-సుల్తాన్‌బజార్

తెలంగాణ రాష్ట్ర టీడీపీ బీసీ సెల్ కార్యదర్శిగా గోషామహల్ నియోజక వర్గానికి చెందిన జి.జయరాజు యాదవ్ నియమితులయ్యారు ఈ మేరకు తెలంగాణ టీడీపీ రాష్ట్ర అధ్యక్షులు కాసాని జ్ఞానేశ్వర్ ఉత్తర్వులు జారీ చేశారు. టిడిపి బీసీ సెల్ రాష్ట్ర కార్యదర్శిగా నియమితులైన సందర్భంగా జయరాజ్ యాదవ్ మీడియాతో మాట్లాడుతూ తెలంగాణలో తెలుగుదేశం పార్టీ త్వరలోనే పూర్వ వైభవాన్ని సంచరిం చుకుం టుందన్నారు. రాష్ట్రంలో పార్టీని బలోపేతం చేసేందుకు తన వంతు కృషి చేస్తాన న్నారు.తనపై నమ్మకంతో టిడిపి రాష్ట్ర బీసీసెల్ కార్యదర్శిగా నియమించిన తెలుగుదేశం పార్టీ జాతీయ అధ్యక్షుల చంద్రబాబు నాయుడు, తెలంగాణ తెలుగు దేశం పార్టీ రాష్ట్ర అధ్యక్షులు కాసాని జ్ఞానేశ్వర్, రాష్ట్ర పొలిట్ బ్యూరో సభ్యులు అరవింద్ కుమార్ గౌడ్, తెలంగాణ తెలుగుదేశం పార్టీ రాష్ట్ర బీసీ సెల్ అధ్యక్షులు శ్రీపతి సతీష్, సికింద్రాబాద్ పార్లమెంట్ నియోజకవర్గం అధ్యక్షులు పి సాయి బాబాలకు కృతజ్ఞతలు ఈ సందర్భంగా కృతజ్ఞతలు తెలియజేశారు.

భావి ఐటి లీడర్ల కోసం అవగాహన ఒప్పందం చేసుకున్న ఐఎంటీ, హెచ్‌సీఎల్

నవతలంగాణ - హైదరాబాద్

ప్రముఖ సాంకేతిక సేవలు, కన్సల్టింగ్ కంపెనీ అయిన హెచ్ సీఎల్ టెక్నాలజీస్, ఐఎంటీ హైదరాబాద్లో ఇన్ఫర్మేషన్ టె క్నాలజీ (ఐటీ) లో ప్రత్యేకత కలిగిన ఒక వినూత్నమైన పోస్ట్ గ్రాడ్యుయేట్ డిప్లొమా ఇన్ మేనేజ్మెంట్ ప్రోగ్రామ్ను రూపొందించడానికి, అందించడానికి అవగాహన ఒప్పందం ద్వారా చేతులు కలిపాయి. ఈ సందర్భంగా ఐఎంటీ హైదరాబాద్లో డైరెక్టర్, ప్రొఫెసర్ డాక్టర్ కె.శ్రీహర్ష రెడ్డి, హెచ్ సీఎల్ టెక్నాలజీస్ పట్ల తమ అభిమానాన్ని వ్యక్తం చేస్తూనే ఐఎంటీ హైదరాబాద్లో వారి భాగస్వామ్య విజన్ న్ను గురించి వెల్లడించారు. ఆయన పీజీడీఎం ఐటీ ప్రోగ్రామ్ ప్రారంభాన్ని ప్రకటించారు. దీనికి కార్పొరేట్ భాగస్వాముల నుండి పూర్తి మద్దతు లభిస్తుందన్నారు. నేటి వ్యాపార దృశ్యంలో అభివృద్ధి చెందుతున్న సాంకేతికతలు, వేగవంతమైన డిజిటలైజేషన్, ప్రాముఖ్యతను డాక్టర్ రెడ్డి నొక్కి చెప్పారు. కార్పొరేట్ అతిథులు, మీడియాతో హెచ్సీఎల్ టెక్నాలజీస్ డైరెక్టర్ హెచార్, ఆశిష్ భల్లా మాట్లాడుతూ.. పరిశ్రమ, విద్యాసంస్థలు కలిసి రావడం, తమ భాగస్వామ్యం వాటాదారులకు సహాయం చేయడంపై తన అభిప్రాయాలను వ్యక్తం చేశారు. పీజీడీఎం ఐటీ ప్రోగ్రామ్ను ప్రారంభించినందుకు ఐఎంటీహెచ్, హెచ్ సీఎల్ టెక్ని తెలంగాణ ప్రభుత్వ ఐటీ, పరిశ్రమల ముఖ్య కార్యదర్శి జయేష్ రంజన్ అభినందించారు. ఈ తరహా భాగస్వామ్యాల ప్రాముఖ్యతను హైలైట్ చేశారు. ఈ అవగాహన ఒప్పందంపై సంతకం చేయడంలో ఐఎంటీ హైదరాబాద్, హెచ్ సీఎల్ టెక్నాలజీస్ సహకార ప్రయత్నాలను తాము అభినందిస్తున్నామన్నారు. తెలంగాణ ప్రభుత్వ మాజీ ప్రధాన కార్యదర్శి, ఎస్కే జోషి మాట్లాడుతూ... ఈ భాగస్వామ్యం ఔత్సాహిక ఐటీ నిపుణుల నైపుణ్యాభివృద్ధిని పెంపొందిస్తుందన్నారు. పరిశ్రమకు సంబంధించిన జ్ఞానం, నైపుణ్యంతో వారిని సన్నద్ధం చేస్తుందన్నారు. ఇది తెలంగాణను సాంకేతిక హబ్ ఉంచాలనే తమ దృష్టికి అనుగుణంగా ఉంటుందన్నారు.

తెలంగాణ ఎదుగుదలపై సామూహిక చర్చ

నవతెలంగాణ-జూబ్లీహిల్స్

తెలంగాణ దశాబ్ది వేడుకల్లో భాగంగా డా.బి.ఆర్. అంబేద్కర్ సార్వత్రిక విశ్వవిద్యాలయంలో నిర్వహించిన "తెలంగాణ ఎదుగుదల కథ-సామూహిక చర్చ" కార్యక్రమం నిర్వహించారు. ఈ కార్యక్రమానికి విశ్వవిద్యాలయ ఉపకులపతి ఆచార్య సీతారామారావు ముఖ్య అతిథిగా పాల్గొని ప్రసంగించారు. ఆయన మాట్లాడుతూ 9 సంవత్సరాలు క్రితమే ఏర్పడ్డ తెలంగాణ రాష్ట్రం అభివృద్ధిలో దేశంలో ముందు వరుసలో ఉందని, జాతీయ స్థాయిలో 90 శాతానికి పైగా అభివృద్ధి అవార్డులు తెలంగాణకే వస్తున్నాయన్నారు. ఆర్థిక క్రమ శిక్షణ, పేదలకు సంక్షేమం పథకాలు అందించడం వంటివి తెలంగాణను దేశంలో అగ్ర స్థా నంలో నిలపాయన్నారు. కార్యక్రమానికి అధ్యక్షత వహించిన విశ్వవిద్యాలయ అకాడమిక్ డైరెక్టర్ ప్రొ.ఘంటా చక్రపాణి మాట్లాడుతూ అభివృద్ధి అనేది నిరంతర ప్రక్రియ అని పాలకులు సమాజాభివృద్ధికి పాటు పడ్డప్పుడే సమగ్ర అభివృద్ధి సాధ్యమవుతోందన్నారు. కార్యక్రమంలో ప్యానెల్ సభ్యులుగా పాల్గొన్న సెస్ డైరెక్టర్ ప్రొ. రేవతి మాట్లాడుతూ పెద్ద రాష్ట్రాల్లో జరగని అభివృద్ధి చిన్న రాష్ట్రాలతోనే సాధ్యం అనే వాదనను తెలంగాణ రాష్ట్రం సుసాధ్యం చేసిం దన్నారు. మరో ప్యానెల్ సభ్యులు ప్రొ. చెన్న బసవయ్య మాట్లాడుతూ అభివృద్ధిలో విధాన పరమైన నిర్ణాయాలు ప్రధాన పాత్ర పోషిస్తాయన్నారు. మరో ప్యానెల్ సభ్యులు హైదరాబాద్ కేంద్రీయ విశ్వ విద్యాలయ అధ్యాపకులు ప్రొ.ఆర్.వి. రమణ మూర్తి మాట్లాడుతూ తెలంగాణలో వ్యవసాయ రంగంలో వినూత్న పరిణామాలు చోటు చేసుకున్నాయన్నారు. మిషన్ కాకతీయ చెరువులపునరుద్ధరణ, ప్రాజెక్ట్‌ల నిర్మాణం వంటివి సరికొత్త తెలంగాణను ఆవిష్కరించాయన్నారు. సాగు భూమి 15 శాతం పెరిగిందని ఇటీవల కా లంలో ఇది ఏ రాష్ట్రంలో సాధ్య పడలేదన్నారు. కార్యక్ర మంలో పాలక మండలి సభ్యులు డా. బానోత్ లాల్, సికా డైరెక్టర్ ప్రొ.పీ. మధుసూదన్ రెడ్డి, డైరెక్టర్ ప్రొ.గుంటిరవి, డీన్‌లు ప్రొ షకీలాఖానం,ప్రొ.వడ్డానంశ్రీనివాస్, పరీక్షల నియంత్రన అధికారిడా.పరాంకుశం వెంకటరమణ, విద్యార్థి సేవల విభాగం డైరెక్టర్ డా.ఎల్వీకే రెడ్డి, విశ్వవిద్యాలయ అధ్యాపక, అధ్యపకేతర సిబ్బంది, ఉద్యోగ సంఘాల ప్రతినిధులు పాల్గొన్నారు.

విభజన చట్టాన్ని ఉల్లంఘిస్తున్న తెలంగాణ ప్రభుత్వం



- తెలంగాణ కొప్పుల వెలమ సంక్షేమ సంఘం

నవతెలంగాణ-బంజారాహిల్స్

జీవో నెంబర్3వల్ల ఉత్తరాంధ్ర బీసీలు భారీగా నష్టపోతు న్నరని తక్షణమే తెలంగాణ గవర్నర్ తమిళిసై స్పందించా లని తెలంగాణ కొప్పుల వెలమ సంక్షేమ సంఘం అధ్యక్షులు పోలా లక్ష్మునాయుడు అన్నారు. శనివారం సోమాజిగూడ ప్రెస్‌క్లబ్ లో తెలంగాణ కొప్పుల వెలమ సంక్షేమ సంఘం సభ్యులతో కలిసి విలేకరుల సమావేశంలో ఆయన మా ట్లాడారు. పదేళ్ల పాటు ఉమ్మడి రాజధాని హైదరాబాద్‌లో విభజన చట్టాన్ని ఉల్లంఘిస్తూ ప్రభుత్వం 26 బీసీ కులాలను తొలగించడంపై గవర్న ర్‌కు ఫిర్యాదు చేసినట్లు రాష్ట్ర నాయకులు వెల్లడించారు.వారికి న్యాయం చేయాలని తెలంగాణ గవర్నర్ తమిళిసైని కలిసి విజ్ఞప్తి చేసినా ఇంత వరకు ఎలాంటి ఫలితం కనిపించలేదని, హైదరాబాద్‌లోని స్థిరపడిన దాదాపుగా పది లక్షల మంది ఉత్తరాంధ్ర బీసీలకు తెలంగాణ సర్కార్ అన్యాయం చేసిందన్నారు. ఈ జీవో వల్ల వారంతా బీసీ జాబితాలో ఉండ లేకపోతున్నారని, తద్వారా రిజర్వేషన్ల ప్రయోజనాలు పొందలేకపోతున్నారని గవర్నర్ దృష్టికి తీసుకెళ్లామని, జీవోనెంబర్3తో బలహీన వర్గాలు హక్కులు కోల్పోతున్నారని, విభజన తర్వాత ఆంధ్రలో బీసీలు హక్కులు కోల్పోతున్నారని ఆయన ఆవేదన వ్యక్తం చేశారు. ఈ అంశంపై ఎప్పుడు ఎన్నికలు జరి గినా రాజకీయ పార్టీల నేతలు హామీలు ఇస్తూనే ఉన్నరు గాని ఇప్పటి వరకూ సమస్య పరిష్కారిం చాలేదని గవర్నర్ తక్ష ణమే స్పందించి న్యాయం చేయాలని వారు విజ్ఞప్తి చేశారు.

విద్య ద్వారానే మహిళా సాధికారత

- టీపీసీసీ ప్రధాన కార్యదర్శి డా. కోట నీలిమ
- రాజీవ్ గాంధీ యూత్ ఆశ్రీ క్విజ్ పోటీలకు పేర్లు నమోదు



నవతెలంగాణ-అంబర్‌పేట

ఆర్థికాభివృద్ధికి, రాజకీయ స్థిరత్వానికి సామాజిక పరివర్తనకు మహిళలకు సాధికారత సాధించడం కీలకం అని, అది మహిళలకు విద్య ద్వారానే సాధ్యమవుతుందని టీపీసీసీ ప్రధాన కార్యదర్శి డా. కోట నీలిమ పేర్కొన్నారు. మహిళలు తమ హక్కులను పొందడానికి విద్య ఒక ప్రత్యేక సాధనం అని, విద్యావంతులైన మహిళలు సమాజ మార్పుకు ప్రతినిధులని ఆమె తెలిపారు. మహిళా సాధికారతతో ఆత్మవిశ్వాసం పెంపొందుతుందని, లింగ సమానత్వం లభిస్తుందని, చట్టపరమైన హక్కులను పొందుతారని, స్వీయ-విలువ భావం పెరగడంతోపాటు ఆర్థికంగా అభివృద్ధి చెంది, సమాజంలో ఇతరులపై ఆధారపడకుండా చేస్తుందని ఆమె చెప్పారు. శ్యామల దేవి బాలికల జూనియర్ కళాశాల వద్ద శనివారం రాజీవ్ గాంధీ యూత్ ఆన్లైన్ క్విజ్ పోటీలకు సంబంధించిన పేర్ల నమోదు కార్యక్రమాన్ని టిపిసిసి ప్రధాన కార్యదర్శి డా. కోట నీలిమ ప్రారం భించారు. వందలాదిమంది విద్యార్థినిలు ఈ పోటీలలో పాల్గొనడానికి తమ పేర్లను నమోదు చేసుకున్నారు. రాజీవ్ గాంధీ యూత్ ఆన్లైన్ క్విజ్ పోటీ పరీక్ష జూలై 2, 2023న నిర్వహిస్తున్నామని, నమోదు చేసుకున్న విద్యార్థినీ-విద్యార్థులు ఈ ఆన్‌లైన్ పోటీ పరీక్షలో పాల్గొని రూ.లక్షల రూపాయల విలువైన ఈ-స్కూటర్, లాప్ టాప్, స్మార్ట్ ఫోన్, టాబ్లెట్స్‌తోపాటు కన్సోలేషన్ బహుమతులను కూడా గెలుచుకోవచ్చునన్నారు. మొబైల్ నెంబర్ 7661 899 899 మిస్డ్ కాల్ ఇచ్చి రిఫెరల్ కోడ్ 15011 ఉపయోగించి తమ పేర్లను నమోదు చేసుకోవాలని డా. కోట నీలిమ విజ్ఞప్తి చేసారు. ఈ కార్యక్రమంలో ఎన్.ఎస్.యు.ఐ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి అనుప శేఖర్, హక్కు వలంటీర్లు అఖిల్, భారత్, ఖుర్షీద్ తదితరులు పాల్గొన్నారు.

ఐసీఎస్ఎస్ఆర్ సేవలను వినియోగించుకోవాలి



నవతెలంగాణ-ఓయూ

పరిశోధక విద్యార్థులు నాణ్యమైన పరిశోధనలు చేయాలని ఓయూ వీసీ ప్రొ.రవీందర్ సూచించారు. ఆ దిశగా పరిశోధక విద్యార్థులు ఐసిఎస్ఎస్ఆర్ సేవలను వినియోగించుకోవాలని పిలుపునిచ్చారు.ఓయూ సెంటర్ ఫర్ ఇంటర్నేష నల్ స్టడీస్ (ఓయూసీఐఎస్) ప్రాంగణంలో నెలకొల్పిన ఐసీఎస్ఎస్ఆర్-ఎస్ఆర్సి నూతన ప్రాంగణాన్ని శనివారం ప్రారం భించారు. ఈ కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా హాజరయ్యారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ. పరిశోధక విద్యార్థు లకు మెరుగైన సేవలు అందించేందుకు ఐసీఎస్ఎస్ఆర్ డైరెక్టర్ ప్రొఫెసర్ బి. సుధాకర్ రెడ్డి చేస్తున్న ప్రయత్నా లను అభినందించారు. యూనివర్సిటీ నుంచి పూర్తి సహాయ సహకారాలు అందిస్తామని హామీ ఇచ్చారు. యూనివర్సిటీలో విద్యా వ్యవస్థను గాడిన పెట్టేందుకు అనేక సంస్కరణలను ప్రవేశపెట్టినట్లు వివరించారు. ఓయూకు పూర్వ వైభవం సాధించడమే లక్ష్యంగా పనిచేస్తున్నట్లు పేర్కొన్నారు. ప్రొఫెసర్ సుధాకర్ రెడ్డి మాట్లాడుతూ కేంద్ర విద్యాశాఖ ఆధ్వర్యంలో దేశంలో సామాజిక శాస్త్రాల పరిశోధనను ప్రోత్సహించేందుకు 1969లో ఐసీఎస్ఎస్ఆర్ ను ప్రారంభించారని గుర్తు చేశారు. ఈ కార్యక్రమంలో ఓయూ రిజిస్టర్ ప్రొ. పి లక్ష్మీనారాయణ, ఓయూసీఐఎస్ డైరెక్టర్ ప్రొఫెసర్ కృష్ణ కుమార్, ఇన్స్టిట్యూట్ ఆఫ్ ఇండో పసిఫిక్ స్టడీస్ డైరెక్టర్ ప్రొ. జేఎల్ఎన్ రావు, పీజీఆర్ఆర్‌సీడీఈ డైరెక్టర్ ప్రొ.జీబి.రెడ్డి, ప్రొ.స్టీవెన్ సన్, పాల్గొన్నారు.

సీతాఫల్‌మండిలో వార్డ్ కార్యాలయం ప్రారంభం



నవతెలంగాణ-ఓయూ

వార్డు కార్యాలయాల ఏర్పాటు వ్యవస్థ ద్వారా స్థానిక సమస్యలను అక్కడిక్కడే పరి ష్కరించగలుగుతామని డిప్యూటీ స్పీకర్ తీగుల్ల పద్మారావు గౌడ్ అన్నారు. సితాఫల మండీ వార్డు కార్యాలయాన్ని డిప్యూటీ స్పీకర్ పద్మా రావు గౌడ్ శనివారం జోనల్ కమీషనర్ శ్రీని వాస్ రెడ్డి, కార్పొరేటర్ సామల హేమ, డి ప్యూటీ కమీషనర్ దశరథ్, అధికారులు ఆశా లత, కృష్ణ, సంధ్య, బీఆర్ఎస్ నేతలు రామేశ్వర్ గౌడ్, కరాటే రాజుతో కలిసి బీదలబస్తీ కమ్యూనిటీ హాల్‌లో ఏర్పాటు చేసిన ఈ వార్డు కార్యాలయాన్ని డిప్యూటీ స్పీకర్ పద్మారావు ప్రారంభించారు. ఈ సందర్భంగా మాట్లా డుతూ స్థానిక సమస్యలను పరిష్కరించుకొనేం దుకు వార్డు కార్యాలయాల వ్యవస్థను ప్రభుత్వం రూపొందించిందని, సీనియర్ అధికారుల బృందాలు దేశంలోని వివిధ ప్రధాన నగరాల్లో పర్యటించి, ఆయా పరిస్థితులను అధ్యయనం చేసి హైదరాబాద్‌లో వ్యవస్థను ప్రతిపాదించాయని తెలిపారు. అన్ని ప్రభుత్వ విభాగాల అధికారులు ఈ కార్యాలయాల్లో అందుబాటులో ఉంటారని వారి ని ప్రజలు సదివినియోగం చేసుకోవాలని పద్మారావుగౌడ్ సూచించారు. జోనల్ కమీషనర్ శ్రీనివాస్‌రెడ్డి మాట్లాడుతూ అన్ని మునిసిపల్ డివిజన్లలో వార్డు కార్యాలయాలను ఏర్పాటు చేసామని , ఇతర వార్డు లకు సంబంధించిన ఫిర్యాదులను ఆయా వార్డు లకు పంపేలా కుడా ఏర్పాట్లు జరిపామని తెలిపారు. సర్వాంగ సుందరంగా సికింద్రాబాద్ కాలనీ పార్కులు సీతాఫల మండీలోని టీఆర్‌టీ కాలనీ పార్కు, మధురా నగర్ కాలనీ పార్కుల్లో వివిధ కొత్త సదుపాయాలను ఆయన శనివారం ప్రారంభించారు. మాట్లాడుతూ సికింద్రాబాద్ పరిధిలోని అన్ని కాలనీ పార్కులను సర్వాంగ సుందరంగా తీర్చిది ద్దాలని అధికారులను ఆదేశించారు. కార్పొరేటర్ సామల హేమ, నేతలు రామేశ్వర్ గౌడ్, శేఖర్, పవన్ కుమార్ గౌడ్, తదితరులు పాల్గొన్నారు.

కుత్బుల్లాపూర్ నియోజకవర్గం పరిధిలోని వివిధ కాలనీలు, బస్తీలకు చెందిన ప్రజలు ప్రభుత్వ విప్, మేడ్చల్ జిల్లా బీఆర్ఎస్ పార్టీ అధ్యక్షులు, ఎమ్మెల్సీ శంభీపూర్ రాజు గారిని ఈరోజు శంభీపూర్ కార్యాలయంలో మర్యాద పూర్వకంగా కలిసి సమస్యలను పరిష్కరిం చాలని కోరారు. స్పందించిన ఎమ్మెల్సీ మాట్లాడుతూ సమస్యలను సంబంధిత అధికారుల దృష్టికి తీసుకెళ్ల పరిష్కరించేం దుకు కృషి చేస్తానన్నారు. ఈ కార్యక్రమంలో ప్రజా ప్రతినిధులు, ప్రజలు, బీఆర్ స్ పార్టీ కుటుంబ సభ్యులు తదితరులు పాల్గొన్నారు.

నవతెలంగాణ-దుండిగల్



నవతెలంగాణ
కుత్బుల్లాపూర్
ఆదివారం 25 జూన్ 2023

మేడ్చల్ జిల్లా సాధన సమితి దశాబ్ది ఉత్సవాలకు ఆహ్వానం అందజేత



నవతెలంగాణ-మేడ్చల్

మేడ్చల్ జిల్లా సాధన సమితి ఆధ్వర్యంలో ఈ నెల 29న నిర్వహించే దశాబ్ది ఉత్సవాల్లో పాల్గొనలని కోరుతూ శనివారం మేడ్చల్ జిల్లా సాధన సమితి వ్యవస్థాపక అధ్యక్షుడు పాతూరి సుధాకర్ రెడ్డి ఆధ్వర్యంలో రాష్ట్ర కార్మిక శాఖ మంత్రి చామకూర మల్లారెడ్డి, హుజురాబాద్ ఎమ్మెల్యే ఈటల రాజేందర్, బీఆర్ఎస్ పార్టీ మల్కాజిగిరి పార్లమెంటు ఇంచార్జి మర్రి రాజశేఖర్ రెడ్డిలను శనివారం వారి నివాసాలలో మర్యాదపూర్వకంగా కలిసి ఆహ్వాన పత్రిక అందజేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ అతిథులు అందరూ మా ఆహ్వానాన్ని మన్నించి దశాబ్ది ఉత్సవాల్లో పాల్గొంటారని తెలిపారు. ఈ కార్యక్రమంలో జిల్లా సాధన సమితి నాయకులు పాపారావు, బీఆర్ఎస్ నాయకులు సత్యనారాయణ,సాటే నరేందర్,సందీప్ గౌడ్, లవంగ రాకేష్ తదితరులు పాల్గొన్నారు.

అంగన్వాడి కేంద్రానికి బీరువా విరాళం అందజేత



నవతెలంగాణ-మేడ్చల్

మేడ్చల్ మండల పరిధిలోని పూడూరు గ్రామంలోని పోచమ్మ ఆలయం వద్ద ఉన్న అంగన్వాడి కేంద్రానికి ప్రముఖ న్యాయవాది నక్క మల్లికార్జున్ వారి తల్లి నక్క వరమ్మ జ్ఞాపకార్థం శనివారం బీరువా, 35ప్లేట్లు, 35గ్లాసులు, సీలింగ్ ఫ్యాన్ విరాళంగా అందజేశారు. ఈ సందర్భంగా నక్క మల్లికార్జున్ మాట్లాడుతూ గ్రామ అభివృద్ధే ధ్యేయంగా పనిచేస్తానని అన్నారు. గ్రామానికి తన వంతు సహాయ సహకారాలు ఎల్లప్పుడూ ఉంటాయని చెప్పారు. ఈ కార్యక్రమంలో గ్రామస్తులు వర్గంటి కిషోర్, బి.మధుసూదన్, తొర్రి సత్యనారాయణ, మండల అశోక్ గౌడ్, అంగన్వాడి టీచర్లు పాల్గొన్నారు.

ఈగలు, దోమలు ముసిరే కాలం..

- చెత్త, పెరుకుపోతే రోగాలు ఖాయం..
- అల్విన్ కాలనీలో పడకేసిన పారిశుధ్యం



నవతెలంగాణ-కూకట్‌పల్లి

కూకట్‌పల్లి సర్కిల్ ఆల్విన్ కాలనీ డివిజన్‌లోని, తులసి నగర్, భూదేవి హిల్స్‌లో పేరుకుపోయిన చెత్తతో స్థానికులు ఇబ్బందులు పడుతున్నారు. అసలే వానా కాలం ఈగలు, దోమలు ముసిరే కాలం ఇలాంటి సమయంలో చెత్తా, చెదారం పేరుకుపోతే రోగాలు ఖాయం అంటూ స్థానికులు తమ ఆవేదన వ్యక్తంచేశారు. భూదేవి హిల్స్‌లోని హైటెన్షన్ లైన్ రోడ్‌లో గత కొన్ని రోజులుగా చెత్త పేరుకుపోయిందంటు తొలగించమని మున్సిపల్ కార్యాలయంలో సంబంధిత అధికారులకు ఫిర్యాదు చేసినప్పటికి ఫలితం లేదంటూ స్థానిక మహిళలు వాపోయారు. అలాగే తులసి నగర్‌లోని జీవన్ జ్యోతి స్కూల్ సమీపంలోను రోడ్డుపై చెత్త పేరుకు పోయి దుర్వాసన వస్తుందన్నారు. పక్కనే స్కూల్‌కి చిన్న పిల్లలు వస్తుంటారని, స్థానికంగా నివాసం ఉండే వారికి సైతం చాలా ఇబ్బందిగా ఉంటుందని, చెత్తను ఏ రోజుకారోజు తొలగిస్తే ఎలాంటి సమస్యా ఉండదన్నారు. రెండు రోజులకు ఓ సారి చెత్త తొలగించడంతో అనారోగ్యాలకు గురికావాల్సి వస్తుంది కాబట్టి ,జి హెచ్ఎంసి అధికారులు వెంటనే స్పందించి చెత్తను ఏ రోజుకారోజు తొలగించేలా చర్యలు తీసుకోవాలని స్థానికులు కోరుతున్నారు.

26న చలో కలెక్టరేట్‌ను విజయవంతం చేయండి

- ఎస్ఎఫ్ఐ ఉపాధ్యక్షుడు ఎం.చంద్రకాంత్



నవతెలంగాణ-కుత్బుల్లాపూర్

విద్యారంగ సమస్యల పరిష్కారణకై ఈనెల 26వ తేదీన జరిగే చేలో కలెక్టరేట్ ముట్టడిని విజయవంతం చేయాలని ఎస్ఎఫ్ఐ మేడ్చల్ మల్కాజ్గిరి జిల్లా ఉపాధ్యక్షుడు ఎం.చంద్రకాంత్ ఒక ప్రకటనలో తెలిపారు. ఈ సందర్భంగా చంద్రకాంత్ మాట్లాడుతూ... రాష్ట్ర, కేంద్ర ప్రభుత్వాలు విద్యారంగాన్ని ప్రైవేటీకరణ చేసే దిశగా ముందుకు సాగుతున్నాయని, విద్యారంగా సమస్యలు పరిష్కరించడంలో కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు పూర్తిగా విఫలమయ్యాయని ఆవేదన వ్యక్తం చేశారు. కార్పొరేట్, ప్రైవేట్ పాఠశాలల్లో ఫీజులు నియంత్రణ చట్టం పకడ్బందీగా అమలు చేయాలన్నారు. పెండింగ్ పుస్తకాలను తక్షణమే పంపిణీ చేసి, విద్యార్థులకు రెండు జతల యూనిఫామ్‌లు అందిం చాలన్నారు. ఖాళీగా ఉన్న టీచర్స్ పోస్టులను భర్తీ చేయాలి. మధ్యాహ్న భోజనానికి అధిక నిధులు కేటాయించాలి. రాష్ట్రంలో ఉన్న అన్ని ప్రభుత్వ పాఠ శాలను మన ఊరు మనబడి కింద మార్చాలి. బీసీ వసతి గృహ ప్రవేశాలకు ఆన్లైన్ పద్ధతిని రద్దు చేసి, పెరిగిన ధరలకు అనుగుణంగా మెస్ కాస్మోటిక్ చార్జీలు పెంచాలని ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. ఇందులో భాగంగానే విద్యార్థులందరూ అధిక సంఖ్యలో పాల్గొని చలో కలెక్టరేట్ విజయవంతం చేయాలని కోరారు.

లబ్ధిదారులకు వెంటనే డబుల్ బెడ్ రూమ్ ఇండ్లు ఇవ్వాలి



నవతెలంగాణ-కుత్బుల్లాపూర్

కేసీఆర్ ఎన్నికలలో ఇచ్చిన హామీ ధరఖాస్తు చేసుకున్న అర్హులైన లబ్ధిదారులకు వెంటనే డబుల్ బెడ్ రూమ్ ఇండ్లు ఇవ్వాలని కోరుతూ శనివారం షాపూర్‌నగర్ సీపీఐ(ఎం) కార్యాలయంలో సీపీఐ, సీపీఐ(ఎం) నాయకుల సమావేశం నిర్వహించడం జరిగింది. ఈ సందర్భంగా సీపీఐ, సీపీఐ (ఎం) మండల కార్యదర్శి ఉమా మహేష్, కీలుకాని లక్ష్మణ్ మాట్లాడుతూ... మండలంలో కేసర్‌నగర్, బహదూర్ పల్లిలలో నిర్మించిన రెండు గదుల ఇండ్లు అసాంఘిక కార్యక్రమాలకు అడ్డాలుగా మారకుండా పూర్తయిన రెండు గదుల ఇండ్లు వెంటనే లబ్ధిదారులకు ఇవ్వాలని డిమాండ్ చేశారు. పేదలకు అన్యాయం జరిగితే వామపక్షాల ఆధ్వర్యంలో ఆందోళన నిర్వహిస్తామని నిజమైన పేదలతో రెండు గదుల ఇండ్లు ఆక్రమించుకుంటామని అన్నారు. ఇప్పటికే కొంతమంది ప్రజలకు రెండు గదుల ఇండ్లు ఇప్పిస్తామని చెప్పి డబ్బులు వసూలు చేస్తున్నట్లు బహిరంగంగా చూస్తున్నామని అలా ప్రజలు మోసపోకుండా వెంటనే అర్హులకు ఇవ్వాలని డిమాండ్ చేశారు. జులై 1 నుండి జూలై 8 వరకు మండల పరిధిలో 8 డివిజన్లో ప్రజల వద్దకు వెళ్లి దరఖాస్తు చేసుకున్న వారిని కలిసి ప్రభుత్వం రెండు గదుల ఇండ్లు లబ్ధిదారులకు కేటాయించుటలో ప్రభుత్వం నిర్లక్ష్యాన్ని ప్రజలకు వివరిస్తామని అన్నారు. ఈ సమావేశంలో సీపీఐ జిల్లా కార్యవర్గ సభ్యులు స్వామి, హరినాథ్, మండల సహాయ కార్యదర్శి రాము, కోశాధికారి సదానంద, సీపీఎం మండల కమిటీ సభ్యులు సలీం, శంకర్ ,శాఖ కార్యదర్శిలు స్వాతి, తదితరులు పాల్గొన్నారు.

నిరుపేదలకు వరం సీఎంఆర్ఎఫ్

- ఎమ్మెల్యే కేపీ వివేకానంద్



నవతెలంగాణ-కుత్బుల్లాపూర్

కుత్బుల్లాపూర్ నియోజకవర్గం పరిధికి చెందిన 31 మంది సీఎంఆర్ఎఫ్ పథకం లబ్ధిదారులకు రూ.22,61,000/- విలువల చేసే చెక్కులను ఎమ్మెల్యే కేపీ వివేకానంద్ ప్రభుత్వం ద్వారా మంజూరు చేయించి శనివారం చింతల్‌లోని తన కార్యాలయం వద్ద పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వం పేదల సంక్షేమమే ధ్యేయంగా పథకాలు అమలు చేస్తుందని అన్నారు. అనారోగ్యాలతో ఆసుపత్రుల పాలైన నిరుపేదలకు సీఎంఆర్ఎఫ్ వరంలా మారిందని అన్నారు. తమ ప్రభుత్వం నిరుపేదల ఆరోగ్య భద్రతకు వేలాది కోట్ల రూపాయలు వెచ్చిస్తోందిన్నారు. అనారోగ్యాల బారిన పడిన ప్రైవేట్ ఆస్పత్రిలో చికిత్స పొంది సంబంధిత ధ్రువీకరణ పత్రాలతో దరఖాస్తు చేసుకున్న వారికి సీఎంఆర్ఎఫ్ ద్వారా ఆర్థిక చేయూతను అందిస్తున్నామన్నారు. ప్రభుత్వ పథకాలను ప్రజలు తప్పక సద్వినియోగం చేసుకోవాలని కోరారు. ఈ కార్యక్రమంలో మాజీ ప్రజా ప్రతినిధులు, డివిజన్ల అధ్యక్షులు, నాయకులు

రాబోయే వర్షాకాలంలో అప్రమత్తంగా ఉండాలి

- ఎమ్మెల్యే మాధవరం కృష్ణారావు



నవతెలంగాణ-కూకట్‌పల్లి

ఎమ్మెల్యే మాధవరం కృష్ణారావు నియోజకవర్గ కార్పొరేటర్లతో శనివారం టెలికాన్ఫరెన్స్ నిర్వహించారు. ఇందులో ప్రధానంగా వర్షాకాలంలో ప్రారంభమవుతున్న సందర్భంగా తలెత్తబోయే అంశాలపై సమీక్షించారు. ప్రధానంగా నూతన పైప్ లైన్‌ల నిర్మాణానికి ఎక్కడ ఆటంకం లేకుండా, తగినన్ని పైప్ లైన్లు చేరుకున్నాయని. దగ్గరుండి పనులు పూర్తి చేయించాలని ఆదేశాలు జారీ చేశారు. ముఖ్యమంత్రి కేసీఆర్ ,మంత్రి కేటీఆర్‌లు భవిష్యత్తునుదృష్టిలో పెట్టుకుని రాబోయే రోజుల్లో మంచినీరు, డ్రయినేజీ వ్యవస్థకు సంబంధించి, ఎలాంటి సమస్యలు రాకుండా భూగర్భ పైప్‌లైన్ నిర్మాణాలు చేపడుతున్నారని, దీనికి ఎన్ని నిధులైనా ఖర్చు పెట్టేందుకు వెనుకాడటం లేదన్నారు. ఈ వర్షాకాలంలో వర్షాలు పడటం వల్ల డ్రయినేజీలు పొంగడం లాంటివి ఎక్కడైనా ఇబ్బందులు తలెత్తే ప్రమాదం ఉందని.. దీనికి సంబంధించి మ్యాన్ హెూల్స్ కూడా మూసి ఉంచే విధంగా చర్యలు తీసుకోవాలని సూచించారు. ఏమైనా ఇబ్బంది ఉన్న యెడల వెంటనే తమ దష్టికి తీసుకురావాలని తెలిపారు.

సీఎం రిలీఫ్ ఫండ్ చెక్కు అందజేత



నవతెలంగాణ-మేడ్చల్

పేదలకు సీఎం రిలీఫ్ ఫండ్ వరం లాంటిదని మంత్రి చమాకూర మల్లారెడ్డి అన్నారు.మేడ్చల్ మండల పరిధిలోని నూతనకల్ గ్రామానికి చెందిన గాయంత హరీష్ యాదవ్ ఇటీవల రోడ్డు ప్రమాదానికి గురై చికిత్స చేయించుకున్నాడు. సీఎంఆర్ఎఫ్‌కు దరఖాస్తు చేసుకోగా మంజూరైన చెక్కు రూ.1లక్ష యాభై వేలను మంత్రి చేతుల మీదుగా శనివారం లబ్ధిదారుడికి అందజేశారు. పీఏసీఎస్ చైర్మెన్ సద్ది సురేష్ రెడ్డి, ఉప సర్పంచ్ ప్రభాకర్ రెడ్డి,నాయకులు యూనిస్ పాషా, జీవన్, పద్మారావు, భాస్కర్, మహేందర్ రెడ్డి, నర్సింగరావు తదితరులు పాల్గొన్నారు.

ఉచిత వైద్య శిబిరాలను పేదలు సద్వినియోగించుకోవాలి



- లయన్స్ క్లబ్ ఆఫ్ సికింద్రాబాద్ నార్త్ అధ్యక్షులు వినోద్ కుమార్ జాదవ్

నవతెలంగాణ-జగద్గిరిగుట్ట


పేదల నివసిత ప్రాంతాల్లో స్వచ్ఛంద సంస్థలు, దాతలు నిర్వహిస్తున్న ఉచిత వైద్య శిబిరాలు సద్వినియోగం చేసుకోవాలని లయన్స్ క్లబ్ ఆఫ్ సికింద్రాబాద్(నార్త్) అధ్యక్షులు, బ్రైట్ కాన్సెప్ట్ స్కూల్ కరస్పాండెంట్ లయన్ వినోద్ కుమార్ జాదవ్ అన్నారు. శనివారం కుత్బుల్లాపూర్ సర్కిల్ రంగారెడ్డి నగర్ డివిజన్ పరిధి, రంగారెడ్డి నగర్ ప్రాంతంలోని బ్రైట్ కాన్సెప్ట్ స్కూల్ లో లయన్స్ క్లబ్ ఆఫ్ సికింద్రాబాద్ (నార్త్) ఆధ్వర్యంలో మల్లారెడ్డి మల్టీ స్పెషాలిటీ హాస్పిటల్ (సూరారం) వారి సౌజన్యంతో ఏర్పాటు చేసిన ఉచిత మెగా వైద్య శిబిరాన్ని పూర్వ అధ్యక్షులు లయన్ పి .కష్ణ ,మేడ్చల్ జిల్లా ట్రస్మ అధ్యక్షులు లయన్ కె .రామేశ్వర్ రెడ్డి, కార్యదర్శి లయన్ బిర్రు ఆంజనేయులు ,లయన్ ఎస్.ఆర్.భాష, లయన్ రామ్ కుమార్ దేవత, లయన్ ప్రసాద్‌లతో కలిసి ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ లయన్స్ క్లబ్ ఆఫ్ సికింద్రాబాద్ (నార్త్) ఆధ్వర్యంలో గత కొన్నేండ్లుగా సామాజిక సేవలతో పాటు వైద్య సేవలు అందిస్తున్నామని తెలిపారు. ఈ ప్రాంతంలో అత్యధికంగా కార్మికులు, పేద ప్రజలు నివసిస్తుంటారని వారికి ఇటువంటి వైద్య శిబిరాలు ఎంతో దోహదపడతాయన్నారు. వివిధ భాగాలకు చెందిన సాధారణ, గైనకాలజీ, పెడియాట్రిక్స్,(చిన్నపిల్లల)ఎముకల, దంత, చర్మ వైద్యనిపుణులచే పాఠశాల విద్యార్థు లతోపాటు, వారి తల్లిదండ్రులకు సుమారుగా 600 మంది వరకు వైద్య పరీక్షలు చేశారు. అనంతరం మల్లారెడ్డి ఆస్పత్రి సిబ్బంది ఉచితంగా మందులు పంపిణీ చేశారు. ఈ కార్యక్రమంలో పాఠశాల ఇన్‌చార్జ్ ఆయేషా, లయన్స్ క్లబ్ ప్రతినిధులు లయన్ ఏ. విటల్ రావు పాటిల్, లయన్ మంచక్ రావు దేశముఖ్,ఉపాధ్యాయులు ,మల్లారెడ్డి హాస్పిటల్ ఇన్‌చార్జ్ రవికిరణ్, ఎగ్జిక్యూటివ్‌లు పవన్ ,నాగప్ప, పాల్గొన్నారు.

కేఎం ప్రతాప్‌కు జన్మదిన శుభాకాంక్షలు తెలిపిన ఎమ్మెల్సీ



నవతెలంగా-కుత్బుల్లాపూర్

రంగారెడ్డి జిల్లా మాజీ డీసీసీ అధ్యక్షులు, బీఆర్ఎస్ పార్టీ రాష్ట్ర నాయకులు కేయం ప్రతాప్ తన పుట్టిన రోజు వేడుకలను తిరుమల తిరుపతి వెంకటేశ్వర స్వామి సన్నిధిలో బుధవారం జరుపుకున్నారు. తిరిగి కుత్బుల్లాపూర్ తన నివాసానికి చేరుకున్న కేఎం ప్రతాప్‌ను శనివారం ప్రభుత్వ విప్, మేడ్చల్ జిల్లా బీఆర్ఎస్ పార్టీ అధ్యక్షులు, ఎమ్మెల్సీ శంభీపూర్ రాజు మర్యాదపూర్వకంగా కలిసి జన్మదిన శుభాకాంక్షలు తెలిపి, శాలువా, బొకేతో సత్కరించారు. ఈ సందర్భంగా కే.ఎం. ప్రతాప్ మాట్లాడుతూ తన అభిమానులు ఎంతో ప్రేమతో ప్రత్యక్షంగా, పరోక్షంగా జన్మదిన శుభాకాంక్షలు తెలియజేశారన్నారు. వారందరికీ ఎల్లప్పుడు అండగా ఉంటానన్నారు. ఎమ్మెల్సీతో పాటు కార్పొరేటర్లు మంత్రి సత్యనారాయణ, కొలుకుల జగన్, మాజీ కార్పొరేటర్ గుడిమెట్ల సురేష్ రెడ్డి ,ఆగం పాండు బీఆర్ఎస్ పార్టీ నాయకులు విజయరామరెడ్డి, అల్లా బక్ష, సుకన్య , ప్రేమిలా, రాజు ,రవీందర్ గౌడ్, రాష్ట్ర రికనైజర్ స్కూల్ ఉపాధ్యక్షులు చింతల మల్లేశం వారి కార్యవర్గం తదితరులు పాల్గొన్నారు.



గాంధీభవన్‌లో కాంగ్రెస్ పార్టీ ఇన్‌చార్జ్ ఏఐసీసీ కార్యదర్శి మన్సూర్ అలీ ఖాన్‌ను మర్యాద పూర్వకంగా కలిసిన కూకట్ పల్లి నియోజకవర్గ కాంగ్రెస్ పార్టీ సీనియర్ నాయకులు, మాజీ కార్పొరేటర్, పీసీసీ సభ్యులు గొట్టిముక్కల వెంగళరావు.

నవతెలంగాణ-కూకట్‌పల్లి

ప్రపంచ నంబర్ 1 బ్రాండ్‌గా పేరు తెచ్చుకున్న హయర్ అప్లయన్సెస్

నవతెలంగాణ-హైదరాబాద్

భారతీయ ఉపకరణాల పరిశ్రమలో అగ్రగామి సంస్థగా పేరు తెచ్చుకుని వినియోగదారులకు అత్యుత్తమ ఉత్పత్తులను అందిస్తోంది హయర్ అప్లయన్సెస్ ఇండియా. హెూమ్ అప్లయన్సెస్ లో గ్లోబల్ లీడర్ గా, 14 ఏళ్ల పాటు మేజర్ అప్లయెన్సెస్ ప్రపంచ నంబర్ 1 బ్రాండ్ గా పేరు తెచ్చుకుంది. పుణేలోని రంజంగాన్ తయారీ యూనిట్ కు ఐఎస్ఐ సర్టిఫికేషన్ సాధించిన ప్రపంచ నెంబర్ వన్ డీప్ ఫ్రీజర్ బ్రాండ్ హయర్. ఈసందర్భంగా హయర్ ఇండియా అధ్యక్షులు ఎన్.ఎస్.సతీష్ తన సంతోషాన్ని వ్యక్తం చేసి మాట్లాడుతూ..... పుణేలో ఉన్న రంజంగావ్ లో ఉన్న తమ తయారీ యూనిట్కు ఐఎస్ఐ సర్టిఫికేషన్ రావడం తమకు గర్వకారణమన్నారు. ఈ విజయం అధిక-నాణ్యత అందించాలనే తమ అచంచలమైన నిబద్ధతను ప్రతిబింబిస్తుందన్నారు. వినియోగదారుల అవసరాలు, అంచనాలకు అనుగుణంగా ఉండే ఉపకరణాలన్నారు. ధృవీకరణ భద్రత, మన్నిక, పనితీరు పట్ల హయర్ అంకితభావాన్ని బలపరుస్తుందన్నారు. అదే సమయంలో పరిశ్రమలోని అత్యున్నత ప్రమాణాలకు తమ కట్టుబడి ఉండడాన్ని ఉదాహరిస్తుందన్నారు.

వెల్‌స్పన్ సహకారానికి తెలంగాణలో రెండు ప్రత్యేక అవార్డులతో గుర్తింపు

నవతలంగాణ - హైదరాబాద్

భారతదేశంలోని ప్రముఖ బహుళజాతి సంస్థలలో ఒకటైన వెల్‌స్పన్, తమ అత్యుత్తమ సహకారంకోసం ప్రతిష్టాత్మక గుర్తింపును అందుకుంది. తెలంగాణ రాష్ట్రం ఏర్పడి ఒక దశాబ్దం పూర్తవుతున్న సందర్భాన్ని పురస్కరిం చుకొని జరుపుకుంటున్న మహెూన్నత వేడుకల్లో భాగంగా జూన్6, 2023న జరిగిన తెలంగాణ పారిశ్రామికవృద్ధి ఉత్సవంలో ఈ అవార్డులు అందజేయబడ్డాయి. ఈ కార్యక్రమం లో తెలంగాణలో టెక్స్టైల్ పరిశ్రమ అభివృద్ధికి వెల్‌స్పన్ అందిస్తున్న సహకారం పట్ల వెల్‌స్పన్‌కు ఉన్న తిరుగులేని నిబద్ధతను గుర్తించి గౌరవనీయమైన అవార్డుతో సత్కరించారు. ఈ అవార్డును సబితా ఇంద్రారెడ్డి, విద్యాశాఖ మంత్రి, తెలంగాణ ప్రభుత్వం, డా.ఎస్.హరీష్, ఐఏఎస్, కలెక్టర్ - రంగారెడ్డి జిల్లా, తీగల అనితారెడ్డి, జడ్పీ చైర్ పర్సన్ - రంగారెడ్డి జిల్లా, జిల్లా పరిశ్రమల కేంద్రం, రంగారెడ్డి జిల్లా, తెలంగాణ సహా అతిథులు వెల్స్పన్కు అందించారు.

స్టేట్ ఫస్ట్ ర్యాంక్ హన్సికకు ఘన సన్మానం



నవతెలంగాణ-కుత్బుల్లాపూర్

టీవీఆర్ మోడల్ హై స్కూల్ మేనేజింగ్ డైరెక్టర్ వంశీకృష్ణా రెడ్డి చేతుల మీదుగా స్టేట్ ఫస్ట్ ర్యాంక్ సాధించిన ఆర్.హన్సికకు ఘనసన్మానం కార్యక్రమం శనివారం నిర్వహించారు. 2023 మే నెలలో విడుదలైన ఎంపీసీ ప్రథమ సంవత్సరం ఇంటర్మీడియట్ ఫలితాలలో రాష్ట్రంలో ప్రథమ స్థానం పొందిన విద్యార్థిని హన్సికను టీవీఆర్ యజమాన్యం ఘనంగా సన్మానించి అభినందించింది. ఒకటవ తరగతి నుండి పదవ తరగతి వరకు విద్యా కుసుమంగా ఎదిగి ఇంటర్మీడియట్ ఫలితాలలో అద్భుత విజయాన్ని సాధించి కన్నా తల్లిదండ్రులకు, చదివిన పాఠశాలకు, కీర్తి ప్రతిష్టలు తెచ్చిన కుమారి హన్సికని పాఠశాల యజమాన్యం చదువుల తల్లి సరస్వతి దేవి విగ్రహాన్ని బహుమతిగా ఇచ్చి సత్కరించారు. టీవీఆర్ మోడల్ హై స్కూల్ చైర్మెన్ కోటిరెడ్డి మాట్లాడు తూ... కుమారి హన్సిక భవిష్యత్తులో మరిన్ని విజయాలను సాధించి, విద్యా కుసుమంగా ఎదగాలని పట్టుదలతో శ్రద్ధగా చదివి, ఉన్నత శిఖరాలను అధిరో హించాలని, అందుకు తగినంత ప్రోత్సా హం తమ నుండి ఎప్పుడు ఉంటుందని తల్లిదండ్రులకు తెలుపుతూ అభినంది స్తూ హర్షం వ్యక్తం చేశారు. ఈ కార్యక్రమంలో పాఠశాల విద్యార్థిని, విద్యార్థులు అధ్యాపక బృందం పాల్గొన్నారు.

బస్తీ దవాఖానాలో ఎలాంటి ఇబ్బందులు ఉండకూడదు

- ఎమ్మెల్యే మాధవరం కృష్ణారావు



నవతెలంగాణ-కూకట్‌పల్లి

ఎమ్మెల్యే మాధవరం కృష్ణారావు తన క్యాంపు కార్యాలయంలో శనివారం బస్తీ దవాఖానాలు, పల్లె దవాఖాన నగర ప్రాథమిక ఆరోగ్య కేంద్రాలు (యూపీహెచ్‌సీ) మెడికల్ ఆఫీసర్లతో సమీక్ష సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా కూకట్‌పల్లి నియోజకవర్గంలోని అన్ని డివిజన్‌లలో ఉన్న బస్తీ దవాఖానాల్లో ఇబ్బం దులు అడిగి తెలుసుకున్నారు. వైద్యులు కొన్నిచోట్ల మరుగుదొడ్లు, మంచినీరు, సిబ్బందికి సంబంధించి సమస్యలు తెలుపగా వెంటనే స్పందిస్తూ చర్యలు తీసుకునేటట్లు అధికారులకు అక్కడ నుంచి ఆదేశాలు జారీ చేశారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ ముఖ్యమంత్రి కేసీఆర్ ఎంతో మంది నిరు పేదలకు అండగా నిలుస్తూ బస్తీల్లో దవాఖానలు ఏర్పాటు చేశారని, అంతేకా కుండా కార్పొరేట్ ఆస్పత్రులకు ధీటుగా ఎక్కడికక్కడ ఆస్పత్రులు నిర్మిస్తున్నా రన్నారు. అలాగే కేపీహెచ్‌బీలోని వంద పడకల ఆస్పత్రి నిర్మాణం కూడా త్వరితగతిన పూర్తి చేస్తామని హామీ ఇచ్చారు. బస్తీ దవాఖానాలు, పల్లె దవాఖానాలు ప్రజలు ఉపయోగించుకోవాలని, వైద్యులు కూడా ఎప్పటికప్పుడు ప్రజలకు అందుబాటులో ఉండాలని సూచించారు. ఈ కార్యక్రమంలో డాక్టర్ చందర్ బస్తీ, దవాఖాన వైద్యులు పాల్గొన్నారు.

అర్హులైన పేద వారికి డబుల్ బెడ్ రూమ్ ఇండ్లు ఇవ్వాలి

- వాంబే కాలనీలోని సమస్యల పరిశీలనలో ప్రజా సంఘాల డిమాండ్



నవతెలంగాణ-కూకట్‌పల్లి

తెలంగాణ ప్రజా సంఘాల పోరాట వేదిక కూకట్‌పల్లి మండల కమిటీ ఆధ్వర్యంలో, శనివారం ఆల్విన్ కాలనీ డివిజన్ పరిధిలోని వాంబే కాలనీలో స్థానికుల సమస్యలను పరిశీలించి వాటిని పరిష్కరించాలని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో తెలంగాణ ప్రజా సంఘాల జిల్లా నాయకులు ఏం. శంకర్ పాల్గొని మాట్లాడుతూ.. ఆల్విన్ కాలనీ డివిజన్ పరిధిలోని వాంబే కాలనీలో ప్రజలు అనేక సమస్యలతో తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారని అన్నారు. ఇక్కడ మౌలికమైనటువంటి సదుపాయాలు రోడ్లు, డ్రైనేజీ, మంచినీరు ,విద్యుత్ స్తంభాలు ,వీధిలైట్లు, సరిగా లేనందున ప్రజలు తీవ్ర ఇబ్బందులు పడుతున్నరన్నారు. ఇక్కడ నివసిస్తున్న పేద ప్రజలకు ఇండ్ల పట్టాలు కూడా కొందరికి రాలేవని, కావున ఇప్పటికైనా ప్రభుత్వం స్పందించి ఇక్కడ మౌలిక సదుపాయాలు వెంటనే కల్పించాలని, ఇండ్ల పట్టాలు మంజూరు చేయాలని డిమాండ్ చేశారు. అలాగే అర్హులైన పేద వారిని గుర్తించి డబల్ బెడ్ రూమ్ ఇండ్లు ఇవ్వాలని, 58 ,59 కింద పట్టాలు ఇవ్వాలని, బీసీ రుణాలు ఇవ్వాలని, పెన్షన్లు ఇవ్వాలని ,ఖాళీ స్థలం ఉన్న వారికి 5 లక్షల రూపాయలు ఇవ్వాలని ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో షాబుద్దీన్ ,మునీర్ హుస్సేన్, శీను, గురుమయ్య, అంజలి, వహీద్ తదితరులు పాల్గొన్నారు.

26న రెవెన్యూ కార్యాలయాం ఎదుట ధర్నాలు



నవతెలంగాణ-దుండిగల్

ఇండ్లు, ఇండ్ల స్థలాలు, ఇంటి నిర్మాణానికి 5 లక్షల రూపాయలు, డబల్ బెడ్ రూమ్‌ల ప్రభుత్వ పంపిణీ కోసం ఈనెల 26న తహశీల్దార్ కార్యాలయల ముందు తెలంగాణ ప్రజా సంఘాల పోరాట వేదిక ఆధ్వర్యంలో జరుగు ధర్నాలను జయప్రదం చేయాలని తెలంగాణ ప్రజాసంఘాల పోరాటవేదిక జిల్లా నాయకులు నాగనిగళ్ల బాలపీరు తెలిపారు. శనివారం బాచుపల్లి మండలంలోని రాజీవ్ గృహకల్పలో ప్రజా సంఘాల నాయకులు మాట్లాడుతూ డబుల్ బెడ్ రూములు నిర్మాణాలు పూర్తయిన ప్రజలకు అందచేయకుండా ప్రభుత్వం జాప్యం చేయడం ఎందుకని, అలాగే ఇండ్లు లేని నిరుపేదలకు ఇళ్ల స్థలాలు, ఇటీవల ప్రభుత్వం ప్రకటించిన ఇంటి నిర్మాణాలకు రూ.5 లక్షల ప్రజలకు త్వరితగతిన అందజేయాలని, ఈ మేరకు జిల్లావ్యాప్తంగా జరిగే ధర్నాకు పెద్ద ఎత్తున పాల్గొని విజయవంతం చేయాలని తెలంగాణ ప్రజా సంఘాల పోరాట వేదిక జిల్లా నాయకులు నాగనిగళ్ల బాలపీరు పిలుపునిచ్చారు. ఏ పార్టీ అధికారం చేపట్టిన పేదలకు మాత్రం నిలువ నీడ లేదని ఉండడానికి ఇల్లు, కుటుంబ పోషణ కోసం సాగుభూమి, చనిపోతే బొంద పెట్టుకోవడానికి ఆరడుగుల స్థలం లేని దుస్థితి నేటికీ కొనసాగడం చాలా దారుణమైన విషయమని అన్నారు. ఇప్పటికైనా ప్రభుత్వం ఇండ్ల స్థలాలు లేని పేదలందరికీ 120 గజాల స్థలము ఇవ్వాలని, గతంలో పట్టా సర్టిఫికెట్లు ఉన్నవారికి ఇంటి స్థలము కేటాయించాలని, స్థలమున్నవారికి రూ.5 లక్షల ఇంటి నిర్మాణానికి ఇవ్వాలని, జిల్లాలో పూర్తయిన డబల్ బెడ్ రూమ్ ఇళ్లను అరత కలిగిన పేదలకు పంచాలని డిమాండ్ చేశారు. ఈ సమావేశంలో తెలంగాణ ప్రజాసంఘాల నాయకుడు మల్లికర్జున స్వామి పాల్గొన్నారు.

తెలంగాణలోని ట్రక్కర్లు, మెకానిక్ తో కనెక్ట్ అవుతున్న హ్యాపీనెస్ ట్రక్ 4.0

నవతలంగాణ - హైదరాబాద్

ఎన్బీసీ బేరింగ్స్ - సీకే బిర్లా గ్రూప్ సమర్పణలో వాల్వోలిన్ కమ్మిన్స్ చేత శక్తివంతం కావటంతో పాటుగా మోటార్ ఇండియా ద్వారా నిర్వహించ బడుతున్న వినూత్నమైన హ్యాపీ నెస్ ట్రక్ 4.0. కాశ్మీర్ నుండి కన్యాకుమారి వరకు సంచలనం సృష్టిస్తోంది. ఈ ట్రక్కు కన్యాకుమారి వద్ద తన చివరి గమ్యస్థానం వైపు దూసుకుపోతున్నందున తెలంగాణలోని నిజామాబాద్, హైదరాబాద్ నగరాల్లో దాని తాజా స్టాప్లను పూర్తి చేసింది. హ్యాపీనెస్ ట్రక్ 4.0 ప్రచారం అనేది సికెబిర్లా గ్రూప్ (టైటిల్ పార్టనర్)లో భాగమైన ఎన్బిసి బేరింగ్, వాల్వోలైన్ (పవర్డ్ బై పార్టనర్), భారత్ బెంజ్ (ట్రక్ పార్ట్‌నర్), గేట్స్ (పవర్ ట్రాన్స్ మిషన్ పార్టనర్)లో కేటీ టెలిమాటిక్ (నావిగేషన్ పార్టనర్), ఆల్ క్రాఫ్ట్ (థర్మల్ మేనేజ్మెంట్ పార్టనర్), సెటో (క్లచ్ పార్టనర్), ఎక్సలైట్-డీహెచ్ లైటింగ్ (లైటింగ్ పార్టనర్), విక్స్ ఫిల్టర్లు-మన్ ప్లస్ హమ్మెల్ (వడపోత భాగస్వామి), టాటా గ్రీన్ బ్యాటరీస్ (బ్యాటరీ) భాగస్వామి సహపరిశ్రమలోని అగ్ర బ్రాండ్ కలయిక.

రాష్ట్రంలో ఉన్నత విద్యలో ప్రగతి

- రాష్ట్ర ప్రభుత్వం సంస్కరణలతో ఉన్నత విద్యలో పెరిగిన నాణ్యత ప్రమాణాలు
- సాంకేతిక విద్యాశాఖ అవసరాల కోసం రూ.127.33 కోట్ల ఖర్చు
- ఇంటర్ విద్యా శాఖ వివిధ కార్యక్రమాలు



నవతెలంగాణ-సిటీబ్యూరో

ఇంటర్మీడియట్ విద్యాశాఖ చేపట్టిన కార్యక్రమాలు, సాధించిన ప్రగతికి సంబంధించి ప్రభుత్వ జూనియర్ కాలేజీల్లో ఏటా 10 శాతం విద్యార్థుల సామర్థ్యం పెరుగుతున్నది. 2015-16 విద్యా సంవత్సరం నుంచి ప్రభుత్వ జూనియర్ కాలేజీల విద్యార్థుల నుంచి ఎలాంటి ట్యూషన్ ఫీజును వసూలు చేయకుండా ప్రభుత్వం పుస్తకాలను ఉచితంగా పంపిణీ చేస్తున్నది. మౌలిక సదుపాయాల కల్పనలో భాగంగా 48 కొత్త భవనాలు, 186 అదనపు తరగతి గదులు, 267 ప్రహరీ గోడలు, 350 ఆర్వో ప్లాంట్లను ప్రభుత్వం ఏర్పాటు చేసింది. కార్పొరేట్ సామాజిక బాధ్యత (సీఎస్ఆర్)లో భాగంగా 18 కొత్త భవనాలు, 14 అదనపు తరగతులు, నాలుగు ప్రహరీ గోడలను చేపట్టింది.

ఉన్నత విద్యాశాఖ అభివృద్ధి

ప్రభుత్వ డిగ్రీ కాలేజీల్లో విద్యార్థుల నమోదుకు సంబంధించి తెలంగాణ స్థూల నమోదు నిష్పత్తి 36.2. ఇది జాతీయ సగటు కంటే ఎక్కువ. రాష్ట్ర ప్రభుత్వం చేపట్టిన సంస్కరణల కారణంగా ఉన్నత విద్యలో నాణ్యత ప్రమాణాలు ఆశించిన స్థాయిలో పెరిగాయి. ప్రతీ అసెంబ్లీ నియోజకవర్గంలో ఒక ప్రభుత్వ డిగ్రీ కాలేజీ ఉండేలా ఉన్నత విద్యాశాఖ చర్యలు చేపట్టింది. 34 ప్రభుత్వ డిగ్రీ కాలేజీలకు కొత్త భవనాల నిర్మాణం కోసం నిధులు కేటాయించింది. పారదర్శకంగా డిగ్రీ కాలేజీల్లో అడ్మిషన్లను చేపట్టేందుకు 2016-17 విద్యా సంవత్సరంలో ఉన్నత విద్యాశాఖ డిగ్రీ ఆన్‌లైన్ సర్వీసెస్ ఆఫ్ తెలంగాణ (దోస్త్) విధానాన్ని ప్రవేశపెట్టింది. రాష్ట్ర ఆవిర్భావానికి ముందు 450 ఉన్న అధ్యాపకుల సంఖ్య ఈ ఏడాది మార్చి 31 నాటికి 1,940కి పెరిగింది. 2019-20 విద్యాసంవత్సరంలో 96 కాలేజీలకు ఐఎస్‌వో సర్టిఫికెట్ లభించింది.

సాంకేతిక విద్యలో ప్రగతి

తెలంగాణ ఆవిర్భావం తర్వాత సాంకేతిక విద్యాశాఖ అవసరాల కోసం రూ.127.33 కోట్ల ఖర్చుతో 17 కొత్త భవనాలను ప్రభుత్వం నిర్మించింది. రాష్ట్ర ఏర్పాటు తర్వాత 12 కొత్త ప్రభుత్వ పాలిటెక్నిక్ కాలేజీలను స్థాపించింది. ప్రభుత్వ పాలిటెక్నిక్ కాలేజీల్లో విద్యార్థుల సంఖ్య 10,760 నుంచి 12,300కు పెరిగింది. 390 మంది కాంట్రాక్టు లెక్చరర్లు, 129 మంది కాంట్రాక్టు వర్క్‌షాప్ అటెండెంట్లను రెగ్యులరైజ్ చేసింది. ఎమర్జింగ్ టెక్నాలజీలుగా ఆదరణ పొందుతున్న ఏఐ (ఆర్టిఫిషియల్ ఇంటెలిజెన్స్), ఎంఎల్ (మెషిన్ లెర్నింగ్), సైబర్ సెక్యూరిటీ, డేటాసైన్స్, క్లౌడ్ కంప్యూటింగ్, ఎల్‌ఓటి, సీఎస్ఐటి, సాఫ్ట్‌వేర్ ఇంజినీరింగ్, నెట్‌వర్క్ కంప్యూటర్ సైన్స్ అండ్ బిజినెస్ సిస్టమ్స్ కోర్సులను రాష్ట్రంలోని ఇంజినీరింగ్ కాలేజీల్లో ప్రవేశపెట్టింది. సిరిసిల్లా, వనపర్తిలో జేఎన్టీయూ కాలేజీలను స్థాపించింది. 2021-22 విద్యాసంవత్సరంలో సంగారెడ్డి జిల్లా సుల్తాన్‌పూర్‌లో జేఎన్టీయూహెచ్ కాలేజ్ ఆఫ్ ఫార్మాస్యూటికల్ సైన్సెస్‌ని ఏర్పాటు చేసింది.

సమాజ భాగస్వామ్యం

పిల్లలు బడికి రోజూ రావాలన్నా, చదువుల్లో ప్రగతి కనబర్చాలన్నా బడితో పాటు 3వ శనివారం సమాజ సహకారం, భాగస్వామ్యం కూడా అవసరం. ఇందుకోసం ప్రతీ నెలలో తల్లిదండ్రుల సమావేశాన్ని పాఠశాలల్లో నిర్వహిస్తున్నారు. తద్వారా తల్లిదండ్రులకు చైతన్యాన్ని కల్పించడంతో పాటు వారి పిల్లల ప్రగతి గురించి చర్చించడం, ప్రదర్శనలు నిర్వహించడం వంటివి చేస్తున్నారు. ఈ విద్యా సంవత్సరం ముగింపు రోజు ఏప్రిల్ 24వ తేదీన పండగ వాతావ రణంలో తల్లిదండ్రుల సమావేశాలను నిర్వహించి విద్యార్థులకు 'ప్రగతి పత్రాల'ను అందించారు. తల్లిదండ్రులు, ఉపాధ్యాయులు, సమాజ సభ్యులు, ఒకే తాటిపైకి వచ్చి పిల్లల ప్రగతి గురించి బడి కేంద్రంగా ఉపక్రమించడం ఒక నూతన అధ్యాయమని చెప్పవచ్చు. ఈ ప్రక్రియలను సార్వత్రీకరించి పాఠశాల విద్యలో గుణాత్మకతను పెంచడానికి విద్యాశాఖ ముందుకెళ్తున్నది. మొత్తంగా తెలంగాణ ఆవిర్భావం జరిగి నవ వసంతాలు పూర్తయిన సందర్భంగా గడిచిన తొమ్మిదేండ్లుగా అమలు జరిపిన కార్యక్రమాలు, రూపొందించిన పథకాలు పాఠశాల విద్యాశాఖను ప్రగతి బాటలో పయనింపజేయడానికి దోహదపడ్డాయి. అన్ని రంగాల్లో ముందంజలో ఉన్న 'తెలంగాణ' విద్యా రంగంలో కూడా అనతి కాలంలోనే అగ్ర స్థానానికి చేరడానికి అనుకూలంగా ఉందని భావిద్దాం.



తెలుగు ఖ్యాతిని ఆస్ట్రేలియా గడ్డ పై చాటుతున్న కృష్ణ నడింపల్లి

- ప్రముఖుల ప్రశంసలు



నవతెలంగాణ-సిటీబ్యూరో

ఏదేశ మేగినా ఎందు కలిడినా పొగడరా నీ తల్లి భూమి భారతి ని అన్న రాయప్రోలు సుబ్బారావు గీతానికి కార్యరూపంలో ఆస్ట్రేలియా గడ్డ పై జాతి ఖ్యాతిని కృష్ణ నడింపల్లి చాటు తున్నారని ప్రముఖులు ప్రశంసించారు. రవీంద్రభారతి లోని సమావేశ మందిరంలో వంశీ ఆర్ట్స్ థియేటర్స్, వంశీ కల్చరల్ అండ్ ఎడ్యుకేషనల్ ట్రస్ట్, ఏం. ఆర్.సి గ్రూప్ నిర్వహణలో ఆస్టేలియా లో స్థిరపడిన కృష్ణ నడింపల్లి,లక్ష్మీ నడింపల్లి దంపతుల కు వంశీ గ్లోబల్ లెజెండరీ అవార్డుతో పాటు ఆదర్శ దంపతులు పురస్కార సభ జరిగింది. ముఖ్య అతిథిగా పురస్కారాలను బహు కరించి గోపాలాకృష్ణానంద. స్వామి పాల్గొని మాట్లాడారు విదేశాలలో ఉన్న తెలుగు వారు భారతీయ సంస్కృతికి రాయబారులు అన్నారు. కృష్ణ ప్రకృతి విపత్తుల నివారణ శాస్త్ర వేత్త గా ఆస్టేలియా దేశంలో గత ఇరవై వత్సరాలుగా ఆ దేశ ప్రగతి లో పాలు పంచుకొని అక్కడి ప్రభుత్వం చే మెడల్ ఆఫ్ ది ఆర్డర్ ఆఫ్ ఆస్టేలియా సత్కారం పొందారని ఇది ప్రతి భారతీయునికీ ముఖ్యంగా తెలుగు వారు అందరికి గర్వకారణం అన్నారు. ఆయన రానున్న రోజుల్లో ఆస్టేలియా చట్ట సభలకు ఎంపిక అయ్యే అవకాశాలు ఉందని వివరించారు. అధ్యక్షత వహించిన సాహితీ వేత్త వోలెటి పార్వతీశం మాట్లాడుతూ తెలుగు నాట మారు మూల గ్రామంలో పేద కుటుంబం నుంచి స్వయంకృషితో విదేశీ గడ్డ పై శాస్త్ర వేత్త గా ప్రభవించిన కృష్ణ జీవిత ప్రస్థానం నేటి తరాలకు స్ఫూర్తి దాయకం అన్నారు. స్వాగతం పలికిన వంశీ రామ రాజు ఆస్టేలియా లో కృష్ణ తెలుగు సంస్థలను ఐక్య పరచి పలు సాహిత్య సాంస్కృతిక కార్యక్రమాలు నిర్వహిస్తున్నారని తెలిపారు. వేదిక పై నిర్మాత ఏం. ఆర్.చౌ దరి, డాక్టర్ తెన్నేటి సుధ, శైలజ తదితరులు పాల్గొన్నారు తొలుత కొండ్రాజు కృతి సాహిత్య భరత నాట్య ప్రదర్శన ఆకట్టుకుంది

విద్యార్థుల బంగారు భవితకు బాట వాసర విద్యాలయ హై స్కూల్



నవతెలంగాణ-కూకట్‌పల్లి

కూకట్ పల్లి ఆల్విన్ కాలనీలో గత 33 ఏండ్లుగా విద్యార్థులకు నాణ్యమైన విద్యను అందిస్తూ, విద్యార్థుల బంగారు భవితకు బాటలు వేస్తూ ,ఎందరో విద్యార్థులను ఉన్నత స్థానాల్లో ఉండేలా కృషి చేశామని వాసర విద్యాలయ హై స్కూల్ కరెస్పాండెంట్ అశోక్ గుంజడి తెలిపారు. కరస్పాం డెట్ జి, అశోక్ వాసర విద్యాలయ స్కూల్ విశేషాలు తెలుపుతూ.. ఆల్విన్ కాలనీ సాయి నగర్ ప్రాంతంలో 1989 వ సంవత్సరంలో అతి తక్కువ మంది స్టూడెంట్స్ తో విద్యాసంస్థను ప్రారంభించి నేడు భారీ స్ట్రెంత్‌తో విద్యార్థులకు నాణ్యమైన విద్యను అందిస్తూ విద్యార్థుల విజయాలకు పునా దిగా వాసర విద్యాలయం కొనసాగుతుందని తెలిపారు. కాలానుగుణంగా మారుతున్న టెక్నాలజీకి అనుగుణంగా విద్యార్థులకు బోధించే విద్యలో సాంకేతికతను జోడిస్తూ విద్యార్థులను విద్యావంతులుగా తీర్చిదిద్దు తున్నామని చెప్పారు. అలాగే విద్యతో పాటుగా విద్యార్థులకు భవిష్యత్తులో ఉపయోగపడేలా, ఆరో తరగతి నుంచి పదవ తరగతి విద్యార్థులకు ఐఐటీ తరగతులను,ఒకటవ తరగతి నుండి ఐదవ తరగతి విద్యార్థులకు అబాకస్ ఉచితంగా బోధిస్తున్నామని చెప్పారు. అలాగే డిజిటల్ తరగతులు, ప్రొజెక్టర్ లు,డిజిటల్ వైట్ బోర్డ్ ఉపయోగిస్తూ ఆధునిక టెక్నాలజీ ద్వారా విద్యార్థులకు నాణ్యమైన విద్యను అందిస్తున్నామన్నారు. పాఠశాల ప్రారంభమైనప్పటి నుంచి పదవ తరగతిలో 98 నుంచి 100 శాతం ఉత్తీర్ణత సాధిస్తూ, గ్రేడింగ్ పద్ధతి అమలులోకి వచ్చాక 10/10 గ్రేడ్‌లు సాధిస్తూ,అతి తక్కువ ఫీజుతో సామాన్యులకు సైతం అందుబాటులో ఉండేలా ఆధునిక తరగతులలో విద్యార్థులకు విద్యను అందించడమే కాకుండా, ,విద్యార్థులకు తరగతి గదుల్లో ఎలాంటి అసౌకర్యం కలుగకుండా పరిశుభ్రమైన తరగతి గదుల్లో విద్యనందిస్తున్నామని వివరించారు. ప్రతీ సంవత్సరం మంచి ఫలితాలతో ముందుకు సాగుతున్నామని తెలిపారు.

పైడి లక్ష్మయ్య, సంజీవ రెడ్డిలు నిస్వార్థ ప్రజా సేవకులు

- తమిళనాడు పూర్వ గవర్నర్ పీ.ఎస్.రామ మోహనరావు



నవతెలంగాణ-కల్చరల్

పైడి లక్ష్మయ్య పాలనాధ్యక్షునిగా సాహితీ ప్రియునిగా పెరుపొందగా ఆయన కుమారుడు సంజీవ రెడ్డి ఉన్నత పదవిలో నిరతరం ప్రజా క్షేమం కోసం తపించిన వారుగా గుర్తింపు తెచ్చుకున్నారని ఇరువురూ నిస్వార్థ ప్రజా హితులు అని తమిళనాడు పూర్వ గవర్నర్ పీ.ఎస్. రామమోహన రావు అన్నారు. ప్రముఖ సాంస్కృతిక సంస్థ రసమయి, డాక్టర్ పైడి లక్ష్మయ్య పైడి సంజీవ రెడ్డిల స్మారక పురస్కార ప్రదానోత్సవ సభ జరిగింది. ముఖ్య అతిథిగా రామమోహన రావు పాల్గొని సాహితీవేత్త డాక్టర్ అనంత పద్మనాభ రావుకు కవి టిక్కి కృష్ణ కు, తెలంగాణ రచయిత ల సంఘం రాష్ట్ర అధ్యక్షుడు నాలేస్వరం శంకరం కు స్వర్ణ భారతి ట్రస్ట్ నిర్వాహకులు దీప వెంకట్‌కు బహుకరించి అభినందించారు. అధ్యక్షత వహించిన శ్రీ వెంకటేశ్వర విశ్వవిద్యాలయం విశ్రాంత ఉప కులపతి ఆచార్య కొలకలూరి ఇనాక్ మాట్లాడుతూ పైడి లక్ష్మయ్య బహు భాష కోవిదులు సంజీవ రెడ్డి తండ్రి కి తగ్గ తనయులు అని కొనియాడరు. డాక్టర్ రాము స్వాగతం పలికిన సభలో నరసింహప్ప తదితరులు పాల్గొన్నారు. కార్యక్రమనికి తొలుత సలాది మృణాళిని శిష్యులు భగీరథ విలాసం రస రమ్యం గా నర్తించారు. ఆశ లత వ్యాఖ్యానం ఆకట్టుకుంది

నవచిత్రం

భిన్న కాన్సెప్ట్‌తో.. హర్


సురేష్‌బాబు, శ్రీధర్ స్వరాఘవ్

కథానాయిక రుహాణి శర్మ నటించిన డిఫరెంట్ లేడీ ఓరియెంటెడ్ కాన్సెప్ట్ చిత్రం 'హర్'. పోలీస్ ఇన్వెస్టిగేషన్ నేపథ్యంలో తెరకెక్కిన ఈ సినిమాకు శ్రీధర్ స్వరాఘవ్ దర్శకత్వం వహించారు. డబుల్ అప్ మీడియాస్ సంస్థ తొలి ప్రొడక్షన్‌గా ఈ సినిమాను రఘు సంకురాత్రి, దీపా సంకురాత్రి నిర్మించారు. ఈ చిత్రంలో వికాస్ వశిష్ఠ, ప్రదీప్ రుద్ర, జీవన్ కుమార్, అభిగ్న్య, సంజయ్ స్వరూప్, బెనర్జీ, రవివర్మ ఇతర ముఖ్యపాత్రలు పోషిస్తున్నారు. ఇప్పటికే పోస్ట్ ప్రొడక్షన్ వర్క్స్ ఫినిష్ చేసుకున్న ఈ సినిమా విడుదలకు సిద్ధమైంది.
ఈ సినిమా ఫైనల్ కాపీ చూసి, సురేష్ ప్రొడక్షన్స్ సంస్థ దీన్ని థియేటర్లలో విడుదల చేయడానికి ముందుకు రావడమే తమ విజయానికి తొలి మెట్టు అని దర్శక, నిర్మాతలు తెలిపారు. తాజాగా ఈ సినిమాకు సంబంధించిన రిలీజ్ డేట్ పోస్టర్‌ను నిర్మాత డి. సురేష్ బాబు రిలీజ్ చేశారు. సురేష్ ప్రొడక్షన్స్ డిస్ట్రిబ్యూషన్ సంస్థ ద్వారా ఈ సినిమా జూలై 21న థియేటర్లోకి రాబోతోంది. ఈ సినిమా ఆడియో హక్కులను సరిగమ సొంతం చేసుకుంది. ఇప్పటికే రిలీజ్ చేసిన పోస్టర్స్, టీజర్ సినిమాపై హైప్ పెంచాయని, సినిమా తప్పకుండా ప్రేక్షకులను అలరిస్తుందనే దీమాని, మంచి కాన్సెప్ట్‌ని ప్రేక్షకులు కచ్చితంగా ఆదరిస్తారనే నమ్మకాన్ని మేకర్స్ వ్యక్తం చేశారు.

రీ- రిలీజ్‌కి రంగం సిద్ధం


కీర్తి రెడ్డి, పవన్‌కళ్యాణ్

తెలుగు సినీ పరిశ్రమలో క్లాసిక్ హిట్‌గా నిలిచిన 'తొలిప్రేమ' ఈ ఏడాదితో దిగ్విజయంగా 25 వసంతాలు పూర్తి చేసుకుంది. పవన్ కళ్యాణ్, కీర్తి రెడ్డి జంటగా నటించిన ఈ చిత్రానికి ఎ.కరుణాకరన్ దర్శకత్వం వహించారు. ఎస్.ఎస్.సి. ఆర్ట్స్ పతాకంపై జి.వి.జి.రాజు నిర్మించిన ఈ చిత్రం 1998 జూలైలో విడుదలై ఘన విజయం సాధించింది.
ఈ సినిమా విడుదలై ఈ ఏడాదితో 25 వసంతాలు పూర్తవుతున్న సందర్భంగా 4కె ఫార్మెట్‌లో దీన్ని రిలీజ్ చేస్తున్నారు. శ్రీ మాతా క్రియేషన్స్ వారు ఈ చిత్రాన్ని ఈనెల 30న 300కి పైగా థియేటర్లలో భారీగా విడుదల చేస్తున్నారు. ఈ నేపథ్యంలో ఈ మూవీ రీ-రిలీజ్ ట్రైలర్ ఈవెంట్ శనివారం ఉదయం రామానాయుడు స్టూడియోస్‌లో జరిగింది.
నిర్మాత దిల్ రాజు మాట్లాడుతూ, "తొలిప్రేమ అనేది ఒక గొప్ప జ్ఞాపకం. నా సినీ ప్రయాణంలో ఈ సినిమాకి ఓ ప్రత్యేక పేజీ ఉంటుంది. ఈరోజు నేను ఇలా ఉన్నానంటే నాకు అడుగులు నేర్పించిన సినిమా 'తొలిప్రేమ" అని అన్నారు. దర్శకుడు కరుణాకరన్ మాట్లాడుతూ, 'ఈ ఒక్క చిత్రం నా జీవితాన్ని మార్చేసింది' అని తెలిపారు. 'తొలిప్రేమ సినిమా మాకు ఎన్నో జ్ఞాపకాలు ఇచ్చింది. ఈ సినిమా రీరిలీజ్ చేస్తున్న రఘురాం రెడ్డి, రవికాంత్ రెడ్డికి ఆల్ ది బెస్ట్' అని నిర్మాత జి.వి.జి.రాజు చెప్పారు. శ్రీ మాతా క్రియేషన్స్ నిర్మాతలు రఘురాం రెడ్డి, రవికాంత్ రెడ్డి మాట్లాడుతూ, 'ఈ సినిమా ద్వారా వచ్చే ఆదాయంలో కొత్త మొత్తాన్ని పవన్ కళ్యాణ్ జనసేన పార్టీ తలపెట్టిన రైతు భరోసా యాత్రకు విరాళంగా ఇవ్వబోతున్నాం' అని అన్నారు.

షికార్‌కి వచ్చిన షేర్‌ని..


చిరంజీవి

చిరంజీవి, మెహర్ రమేష్, ఎకె ఎంటర్‌టైన్ మెంట్స్ కాంబోలో రూపొందుతున్న యాక్షన్ ఎంటర్‌టైనర్ 'భోళా శంకర్'. ఈ చిత్ర టీజర్‌ను శనివారం లాంచ్ చేశారు.
'33 మందిని దారుణంగా చంపిన వ్యక్తి ఎవరు? డెన్‌లో గూండాలను చితకొట్టి 'షికార్ కొచ్చిన షేర్ ని బే..." అని చిరు చెప్పిన డైలాగ్, 'ఈ స్టేట్ డివైడ్ అయినా అందరూ నా వాళ్లే... నాకు హద్దుల్లేవ్... సరిహద్దుల్లేవ్... 11 ఆగస్ట్ దేఖ్‌లేంగే...' అంటూ చెప్పిన చివరి డైలాగ్స్ బాగా అలరిస్తున్నాయి' అని చిత్ర బృందం తెలిపింది. దర్శకుడు మాట్లాడుతూ, 'మెగాస్టార్‌లో మనకు నచ్చే అంశాలన్నీ ఇందులో ఉంటాయి' అని అన్నారు. 'టీజర్ అదిరిపోయింది. సినిమా దీనికి మించి ఉంటుంది. ఆగస్ట్ 11న సినిమా వస్తోంది. చిరంజీవి కెరీర్‌లో నెంబర్1 సినిమా అవుతుంది' అని నిర్మాత అనిల్ సుంకర తెలిపారు.

మాఫియా అక్రమాలు


అర్జున్ అంబటి, జెన్నిఫర్

మాఫియా అక్రమాల నేపథ్యంలో ఎస్ ఎస్ మీడియా ప్రొడక్షన్స్ బ్యానర్ పై రూపొందుతున్న కొత్త సినిమా 'పరమపద సోపానం'. గుడిమిట్ల సువర్ణలత సమర్పణలో తెరకెక్కుతున్న ఈ చిత్రంలో అర్జున్ అంబటి హీరోగా నటిస్తుండగా, జెన్నిఫర్ హీరోయిన్‌గా నటిస్తోంది. తాజాగా మేకర్స్ ఈ చిత్ర టీజర్‌ను రిలీజ్ చేశారు.
'ఆయువు కోసం అరువులు చాస్తూ నోరు తెరిచిన కాల సర్పం కంట పడకుండా.. ఎగిరిపోవాలి అనే డైలాగ్‌తో ప్రారంభమైన ఈ టీజర్‌లో ఆసక్తికర ఎలిమెంట్స్ అందర్నీ అలరిస్తున్నాయి. సినిమా సోల్ తెలిసేలా కట్ చేసిన యాక్షన్ సన్నివేశాలు కథపై క్యూరియాసిటీ పెంచేలా చేశాయి. టీజర్‌లో వినిపించిన ఒకటి రెండు డైలాగ్స్, బ్యాక్ గ్రౌండ్ స్కోర్ హైలైట్ అయ్యాయి. పోలీస్ ఇన్వెస్టిగేషన్, మాఫియా ప్రధానంగా ఈ మూవీ రూపొందుతోందని స్పష్టం చేస్తూ వదిలిన ఈ టీజర్ ప్రేక్షకుల దృష్టిని విశేషంగా ఆకర్షించింది' అని చిత్ర యూనిట్ తెలిపింది.
ఈ సినిమాకు స్టోరీ, స్క్రీన్ ప్లే, మాటలు, దర్శకత్వం : నాగ శివ, ఎడిటర్ : గౌతమ్ రాజ్ నెరుసు, ఎగ్జిక్యూటివ్ ప్రొడ్యూసర్ : గణపర్తి నారాయణ రావు, కో - ప్రొడ్యూసర్ : గుడిమిట్ల ఈశ్వర్.

ఎమోషనల్ థ్రిల్లర్

బసవతారక రామ క్రియేషన్స్ పేరుతో ఎన్టీఆర్ పెద్ద కుమారుడు నందమూరి జయకృష్ణ నిర్మాణ సంస్థని ఏర్పాటు చేసి, తొలి చిత్రంగా తన తనయుడు చైతన్యకృష్ణని హీరోగా పరిచయం చేస్తూ నిర్మిస్తున్న ఎమోషనల్ థ్రిల్లర్ 'బ్రీత్'. ఈ చిత్రానికి వంశీకృష్ణ ఆకెళ్ళ దర్శకత్వం వహిస్తున్నారు. తాజాగా ఈ చిత్ర టీజర్‌ని లాంచ్ చేశారు మేకర్స్.


చైతన్య కృష్ణ, జయకృష్ణ, వంశీకృష్ణ ఆకెళ్ళ

ఈ టీజర్ లాంచ్ ఈవెంట్‌లో నిర్మాత నందమూరి జయకృష్ణ మాట్లాడుతూ,' ఇదొక ఎమోషనల్ థ్రిల్లర్. అన్ని వర్గాల వారిని అలరించేలా ఉంటుంది. మా అమ్మానాన్నల పేరుతో బసవ తారక రామ క్రియేషన్స్ బ్యానర్ పై నిర్మిస్తున్న ఈ చిత్రాన్ని వారికి అంకితం చేస్తున్నాను' అని తెలిపారు. 'వంశీకృష్ణ ఆకెళ్ళ చక్కని కథ, కథనంతో ఈ చిత్రాన్ని మలిచారు. ప్రతి పాత్ర, సన్నివేశం అర్థవంతంగా ఉంటుంది. హీరోయిన్ వైదిక అద్భుతంగా నటించింది' అని హీరో చైతన్యకృష్ణ అన్నారు. దర్శకుడు వంశీకృష్ణ ఆకెళ్ళ,'ఇంత మంచి థ్రిల్లర్‌ని చేసే అవకాశం ఇచ్చినందుకు హీరో, నిర్మాతలకు థ్యాంక్స్. ఇదొక సీట్ ఎడ్జ్ థ్రిల్లర్. సినిమా చూస్తున్నపుడు షాక్, ఎగ్జైట్‌మెంట్, థ్రిల్ అన్నీ ఫీలవుతారు. కమర్షియల్ ఎలిమెంట్స్‌తో ఉన్న యూనిక్ థ్రిల్లర్ ఇది' అని చెప్పారు.

నిదురించు జహాపన..

ప్రేమించుకుందాం రా , సూర్యవంశం, మనసంతా' నువ్వే లాంటి ఎన్నో సూపర్ హిట్ చిత్రాలతో ప్రేక్షకులని అలరించిన చైల్డ్ ఆర్టిస్ట్ ఆనంద్ వర్ధన్ హీరోగా పరిచయం అవుతున్నారు. ఆయన హీరోగా ప్రసన్న కుమార్ దేవరపల్లి దర్శకత్వంలో ఆర్ ఎంటర్‌టైన్మెంట్స్, శ్రీజ మూవీ మేకర్స్ బ్యానర్స్‌పై సామ్ జి, వంశీ కృష్ణ వర్మ ఓ యూనిక్ ఎంటర్‌టైనర్ నిర్మిస్తున్నారు.


నవమి గయాక్, ఆనంద్ వర్ధన్, రోషిణి సాహోతా

ఈ చిత్రానికి 'నిదురించు జహాపన' అనే ఆసక్తికరమైన టైటిల్‌ని లాక్ చేసిన మేకర్స్ మోషన్ పోస్టర్‌ని లాంచ్ చేశారు. ఆనంద్ వర్ధన్ మాట్లాడుతూ,' చైల్డ్ ఆర్టిస్ట్‌గా చాలా చిత్రాలు చేశాను. ఇప్పుడు కథానాయకుడిగా మీ ముందుకు వస్తున్నాను. ఇదొక గ్రేట్ జర్నీ. మీ అందరినీ తప్పకుండా ఈ సినిమా అలరిస్తుంది' అని తెలిపారు.
'ఒక మనిషి నిద్రపోయిన తర్వాత కలలు వస్తాయి. ఐతే ఆ కల గురించి ఓ పది నిమషాలు చెప్పుకుంటాం. మిగతా సమయం అంతా ఏం జరుగుతుందనేది ఒక క్వశ్చన్ మార్క్. అలాగే ఈ సినిమాలో మా హీరో ఆరు నెలలు కంటిన్యూస్ నిద్రపోతూనే ఉంటాడు. దాదాపు సముద్ర నేపథ్యంలో సాగే కథ ఇది' అని దర్శకుడు ప్రసన్న కుమార్ చెప్పారు. సంగీత దర్శకుడు అనూప్ రూబెన్స్ మాట్లాడుతూ, కథ చాలా నచ్చింది. పాటలన్నీ బాగా వచ్చాయి' అని చెప్పారు.

మట్టి నుంచి పుట్టిన సినిమా



ఎ.బి. సినిమాస్, నిహాల్ ప్రొడక్షన్స్ బ్యానర్స్‌పై రమేష్ చెప్పాల రచన-దర్శకత్వంలో డాక్టర్ బత్తిని కీర్తిలత గౌడ్, రాజా నరేందర్ చెట్లపెల్లి నిర్మించిన చిత్రం భీమదేవరపల్లి బ్రాంచి. ఈ చిత్రంలో బలగం ఫేమ్ సుధాకర్ రెడ్డి, అంజి వల్లమాన్, సాయి ప్రసన్న, అభి, రూప ప్రధాన పాత్రలలో నటించారు. శుక్రవారం విడుదలైన ఈ సినిమా తొలి ఆట నుంచే ఆర్గానిక్ హిట్ టాక్‌ను సొంతం చేసుకుని విజయవంతంగా ప్రదర్శితమౌతోంది. ఈ నేపథ్యంలో శనివారం ప్రసాద్ ల్యాబ్‌లో సక్సెస్‌మీట్‌ను నిర్వహించారు. ఈ సందర్భంగా తెలంగాణ బీసీ కార్పొరేషన్ చైర్మన్ వకుళాభరణం కృష్ణమోహన్‌రావు మాట్లాడుతూ, "బలగం' మాదిరిగానే 'భీమదేవరపల్లి బ్రాంచి' కూడా విజయవంతం కావడం సంతోషంగా ఉంది' అని అన్నారు. 'మట్టి నుంచి పుట్టిన సినిమా ఇది. ప్రజల జీవన విధానాలను, వారిలోని ఎమోషన్స్‌ను బేస్ చేసుకుని చక్కని కథను తయారు చేసుకుంటే సక్సెస్ ఖచ్చితంగా వస్తుంది అని మరోసారి నిరూపించిన అద్భుతమైన సినిమా ఇది' అని దర్శక, నిర్మాత తమ్మారెడ్డి భరద్వాజ అన్నారు.
నిర్మాతల్లో ఒకరైన రాజా నరేందర్ చెట్లపెల్లి మాట్లాడుతూ, 'ప్రేక్షకుల్ని అద్భుతంగా మెప్పించిన ఇలాంటి మంచి చిత్రానికి నిర్మాత కావడం చాలా గర్వంగా ఉంది' అని తెలిపారు. నిర్మాత డాక్టర్ బత్తిని కీర్తిలత గౌడ్ మాట్లాడుతూ,'ఇందులో నేను హీరోయిన్ తల్లిగా నటించాను. అటు నటిగా, ఇటు నిర్మాతగా నాకు మంచి పేరు తెచ్చిన చిత్రమిది' అని అన్నారు. 'తెలుగు సినిమా పరిశ్రమ ఖ్యాతిని పెంచే సినిమా ఇది. గ్రామీణ నేపథ్యంతో పాటు రాజకీయ పార్టీలు ప్రజల జీవితాలతో ఎలా ఆడుకుంటున్నాయి అనే నగ్న సత్యాన్ని వినోదంతో చెప్పాం. అందుకే ప్రజలు మా సినిమాకు బ్రహ్మరథం పడుతున్నారు' అని దర్శకుడు రమేష్ చెప్పాల తెలిపారు.

విద్యారంగాన్ని ధ్వంసం చేసి

విద్యా దినోత్సవాలా?

- టీచర్ల ఖాళీ భర్తీ, కనీస సౌకర్యాలు లేవ్..
- ప్రశ్నించే ఉపాధ్యాయులు, విద్యార్థులపై ఉ.పా కేసులు ఎత్తేయాలి : ప్రొఫెసర్ హరగోపాల్



నవతెలంగాణ-ముషీరాబాద్

విద్యారంగాన్ని ధ్వంసం చేసి విద్యాదినోత్సవాలు జరుపుకోవడం సిగ్గుచేటని, ప్రశ్నించే ఉపాధ్యాయులు, విద్యార్థులపై పెట్టిన ఉపా కేసులను ఎత్తేయాలని ప్రొఫెసర్ హరగోపాల్ ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. హైదరాబాద్‌లోని సుందరయ్య విజ్ఞాన కేంద్రంలో శనివారం తెలంగాణ విద్యా పరిరక్షణ కమిటీ ఆధ్వర్యంలో విలేకరుల సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా హరగోపాల్ మాట్లాడుతూ.. కేజీ నుంచి పీజీ వరకు ఉచిత విద్య అని, కామన్ విద్యా విధానం నా కల అని, కలెక్టర్ పిల్లలైనా రిక్షా వాళ్ల పిల్లలైనా ఒకే బడిలో చదువుకోవాలని చెప్పిన కేసీఆర్ ప్రభుత్వం తొమ్మిది సంవత్సరాలుగా విద్యారంగాన్ని ధ్వంసం చేసిందని విమర్శించారు.

రాష్ట్రంలో 26,62 ప్రభుత్వ పాఠశాలల్లో ఉపాధ్యాయుల కొరత, పర్యవేక్షణ లోపించి, మౌలిక సదుపాయాల కొరత కొట్టొచ్చినట్టు కనిపిస్తున్నదన్నారు. దాదాపు 24 వేల టీచర్ పోస్టులు ఖాళీగా ఉన్నాయని, గత సంవత్సరం కనీసం విద్యావాలంటీర్లను కూడా నియమించలేదని అన్నారు 33 జిల్లాల్లో 26 జిల్లాలకు డీఈవోలు లేరని, 67 మండలాల్లో 590 మండలాలకు ఎంఈఓలు లేరని తెలిపారు. రాష్ట్రవ్యాప్తంగా పది డైట్ కాలేజీలు ఉంటే 6 కాలేజీలకు ప్రిన్సిపాళ్లు లేరని, 90 శాతం ప్రాథమిక పాఠశాలల్లో తరగతికి టీచర్‌లు కూడా లేరని తెలిపారు. 7500 స్కూళ్లకు ఒకరే టీచర్ ఉన్నారని వివరించారు. మన ఊరు -మనబడి పేరు కింద కేటాయించిన రూ. 7289 కోట్లలో రూ.469 కోట్లు కూడా ఖర్చు చేయలేదన్నారు.

రాష్ట్ర అధ్యక్షులు ప్రొఫెసర్ చక్రధర్‌రావు మాట్లాడుతూ.. 2014లో విద్యారంగానికి బడ్జెట్లో 11 శాతం నిధులు కేటాయించగా.. ఇప్పుడు ఆరు శాతానికి తగ్గించిందన్నారు. విద్యారంగానికి కనీసం నిధులు 20 శాతానికి పెంచాలని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో కమిటీ కార్యనిర్వాహక కార్యదర్శి ప్రొఫెసర్ కె.లక్ష్మీనారాయణ, డెమోక్రటిక్ టీచర్స్ ఫెడరేషన్ రాష్ట్ర కార్యదర్శి లింగారెడ్డి, సీనియర్ నాయకులు ఎంఎస్.క్రిష్టప్ప, ప్రోగ్రెసివ్ యూత్‌లీగ్ రాష్ట్ర అధ్యక్షులు కాశీనాథ్, పీడీఎస్‌యూ రాష్ట్ర అధ్యక్షులు రామకృష్ణ, కార్యదర్శి ఆజాద్, టీపీటీఎఫ్ రాష్ట్ర కార్యదర్శి నాగిరెడ్డి, పీడీఎస్‌యూ(వి) అధ్యక్షులు మహేష్, కార్యదర్శి విజయ్ పీవైఎల్ నాయకులు కృష్ణ తదితరులు పాల్గొన్నారు.

మంత్రి ఎర్రబెల్లికి ఇస్కాన్ ఆహ్వానం

నవతెలంగాణ బ్యూరో - హైదరాబాద్

ఇస్కాన్ అధ్వర్యంలో ఈ నెల 27న పాలకుర్తి నియోజకవర్గం తొర్రూరులో నిర్వహించనున్న జగన్నాథ రథయాత్రలో ముఖ్య అతిథిగా పాల్గొనాలని ఆ సంస్థ ప్రతినిధులు పంచాయతీరాజ్ శాఖ మంత్రి ఎర్రబెల్లి దయాకర్ రావును ఆహ్వానించారు. ఈ మేరకు శనివారం హైదరాబాద్‌లోని మంత్రుల నివాసంలో వారు ఆయన్ను కలిశారు. రథ యాత్రకు సంబంధించిన విషయాలను, ప్రాధాన్యతను వారు మంత్రికి వివరించారు. రథయాత్రలో పాల్గొనేందుకు ఎర్రబెల్లి అంగీకరించారని ఇస్కాన్ సంస్థ తెలిపింది.

కేంద్ర ప్రభుత్వ కార్మిక వ్యతిరేక విధానాలకు నిరసనగా

20న హైదరాబాద్‌లో రాష్ట్ర సదస్సు
21 నుంచి ఆగస్టు 8 వరకు గ్రామ, మండల కేంద్రాల్లో ప్రచారం

జూలై 1 నుంచి 15 వరకు జిల్లా సదస్సులు

- ఆగస్టు 9, 10 తేదీల్లో హైదరాబాద్‌తోసహా అన్ని జిల్లాల్లో మహాధర్నా

కేంద్ర, రాష్ట్ర కార్మిక, ఉద్యోగ సంఘాల పిలుపు



నవతెలంగాణబ్యూరో-హైదరాబాద్

కేంద్ర ప్రభుత్వ కార్మిక వ్యతిరేక విధానాలకు నిరసనగా ఉద్యమ కార్యాచరణ చేపట్టాలంటూ కేంద్ర, రాష్ట్ర ఉద్యోగ, కార్మిక సంఘాలు పిలుపునిచ్చాయి. ఇందులోభాగంగా జూలై 1 నుంచి 15 వరకు జిల్లా సదస్సులు నిర్వహించాలని కోరాయి. 20న హైదరాబాద్‌లో రాష్ట్ర సదస్సు నిర్వహించనున్నట్టు తెలిపాయి. 21 నుంచి ఆగస్టు 8 వరకు గ్రామ, మండల కేంద్రాల్లో ప్రచారం చేయాలని పిలుపునిచ్చాయి. ఆగస్టు 9, 10 తేదీల్లో హైదరాబాద్‌తోసహా అన్ని జిల్లాల్లో మహాధర్నా చేపట్టనున్నట్టు తెలిపాయి. శనివారం హైదరాబాద్‌లోని సుందరయ్య విజ్ఞాన కేంద్రంలో ఆర్. డీ. చంద్రశేఖర్ (ఐఎన్‌టీయూసీ), ఎస్.బాలరాజు (ఏఐటీయూసీ), పాలడుగు భాస్కర్, కె. భూపాల్, జె. వెంకటేష్ (సీఐటీయూ), రెబ్బా రామారావు, అంజాద్ (హెచ్‌ఎంఎస్), ఎస్ఎల్ పద్మ, కిరణ్ (ఐఎఫ్‌టీయూ), ఎంకే బోస్, ప్రసాద్ (టీఎన్‌టీయూసీ), ఎం. శ్రీనివాస్ (ఐఎఫ్‌టీయూ), కె. ఆంజనేయులు (ఏఐయూటీయూసీ), ఇ. నాగేశ్వరరావు (సీజీ కాన్ఫెడరేషన్), జి. తిరుపతయ్య(ఎల్ఐసీ), పి. వెంకట్రామయ్య, టీ, సతీష్, సుందర్‌రామ్ (బెఫీ), రాజు భట్ (మెడికల్ రిప్స్) రాష్ట్ర నాయకులు విలేకర్లతో మాట్లాడారు. కేంద్రంలోని మోడీ సర్కారు గత తొమ్మిదేండ్లుగా ప్రభుత్వరంగ సంస్థలను నిర్వీర్యం చేసిందని వారు ఈ సందర్భంగా విమర్శించారు. దేశంలోని ఉద్యోగ ఖాళీలను భర్తీ చేయకుండా నిర్లక్ష్యం చేసిందన్నారు. 29 కార్మిక చట్టాల స్థానంలో నాలుగు లేబర్ కోడ్లను తెచ్చి కార్మిక హక్కులను హరిస్తున్నదని విమర్శించారు. రైల్వే, రక్షణ, ఫార్మా సింగరేణి తదితర సంస్థలను నిర్వీర్యం చేస్తున్నదని ఆందోళన వ్యక్తం చేశారు.

ద్రవ్యోల్బణాన్ని అదుపు చేయలేని మోడీ సర్కార్ అసమర్థత వల్ల కార్మికుల కొనుగోలు శక్తి క్షీణిస్తున్నదని తెలిపారు. పెన్షన్ నిధులను సైతం కేంద్రం కార్పొరేట్ సంస్థలకు ధారాదత్తం చేస్తున్నదని విమర్శించారు. కార్మికులు కష్టాల్లో ఉన్నప్పటికీ కనీస వేతనాలు సవరించడం లేదని చెప్పారు. దేశంలో కార్మిక రంగ సమస్యలను పరిష్కరించడం చేతకాని బీజేపీ ప్రభుత్వం కుల, మత, ప్రాంతీయ, అస్థిత్వ ఉద్యమాలకు ఆజ్యం పోస్తూ కార్మికవర్గ ఐక్యతను విచ్ఛిన్నం చేస్తున్నదని ఆగ్రహం వ్యక్తం చేశారు. ఈ సంక్లిష్ట పరిస్థితుల్లో కేంద్ర ప్రభుత్వ కార్మిక వ్యతిరేక విధానాలను నిరసిస్తూ ఈనెలతోపాటు జూలై, ఆగస్టు నెలలో చేపట్టబోతున్న ప్రచార కార్యక్రమాల్లో రాష్ట్రంలోని యావత్ కార్మికవర్గం పాల్గొని విజయవంతం చేయాలని కోరారు.

డిమాండ్లు

- నాలుగు లేబర్ కోడ్లను రద్దు చేయాలి
- తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వం విడుదల చేసిన 5 కనీస వేతనాల జీఓలను అమలు చేయాలి. మిగిలిన షెడ్యూల్డ్ పరిశ్రమలకు వెంటనే కనీస వేతన జీవోలు ప్రకటించి అమలుచేయాలి.
- రైతాంగానికి కనీస మద్దతు ధర ప్రకటించాలి. ఎలక్ట్రిసిటీ బిల్లు - 2022ను వాపస్ తీసుకోవాలి.
- ప్రభుత్వరంగ సంస్థలను ప్రైవేటుపరం చేయరాదు.
- నేషనల్ మానిటైజేషన్ పైపులైన్‌ను రద్దు చేయాలి.
- కాంట్రాక్ట్ విధానాన్ని రద్దుచేసి, కాంట్రాక్ట్, ఔట్ సోర్సింగ్ కార్మికులను పర్మినెంట్ చేయాలి.
- ట్యాక్స్ పరిధిలో లేని అసంఘటితరంగ కార్మికులకు రూ.7,500లు నెలకు చెల్లించాలి.
- అసంఘటితరంగ కార్మికులను 'యూనివర్సల్ సోషల్ సెక్యూరిటీ స్కీమ్'ను ప్రవేశపెట్టాలి.
- ఉపాధి చట్టానికి కేంద్ర బడ్జెట్‌లో నిధులను పెంచాలి. ఈ పథకాన్ని పట్టణ ప్రాంతాలకు విస్తరించాలి.
- అంగన్‌వాడీ, ఆశా, మధ్యాహ్నభోజనం లాంటి స్కీమ్ వర్కర్లకు చట్టపరమైన కనీస వేతనాలు చెల్లించాలి. వారిని ప్రభుత్వ ఉద్యోగులుగా గుర్తించాలి.
- దేశంలోని అత్యధిక ధనవంతుల (కార్పొరేట్ వర్గాలు) ఆదాయంపై సంపద పన్నును పెంచి, విద్యా ఆరోగ్యం, వ్యవసాయ రంగాలకు కేటాయించాలి.
- పెట్రోల్, డీజిల్‌పై సెంట్రల్ ఎక్సైజ్ డ్యూటీని తగ్గించాలి.
- ప్రజా పంపిణీ ద్వారా నిత్యావసర వస్తువులను తక్కువ ధరలకు పంపిణీ చేయాలి.
- బీడీ కార్మికులందరికీ కనీస వేతనాల జీవోను పునరుద్ధరించాలి.

ఓపీఎస్ సాధనకోసం 23న రాష్ట్రస్థాయి సదస్సు

- 17 కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వ ఉద్యోగ సంఘాల నిర్ణయం



నవతెలంగాణ-హైదరాబాద్‌బ్యూరో

నూతన పెన్షన్ విధానాన్ని (ఎన్‌పీఎస్) రద్దు చేసి, పాత పెన్షన్ విధానాన్నే (ఓపీఎస్) అమలు చేయాలని డిమాండ్ చేస్తూ జులై 23వ తేదీ ఉదయం 10 గంటలకు హైదరాబాద్ సుందరయ్య విజ్ఞాన కేంద్రంలో రాష్ట్రస్థాయి ఐక్య సదస్సు నిర్వహిస్తున్నట్టు జాయింట్ ఫోరమ్ ఫర్ రిస్టోరేషన్ ఆఫ్ ఓపీఎస్ (జేఎఫ్‌ఆర్‌ఓపీఎస్) ప్రకటించింది. 17 కార్మిక సంఘాలతో కూడిన ఈ ఫోరం ఆధ్వర్యంలో శనివారం సికింద్రాబాద్‌లోని దక్షిణ మధ్య రైల్వే మజ్దూర్ యూనియన్ (ఎస్‌సీఆర్ఎమ్‌యూ) రాష్ట్ర కార్యాలయంలో విలేకరుల సమావేశం జరిగింది. ఎస్‌సీఆర్ఎమ్‌యూ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి డాక్టర్ సీహెచ్ శంకరరావు, కాన్ఫెడరేషన్ ఆఫ్ సెంట్రల్ గవర్నమెంట్ ఎంప్లాయిస్ అండ్ వర్కర్స్ (సీసీజీఈడబ్ల్యూ) చైర్మెన్ నాగేశ్వరరావు, ప్రధాన కార్యదర్శి ఏ అజీజ్, ఆలిండియా ఇన్సూరెన్స్ ఎంప్లాయిస్ అసోసియేషన్ (ఏఐఐఈఏ) ప్రధాన కార్యదర్శి జీ తిరుపతయ్య, ఆలిండియా డిఫెన్స్ ఎంప్లాయిస్ ఫెడరేషన్ (ఏఐడీఈఎఫ్) రాష్ట్ర నాయకులు గోపాలకృష్ణ, తిరుపతి, రంజిత్‌గౌడ్, తెలంగాణ స్టేట్ యునైటెడ్ టీచర్స్ ఫెడరేషన్ (టీఎస్‌యూటీఎఫ్) ప్రధాన కార్యదర్శి చావ రవి, తెలంగాణ ప్రోగ్రెసివ్ టీచర్స్ ఫెడరేషన్ (టీపీటీఎఫ్) అధ్యక్షులు అశోక్‌బాబు, డెమోక్రటిక్ టీచర్స్ ఫెడరేషన్ (డీటీఎఫ్) అధ్యక్షులు ఎమ్ సోమయ్య తదితరులు మాట్లాడారు. దేశవ్యాప్తంగా పాత పెన్షన్ సాధన కోసం ఉద్యమం నడుస్తున్నదనీ, కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వ ఉద్యోగులు, ఉపాధ్యాయులు దీనిలో భాగస్వాములు కావాలని పిలుపునిచ్చారు. వామపక్షపార్టీలు మొదటి నుంచీ పాత పెన్షన్ విధానానికి కట్టుబడి ఉన్నాయని తెలిపారు. ఇటీవలికాలంలో ఢిల్లీ, పంజాబ్ రాష్ట్రాల్లో పాత పెన్షన్ విధానాన్ని అమలు జరుపుతూ ఆమ్ ఆద్మీ పార్టీ నిర్ణయం తీసుకున్నదని చెప్పారు. నూతన పెన్షన్ స్కీంను తెచ్చిన కాంగ్రెస్‌పార్టీ కూడా రాజస్థాన్, ఛత్తీస్‌గఢ్, హిమాచల్‌ప్రదేశ్, కర్నాటక రాష్ట్రాల్లో పునరాలోచన చేసి, పాత పెన్షన్ విధానాన్నే కొనసాగిస్తామని ప్రకటించిందని గుర్తుచేశారు. దేశవ్యాప్తంగా ఈ ఉద్యమాన్ని మరింత ఉధృతం చేస్తూ సీసీజీ ఈడబ్ల్యూ, అఖిల భారత రాష్ట్ర ప్రభుత్వ ఉద్యోగుల ఫెడరేషన్ (ఏఐఎస్‌జీఈఎఫ్) గతేడాది డిసెంబర్‌లోనే పిలుపునిచ్చిందన్నారు. దానిలో భాగంగా పలు రాష్ట్రాల్లో వివిధ రూపాల్లో ఆందోళనలు కొనసాగుతున్నాయనీ, వాటన్నింటినీ ఏకతాటిపైకి తెచ్చి కేంద్ర ప్రభుత్వంపై ఒత్తిడి పెంచేలా కార్యాచరణ ప్రకటించాల్సి ఉందన్నారు. దానికి సన్నాహకంగానే రాష్ట్రస్థాయి సదస్సును ఏర్పాటు చేశామన్నారు. దీనిలో కార్మికులు, ఉద్యోగులు పెద్ద సంఖ్యలో పాల్గొనాలని విజ్ఞప్తి చేశారు. ఈ సందర్భంగా రాష్ట్ర సదస్సు పోస్టర్‌ను విడుదల చేశారు. ఐక్య రాష్ట్రస్థాయి సదస్సులో పై సంఘాలతో పాటు బ్యాంక్ ఎంప్లాయిస్ ఫెడరేషన్ ఆఫ్ ఇండియా (బెఫీ), తెలంగాణ స్టేట్ ప్రైమరీ టీచర్స్ అసోసియేషన్ (టీఎస్‌పీటీఏ), తెలంగాణ రాష్ట్ర టీచర్స్ ఫెడరేషన్ (టీఆర్‌టీఎఫ్), స్కూల్ టీచర్స్ ఫెడరేషన్ తెలంగాణ స్టేట్ (ఎస్‌టీఎఫ్‌టీఎస్), బహుజన టీచర్స్ ఫెడరేషన్ (బీటీఎఫ్), తెలంగాణ ఎస్సీ ఎస్టీ టీచర్స్ ఫెడరేషన్ (టీఎస్సీఎస్టీటీఎఫ్), తెలంగాణ స్టేట్ మోడల్ స్కూల్ టీచర్స్ ఫెడరేషన్ (టీఎస్ఎమ్ఎస్‌టీఎఫ్), ట్రైబల్ టీచర్స్ అసోసియేషన్ (టీటీఏ), ఎస్సీ, ఎస్టీ ఉపాధ్యాయ సంఘం తెలంగాణ స్టేట్ (ఎస్సీఎస్టీయూఎస్‌టీఎస్), మజ్లిస్ టీచర్స్ యూనియన్ (ఎమ్‌టీయూ)లు కూడా భాగస్వామ్యమవుతాయని తెలిపారు.

ప్రగతి పథంలో విద్యాశాఖ

అత్యధిక మానవ వనరులు కలిగిన వ్యవస్థగా పాఠశాల విద్యాశాఖ సమాజాభివృద్ధిలో కీలక పాత్రను పోషిస్తున్నది. ఉపాధ్యాయులు, విద్యార్థులు, అధికారులు, సమాజ సభ్యులు, ప్రజాప్రతినిధులను ఒకే వేదిక మీదకు తీసుకొని వచ్చిన అరుదైన క్షేత్రంగా 'పాఠశాల' విరాజిల్లుతున్నది. పాఠశాల వివిధ ప్రక్రియలకు కార్యస్థలంగా, మానవ సంబంధాలను పెంపొందింపజేసే సంస్థగా సమాజానికి అవసరమైన మానవ వనరులను సమకూరుస్తున్నది.

నవతెలంగాణ-సిటీబ్యూరో

రాష్ట్రంలోని 26,815 ప్రభుత్వ పాఠశాలల్లో 23,35,952 మంది పిల్లలు విద్యనభ్యసిస్తుండగా..1,002 గురుకుల పాఠశాలలలో 5,99,537 మంది విద్యార్థులకు అంతర్జాతీయ ప్రమాణాలతో విద్యాబోధన జరుగుతున్నది. ఇక హైదరాబాద్ జిల్లాలో మొత్తం 3150 పాఠశాలల్లో 'పాఠశాల విద్యాశాఖ' ఆధ్వర్యంలో 691 ప్రభుత్వ పాఠశాలలు, 245 ఎయిడెడ్ పాఠశాలలు 1730 ప్రయివేట్ పాఠశాలలు ఉన్నాయి. మిగిలిన పాఠశాలలు సంక్షేమశాఖల ఆధ్వర్యంలో నిర్వహించబడే రెసిడెన్షియల్ పాఠశాలలు. వీటిలో 9,91,800 మంది.. విద్యార్థులు 1 నుంచి 12వ తరగతి వరకు విద్యనభ్యసిస్తున్నారు. 4,641 మంది ఉపాధ్యాయులు ప్రభుత్వ పాఠశాలల్లో బోధిస్తుండగా, 31,289 మంది ఉపాధ్యాయులు ప్రయివేటు పాఠశాలల్లో బోధిస్తున్నారు. ఎయిడెడ్, సంక్షేమశాఖ, రెసిడెన్షియల్ పాఠశాలల్లో సుమారు 2,531 ఉపాధ్యాయులు పనిచేస్తున్నారు. పాఠశాల విద్యాశాఖ, ప్రయివేట్, కేంద్ర ప్రభుత్వం సంక్షేమశాఖల ఆధ్వర్యంలో 38,461 మంది ఉపాధ్యాయులు పని చేస్తున్నారు.

సకల హంగులతో సర్కారు బడులు

మూడేండ్లలో, మూడు దశలుగా 26,065 పాఠశాలల్లో మౌలిక సదుపాయాలను సమగ్రంగా అభివృద్ధి చేయాలని రాష్ట్ర ప్రభుత్వం నిర్ణయించింది. బడులను బలోపేతం చేయడం కోసం రూ.7,289 కోట్లతో మన ఊరు-మన బడి/మన బస్తీ-మన బడి కార్యక్రమాన్ని అమలు చేస్తున్నది. 12 అంశాలుగా విభజించి మౌలిక వసతులను అభివృద్ధి చేస్తున్నది. మొదటి దశలో 2021-22 సంవత్సరానికి 9,123 (35 శాతం) పాఠశాలల్లో మౌలిక సదుపాయాల కల్పన, బలోపేతం కోసం రూ.3,497.62 కోట్ల అంచనా బడ్జెట్‌తో పనులు చేపట్టింది. నగరంలో మొదటి దశలో 261(35శాతం) పాఠశాలల్లో కార్యక్రమాన్ని ప్రారంభించారు. తద్వారా మొదటి దశలో 73,065 మంది విద్యార్థులు లబ్ధి పొందుతున్నారు. ఇందుకోసం రూ.103.99 కోట్ల ఖర్చు చేస్తున్నారు.

మధ్యాహ్న భోజన పథకం

హైదరాబాద్ జిల్లాలో 837 ప్రభుత్వ, ఎయిడెడ్ పాఠశాలల్లోని సుమారు 1,43,676 మంది పిల్లలు 'మధ్యాహ్న భోజన పథకం' ద్వారా లబ్ధి పొందుతున్నారు.



ఇది కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాల భాగస్వామ్యంతో నిర్వహించబడే పథకం అయినప్పటికీ, మన రాష్ట్రంలో దీనికి ప్రత్యేకత ఉండడం గమనార్హం. కేంద్ర ప్రభుత్వ సహకారంతో మన రాష్ట్రంలో 8వ తరగతి వరకు అమలయ్యే ఈ పథకాన్ని తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వం 9,10 తరగతులకు కూడా విస్తరించి సన్న బియ్యంతో కూడిన నాణ్యమైన భోజనాన్ని అందిస్తున్నది. వంట మనుషులకు, కార్మికులకు ఇచ్చే రూ.వెయ్యి గౌరవ వేతనాన్ని రాష్ట్ర ప్రభుత్వం మూడింతలు అంటే రూ.3వేలకు పెంచడం ద్వారా వారికి కూడా చేయూతనిస్తున్నది.

ఫోర్టిఫైడ్ రాగి జావ (మాల్ట్)

ఈ విద్యా సంవత్సరం 2023-24 నుంచి ఉదయం రాగి జావ కూడా అందించాలనే ప్రభుత్వ నిర్ణయం హర్షణీయం. హైదరాబాద్ జిల్లాలో 837 ప్రభుత్వ, ఎయిడెడ్ పాఠశాలల్లో 1వ తరగతి నుండి 10వ తరగతి వరకు చదువుకుంటున్న 1,43,676 మంది విద్యార్థులకు ఉదయం రాగి జావను అల్పాహారంగా అందిస్తున్నారు. ఇందులో 50శాతం శ్రీ సత్యసాయి అన్నపూర్ణ ట్రస్ట్ వారు, మిగిలిన 50శాతం ప్రభుత్వం భరిస్తున్నది. దీని వల్ల విద్యార్థులకు అవసరమైన కాల్షియం, ఇనుము, మినరల్స్, విటమిన్స్ వంటివి సమృద్ధిగా లభిస్తాయి. తద్వారా ఆరోగ్యం మెరుగుపడుతుంది.

న్యాక్ ఆధ్వర్యంలో అందిస్తున్న వివిధ కోర్సుల్లో ప్రవేశాలకు దరఖాస్తుల ఆహ్వానం

నవతెలంగాణ-సిటీబ్యూరో



నేషనల్ అకాడామి ఆఫ్ కన్‌స్ట్రక్షన్(న్యాక్) ఆధ్వర్యంలో అందిస్తున్న వివిధ కోర్సులల్లో ఉచిత శిక్షణ కోరకు దరఖాస్తులను ఆహ్వానించారు. కన్‌స్ట్రక్షన్ ప్రాజెక్టు మేనేజ్‌మెంట్, క్వాంటిటీ సర్వేయింగ్‌తోపాటు కాంట్రాక్టు మేనేజ్‌మెంట్ కోర్సులను అందిస్తున్నారు. ఒక సంవత్సరం పీజీ కోర్స్ ట్రైనింగ్‌ను జీఐపీఎల్ సంస్థద్వారా ఒక్కో కోర్సులో 10 మందికి ఉచిత అవకాశం కల్పించారు. సివిల్, మెకానికల్ ఇంజనీరింగ్ విద్యా అర్హత కల్గిన వారు దరఖాస్తు చేకోవాలని న్యాక్ డైరెక్టర్ శాంతి శ్రీ శనివారం తెలిపారు. పూర్తి చేసిన దరఖాస్తులను ఆగస్టు 12లోపు సమర్పించాలని కోరారు. పూర్తి వివరాల కోసం 9247440624, 9290021976 ఫోన్ నెంబర్‌లో సంప్రదించాలని కోరారు.

JEEVANJYOTHI HIGH SCHOOL



విద్యార్థుల జీవితాల్లో వెలుగులు నింపుతున్న జీవన్ జ్యోతి హై స్కూల్

- వంద శాతం ఉత్తమ ఫలితాలతో ఈ ప్రాంతంలో ఉన్న బెస్ట్ స్కూల్

జీవన్ జ్యోతి : స్కూల్ డైరెక్టర్ రాజశేఖర్

నవతెలంగాణ - కూకట్‌పల్లి

కూకట్ పల్లి ఆల్విన్ కాలనీలో 1995 వ సంవత్సరంలో ప్రారంభమైన జీవన్ జ్యోతి హై స్కూల్ 28 ఏండ్లుగా ఆల్విన్ కాలనీ, తులసి నగర్,ఎల్లమ్మ బండ, భూదేవి హిల్స్ , పరిసర ప్రాంతాల్లో ని ఎంతో మంది పిల్లలను విద్యావంతులుగా తీర్చిదిద్దడంతో పాటుగా, ఉన్నత స్థానాలకు చేరేలా విద్యతో పాటు,క్రమశిక్షణ , సమాజం పట్ల అవగాహన కల్పిస్తూ విద్యార్థులకు వారి జీవితాల్లో వెలుగులు నింపుతున్నది. జీవన్ జ్యోతి ఈ టెక్నో హై స్కూల్ డైరెక్టర్ రాజశేఖర్,కరస్పాండెంట్ లోయిస్ లు మాట్లాడుతూ విద్యార్థులందరూ నూటికి నూరు శాతం ఉత్తీర్ణులు కావడమే లక్ష్యంగా విద్యార్థులకు విద్యా బోధన చేస్తున్నామని,అలాగే స్కూల్లో మొత్తం టీచర్స్ బీఎడ్ వంటి ఉన్నత చదువులు చదివి, విద్యా బోధనలో మంచి అనుభవం ఉన్నవారు ఉండటం వల్ల మంచి ఫలితాలు సాధిస్తున్నామని తెలిపారు, స్కూల్లో మొదటి తరగతి నుంచి పదవ తరగతి వరకు ఇంగ్లీష్ మీడియం తో నడుపుతున్నామని, ఈ విద్యా సంవత్సరానికి పదో తరగతి లో వంద శాతం ఫలితాల తో పాటు 10/10 సాధించామని తెలిపారు. విద్యార్థులకు ఎడ్యుకేషనల్ కోర్సెస్ లో బాగంగా డిజిటల్ తరగతుల్లో ,డిజిటల్ స్క్రీన్ పై తరగతులు



తీసుకుంటూ ఆధునిక టెక్నాలజీ ద్వారా విద్యార్థులకు నాణ్యమైన విద్యను అందిస్తున్నామని, తక్కువ ఫీజుతో ఉన్నతమైన విద్యను బోధిస్తూ ఈ ప్రాంతంలో ఉన్న బెస్ట్ స్కూల్ లో జీవన్ జ్యోతి స్కూల్ మొదటి స్థానంలో ఉందన్నారు. ప్రతీ సంవత్సరం వంద శాతం ఉత్తమ ఫలితాలు సాధిస్తూ,పిల్లకు విద్యతో పాటు క్రీడల్లో ను శిక్షణ ఇస్తున్నామని తెలిపారు.

Printed and Published by Nandayala Narsimha Reddy On behalf Of Navatelangna Printers Private Limited, Printed At M.H Bhavan, 1st Floor, Plot No. 21/1, Azamabad Near Rtc Kalyana Mandapam, Baghlingampally, Hyderabad-500020,Telangana State, Published at Navatelangana Printers Private Limited, M.H Bhavan,1st Floor No.21/1, Azamabad, Near Rtc Kalyana Mandapam, Baghlingampally, Hyderabad-500020, Telangana State, Editor : R.Sudha Bhaskar TELTEL/2014/59462.

ఆగస్ట్ ఆఫర్ అంటే ఏమిటి ?

- డాక్టర్ కె. శశిధర్
విషయ నిపుణులు
94919 91918



రెండవ ప్రపంచయుద్ధం జరుగుతున్న సందర్భం లో భారతదేశాన్ని పరిపాలిస్తున్న బ్రిటీషు ప్రభుత్వానికి చెందిన వైశ్రాయ్ జనరల్ లిన్‌లిత్‌గో భారతదేశానికి చెందిన ఏ ఒక్కరితోను సంప్రదించకుండా భారత దేశం రెండవ ప్రపంచ యుద్ధంలో పాల్గొంటుందని ప్రకటిం చాడు. ఈ ప్రకటనను భారత జాతీయ కాంగ్రెస్‌తో పాటు ఇండియన్ ముస్లీం లీగ్ కూడా వ్యతిరేకించింది. బ్రిటీషు ప్రభుత్వానికి అనుకూలంగా భారతదేశం రెండవ ప్రపంచ యుద్ధంలో పాల్గొనాలంటే తాము ప్రతిపాదించిన డిమాండ్లను బ్రిటీషు ప్రభుత్వం అంగీకరించాలని అటు భారత జాతీయ కాంగ్రెస్, ఇటు ఇండియన్ ముస్లీం లీగ్ సంస్థలు వేరువేరుగా తీర్మానాలు చేశాయి. ఈ తీర్మానాల ప్రకారం భారతదేశాన్ని వలస పాలన నుండి విముక్తి చేసి సంపూర్ణ స్వాతంత్ర్యాన్ని ప్రకటించాలని, దానితో పాటు జాతీయస్థాయిలో ప్రభుత్వాన్ని ఏర్పాటు చేయాలని కాంగ్రెస్ డిమాండ్ చేయగా, ముస్లింలకు ప్రత్యేక దేశాన్ని ప్రకటించాలని ముస్లీం లీగ్ బ్రిటీషు ప్రభుత్వాన్ని కోరింది. ఈ రెండు డిమాండ్లను పరిగణనలోనికి తీసుకోకుండా వైశ్రాయ్ మధ్యే మార్గంగా జనరల్ లిన్‌లిత్‌గో కొన్ని కొత్త అంశాలతో కూడిన ఒక ప్రతిపాదనను ముందుకు తీసుకువచ్చాడు. 1940 ఆగస్టు 8వ తేదిన సిమ్లాలో వైశ్రాయ్ జనరల్ లిన్‌లిత్‌గో ఈ ప్రతిపాదనను ప్రకటించటం వల్ల దీనికి 'ఆగస్టు ఆఫర్' లేదా 'ఆగస్టు ప్రతిపాదన' అని పిలుస్తారు.

ఆగస్టు ప్రతిపాదనలో ముఖ్యాంశాలు

రెండవ ప్రపంచ యుద్ధం ముగిసిన అనంతరం భారతదేశానికి డొమినీయన్ స్టేటస్‌ను ప్రకటించటం, వైశ్రాయ్ కౌన్సిల్‌లో మెజారిటీ స్థానాలను భారతీయులకు కేటాయించటం, భారతదేశ రాజ్యాంగ నిర్మాణానికి ప్రత్యేక సభను నియమించటం వంటి అంశాలతో కూడిన ప్రతిపాదనను లిన్‌లిత్‌గో కాంగ్రెస్, ముస్లిం లీగ్‌ల ముందు ఉంచాడు. రాజ్యాంగ సభ ద్వారా భారతీయులే తమ దేశానికి సంబంధించిన రాజ్యాంగాన్ని రూపొందిం చుకోచ్చని ఈ ప్రతిపాదన ద్వారా బ్రిటీషు ప్రభుత్వం తన అంగీకారాన్ని తెలిపింది. ఆ రకంగా భారతీయ రాజ్యాంగ నిర్మాణానికి మొదటి అంకు రార్పణగా ఆగస్టు ప్రతిపాద నను గుర్తించవచ్చు. దానితో పాటు రాజ్యాంగ నిర్మాణంలో మైనారిటీ వర్గాల న్యాయ బద్ధమైన డిమాండ్లను పరిగణనలోనికి తీసుకుంటామని లిన్‌లితో ప్రకటిం చాడు. భారతదేశానికి సంపూర్ణ స్వాతంత్ర్యాన్ని ప్రకటిం చటంతో పాటు జాతీయస్థాయిలో ప్రభుత్వాన్ని ఏర్పాటు చేయాలన్న కాంగ్రెస్ డిమాండును పరిగణన లోనికి తీసుకోకపోవటంతో కాంగ్రెస్ ఈ ఆఫర్‌ను తిరస్కరిం చింది. ముస్లింలకు ప్రత్యేక దేశం అనే అంశాన్ని పట్టిం చుకోక పోవటంతో ముస్లిలీగ్ కూడా ఈ ఆఫర్‌ను వ్యతిరేకించింది. దీంతో రెండవ ప్రపంచ యుద్ధంలో భారతీ యుల భాగస్వామ్యాన్ని కోరుతూ వారి ముందుకు వివిధ తాయిలాలతో తెచ్చిన ఆగస్టు ఆఫర్ విఫలమయ్యింది. భారతీ యుల ఆకాంక్షలకు ఏమాత్రం గౌరవం ఇవ్వకుండా సంపూర్ణ స్వాతంత్ర్యానికి బదులుగా దేశానికి సార్వభౌమత్వాన్ని ఇస్తామన్న ఈ ఆగస్టు ప్రతి పాదనను జవహార్‌లాల్ నెహ్రూ 'తలుపుకు కొట్టిన మేకులా చనిపోయిందని' (డెడ్ ఆజ్ ఎ డోర్‌నెయిల్)గా అభివర్ణించారు.



పోటీ పరీక్షల ప్రత్యేకం ఇండియన్ పాలిటీ

1. ఆగస్టు ఆఫర్‌ను ప్రతిపాదించినది ఎవరు?
   ఎ. లార్డ్ కర్జన్ బి. లార్డ్ మింటో
   సి. లార్డ్ లిన్‌లిత్‌గో డి. లార్డ్ ఇర్విన్

2. బ్రిటీషు ప్రభుత్వం భారతీయుల ముందు పెట్టిన ఆగస్టు ఆఫర్ ముఖ్యోద్దేశమేంటి?
   ఎ. భారతదేశాన్ని స్వతంత్ర్య దేశంగా ప్రకటించటం
   బి. భారతదేశ ప్రజలు, నాయకుల్లో వ్యతిరేకతను తొలగించి రెండవ ప్రపంచ యుద్ధంలో పాల్గొనేలా చేయటం
   సి. భారత్‌ను రెండు దేశాలుగా విభజించటం
   డి. దేశీయ నాయకులను బ్రిటీషు అనుకూలురు, వ్యతిరేకులనే రెండు వర్గాలుగా చీల్చటం

3. ఆగస్టు ఆఫర్‌ను ప్రతిపాదించిన 1940లో బ్రిటన్ ప్రధానమంత్రి ఎవరు?
   ఎ. విలియం ఎవర్ట్ గ్లాడ్‌స్టోన్ బి. విన్‌స్టన్ చర్చిల్
   సి. లార్డ్ లిన్‌లిత్‌గో డి. క్లిమెంట్ అట్లీ

4. బ్రిటీషు ప్రభుత్వం భారత్‌కు ఇస్తానన్న డొమినియన్ స్టేటస్‌ను డెడ్ ఆజ్ ఎ డోర్‌నెయిల్ (తలుపుకు కొట్టిన మేకులా చనిపోయింది) అని అభివర్ణించింది ఎవరు?
   ఎ. వినోభాబావే బి. మహాత్మాగాంధీ
   సి. సుభాష్ చంద్రబోస్ డి. జవహార్‌లాల్ నెహ్రూ

5. ఈ క్రింది వాటిలో భారత రాజ్యాంగ నిర్మాణానికి సంబంధించినది ఏది?
   ఎ. ఆగస్టు ఆఫర్ 1940 బి. ఆగస్టు డిక్లరేషన్ 1917
   సి. పూనా ఒడంబడిక డి. ఆగస్టు రివల్యూషన్

6. ఆగస్టు ఆఫర్‌ను తిరస్కరించిన కాలంలో భారత జాతీయ కాంగ్రెస్ అధ్యక్షుడు ఎవరు?
   ఎ. పట్టాభి సీతారామయ్య బి. అనిబిసెంట్
   సి. మౌలానా అబ్దుల్ కలామ్ ఆజాద్ డి. జవహార్‌లాల్ నెహ్రూ

7. ప్రపంచ యుద్ధంలో సహకరించదానికి బదులుగా భారత్‌కు కాంగ్రెస్ కోరిందేమిటి?
   ఎ. సంపూర్ణ స్వాతంత్ర్యం బి. ముస్లింలకు ప్రత్యేక దేశం
   సి. వైశ్రాయ్ కౌన్సిల్‌లో భారతీయులకు మెజారిటీ స్థానాలు
   డి. భారతదేశ విభజన

8. భారతదేశంలో అధిక కాలం వైశ్రాయ్ జనరల్‌గా సేవలందించిన వారు ఎవరు?
   ఎ. రాబర్ట్ క్లైవ్ బి. వారెన్ హేస్టింగ్స్
   సి. లార్డ్ ఇర్విన్ డి. లార్డ్ లిన్‌లిత్‌గో

9. ఈ క్రింది వాటిలో ఆగస్టు ఆఫర్‌కు సంబంధంలేని అంశమేది?
   ఎ. భారత రాజ్యాంగ నిర్మాణానికి ప్రత్యేక సంఘాన్ని నియమించటం
   బి. వైశ్రాయ్ కౌన్సిల్‌లో మెజారిటీ స్థానాలు భారతీయులకు కేటాయించటం
   సి. ఆగస్టు ఆఫర్‌కు భారత జాతీయ కాంగ్రెస్ ఆమోదం తెలపటం
   డి. భారత రాజ్యాంగ నిర్మాణంలో మైనారిటీల అభిప్రాయలను పరిగణనలోనికి తీసుకోవటం

10. ఆగస్టు ప్రతిపాదనను ఎప్పుడు, ఎక్కడ నుండి ప్రకటించారు?
    ఎ. సిమ్లా నుండి 1940 ఆగస్టు 8వ తేదిన
    బి. సిమ్లా నుండి 1940 ఆగస్టు 18వ తేదిన
    సి. ఢిల్లీ నుండి 1940 ఆగస్టు 8వ తేదిన
    డి. ఢిల్లీ నుండి 1940 ఆగస్టు 18వ తేదిన

సమాధానాలు

1.సి	2.బి	3.బి
4.డి	5.ఎ	6. సి
7. ఎ	8. డి	9. సి
10.ఎ		

ప్లాస్టిక్ వ్యర్థాలను సముద్రంలోకి

నేరుగా వదిలేస్తున్న దేశాలలో మన దేశ స్థానం ఎంత?

- కె. నాగార్జున
కరెంట్ ఎఫైర్స్ సీనియర్ ఫ్యాకల్టీ
9490352545



కరెంట్ అఫైర్స్

ప్రపంచబ్యాంకు అధ్యక్షుడిగా

హైదరాబాద్ పబ్లిక్ స్కూల్ పూర్వ విద్యార్థి



ప్రతిష్టాత్మకమైన ప్రపంచ బ్యాంకుకి 14వ అధ్యక్షుడిగా భారత సంతతికి చెందిన అజయ్‌పాల్ సింగ్ బంగా నియమితుల య్యారు. 25 మంది సభ్యులున్న ప్రపంచ బ్యాంకు ఎగ్జిక్యూటివ్స్ ఆఫ్ డైరక్టర్స్ బోర్డు అజయ్ సింగ్‌ను తదుపరి ప్రపంచ బ్యాంకు అధ్యక్షుడిగా ఎంపిక చేసింది. జనరల్ అట్లాంటిక్‌కు వైస్‌ఛైర్మన్‌గా ఉన్న అజయ్ సింగ్ పేరును అమెరికా అధ్యక్షుడు ప్రతిపాదించగా 25 మంది సభ్యులున్న డైరక్టర్స్ బోర్డులో 24 మంది అజయ్ బంగాకు అనుకూలంగా ఓటు వేశారు. రష్యా ఈ ఎంపికలో తటస్థంగా ఉండి పోయింది. మహారాష్ట్రలోని పూణేకు చెందిన అజయ్ బంగా తెలంగాణా రాష్ట్రంలోని హైదరాబాద్ పబ్లిక్ స్కూల్‌లో విద్యాభ్యాసం చేశారు. ప్రపంచవ్యాప్తంగా వివిధ సంస్థలలో విశేషమైన సేవలందించిన అజయ్ బంగా 2007లో అమెరికా పౌరసత్వం తీసుకున్నారు.


కోల్ ఇండియా తదుపరి సిఎండిగా

ఉస్మానియా పూర్వ విద్యార్థి పి.ఎం. ప్రసాద్



భారతదేశ అత్యున్నత సంస్థలలో ఒకటైన కోల్ ఇండియాకు తదుపరి ఛైర్మన్ అండ్ మేనేజింగ్ డైరక్టర్ (సిఎండి)గా ఉస్మానియా విశ్వవిద్యాలయ పూర్వ విద్యార్థి పోలవరపు మల్లిఖార్జున ప్రసాద్ నియమితులయ్యారు. పబ్లిక్ ఎంటర్ ప్రైజెస్ సెలక్షన్ బోర్డు కోల్ ఇండియా తదుపరి సిఎండిగా పి.ఎం ప్రసాద్ పేరును సిఫార్సు చేసింది. పిఎం ప్రసాద్ ప్రస్తుతం సెంట్రల్ కోల్డ్‌ఫీల్డ్ సిఎండిగా భాధ్యతలు నిర్వహిస్తున్నారు. గత మూడు దశాబ్దాలుగా మైనింగ్, బొగ్గు రవాణా రంగాలలో విశేషమైన సేవలందించిన ప్రసాద్ ఉస్మానియా విశ్వవిద్యాలయం మైనింగ్ విభాగం నుండి ఇంజనీరింగ్ పట్టాను అందుకున్నారు. ప్రస్తుతం కోల్ ఇండియా సిఎండిగా ఉన్న ప్రమోద్ అగర్వాల్ పదవీకాలం 2023 జూన్ 30వతేదిన ముగియనుంది. పిఎం ప్రసాద్ 2023 జూలై 1వ తేది నుండి భాధ్యతలు స్వీకరిస్తారు.

వెలుగులోకి వచ్చిన అల్లూరి కాలం నాటి గుహలు



ఆంధ్రప్రదేశ్ రాష్ట్రంలో కొత్తగా ఏర్పడిన అల్లూరి సీతా రామరాజు జిల్లాలో గూడెం కొత్తవీధి మండ లంలోని సప్పర్లకు ఐదు కిలో మీటర్ల దూరంలో గాలికొండ పంచాయితీ వద్ద రెండు రహస్య గుహలను స్థానిక గిరిజన ప్రజలు కనుగొన్నారు. స్వాతంత్ర్యోద్యమ కాలంలో మన్యం వీరుడు అల్లూరి సీతారామరాజు ఈ గుహలను రహస్య స్థావరాలుగా వినియోగిం చుకునే వారని స్థానికులు గిరిజన పెద్దలు చెబుతున్నారు.

ప్లాస్టిక్ వ్యర్థాలను సముద్రంలోకి నేరుగా వదిలేస్తున్న దేశాలలో భారత్ రెండవ స్థానం



ప్లాస్టిక్ వ్యర్థాలను సముద్రంలోకి నేరుగా వది లేస్తున్న దేశాలలో భారత్ రెండవ స్థానంలో ఉందని ఒక అధ్యయనం ఆధారంగా ఐక్య రాజ్యసమితి ఇటీవల ప్రకటిం చింది. వచ్చే నెలలో ప్లాస్టిక్ వ్యర్థా లకు వ్యతిరేకండా ఉద్యమిద్దాం అనే నినాదంతో ప్రపంచ పర్యావరణ దినోత్సం వేడుకలు జరుపుకోనున్న తరుణంతో ఐక్యరాజ్యసమితి ప్లాస్టిక్ వ్యర్థాలను నేరుగా సముద్ర జలాలలోకి నేరుగా వదిలేస్తున్న దేశాలలో ఫిలిఫీన్స్ 3,56,371 టన్నుల వ్యర్థాలను వదిలేస్తూ మొదటి స్థానంలో ఉండగా, భారతదేశం 1,26,513 టన్నులతో రెండవ స్థానంలో ఉంది. 73, 098 టన్నులతో మలేషియా మూడవ స్థానంలో ఉంటే, 70,707 టన్నులతో చైనా, 56, 333 టన్నులతో ఇండోనేషియా వరుసగా నాలుగు, ఐదు స్థానాలలో ఉన్నాయి.

ముగిసిన సముద్ర శక్తి విన్యాసాలు



భారత్, ఇండోనేషియా ద్వైపాక్షిక ఒప్పందాలలో భాగంగా ఇరు దేశాల మధ్య నౌకా దళాల మధ్య సంబం ధాలను మరింత పరిపుష్టం చేసుకోవటంలో భాగంగా ఇటీవల ఆరు రోజుల పాటు సముద్ర శక్తి విన్యాసాలు విజయ వంతంగా ముగిసాయి. ఇండో నేషియాలోని బాటమ్ పోర్టు వద్ద జరిగిన ఈ సముద్ర శక్తి విన్యాసాలలో భారతదేశం దేశీయంగా నిర్మించిన యాంటీ వార్‌ఫేర్ కార్వెట్ ఐఎన్ఎస్ కవరత్తి, డోర్నియర్ సముద్ర గస్తీ విమానం, ఛేతక్ ఛాపర్‌తో భారత్ ఈ విన్యాసాలలో పాల్గొంటే, ఇండోనేషియా యుద్ధనౌక కెఆర్ఐ సుల్తాన్ ఇస్కంధర్ ముడా, సిఎన్ 235 సముద్ర గస్తీ విమానం, ఎస్ 565 పాంథర్ హెలికాప్టర్లతో ఈ విన్యాసాలలో పాల్గొంది.

'కేజీబీవీ'ల్లో 1,241 కాంట్రాక్టు అధ్యాపక కొలువులు

ఉద్యోగ అవకాశాలు

రాష్ట్ర వ్యాప్తంగా ఉన్న కస్తూర్బాగాంధీ బాలికా విద్యాలయాల (కేజీబీవీ)ల్లో 1,241 మంది మహిళా కాంట్రాక్టు అధ్యాపకులను నియమించాలని పాఠశాల విద్యాశాఖ నిర్ణయించింది. ఈ మేరకు నోటిఫికేషన్ జారీ చేసింది. రాష్ట్ర వ్యాప్తంగా 475 కేజీబీవీల్లోనూ ఖాళీలను కాంట్రాక్టు విధానంలో భర్తీ చేయాలని విద్యాశాఖ నిర్ణయించింది. ప్రస్తుతం 42 స్పెషల్ ఆఫీసర్లు, 849 పీజీ సీఆర్‌టీలు, 273 సీఆర్‌టీలు, 77 పీఈటీల పోస్టులు ఖాళీగా ఉన్నాయి.

రాత పరీక్ష ఆధారంగా... : ఆసక్తి ఉన్న వారు ఈ నెల 26 నుంచి జూలై 5 వరకు ఆన్‌లైన్‌లో దరఖాస్తు చేసుకోవచ్చు. జూలైలో ఆన్‌లైన్ విధానంలో రాత పరీక్ష ఉంటుంది. జిల్లాల వారీగా ఖాళీలు, ఇతర వివరాలను www.schooledu.telangana.gov.in ద్వారా తెలుసుకోవచ్చు.

దుక్కులు దున్నుతూ..

విత్తులు నాటుతూ..

వ్యవసాయ పనుల్లో రైతులు నిమగ్నం

- వర్షాలు కురుస్తుండటంతో బిజీబిజీ
- విత్తన దుకాణాల వద్ద రైతుల బారులు
- ఎంఆర్‌పీ ధరలకు మించి విక్రయం





నవతెలంగాణ- ఖమ్మం ప్రాంతీయ ప్రతినిధి

రాష్ట్రంలో వాతావరణ పరిస్థితులు మెరుగవుతున్నాయి. మూడు వారాలు ఆలస్యంచేసిన నైరుతి పలకరించడంతో రైతులు ఖరీఫ్ వ్యవసాయ పనుల్లో బిజీ అయ్యారు. జూన్‌లో ఇప్పటి వరకు 9.55 సెం.మీ సాధారణ వర్షపాతం నమోదవ్వాల్సి ఉండగా కేవలం 3.04 సెం.మీ వర్షమే కురిసింది. సాధారణం కంటే 68శాతం లోటు ఉంది. ఉపరితల ఆవర్తనం కొనసాగుతున్న నేపథ్యంలో రెండు రోజుల పాటు రాష్ట్రంలో పలుచోట్ల విస్తారంగా వర్షాలు కురుస్తాయని వాతావరణ శాఖ అంచనా వేస్తోంది. మూడురోజులుగా చెదురుమదురుగా వర్షాలు కురుస్తుండటంతో రైతులు పలుచోట్ల సాగు పనులు ముమ్మరం చేశారు. విత్తనాలు విత్తే పనిలో కొందరుండగా.. మరికొందరు దుక్కులు దున్నుతున్నారు. పత్తి అచ్చు తోలే పనుల్లో ఉమ్మడి ఖమ్మం, వరంగల్, నల్లగొండ జిల్లాల రైతులు నిమగ్నమయ్యారు.

వర్షాగమనంతో సాగు పనుల్లో...

గతేడాది మే చివర రోహిణి కార్తెలోనే రాష్ట్రవ్యాప్తంగా కురిసిన వర్షాలు ఈ ఏడాది మృగశిర పూర్తయ్యి ఆరుద్ర కార్తె సమీపించాక కురుస్తుండటంతో ఆలస్యంగా దుక్కులు చేసి, విత్తనాలు వేస్తున్నారు. ప్రతి ఏడాది లాగానే ఈ సంవత్సరం కూడా వరి తర్వాత అత్యధిక విస్తీర్ణంలో పత్తి సాగయ్యే అవకాశం ఉందని అంచనా. ఖమ్మం జిల్లాలో 6.50 లక్షల ఎకరాల్లో పంటలు సాగవుతాయని వ్యవసాయ శాఖ అంచనా. దీనిలో వరి 2,89,983 ఎకరాలు, పత్తి 2,23,617 ఎకరాలు సాగయ్యే అవకాశం ఉంది.

వర్షాల ఆలస్యమే భద్రాద్రి రైతుకు మేలు..

గతేడాది వర్షాలు మే చివరలోనే కురవడంతో జూన్ చివరి నాటికి భద్రాచలం, కొత్తగూడెం, పినపాక నియోజకవర్గాల్లోని గోదావరి పరీవాహక మండలాలు పోలవరం బ్యాక్‌వాటర్ ప్రభావానికి లోనయ్యి పంటలు దెబ్బతినడంతో సాగు విస్తీర్ణాలు పడిపోయాయి. ఈ ఏడాది వర్షాలు రావాల్సిన దానికన్నా కొంత ఆలస్యమైనా బ్యాక్‌వాటర్ ముప్పు తప్పుతుండటంతో సమృద్ధిగా పంటల సాగుకు సిద్ధమవుతున్నారు. అందుకే ధర తగ్గినా పత్తి సాగు విస్తీర్ణం భారీగా పెరుగుతోందని అంచనా. భద్రాద్రి కొత్తగూడెం జిల్లాలో గతేడాది ఖరీఫ్‌లో 5,05,011 ఎకరాల్లో వివిధ పంటలు సాగు చేయగా ఈ ఏడాది 5,77,409 ఎకరాల్లో సాగు చేయవచ్చని అంచనా వేస్తున్నారు. జిల్లాలో గతేడాది కంటే ఈ ఏడాది పత్తి సాగు గణనీయంగా పెరుగుతుందని భావిస్తున్నారు. గతేడాది 1.62 లక్షల ఎకరాల్లో పత్తి సాగు చేయగా ఈ ఏడాది 2,14,302 ఎకరాల్లో సాగు చేయవచ్చని అంచనా. మిర్చి గతేడాది 25వేల ఎకరాల్లో వేస్తే ఈసారి 30వేల ఎకరాల్లో వేసేందుకు రైతులు సిద్ధమవుతున్నారు. వరి 1,65,025 ఎకరాల్లో వేయనున్నట్టు భావిస్తున్నారు.

పొరుగు జిల్లాల నుంచి రాకతో ఖమ్మంలో విత్తనాలు టైట్..

పొరుగు జిల్లాల నుంచి రైతులు పెద్ద ఎత్తున ఖమ్మంలో విత్తనాలు కొనుగోలు చేసేందుకు వస్తుండటంతో ఇక్కడ విత్తనాలు దొరికే పరిస్థితి లేకుండా పోతుంది. వరి, అపరాలు, నూనెగింజల విత్తనాలను తెలంగాణ విత్తనాభివృద్ధి సంస్థ అందుబాటులోకి తీసుకువచ్చాయి. పత్తి, మిర్చి విత్తనాలను ప్రయివేటు కంపెనీలు మార్కెట్లోకి తెచ్చాయి. తొలకరి పలకరించగానే రైతులు విత్తన దుకాణాల వద్ద బారులు తీరారు. పొరుగున మహబూబాబాద్, భద్రాద్రి కొత్తగూడెం, సూర్యాపేట, వరంగల్ రూరల్, నల్లగొండ తదితర జిల్లాల నుంచి రైతులు ఖమ్మం వచ్చి విత్తనాలు కొనుగోలు చేస్తుండటంతో కొరత ఏర్పడుతోంది. డిమాండ్ ఉన్న పత్తి, మిర్చి విత్తనాలు లభించకపోవడంతో జిల్లా రైతులు ఆంధ్రప్రదేశ్‌లోని ఉమ్మడి గుంటూరు, కృష్ణా తదితర జిల్లాల నుంచి తెప్పించుకుంటున్నారు. కొందరు రైతులు ఇక్కడే బ్లాక్ మార్కెట్‌లో అధిక ధరకు కొనుగోలు చేస్తున్నారు. డిమాండ్ ఉన్న యూఎస్ 7067 పత్తి విత్తనాలు వ్యవసాయశాఖ అధికారుల సొంత వ్యవసాయానికే లభించడం లేదంటే పరిస్థితిని అర్థం చేసుకోవచ్చు.

అటు మహబూబాబాద్ జిల్లా మరిపెడ, చిన్నగూడురు మండలాల్లో అనుమతిలేని బీటీ-3 పత్తి విత్తనాలను గతేడాది సాగు చేశారు. ఒక్క మరిపెడ మండలం గుండెపూడిలోనే వంద ఎకరాలకు పైగా సాగు చేయడం గమనార్హం. కలుపు సమస్య లేకపోవడం, తెగుళ్ల నివారణ శక్తి అధికంగా ఉండటంతో అనుమతి లేకున్నా ఈ విత్తనాల సాగుకు రైతులు సమాయత్తం అవడంతో టాస్క్‌ఫోర్స్ బృందం దాడులు చేసి పట్టుకుంది. అయినప్పటికీ రైతులు ఈ గింజలపై ఆసక్తి చూపుతున్నారు. 2222 మిర్చి విత్తనాల విషయంలోనూ ఇదే పరిస్థితి. దీన్ని కొందరు సొమ్ము చేసుకుంటున్నారు. ఇలా వర్షాల రాకతో రైతులు పనుల్లో బిజీ అయ్యారు.

కావాల్సిన విత్తనాలు దొరకట్లేదు..

- వనవాసం రాంరెడ్డి, గుండెపూడి, మరిపెడ

మహబూబాబాద్ జిల్లా అయినప్పటికీ మాకు ఏ పని ఉన్నా ఖమ్మం రావడమే వాల్టి. ప్రతియేటా గాంధీచౌక్‌లోనే విత్తనాలు తీసుకెళ్తాం. ఈ ఏడాది కూడా వచ్చాం. నాకు కావాల్సిన మిర్చి విత్తనాలు 2222 కొద్దిరోజుల క్రితం తీసుకుపోయా. వర్షాలు రాక దుక్కిచేయ లేదు. పత్తి అచ్చు తోలలేదు. ఇప్పుడు వానలొస్తుండటంతో యూఎస్ 7067 పత్తి విత్తనాల కోసం వచ్చా. కానీ దొరకట్లేదు. రూ.ఐదారొందలు రేటు ఎక్కువ పెడతానన్నా లేవంటున్నారు. పది రోజుల నుంచి ఎదురుచూస్తున్నా రావట్లేదు.

గ్రేటర్ నోయిడా అథారిటీపై రైతుల ఘనవిజయం

- దిగొచ్చిన అధికార యంత్రాంగం
- ఏఐకేఎస్ అభినందనలు



న్యూఢిల్లీ : గ్రేటర్ నోయిడా అథారిటీపై రైతు ఉద్యమం ఘనవిజయం సాధించింది. రైతుల పోరాటానికి అధికార యంత్రాంగం దిగొచ్చింది. గత 60 రోజులుగా ఏఐకేఎస్ ఆధ్వర్యంలో రైతులు తమ డిమాండ్ల సాధన కోసం గ్రేటర్ నోయిడా అథారిటీ కార్యాలయం ప్రధాన గేటు వద్ద ఆందోళన చేస్తున్నారు. రైతులపై పోలీసుల అణచివేత ప్రదర్శించారు. 35 మంది రైతు నాయకులను అరెస్టు చేసి జైల్లో పెట్టారు. నిర్బంధాలను లెక్కచేయకుండా పోరాటం కొనసాగించారు. గ్రేటర్ నోయిడా డెవలప్‌మెంట్ అథారిటీ, అలాగే బీజేపీ ప్రభుత్వం రైతులతో ఒక ఒప్పందానికి రావాల్సి వచ్చింది. ఇది స్ఫూర్తిదాయక విజయమని ఏఐకేఎస్ పేర్కొంది. పోరాడిన వారందరికీ, ముఖ్యంగా పెద్ద సంఖ్యలో మహిళలకు ఎఐకెఎస్ అభినందనలు తెలిపింది. ఇది ఐక్య పోరాట బలాన్ని రుజువు చేసిందని పేర్కొంది. అరెస్టు చేసిన వారందరినీ విడుదల చేయడంతో రైతుల సమస్యలు పరిష్కారించేందుకు అంగీకరించింది. అన్ని సమస్యలపై చర్చకు అంగీకరించిన ప్రభుత్వం జూన్ 30న చర్చించి తుది నిర్ణయం తీసుకునేందుకు కమిటీని ఏర్పాటు చేసింది. రాజ్యసభ సభ్యుడు సురందర్ నగర్ రైతులకు ఒప్పంద పత్రాన్ని అందజేశారు.

"సమస్యలపై హై పవర్ కమిటీని ఏర్పాటు చేయాలి, దీనిలో స్థానిక పార్లమెంటు సభ్యులు (రాజ్యసభ, లోక్‌సభ), శాసనసభ సభ్యులు (జేవార్, దాద్రీ), అలాగే ఛైర్మెన్ గ్రేటర్ నోయిడా అథారిటీ, పారిశ్రామిక అభివృద్ధి శాఖ ప్రిన్సిపల్ సెక్రటరీ, గ్రేటర్ నోయిడా అథారిటీ చీఫ్ ఎగ్జిక్యూటివ్ ఆఫీసర్, రైతు ప్రతినిధులను కూడా సభ్యులుగా నామినేట్ చేయాలి. ప్రధానంగా సేకరించిన భూమికి సంబంధించి 10 శాతం అబాదీ ప్లాట్లు ఇవ్వాలి. అబాదీ నిబంధనలలో నిర్దేశించిన నిబంధనల ప్రకారం షిఫ్టింగ్ పాలసీ జారీ చేయాలి. కనీసం 120 చదరపు మీటర్ల అబదీ ప్లాట్ ప్రతిపాదన స్వాధీనం చేసుకున్న భూమికి సంబంధించి, అథారిటీకి చెందిన హౌసింగ్ స్కీమ్‌లలో రైతుల 17.5 శాతం కోటా పునరుద్ధరణ, సిట్ దర్యాప్తులో కవర్ చేయబడిన లీజు బ్యాంకు ప్రభుత్వ స్థాయిలో పెండింగ్‌లో ఉన్న కేసులు, ప్రభావితమైన భూమిని తరలించిన కేసులపై చర్చ జరుగుతుంది. ప్రాజెక్ట్, మొదలైనవి ఈ కమిటీ రైతుల డిమాండ్లను కూలంకషంగా చర్చించేందుకు జూలై 15 లోపు సమావేశం నిర్వహించి నిబంధనల ప్రకారం సమస్యల పరిష్కారానికి చర్యలు తీసుకుంటామన్నారు" అని అదనపు చీఫ్ ఎగ్జిక్యూటివ్ ఆఫీసర్ ఆనంద్ వర్ధన్ ఒప్పంద పత్రాన్ని విడుదల చేశారు.

ప్రజాస్వామ్య సూచీలో

అట్టడుగున

మార్పు చేయించేందుకు కేంద్రం రహస్య యత్నాలు

న్యూఢిల్లీ : మోడీ ప్రభుత్వ హయాంలో "క్షీణిస్తున్న ప్రజాస్వామ్యం" స్థాయికి భారత్ ప్రతిష్ట దిగజారిన సిగ్గుచేటైన విషయాన్ని కేంద్ర ప్రభుత్వం దాచిపెట్టింది. ఈ విషయాన్ని కప్పిపుచ్చుకునేందుకు సీనియర్ అధికారుల నాయకత్వంలో ఇప్పటికే అండర్ కవర్ ఆపరేషన్లు ప్రారంభమయ్యాయని గార్డియన్ పత్రిక పేర్కొంది. ప్రధాని నరేంద్ర మోడీ అమెరికా పర్యటన సమయంలో ఈ విషయం వెలుగులోకి వచ్చింది.

లండన్ ప్రధాన కేంద్రంగా పనిచేసే 'ది ఎకనామిస్ట్' ఇంటెలిజెన్స్ విభాగం ప్రపంచ దేశాల్లో ప్రజాస్వామ్య సూచికను రూపొందించింది. ఆ సూచికలో, వరుసగా మూడేళ్ల నుండి భారత్‌ను 'క్షీణిస్తున్న ప్రజాస్వామ్య' దేశంగా వర్గీకరించినట్లు వెల్లడైంది. అమెరికా ప్రభుత్వ సాయంతో పనిచేసే 'ఫ్రీడమ్ హౌస్' సంస్థ భారత్‌ను 'పాక్షిక స్వేచ్ఛలు' కలిగిన దేశంగా అంచనా వేసింది. స్వీడన్‌కి చెందిన వి-డెమ్ ఇనిస్టిట్యూట్ అయితే భారత్‌ను 'ఎన్నికైన నియంతృత్వం'గా బహిరంగంగానే వ్యాఖ్యానించింది.

భారత్, ప్రపంచంలోనే అతిపెద్ద ప్రజాస్వామ్య దేశంగా గల పేరు ప్రతిష్టలను పోగొట్టుకుందని ఆరోపణలు వస్తుండడంతో స్పందించిన కేంద్ర మంత్రులు ఎవరి సర్టిఫికెట్ అవసరం లేదని పేర్కొన్నారు. కాశ్మీర్‌కు ప్రత్యేక హోదాను రద్దు చేయడం, ముస్లింలకు మినహా మిగిలిన శరణార్థులకు పౌరసత్వాన్ని మంజూరు చేసేందుకు చట్టాన్ని చేయడం బహుశా ఇంతటి పేలవమైన ర్యాంక్ రావడానికి కారణమై వుంటాయని అధికారిక అంచనా.

అసోంలో నియోజకవర్గాల పునర్విభజన ప్రతిపాదనలు

ఉధృతమైన నిరసనలు

గువహతి : అసోంలో నియోజకవర్గాల పునర్విభజన ప్రతిపాదనలకు వ్యతిరేకంగా ప్రతిపక్ష పార్టీలు, పాలక బిజెపి మిత్రపక్ష మద్దతుదారుల నిరసనలు ఉధృతమయ్యాయి. రాష్ట్రంలోని 14లోక్‌సభా, 126 అసెంబ్లీ స్థానాల సంఖ్య మారలేదు. అయితే, నాలుగు అసెంబ్లీ స్థానాలను జనరల్ నుండి రిజర్వ్‌డ్ కేటగిరీలోకి తరలించారు. మరో మూడు సీట్లను బోడోలాండ్ ప్రాదేశిక మండలిలో చేర్చారని ఎన్నికల కమిషన్ ప్రచురించిన ముసాయిదా ప్రతిపాదన పేర్కొంటోంది. అయితే కొన్ని పార్లమెంటరీ, అసెంబ్లీ స్థానాల పేర్లను మార్చాలని ప్రతిపాదించారు. పలు స్థానాల సరిహద్దులను మార్చాలని కూడా ప్రతిపాదించారు. ముస్లిం ఓటర్ల సంఖ్యను తగ్గించేందుకే ఈ చర్యలని ఆరోపణలు వెలువడుతున్నాయి. మత, జాతుల ప్రాతిపదికన ఓటర్లను విభజించడానికే ఈ ప్రతిపాదనలన్నీ అని మైనారిటీలు ప్రాతిపదిక గల అఖిల భారత యునైటెడ్ డెమోక్రటిక్ ఫ్రంట్ (ఎఐయుడిఎఫ్) విమర్శిస్తోంది. తమ ఎంఎల్ఎల నియోజకవర్గాలు కొన్నింటి విలీనాన్ని బిజెపి మిత్రపక్షం అసోం గణ పరిషత్ (ఎజిపి) వ్యతిరేకిస్తోంది. అంగూరి నియోజకవర్గంలోని శివసాగర్ జిల్లాలో శనివారం ఎజిపి మద్దతుదారులు నిరసన చేపట్టారు. మరో నియోజకవర్గంతో అంగూరిని విలీనం చేయడాన్ని తాము అంగీకరించబోమని దీనివల్ల తమ గుర్తింపు దెబ్బతింటుందని స్థానిక ఎజిపి నేత చెప్పారు. దక్షిణ అస్సాంలోని బారక్ లోయలో ఎఐయుడిఎఫ్ మద్దతుదారులు నిరసనలు చేపట్టారు. ప్రస్తుతమున్న నియోజకవర్గాలను ఏ విధంగానూ మార్చరాదని డిమాండ్ చేశారు. జులై 7, 8 తేదీల్లో 12 ప్రతిపక్ష పార్టీల ప్రతినిధులు ఢిల్లీలో ఇసికి మెమోరాండం అందచేయనున్నట్లు అస్సాం కాంగ్రెస్ అధ్యక్షుడు భూపేన్ కుమార్ బోరా చెప్పారు.



సే నో టు డ్రగ్స్..

ఆర్థికంగా ఉండి, పబ్బులకు వెళ్లేవాళ్లు కొకైన్, హెరాయిన్, ఓపీయం, ఎల్ఎస్‌డీ వంటి ద్రావణాలను తీసుకుంటున్నారు. ఆవేశంతోనో, ఆనందం కోసమో మొదలవుతున్న ఈ అలవాటు క్రమంగా వ్యసనంగా మారుతోంది. ఆ తర్వాత వారి భవిష్యత్‌నే కబళిస్తోంది. వారి జీవితాలను పాడుచేసుకోవడమే కాదు... మత్తులో వాహనాలు నడిపి ఇతరుల మరణానికీ కారణమవుతున్నారు. చాలా ఘటనల్లో పిల్లలు డ్రగ్స్‌కు అలవాటు పడడానికి స్నేహితులు, తల్లిదండ్రులే కారణమవుతున్నారని నిపుణులు చెబుతున్నారు. మాదక ద్రవ్యాల కోసం యువత చిన్నచిన్న చోరీల నుంచి హత్యలు చేయడానికి, ఆత్మహత్యలు చేసుకోవడానికి కూడా వెనుకాడటం లేదు. ఇటీవలి కాలంలో నగరంలో పెరుగుతున్న ఘటనలు ఆందోళన కలిగిస్తున్నాయి. వీరంతా 35ఏండ్లలోపు వారే. మధ్య తరగతి యువతీ, యువకులు ఎక్కువగా డ్రగ్స్‌కు అలవాటు చేసుకుంటున్నారు. చిన్నచిన్న జాగ్రత్తలు పాటిస్తే డ్రగ్స్ వికృత కోరల నుంచి యువతను కాపాడుకోవచ్చు.

'మేం మీ కోసం మా విధానాలను మార్చుకుంటున్నాం... ప్రత్యేక ఏర్పాట్లు చేస్తున్నాం. నిస్సంకోచంగా మా సంస్థలో ఉద్యోగం చేయొచ్చు' అని లింక్డ్‌ఇన్ లాంటి వేదికగా కంపెనీలే రాస్తున్నాయంటే తరం మారిందని అర్థం. ప్రపంచవ్యాప్తంగా జనరేషన్ జడ్ ఉద్యోగాల్లో చేరుతున్న వేళ ఇది. ఇంటర్నెట్, మొబైల్ ఫోన్లతో పాటూ పెరిగిన ఈ తరం తమ చుట్టూ కూడా హైఫైగా ఉండాలనే కోరుకుంటారు. అయితే ఇలాంటి తరానికి సంస్థలన్నీ ఎందుకింత ప్రాధాన్యమిస్తున్నాయీ... అన్నది ఆసక్తికరమైన ప్రశ్న. 'మేము మార్పుని స్వాగతిస్తున్నాం. సిబ్బంది సంక్షేమానికి ప్రాధాన్యమిచ్చే సంస్థల్లో ముందు వరసలో ఉంటాం. మా ప్రొఫెషనల్ పార్ట్‌నర్స్‌కి వారంలో ఎక్కువ రోజులు హైబ్రిడ్, రిమోట్ వర్క్‌కి అవకాశం కల్పిస్తాం. కొన్ని ఉద్యోగాల్లో మాత్రమే తప్పనిసరిగా ఆఫీసుకి వచ్చి పని చేయాల్సి ఉంటుంది. అవేమిటో ఉద్యోగావకాశాల ప్రకటనలో స్పష్టంగా చెబుతాం...' సోషల్ మీడియాలో మరో కంపెనీ పోస్ట్ ఇది.



జనరేషన్ జడ్

ప్రతిభావంతులైన ఉద్యోగుల్ని... అదీ యువతరాన్ని ఆకట్టుకోవడమూ, మరో సంస్థకి వెళ్లిపోకుండా తమ దగ్గరే అట్టి పెట్టుకోవడమూ... ఇప్పుడు సంస్థలకి కత్తి మీద సాములా తయారైంది. కొత్తగా ఉద్యోగాల్లో చేరుతున్న యువత ఏడాది తిరక్కుండానే మానేసి మరో ఉద్యోగం వెతుక్కుంటున్నారట. గత మూడేండ్లుగా 53 శాతానికి పెరిగిందని డెలాయిట్ నివేదిక చెబుతోంది. అందుకే తమ సంస్థల్లో పనితీరు గురించీ తాము అనుసరించే విలువల గురించీ, ఉద్యోగుల సౌకర్యానికి తామిచ్చే ప్రాధాన్యం గురించీ సంస్థలు సామాజిక మాధ్యమాల్లో ఇలాంటి పోస్టులు పెడుతున్నాయి. అనునిత్యం అభివృద్ధి చెందుతున్న శాస్త్ర సాంకేతిక రంగాల పురోగమనంలో ఎప్పటి కప్పుడు కొత్తకొత్తగా అంకుర సంస్థలూ పుట్టుకొస్తున్నాయి. వీటన్నిటిలోనూ పనిచేయడానికి ఉద్యోగులు కావాలి. అందుకని అవసరానికి తగినట్లుగా ఆయా సంస్థలన్నీ తమవైన విధివిధానాలను రూపొందించుకుని ఉద్యోగాలు కల్పిస్తున్నాయి. పాతికేండ్లకు అటూఇటూగా ఉండి ఇప్పుడే కొత్తగా ఉద్యోగంలో చేరుతున్న వారినే 'జనరేషన్ జడ్' అంటున్నారు. వచ్చే ఐదారేండ్లలో ప్రపంచవ్యాప్తంగా ఉద్యోగుల్లో మూడో వంతు వీళ్లే ఉంటారు అందులో సందేహం లేదు. దాంతో సంస్థలన్నీ అందుకు తగినట్లుగా మారడం మొదలెట్టాయి.

డిమాండ్ ఎక్కువ

నిజానికి వర్క్ ఫ్రమ్ హోమ్ విధానాన్ని కొవిడ్ సమయంలో మొదలుపెట్టారు. సాధారణ పరిస్థితులు నెలకొన్నాక కూడా ఇది కొనసాగుతుందంటే దానికి కారణం జనరేషన్ జెడ్. మూడ్‌ని బట్టి ఆఫీసుకు వస్తారు, లేదంటే ఇంట్లోంచే పని చేస్తామంటారు. అందుకే వీరి కోసం హైబ్రిడ్ వర్క్ కల్చర్‌ని కొనసాగిస్తున్నాయి కంపెనీలు. డిజిటల్ తరంలో పుట్టి పెరిగిన వీరి నైపుణ్యాలకు ఇప్పుడు విపరీతమైన డిమాండు ఉంది. అందుకే ఇలా రకరకాల ప్యాకేజీలూ వెసులుబాట్లతో వారిని ఆకర్షిస్తున్నాయి. అమెజాన్ వెబ్ సర్వీసెస్- గ్యాలప్ సంస్థలు సంయుక్త నివేదిక ప్రకారం భారతదేశంలో 97 శాతం కంపెనీలు డిజిటల్ నైపుణ్యాలు తెలిసిన సిబ్బంది తమకు తక్షణావసరం, కానీ నిపుణుల్ని ఎంచుకోలేక పోతున్నాయి. సరిగ్గా కంపెనీలకు అవసరమవుతున్న సరికొత్త ప్రతిభానైపుణ్యాలు కొరవడిన సమయంలో ఈ కొత్త తరం ఉద్యోగ రంగంలోకి ప్రవేశించడం కార్పొరేట్ కంపెనీలకు గొప్ప ఊరట.


ముందు యుగం దూతలు

ఒకప్పుడు పాతిక ముప్పై ఏండ్లను ఒక తరంగా చెప్పేవారు. కానీ, ఇప్పుడు పదేండ్లకే తరాల మధ్య అంతరం కనిపిస్తోంది.

బేబీ బూమర్స్ : 1946-64 మధ్య పుట్టిన వారిని 'బేబీ బూమర్స్' అంటారు. ప్రపంచవ్యాప్తంగా పలురంగాల్లో చెప్పుకోదగ్గ మార్పులకు లోనై, కష్టపడి పైకి వచ్చిన తరం ఇది.

జనరేషన్ ఎక్స్ : 1965- 84 మధ్య పుట్టినవారంతా జనరేషన్ ఎక్స్ తరానికి చెందినవారు. ఈ కాలంలో రాజకీయంగా చాలా ప్రాధాన్యం గల ఎన్నో ఘటనల్ని చూశారు. విశాల దృక్పథం, వైవిధ్యానికి ప్రాధాన్యమివ్వడం ఈ తరం ప్రత్యేకత.

జనరేషన్ వై : 1985-95 మధ్య పుట్టినవారిని 'జనరేషన్ వై' అనీ 'మిలెనియల్స్' అనీ అంటారు. సాంకేతికంగా విప్లవాత్మక మార్పులు చోటుచేసుకుంటున్న తరంలో పుట్టడంతో సహజంగానే వీరిది 'టెక్ శావీ' తరం అయింది. ప్యూ రీసెర్చ్ సెంటర్ నివేదిక ప్రకారం ఉద్యోగుల వ్యక్తిత్వాల్నీ విలువల్నీ నిశితంగా అధ్యయనం చేయడం మొదలెట్టింది కూడా ఈ తరమే.



జనరేషన్ జడ్ : 1996- 2010 మధ్య పుట్టిన పోస్ట్ మిలెనియల్స్‌నే 'జనరేషన్ జడ్' అంటున్నారు. ఉద్యోగ చరిత్రలో అత్యధిక విద్యావంతులున్న తరం ఇదే. మరో నాలుగైదేండ్లల్లో ప్రతి కార్యాలయంలోనూ మూడోవంతు వీళ్లతోనే నిండిపోతుందని అంచనా. ఇంటర్నెట్ గ్యాడ్జెట్లూ లేకుండా క్షణం గడవని వీరిని డిజిటల్ జనరేషన్ అంటున్నారు. ఒకేసారి ఐదు స్క్రీన్ల మీద పని చేయగల సమర్థులు. భవిష్యత్తు గురించి ఎక్కువ ఆలోచిస్తారు. ప్రపంచ వ్యాప్తంగా దాదాపు రెండువందల యాభై కోట్ల మంది ఈ తరానికి చెందినవారే ఉంటే, అందులో 35 కోట్లు మన దేశంలోనే ఉన్నారు. రాజకీయంగా, సామాజికంగా, ఆర్థికంగా పెను మార్పులకు కారణమయ్యే సత్తా జనరేషన్ జడ్‌కి ఉందనీ రేపటి ప్రపంచ నిర్మాతలు వీరేననీ ఎర్నెస్ట్ అండ్ యంగ్ నివేదిక చెబుతోంది. అంటే శ్రీశ్రీ చెప్పిన ముందు యుగం దూతలు లాంటి వారు వీరు.

వీకెండ్ మ్యారేజెస్ అంటే..?

పెండ్లి అంటే రెండు జీవితాల కలయిక. నూరేండ్ల సావాసం. ఒకేచోట కలిసుంటేనే బంధం బలపడుతుంది. ఇది ఇన్నేండ్లుగా మనకు పెండ్లికి తెలిసిన అర్థాలు. కానీ...ఈ జనరేషన్ జెడ్ పెళ్లికి కొత్త భాష్యాలు చెబుతోంది. 'ఎవరి జీవితం వారిది. ఎవరి ఆర్థిక స్వాతంత్ర్యం వారిది. ఎవరి వ్యక్తిత్వం వారిది. ఒకరి కోసం మరొకరు వాటిని వదులుకోనక్కర్లేదు. అందమైన జీవితాన్ని మూడు ముళ్లతో బంధించి జీవితాంతం రాజీ పడనక్కర్లేదు' వంటి ఆలోచనల నుంచి వీకెండ్ మ్యారేజెస్ కాన్సెప్ట్ పుట్టుకొచ్చింది. జపాన్లోనైతే ఇవి ట్రెండుగా మారాయి. భారత్‌లోనూ మెల్లిగా తెరపైకి వస్తున్నాయి... ఇవాళ రేపు ఆడ, మగ ఇద్దరూ సమానమే. ఒకరు తక్కువ మరొకరు ఎక్కువ అని లేదు. భర్త బయట పని చేసి డబ్బు సంపాదిస్తే, భార్య ఇంటిని చక్కదిద్దుకుంటూ గృహిణి జీవితం గడిపే రోజులు పోయాయి. మగవాళ్లతో సమానంగా ఆడవాళ్లూ సంపాదిస్తున్నారు. తమ వ్యక్తిత్వాన్ని వదులుకోవడానికి, జీవితంలో సర్దుకుపోవడానికి ససేమిరా అంటున్నారు. సోమవారం నుంచి శుక్రవారం వరకు ఊపిరి పీల్చుకోవడానికి కూడా వీల్లేని బిజీ లైఫ్‌లో గడిపేస్తున్నారు. అందుకే పెళ్లి చేసుకొని ఒకే చోట ఉండడం కంటే వీకెండ్స్‌లో కలిసి ఉండాలని ముందే ఒక అవగాహన కుదుర్చుకుంటున్నారు. వారంలో అయిదు రోజులు ఎవరి జీవితం వారిది, మిగిలిన రెండు రోజులు ఒకరికొకరుగా కలిసి జీవిస్తారు. కష్టసుఖాలు కలబోసుకుంటారు. గుండెల నిండా గూడు కట్టుకున్న ప్రేమని పంచుకుంటూ రెండు రోజులు రెండు క్షణాల్లా గడిపేస్తారు.

- ఎంకె

వీకెండ్
భారత్‌లో కుదిరే పనేనా..?

పెళ్లి పేరుతో వారానికోసారి కలుస్తామంటే అంగీకరించే సామాజిక పరిస్థితులు భారత్‌లో లేవు. ముంబైలాంటి నగరాల్లో కొందరు ప్రయోగాత్మకంగా వీకెండ్ కాపురాలు మొదలు పెట్టారు. ఆఫీసులు చెరో మూల ఉన్నప్పుడు ఇలా వీకెండ్స్‌లో కలవడమే బెటర్ అని నిర్ణయించుకునే జంటలు అక్కడక్కడా కనిపిస్తున్నాయి. రోజంతా ట్రాఫిక్ జామ్‌లో పడి ఏ రాత్రికో ఉసూరంటూ ఇంటికి చేరడానికి బదులుగా ఎవరిళ్లలో వారుంటూ వీకెండ్ వరకు ఎదురు చూడడమే మంచిదన్న అభిప్రాయానికి నేటితరం వస్తున్నా కుటుంబాలైతే అంగీకరించే పరిస్థితి లేదు.

వీళ్లకేం కావాలి?

జనరేషన్ జడ్‌కి ఏం కావాలీ అన్నది ఇప్పుడు కంపెనీల ముందున్న పెద్ద ప్రశ్న. ఎవరికి వాళ్లు తమకు తోచిన రీతిలో ప్రయత్నాలు చేస్తున్నప్పటికీ అది సరిపోతుందన్న నమ్మకం కలగడం లేదు. అందుకే అధ్యయనాలు జరుపుతున్న సంస్థలన్నీ కలిసి జనరేషన్ జడ్ లక్షణాలను ఇలా ఉండోచ్చు అని ఒక నిర్ధారణకు వచ్చాయి.

- నిత్యం కొత్తదనం కావాలి. అది పనిలో కావచ్చు, చుట్టూ ఉన్న వాతావరణంలో కావచ్చు.
- కంపెనీ విధానాలూ విలువలూ తెలుసుకుంటూ నచ్చితేనే ఉద్యోగం చేస్తున్నారు. లేకుంటే టాటా చెప్పేస్తున్నారు.
- పర్యావరణం, సమాజం, పారదర్శక పాలన... జనరేషన్ జడ్‌కి ముఖ్యమైన అంశాలు. వీటిపట్ల బాధ్యతాయుతంగా ఉంటారు.
- ఉద్యోగంలో చేరితే జీవితంలో సెటిలైపోయినట్లే అనుకోరు. ఎప్పటికప్పుడు పనిలో నైపుణ్యాలను పెంచుకుంటారు.
- సోషల్‌మీడియాని కాలక్షేపానికి కాక, విషయాలు తెలుసుకోవడానికి వాడతారు.
- రిస్క్ తీసుకోవడానికి భయపడరు. నలభై ఏళ్లకే రిటైరవ్వాలన్న ఆలోచనలే ఉండదు.
- ఫ్లెక్సిబుల్ వర్క్ అవర్స్‌ని ఇష్టపడతారు. నిర్ణీత సమయాల్లోనే పనిచేయాలంటే ఒత్తిడికి గురవుతారు.




వీకెండ్ కాపురాలకు కారణాలు

- ఆఫీసులో పని ఒత్తిడితో ఆడ, మగ లైఫ్‌స్టైల్ వేర్వేరుగా ఉంటున్నాయి. ఒకరికి ఉదయం షిఫ్ట్ అయితే మరొకరికి నైట్ షిఫ్ట్ ఉంటుంది. ఒకరి ఆఫీసు ఊరికి ఈ మూల ఉంటే, మరొకరిది ఆ మూల ఉంటుంది. దీంతో ఒకేచోట కలిసుండే పరిస్థితి లేదు
- భార్యాభర్తలకి ఒకరి నుంచి మరొకరికి ఎక్స్‌పెక్టేషన్‌లు ఉంటాయి. ఆఫీసు నుంచి అలిసిపోయి ఇంటికి వచ్చిన వారికి భాగస్వామి తమకి అనుకూలంగా లేకపోతే చిర్రెత్తుకొచ్చి దెబ్బలాటలకి దారి తీస్తాయి. అదే వీకెండ్స్‌లో మాత్రమే కలిస్తే, కలిసుండేది కాస్త సమయమైనా హాయిగా గడుపుదామని అనిపిస్తుంది. మళ్లీ వారం వరకు చూడలేమన్న ఫీల్‌తో ఒకరిపై మరొకరికి ప్రేమ పొంగుకొస్తుంది. సర్‌ప్రైజ్‌లు, రొమాన్స్‌లు కొత్తగా వింతగా అనిపించి మానసికంగా ఎనలేని సంతృప్తి ఉంటుంది. ఆర్థికంగా ఎవరి స్వాతంత్ర్యం వారికుంటుంది.
- ఎవరికి వారు తమకి మాత్రమే సొంతమైన ఒక స్పేస్ కావాలని బలంగా కోరుకుంటున్నారు.

జిగ్రీ దోస్తు..

నడక మెల్లిమెల్లిగా
పరుగయ్యే క్రమంలో
నడత కూడ పెద్దమనిషిలా
గాంభీర్యాన్ని తొడుక్కున్నపుడు
బాల్యం కనుమరుగై
నూనూగు మీసాల
నవ యౌవ్వనం మొగ్గ తొడిగేవేళ
నీ రూపంలో ఓ ఆత్మీయమిత్రుడు
నా హృదయాన చెరగని
ముద్రేసింది..

కాలంతో పోటీ పడి
పరుగెత్తడానికి
మెల్లిగా నడకతో సాగుతున్న
జీవితాన
ఒక్క ఉదుటున పరుగెత్తడం
నేర్పింది నువ్వు కదా..



నువ్వు దరి చేరిన క్షణం
ఆనందం ఆకాశాన్ని అందుకుంది,
ఆత్మవిశ్వాసం శిఖరాగ్రానికి
చేరుకుంది..

ఉదయం కళాశాలకు,
సాయంత్రం మ్యాథ్స్, ఫిజిక్స్
ట్యూషన్స్ వినడానికి
నీతో పాటే నా పయనం
నువ్వు పక్కనుంటే ఎక్కడికైనా
వెళ్ళడానికి సై అనేవాడిని..

డిగ్రీలో కూడా జిగ్రీ దోస్తువు నువ్వే
కొందరు చాలా దూరం నుండి
కూడా నడుస్తూ వస్తే
కొందరు అట్లాస్ సైకిల్
పెద్ద సీట్లపై కూర్చుని
దర్జాగా వస్తే
నేను నీపై స్టైల్ గా కూర్చుని
రయ్యి రయ్యిన
దూసుకువచ్చేవాడిని..

ఆ నా ఆత్మీయ స్నేహితుడు
మరెవరో కాదు..
ఒంపులు తిరిగిన హ్యాండిల్ తో
సోకులు దిద్దుకున్న బాడీతో
అందమైన చిన్ని సీటుతో
అందరి దృష్టిని ఆకర్షించే
బి.ఎస్.ఏ.ఎస్.ఎల్.ఆర్ సైకిల్..

- సర్ఫరాజ్ అన్వర్
9440981198



నీ చిత్రం చూసి నా చిత్తం చెదిరి

చెలి,

ఆఫీస్‌కి వెళ్లడం.. రావడం. కంప్యూటర్, కుర్చీలు, గోడలు.. ఇవే నా దోస్తులు. నా తీరే అంత. ఏ బంధమూ శాశ్వతం కాదనుకునే రకం. నూతిలో కప్పలా అలా కాలాన్ని ఈదుతున్న నాకు నీవ్వు తారాసపడ్డావు. హే, రాయిలాంటి నా మనసుని మంచులా కరిగించింది కూడా నువ్వే కదా.

ఆ రోజు ఆఫీసు క్యాంటీన్లో టీ తాగుతున్నా. నా ముందు నుంచి నడుచుకుంటూ నువ్వు వెళ్తుంటే.. ఆహా ఏమి సౌందర్యం... నిన్ను చూడగానే మనసు జివ్వుమంది. మళ్లీమళ్లీ చూడమని మారాం చేసింది. 'ఇదేనా లవ్ ఎట్ ఫస్ట్ సైటా?' అంటే అనుకున్నా. 'లవ్వా.. గివ్వా.. అమ్మాయి బాగుంది చూశానంతే..' అని నాకు నేనే సర్దిచెప్పుకున్నా. నువ్వు ఎదురు పడ్డప్పుడల్లా నాకు నేను నిగ్రహ పూజారిలా మనసులోనే మంత్రాలు జపించేవాడిని. అవి నీకు వినిపించాయేమో.. ఎటు వెళ్లినా ప్రత్యక్షమవుతూ నన్ను పరీక్షించేదానివి. అలా నువ్వు కనబడినప్పుడల్లా మనసు లోలోపల డ్యాన్స్ చేస్తుంటే.. ఏంటిలా అయిపోతున్నావంటూ నాలోని నిగ్రహ రాముడు హెచ్చరించేవాడు. మనసులో ఇద్దరికీ నిత్యం యుద్ధమే.

రోజులు గడుస్తున్నకొద్దీ నా నిగ్రహం సడలింది. ఆఖరికి..' నీ చిత్రం చూసి నా చిత్తం చెదిరి' అని పాడుకున్నాను. ఓసారి నీ ఆఫీసు ఐడీ కార్డు చూశా. పేరు తెలిశాక ఏనుగు అంబారీ ఎక్కినంత సంబరపడ్డాను. నక్షత్రాల్లా నీ చుట్టూ ఎంతోమంది ఉన్నా నువ్వు మాత్రం చందమామలా వెలిగిపోయేదానివి. ముఖానికి కొద్దిగా పౌడరు.. మృదువైన పెదాలపై లిప్‌స్టిక్.. నుదుటిన చిన్న బొట్టుబిళ్ల.. అంతే కదా నీ మేకప్. ఈ సహజ సౌందర్యరాశి నాకు దక్కుతుందా అనే సంశయం నన్ను వేదించడం మొదలు పెట్టింది. ఫర్వాలేదు.. గట్టిగా ప్రయత్నిస్తే.. అనుకున్నది జరుగుతుందని నాకు నేనే సర్దిచెప్పుకునే వాణ్ని. అదే జరిగితే నీలి నీలి ఆకాశాన్ని దోసిళ్లలో తెచ్చి నీకు ఇవ్వాలనుకున్నా..

రోజులు నెలలవుతున్నాయి. నాకు నేను నీతో డ్యూయెట్లు పాడుకోవడం తప్ప.. నోరు విప్పి నీతో మాట్లాడింది లేదు. మరి నా తీయని బాధ నీకు చేరేదెలా? అసలు నేను నిన్ను ఫాలో అవుతున్న సంగతి తెలుసా? ఎన్నాళ్లీ వేదన? ప్రశ్నలతో బుర్ర వేడెక్కేది. అయినా ఏదో నాకు తోచినట్టుగా ప్రయత్నించేవాణ్ని. మృదువైన నీ స్వరం వినడం కోసం పక్కపక్కనే నడుచుకుంటూ వెళ్లడం.. ఒక్కోసారి కావాలనే ఎదురు పడటం.. నీ చూపులు నన్ను చేరగానే తల చప్పున కిందికి వేలాడేసుకోవడం.. ఇలా ఎన్నో జ్ఞాపకాలు.. ఎన్ని చెప్పినా తక్కువే.

కొన్నాళ్లయ్యాక అకస్మాత్తుగా కనిపించడం మానేశావు. నా గుండెలో గుబులు. ఆఫీసు మానేసిందా? కొంపదీసి పెండ్లి కానీ ఫిక్స్ కాలేదు కదా? ఇలా సవాలక్ష సందేహాలు. పోనీ నీ ఫ్రెండ్స్‌ను అడిగితే..? ఈ ధైర్యమే ఉంటే నీతోనే నేరుగా మాట కలిపేవాడిని కదా. ఏదేమైనా తను కనబడని రోజు ఓ యుగంలా గడిచేది. ఈ నిరీక్షణకు తెర దించుతూ.. వారమయ్యాక ప్రత్యక్షమైయ్యావు. నిన్ను చూడగానే నా మనసుకి రెక్కలొచ్చాయి. ఈసారి కచ్చితంగా మాట్లాడి తీరాల్సిందే అనుకున్నా. రెండుసార్లు ఫాలో కూడా అయ్యా. కాటుక అద్దిన ఆ కళ్ల చూపు ఓసారి నాపై పడింది. ఆ క్షణం నా గుప్పెడు గుండెకు పండగే. 'ఏ కన్నులూ చూడని చిత్రమే చూస్తున్నది నేడు నా ప్రాణమే' అని లోలోపలే పాడుకున్నా.

నా మనసుని పసిగట్టినట్టు నా ప్రేమకి పచ్చజెండా ఊపుతూ పెదాలపై నవ్వులు పూయించావు. ఆ క్షణంలో కళ్లే ఎక్కువగా మాట్లాడుకున్నాయి. ప్చ్.. గమ్యం సగం చేరాననుకునేలోపే.. కంపెనీ పంపిందంటూ రెక్కలు కట్టుకొని అమెరికా వెళ్లిపోయావు. ఎన్ని ఊసులు చెప్పాలి నీతో.. ఎన్ని చోట్లకు తిప్పాలి నిన్ను.. అందుకే నీ రాకకై నా ఎదురుచూపు... త్వరగా వస్తావు కదు.

నీ... రాజేష్

అభినందన

కురిసిన వర్షంలో
కరిగిన మేఘాలెన్నో
విరిసిన ఇంద్రధనుస్సున
విరిగిన రంగు తెలుసా!


అత్తరు పేరున
నలిగిన పూవులెన్నో
కారిన కన్నీటి మాటున
ఆవిరైన కలలు ఎన్నో!

విప్లవ గేయాల మాటున
రగిలిన గుండె గాయాలెన్నో
విజయాల మాలకు
పుష్ప విలాపాలెన్నో

నీవు నడిచే బాటకు
ఎన్ని కాళ్ళ కవాతులో
రాసిన ప్రతి కవిత వెనుక
కవి పడిన తపన ఎంతో!

బాగుంది అని చెప్పడం
భరువు అని భావిస్తే ఎలా
మన అభినందన
ఎదుటివారికి ఆనందం కాదా!

నీ ఒక్క మెచ్చుకోలు
ఎన్నో మైళ్ళ ప్రయాణానికి
ఇంధనం



అడుగుతుంది ధనం కాదు
కళాకారుడికి ఎంతో
అభిమానధనం!

- జగ్గయ్య.జి
9849525802